సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 73

బుధవారం 4-6-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'



వృథా చేయని సమయమే ర్యాంక్ తెస్తుంది

ఐ.ఐ.టి. జె.ఇ.ఇ. అడ్వాన్స్‌డ్ పరీక్ష అంటే పరీక్షలకే పరీక్ష. అలాంటి పరీక్షను 2025లో లక్షా తొంభై వేల మంది రాస్తే వారిలో అమ్మాయిలు 43,000 మంది. ఆ మొత్తం అమ్మాయిల్లో ఫస్ట్ ర్యాంక్ తెచ్చుకుంది దేవదత్తా మాఝీ. బెంగాల్‌లోని చిన్న ఊర్ల విద్యార్థినుల విజయం ఇది. జె.ఇ.ఇ. మెయిన్ సీజన్ 1, సీజన్ 2లలో టాప్ 1 ర్యాంక్ సాధించిన దేవదత్తా కోచింగ్ లేకుండా సొంతగా చదువుకుంది. 'మీరు వేస్ట్ చేసే ప్రతి నిమిషం మిమ్మల్ని ర్యాంక్‌కు దూరం చేస్తుంది' అని హెచ్చరిస్తూ ఉంది ఆ చదువుల సరస్వతి.

- వివరాలు IIలో

సాక్షి ఫ్యామిలీ II
హైదరాబాద్
బుధవారం ॥ 4-6-2025

న్యూస్‌మేకర్
దేవదత్తా మాఝీ

ఐ.ఐ.టి. జె.ఇ.ఇ. అడ్వాన్స్‌డ్ పరీక్ష అంటే పరీక్షలకే పరీక్ష.
అలాంటి పరీక్షను 2025లో లక్షా తొంభై వేల మంది రాస్తే వారిలో అమ్మాయిలు 43,000 మంది.
ఆ మొత్తం అమ్మాయిల్లో ఫస్ట్ ర్యాంక్ తెచ్చుకుంది దేవదత్తా మాఝీ.
బెంగాల్‌లోని చిన్న ఊర్ల విద్యార్థినుల విజయం ఇది.
జె.ఇ.ఇ. మెయిన్ సీజన్ 1, సీజన్ 2లలో టాప్ 1 ర్యాంక్ సాధించిన దేవదత్తా కోచింగ్ లేకుండా సొంతగా చదువుకుంది.
'మీరు వేస్ట్ చేసే ప్రతి నిమిషం మిమ్మల్ని ర్యాంక్‌కు దూరం చేస్తుంది' అని హెచ్చరిస్తూ ఉంది ఆ చదువుల సరస్వతి.



వృథా చేయని సమయమే ర్యాంక్ తెస్తుంది

ర్యాంక్ రావడం గురించి కోచింగ్ సెంటర్‌లకు ఒక వైఖరి ఉంటుంది. తల్లిదండ్రులకు ఒక వైఖరి ఉంటుంది. పిల్లలకు కూడా ఉంటుంది.

మా దగ్గర కూచోబెట్టి రాత్రి తెల్లవార్లు చదివిస్తే ర్యాంకు వస్తుందని కోచింగ్ సెంటర్ వాళ్లు, ఎయిత్ క్లాస్ నుంచే కోచింగ్‌లో పెడితే ఇంటర్ అయ్యే సరికి చచ్చుకుంటూ ర్యాంక్ వస్తుందని తల్లిదండ్రులూ, ఆపకుండా క్లాసులు విని మాక్ టెస్టులు రాస్తే ర్యాంక్ వస్తుందని విద్యార్థులు అనుకుంటూ ఉంటారు.

తీరా రిజల్ట్స్ వచ్చాక అంచనాలు తారుమారు అయి ఉంటాయి. బ్లేమ్ క్వశ్చన్ పేపర్ మీదకు వెళుతుంది. 'పేపర్ చాలా టఫ్‌గా వచ్చింది కాబట్టే మా అబ్బాయికి ర్యాంక్ రాలేదు' అనీ, 'కెమిస్ట్రీ ఫిజిక్స్ బాగా చేసింది కాని మేథ్స్‌లో దెబ్బతింది మా అమ్మాయి' అని కామెంట్లు వస్తుంటాయి. కోచింగ్ సెంటర్ వాళ్లు బాగా చెప్పలేదని తల్లిదండ్రులు, తల్లిదండ్రులు గట్టిగా హెచ్చరించి చదివించలేదని కోచింగ్ సెంటర్ వారూ అనుకుంటారు. మన తెలివితేటలకు ఇంకా మంచి ర్యాంక్ రావాలని విద్యార్థులు డిజప్పాయింట్ అవుతారు.



తల్లితో దేవదత్తా మాఝీ

కాని జె.ఇ.ఇ. అడ్వాన్స్‌డ్‌కే కాదు ఏ పరీక్షకైనా ర్యాంక్ రావాలంటే మొదట పూనుకోవాల్సింది, సంకల్పించాల్సింది విద్యార్థే అంటోంది దేవదత్తా మాఝీ. లక్షా తొంభై వేల మంది రాసిన జె.ఇ.ఇ. అడ్వాన్స్‌డ్ పరీక్షలో కామన్ ర్యాంక్ 16 సాధించిన దేవదత్తా అమ్మాయిలందరిలో టాప్ 1 ర్యాంకర్‌గా నిలిచింది. అంతే కాదు జె.ఇ.ఇ మెయిన్స్‌లో 100 పర్సంటైల్ సాధించింది.

కోచింగ్ లేకుండానే...

'నేను కోచింగ్ తీసుకోలేదు. కొన్ని ఆన్‌లైన్ క్లాసులు ఢిల్లీ లెక్చరర్ల నుంచి తీసుకున్నాను. మిగిలినదంతా సెల్ఫ్ స్టడీనే. పోటీ పరీక్షల్లో ర్యాంకు రావాలంటే ముందు నుంచి మనం క్రమశిక్షణతో ఉండాలి. టెన్త్ అయిపోయాక రెండేళ్ల పాటు నేను నా ఫ్రెండ్స్‌ని, బంధువులను కలవలేదు. ఫంక్షన్స్‌కు అటెండ్ కాలేదు. కచ్చితంగా రోజుకు పది, పన్నెండు గంటలు చదివాను. ఏనాడూ డిసిప్లిన్ తప్పలేదు. మనం వేస్ట్ చేసే ప్రతి నిమిషం మనల్ని ర్యాంకుకు దూరం చేస్తుందని గ్రహించాలి' అంది దేవదత్తా మాఝీ.

తల్లి మార్గదర్శనం

దేవదత్తా తల్లి ఫిజిక్స్ టీచర్. తండ్రి లెక్చరర్. వీరు ఉంటున్నది కోల్‌కతాకు 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న కత్వా అనే చిన్న ఊరు. దేవదత్తా గవర్నమెంట్ హైస్కూల్‌లోనే టెన్త్ చదివి 2023లో స్టేట్ టాప్ 6వ ర్యాంకర్‌గా నిలిచింది. 'అప్పటినుంచే నాకు ఐ.ఐ.టి. అడ్వాన్స్‌డ్ సాధించాలని కోరిక. అందుకు వేరెవరో కష్టపడితే నాకెలా ర్యాంక్ వస్తుంది. కష్టపడి చదవాల్సింది నేనే... ర్యాంక్ సాధించాల్సింది నేనే. కోచింగ్ సెంటర్లలో కష్టపడి లెక్చరర్లు చెప్పడం ద్వారా మనకు ర్యాంక్ వచ్చేయదు. నా చదువుకు అమ్మ కొంచెం గైడ్ చేసింది. నేను మొదట మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలలో థియరీ అంతా చదువుకున్నాను. తర్వాత ప్రాబ్లమ్స్ సాల్వ్ చేశాను. టెక్స్ట్ బుక్స్ మాత్రమే కాకుండా చాలా పుస్తకాలు చదివాను' అంటుంది దేవదత్తా.

ఏ.ఐ. చదవాలని...

దేవదత్తా ఖరగ్‌పూర్ ఐ.ఐ.టి. పరిధిలోకి వచ్చినా తాను మాత్రం ఐ.ఐ.ఎస్.సి. బెంగళూరులో ఏ.ఐ. అండ్ రోబోటిక్స్ చదవాలని అనుకుంటోంది. 'నేను వయొలిన్ బాగా వాయిస్తాను. కాని పరీక్షల కోసం దానిని పక్కన పెట్టేశాను. అయితే పరీక్షలయ్యాక ఇప్పుడు మళ్లీ వయొలిన్ వాయిస్తున్నాను. ఈ రెండేళ్లు నేను అమ్మతో మాత్రమే మాట్లాడుతూ రిలాక్స్ అయ్యాను. ఆమెతో మాటలు తప్ప మిగిలినదంతా పుస్తకాలతోనే' అని ముగించింది దేవదత్తా.

జూన్-4 : ఇంటర్నేషనల్ డే ఆఫ్ ఇన్నోసెంట్ చిల్డ్రన్ విక్టిమ్స్ ఆఫ్ అగ్రెషన్



కంటికి రెప్పలమై కాపాడుకుందాం

ఇవి... అవి... అని కాదు.
ప్రపంచవ్యాప్తంగా ప్రతి నిత్యం పిల్లలు అనేక రూపాల్లో శారీరక, లైంగిక, మానసిక హింసను ఎదుర్కొంటున్నారు.
వారిని రక్షించుకోవడానికి మనం ఏం చేయాలి?
వారి హక్కులను ఎలా కాపాడుకోవాలి... మొదలైన విషయాలను అవగాహన పరిచే రోజు...
సరికొత్త కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకునే రోజు...
ఐక్యరాజ్య సమితి 'ఇంటర్నేషనల్ డే ఆఫ్ ఇన్నోసెంట్ చిల్డ్రన్ విక్టిమ్స్ ఆఫ్ అగ్రెషన్'...

పద్నాలుగు సంవత్సరాల వయసులో రోషిణి పర్వీన్‌కు వివాహం జరిగింది. పదిహేను సంవత్సరాలకే తల్లి అయ్యింది. చిన్న వయసులోనే పెళ్లి కావడంతో రోషిణి పడిన బాధలు, ఎదుర్కొన్న ఇబ్బందులు ఇన్నీ అన్నీ కాదు. దీన్ని దృష్టిలో పెట్టుకొని తనలా ఏ అమ్మాయీ బాధ పడకూడదు అనుకొని ముందుకు కదిలింది.

ఇప్పటివరకు అరవైకి పైగా బాల్య వివాహాలు జరగకుండా అడ్డుకుంది.

ఆ పిల్లలను మళ్లీ బడి బాట పట్టించి వారి భవిష్యత్‌ను వెలుగుమయం చేసింది.

ఒకప్పుడు 'నేను ఒంటరిని' అనుకున్న బిహార్‌లోని సిమల్‌బరీ గ్రామానికి చెందిన రోషిణి 'చైల్డ్ లైన్ ఇండియా ఫౌండేషన్'లో చేరడంతో వెయ్యి ఏనుగుల బలం వచ్చింది.

'నేను ఒంటరిని కాదు. నాతో మరెంతోమంది ఉన్నారు' అనే ధైర్యం వచ్చింది.

ఆ ధైర్యంతోనే ప్రాణాలకు తెగించి బాల్య వివాహాలను, పిల్లల అక్రమ రవాణాను అడ్డుకుంది.

'సేవ్ ది చిల్డ్రన్'లాంటి సంస్థలలో పని చేసిన రోషిణి ఆడపిల్లలకు చిన్న వయసులోనే పెళ్లి చేయడం వల్ల కలిగే సమస్యల గురించి విస్తృతంగా ప్రచారం చేసింది. ఎన్నో స్కూల్స్‌లో 'గర్ల్స్ గ్రూప్'లను ఏర్పాటు చేసింది.

బిహార్‌లోని రోషిణి పర్వీన్ నుంచి శ్రీకాళహస్తిలోని వైశాలి వరకు ఎంతోమంది మహిళలు పిల్లల హక్కులు, భద్రత గురించి క్రియాశీలంగా పనిచేస్తున్నారు.

ఎందుకు ఈరోజు?

ప్రతి సంవత్సరం జూన్ 4న 'ఇంటర్నేషనల్ డే ఆఫ్ ఇన్నోసెంట్ చిల్డ్రన్ విక్టిమ్స్ ఆఫ్ అగ్రెషన్' జరుపుకుంటారు. ఇది ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ఆగస్ట్ 19, 1982లో మొదలైంది. మొదట్లో యుద్ధ బాధితులైన లెబనాన్, పాలస్తీనా పిల్లలపై దృష్టి పెట్టినప్పటికీ తరువాత దీని ఉద్దేశాన్ని విస్తృతీకరించారు. పిల్లలు రకరకాల రూపాల్లో ఎదుర్కొంటున్న హింసను నిరోధించడానికి, వారి హక్కులను కాపాడడానికి పరిష్కార మార్గాలు, కార్యాచరణ ప్రణాళిక గురించి ఆలోచించడమే ఈ రోజు ఉద్దేశం.



ఫన్నీగానే సీరియస్ విషయాలు

బ్యాడ్ టచ్, గుడ్ టచ్ పిల్లలు గుర్తించేలా చేయడానికి, ఆన్‌లైన్‌లో సురక్షితంగా ఉండడానికి, అంతర్గత శక్తిని పెంచడానికి ఆడియో–విజువల్ టెక్నిక్స్ ఉపయోగిస్తున్నాం. ఇంటరాక్టివ్ సెషన్‌లు నిర్వహిస్తున్నాం. కథలు, ఫన్ వీడియోల ద్వారా చిన్న పిల్లలకు సీరియస్ విషయాల గురించి తెలియజేస్తున్నాం. 'మాయ' అనే షార్ట్ ఫిల్మ్‌ను కూడా రూపొందించాం. పేరెంట్స్, టీచర్స్‌తో సమావేశాలు నిర్వహిస్తున్నాం. రకరకాల ఏజ్ గ్రూపుల ఆధారంగా పిల్లలతో సమావేశాలు నిర్వహిస్తున్నాం.

– అనూ సూరజ్, స్వరక్ష చారిటబుల్ ట్రస్ట్



చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలు

'చైల్డ్ మ్యారేజ్–ఫ్రీ ఇండియా' అనేది నా లక్ష్యం. నాది బాల్య వివాహం కావడంతో ఎన్నో కష్టాలు పడ్డాను. సమస్యలు ఎదుర్కొన్నాను. నాలాంటి పరిస్థితి ఏ అమ్మాయికీ రాకూడదనుకున్నాను. గ్రామాల్లో 'చైల్డ్ ప్రొటెక్షన్' కమిటీలు ఏర్పాటు చేశాం. అవి మంచి ఫలితాన్ని ఇచ్చాయి. 'మీ హక్కులు ఇవి' అంటూ పిల్లలకు అవగాహన తరగతులు నిర్వహించాం.

– రోషిణి, సామాజిక కార్యకర్త

క్షేత్రస్థాయిలోకి...

'కొంతమంది స్నేహితులు, న్యాయవాదుల సహాయంతో బుక్‌లెట్ రూపొందించాను. మా అబ్బాయితో మొదట దీని గురించి మాట్లాడాను. సేఫ్ ఇండియా, హ్యాపీ ఇండియా క్యాంపెయిన్ మొదలు పెట్టి పిల్లల భద్రత గురించి ప్రచారం చేశాం. కరపత్రాలు పంచాం' అంటుంది వైశాలి కోలా.

పిల్లలపై లైంగిక వేధింపులను నిరోధించడానికి, పిల్లల మానసిక ఆరోగ్యాన్ని కాపాడడానికి శ్రీకాళహస్తిలో 'తేజోభారత్' అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసింది వైశాలి.

'ఏదైనా నేరం జరిగితే దానిగురించి కాసేపు మాట్లాడుకొని బాధ పడతారు. ఆ తరువాత మరచి పోతుంటారు. కొందరు మాత్రం ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో నిద్రలేని రాత్రులు గడుపుతుంటారు. అలాంటి వారు కూడా ఏదైనా చేద్దాం అంటే ముందుకు రారు. పిల్లలు ఎదుర్కొంటున్న వివిధ రకాల ప్రమాదాల గురించి అవగాహన కలిగించడానికి స్వరక్ష ఏర్పాటు చేశాం' అంటుంది కేరళలోని కోచికి చెందిన అనూ సూరజ్.

'స్వరక్ష చారిటబుల్ ట్రస్ట్' అనే స్వచ్ఛంద సంస్థ పిల్లలపై జరిగే భౌతిక, లైంగిక, మానసిక హింస గురించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సాధారణ ప్రజలకు తెలియజేయడానికి అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది.

ఎన్నెన్నో రూపాల్లో...

పిల్లల్ని పనిలో పెట్టుకొని వారి భవిష్యత్‌ను చీకటిమయం చేసే, పిల్లల్ని అపహరించి అమ్ముకునే, పిల్లల్ని అపహరించి వ్యభిచార కూపాల్లోకి దింపే సంఘటనలు ఒకవైపు... మరోవైపు యుద్ధాలలో చనిపోతున్న పిల్లలు. యుద్ధ భీభత్సానికి బాధితులు అవుతున్న పిల్లలు. ఇంట్లో తల్లిదండ్రుల తగాదాలకు మానసికంగా దెబ్బ తింటున్న, అయిన వారి చేతిలోనే లైంగిక వేధింపులకు గురవుతున్న పిల్లలు ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది ఉన్నారు

● బ్యూటిప్స్

టర్మరిక్ క్యూబ్స్‌తో.. మిలమిలలాడే అందం





ఇది అటు ఎండా... ఇటూ వానా రెండూ కలగలిసిన వింత వాతావరణం. ఈ సీజన్‌లో ఎన్ని జాగ్రత్తలు పాటిస్తున్నప్పటికీ ముఖ చర్మం జిడ్డుగా, మొటిమలు, బ్లాక్, వైట్ హెడ్స్ వల్ల కమిలినట్లుగా కనిపిస్తుంది. ఈ సమస్యలన్నింటికీ పసుపు ఐస్‌క్యూబ్‌లతో మంచి పరిష్కారం లభిస్తుంది.

- టీస్పూను పసుపు, టీస్పూను ముల్తానీ మట్టి, టీస్పూను ఆరెంజ్ పొడి, కప్పు రోజ్‌వాటర్, టీస్పూను కొబ్బరి పాలు, ఆరు చుక్కల నిమ్మ నూనెను తీసుకుని ఒకగిన్నెలో వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ఐస్ క్యూబ్స్ ట్రేలో పోసి గడ్డకట్టేంత వరకు రిఫ్రిజిరేటర్‌లో ఉంచాలి. ఈ క్యూబ్‌లు మూడు వారాల వరకు తాజాగా ఉంటాయి.
- ముఖాన్ని శుభ్రంగా కడిగి ఈ ఐస్‌క్యూబ్స్‌తో ఇరవై నిమిషాల పాటు మృదువుగా మర్దన చేయాలి
- ఇరవై నిమిషాల తరువాత గోరువెచ్చటి నీటితో కడిగి తడిలేకుండా తుడవాలి. ఇప్పుడు మాయిశ్చరైజర్ లేదా అలోవెరా జెల్‌ను రాసుకోవాలి.
- ఇలా క్రమం తప్పకుండా చేయడం వల్ల ముఖంపై పేరుకుపోయిన మొటిమల తాలూకు మచ్చలు, వైట్, బ్లాక్ హెడ్స్, ట్యాన్ పోయి ముఖం ఫ్రెష్‌గా మెరుపులీనుతూ కనిపిస్తుంది.
- అంతేకాదు, చర్మం జిడ్డు కారడం ఆగిపోయి దీర్ఘకాలంగా వేధిస్తోన్న మొటిమలు కూడా తగ్గుముఖం పడతాయి.
- పసుపు, కొబ్బరి పాలు వృద్ధాప్య చాయలను నియంత్రించి చర్మం యవ్వనంగా కనిపించేలా చేస్తాయి.

రివైవ్

పుస్తకాలతో మరోసారి...

ఒకప్పుడు పుస్తకాలు తెగ చదివేవాడిని. ఇప్పుడు సంవత్సరానికి ఒక పుస్తకం చదవడం కూడా కష్టమైంది' అనే మాట వింటుంటాం. పుస్తకం పఠనం అనేది విలువైన అభిరుచి. ఆ అభిరుచిని ఎప్పటిలాగే కొనసాగించడానికి...



- ఎప్పటినుంచో చదవాలనుకుంటున్న పుస్తకంతో మీ రెండో ప్రయాణం ప్రారంభించండి.
- టీవీలో మీకు యాక్షన్ మూవీస్ ఇష్టమైతే 'థ్రిల్లర్' నవలతో ప్రారంభించండి.
- పెద్దపెద్ద పుస్తకాలతో కాకుండా చాలా చిన్న పుస్తకాలతో చదవడం మొదలుపెట్టండి.
- 'రోజుకు ఇన్ని పేజీలు' అని నిర్ణయించుకొని వాటిని మెల్లగా పెంచుతూ పోవాలి.
- మీతో పాటు ఎప్పుడూ ఒక పుస్తకం ఉండాలి. బయట ఎక్కడైనా ఖాళీ సమయం దొరికినప్పుడు, వెయిటింగ్‌లో ఉన్నప్పుడు సెల్‌ఫోన్ చూడడం కాకుండా పుస్తకంలో కొన్ని పేజీలైనా చదవాలి.
- పుస్తక పఠనం అనేది సోలో హాబీ మాత్రమే కాదు. ఇతరులతో షేర్ చేసుకోవచ్చు.
- రెండు మూడు రోజులు కావచ్చు. వారం కావచ్చు...'రీడింగ్ టైమ్' అని ప్రత్యేకంగా కేటాయించుకోవాలి.
- కాస్త మార్పు కోసం, ఆసక్తి కోసం కొంత టైమ్ ఫిజికల్ బుక్స్ నుంచి ఇ-బుక్స్‌కు మారండి.



బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) జూన్ 3న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	97,310
బంగారం (22 క్యారెట్లు)	90,110
వెండి	1,01,000
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	1,00,260
బంగారం (22 క్యారెట్లు)	90,800
వెండి	1,02,800
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	99,060
బంగారం (22 క్యారెట్లు)	90,800
వెండి	1,11,100
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	1,00,260
బంగారం (22 క్యారెట్లు)	93,520
వెండి	1,02,800
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	97,000
బంగారం (22 క్యారెట్లు)	89,240
వెండి	1,00,500
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	99,050
బంగారం (22 క్యారెట్లు)	90,800
వెండి	1,13,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

లీగల్

వీలునామా రిజిస్ట్రేషన్ తప్పనిసరేం కాదు!

1999లో మా తాతగారు చనిపోవడానికి ఒక సంవత్సరం ముందు వీలునామా రాశారు. అందులో నాకు నా కజిన్ (పెద్దమ్మ కూతురు)కి సమానమైన వాటా రావాలి అని చెప్పనే ఆ వీలునామా మేము ఇద్దరం మేజర్లు అయిన తర్వాత మాత్రమే చెల్లుతుంది అని కూడా రాశారు. నేను, మా కజిన్ దాదాపు ఒకటే వయసు వాళ్ళం. 2007లో మేజర్లం అయ్యాం. సమస్య ఏమిటంటే, ఆ వీలునామా రిజిస్టర్ కాలేదు. ఇప్పుడు రిజిస్ట్రేషన్ ఆఫీసుకు వెళ్తే ఇది చాలా పాతది – ఈ వీలునామా చెల్లదు, కోర్టును ఆశ్రయించాలి అంటున్నారు. మా మేనమామకు – ఇంకొక పిన్నిగారికి కూడా సంతానం ఉంది కానీ వారికి ఈ ఆస్తిలో మా తాతగారు ఏమీ వాటా ఇవ్వలేదు. ఈ విషయాలు అన్నీ తెలిసినప్పటికీ కూడా ఇప్పుడు మేము కోర్టుకు వెళితే వాళ్లు పేచీ పెడతారని భావిస్తున్నాము. ఏం చేయమంటారు?

– సరళ, విశాఖపట్నం

వీలునామా రిజిస్టర్ చేసుకోవడం మంచిది అయినప్పటికీ రిజిస్టర్ చేయాలి అనే ఖచ్చితమైన నియమం ఎక్కడా లేదు! రిజిస్టర్ చేయని వీలునామా అయినా చట్టబద్ధంగా చెల్లుతుంది. ఈ విషయాన్ని ఇదివరకే చాలాసార్లు తెలియజేశాను. చాలా పాత వీలునామా కాబట్టి ఇది చెల్లదు అనడం సరికాదు. వీలునామాను అమలుపరచుటకు (ఎగ్జిక్యూట్ చేయుటకు) ఎటువంటి కాలపరిమితీ లేదు. మీరు తీసుకువెళ్లిన వీలునామా ఆధారంగా రిజిస్ట్రార్ గారు ఖచ్చితంగా మీ పేరున ఆస్తి బదిలీ చేయవలసి ఉంటుంది. పైగా ఈ ఆస్తిపై, సదరు వీలునామాపై అభ్యంతరాలు ఉన్నాయి అంటూ ఎవరు ఎటువంటి ఫిర్యాదులు వాళ్లకు అందనప్పుడు రిజిస్ట్రేషన్‌ను ఆపే హక్కు వారికి లేదు.

ఇక్కడ మరో విషయం... కోర్టులో దావా వేస్తే మీరు అనుమానం వ్యక్తపరచిన విధంగా మీ తాత గారి సంతానం అయిన వేరే కుటుంబ సభ్యులు, వారి పిల్లలు ఇప్పుడు పేచీ పెట్టే అవకాశం లేకపోలేదు. సివిల్ కోర్టుకు వెళ్తే మీరు డిక్లరేషన్ సూట్ వేయవలసి ఉంటుంది. అయితే సివిల్ కోర్టుకు వెళ్లే ముందు, మరొక దరఖాస్తు సదరు రిజిస్ట్రార్ గారికి సమర్పించి అక్నాలెడ్జ్‌మెంట్ తీసుకోండి. వారు అప్పటికీ వినను అంటే దరఖాస్తును తిరస్కరిస్తున్నట్లుగా లిఖితపూర్వకంగా వ్రాసి ఇమ్మని అడగండి. అలా ఇచ్చినా ఇవ్వకపోయినా, హైకోర్టు లాయర్ గారిని సంప్రదించి రిట్ పిటిషన్ ద్వారా హైకోర్టును ఆశ్రయించి రిజిస్ట్రార్ గారి నిర్ణయాన్ని (లేదా మీ దరఖాస్తుపై జాప్యాన్ని) చాలెంజ్ చేయండి. హైకోర్టు ద్వారా మీకు అనుకూలమైన ఆర్డర్ రావడానికి అవకాశాలు బాగానే ఉన్నాయి. అప్పుడు సివిల్ కోర్టుకు వెళ్లవలసిన అవసరం రాదు.



– శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది


మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

● కిచెన్ టిప్స్





- ఇనుప బాణలి, కళాయి, పెనం, ఇతర ఇనుముతో చేసిన వంటసామగ్రిని వాడకుండా కొద్దికాలం పక్కన పెడితే చాలు తుప్పు పట్టడం సహజం. ఇలా తుప్పు పట్టిన ఇనుప బాణలిలో కొద్దిగా హార్పిక్ వేసి బాణలి అంతా రాసి గంట పాటు నానబెట్టాలి. తరువాత స్టీల్ స్క్రబ్బర్‌తో గట్టిగా రుద్ది కడగాలి. మరోసారి డిష్‌వాష్ లిక్విడ్ కూడా వేసి మెత్తటి పీచుతో రుద్ది కడగాలి. ఇలా కడిగిన బాణలిని తడిలేకుండా శుభ్రంగా తుడిచి, నూనెరాసి ఆరనివ్వాలి. ఇలా చేస్తే ఇనుప వస్తువులు తుప్పు రాకుండా వాడుకోవడానికి చక్కగా పనికొస్తాయి.
- బంగాళ దుంప ముక్కలను పది నిమిషాల పాటు మజ్జిగలో నానబెట్టి, తరువాత ఫ్రై చేస్తే ముక్కలు అతుక్కోకుండా కరకరలాడుతూ వేగుతాయి.



'బీడుబడిన భూముల్లో జలయజ్ఞంతో ఆనందపు సిరులు పండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 73

బుధవారం 4-6-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఉగ్రవాదానికి కొత్త రెడ్‌లైన్

యుద్ధంలో చిన్నచిన్న తప్పిదాలు ముఖ్యం కాదు: సీడీఎస్

- 6లో



రణ 'పంచ'తంత్రం

రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్ల దండు దాడితో మారిన యుద్ధవ్యూహాలు

- 6లో



14 లో

18 ఏళ్ల

బెంగ తీరింది..

తొలిసారి ఐపీఎల్ టైటిల్ నెగ్గిన బెంగళూరు

ఫైనల్లో 6 పరుగులతో పంజాబ్ కింగ్స్‌పై గెలుపు

రాణించిన కోహ్లి, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్

18 ఏళ్ల నుంచి నెరవేరని ఓ కల... కోహ్లి ఉన్న జట్టుకు ఉన్న ఏకైక బెంగ... ఎట్టకేలకు తీరింది. ఐపీఎల్ 18వ సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) సరికొత్త చాంపియన్‌గా అవతరించింది. మంగళవారం జరిగిన ఫైనల్లో రజత్ పాటీదార్ సారథ్యంలోని బెంగళూరు 6 పరుగుల తేడాతో శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలోని పంజాబ్ కింగ్స్‌పై విజయం సాధించింది. 11 ఏళ్ల తర్వాత అమీ తుమీకి అర్హత సాధించిన పంజాబ్ కింగ్స్‌కు ఈసారీ ఐపీఎల్ కిరీటం దక్కలేదు. ఫైనల్లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసింది. కోహ్లి (35 బంతుల్లో 43; 3 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. తర్వాత పంజాబ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 184 పరుగులే చేసి ఓడింది. శశాంక్ సింగ్ (30 బంతుల్లో 61 నాటౌట్; 3 ఫోర్లు, 6 సిక్స్‌లు) ఆఖరి మెరుపులు కింగ్స్‌ను అందలాన్ని ఎక్కించలేకపోయాయి. కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ చెరో 2 వికెట్లు తీసి పంజాబ్‌ను దెబ్బ కొట్టారు. ఏళ్ల తరబడి నిరీక్షణకు తెరపడిన వేళ పట్టరాని భావోద్వేగంతో కోహ్లి మైదానంపైనే మోకరిల్లాడు. చెమర్చిన కళ్లతో సహచరులతో కలిసి సంబరాలు చేసుకున్నాడు.



లుకలుకలు.. కుమ్ములాటలు

రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీల్లో అంతర్గత రగడ.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీల్లో రచ్చ

- అసమ్మతి స్వరాలు, అసంతృప్తి జ్వాలలతో సతమతం
- కాంగ్రెస్‌లో తేలని కేబినెట్ విస్తరణ..ఆశావహుల నిరసన గళం
- పార్టీ పదవుల లొల్లి.. గాంధీభవన్‌లో మహిళా నేతల ధర్నా
- ఎమ్మెల్సీ కవిత రె'బెల్స్'తో బీఆర్‌ఎస్‌లో దుమారం
- జాగృతి బలోపేతమంటూ పార్టీకి సమాంతరంగా కార్యకలాపాలు
- కమలంలోనూ కలహాలు.. నేతల్లో కొరవడిన ఐక్యత..
- తలనొప్పిగా మారిన రాజాసింగ్ తీరు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీలు. ఒకటి అధికార కాంగ్రెస్, రెండోది ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్, మూడవది జాతీయ పార్టీ బీజేపీ. ఏ చిన్న అవకాశం దొరికినా ప్రత్యర్థి పార్టీలపై ఆరోపణలు, విమర్శలతో విరుచుకుపడుతుంటాయి. ప్రజల దృష్టిని తమ వైపునకు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తుంటాయి. కానీ ప్రస్తుతం.. ఈ మూడు ప్రధాన రాజకీయ పక్షాలూ వేటికవే తమతమ పార్టీల్లో అసమ్మతి స్వరాలు, అసంతృప్తి జ్వాలలు, అంతర్గత కుమ్ములాటలు, విభేదాలతో సతమతమవుతున్నాయి. ఏ పార్టీకి ఆ పార్టీలో లుకలుకలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువని చెప్పే కాంగ్రెస్ పార్టీలో ఇలాంటివి సహజమే అయినా క్రమశిక్షణకు మారు పేరని భావించే బీజేపీ, ఏకఛత్రాధిపత్యం కింద నడిచే ప్రాంతీయ పార్టీ బీఆర్‌ఎస్‌లో కూడా రాజకీయ రచ్చ కొనసాగుతుండటం గమనార్హం. అయితే గ్రూపులు, గొడవలకు పుట్టినిల్లు లాంటి కాంగ్రెస్ పార్టీలో రహస్య కొట్లాటలు జరుగుతుంటే, బీజేపీ, బీఆర్‌ఎస్‌లలో మాత్రం విభేదాలు బహిరంగమవుతుండటం మరో విశేషం.



కాంగ్రెస్‌లో పదవులు, ప్రాధాన్యం రభస

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతోంది. ఏడాదిన్నరలోనే ప్రభుత్వ పాలన, ప్రభుత్వ.. పార్టీ పదవులు, ప్రాధాన్యత, మంత్రివర్గ విస్తరణ, మంత్రుల వ్యవహారశైలి తదితర అంశాలు చర్చనీయాంశమవుతున్నాయి. అంతర్గత విభేదాలకు, ఫిర్యాదులకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా మంత్రివర్గ విస్తరణ అంశం ఏడాదిన్నర తర్వాత కూడా కొలిక్కి రావడం లేదు. ఎన్నిసార్లు ఢిల్లీ చుట్టూ తిరిగినా, హైదరాబాద్‌లో చర్చలు జరిగినా తేలడం లేదు. అదిగో విస్తరణ...ఇదిగో విస్తరణ అంటూ ఎప్పటికప్పుడు దాటవేతతో విసుగు వచ్చిన ఇద్దరు ఆశావహ ఎమ్మెల్యేలు.. కేబినెట్‌లో బెర్తు కేటాయించకపోతే తమ దారి తాము చూసుకుంటామని సన్నిహితుల వద్ద నిరసన గళం విన్పించినట్టుగా బయటకు రావడం పార్టీలో కలకలం రేపింది. మరోవైపు పదవుల లొల్లి కూడా ఆ పార్టీని కుదిపేస్తోంది. చాలా కాలం తర్వాత నియమించిన కమిటీల్లో కొంత సామాజిక న్యాయ కోణం

మిగతా 12వ పేజీలో ▶



పోషకలోపం.. ఊబకాయం!

డబుల్ బర్డెన్ ఆఫ్ మాల్‌న్యూట్రిషన్‌తో బాధపడుతున్న యువత

22 ఏళ్ల వయస్కుల్లో 29% మందిలో పోషకాహార లోపం.. 19% మందిలో స్థూలకాయం

చదువుకోని/చదువుకున్న తల్లులు ఉన్న ఇళ్లలోనూ స్పష్టమైన తేడా

యంగ్ లైవ్స్ – 2023 సర్వే

3 లో

చరిత్రలో చిరస్థాయిగా భూభారతి

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

ఆగస్టు 15 నాటికి భూ సమస్యలకు పరిష్కారం: పొంగులేటి

నాట్ల కంటే ముందే రైతు భరోసా: తుమ్మల



ములుగుమాడులో సర్వేకు ఉపయోగించే డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, తుమ్మల

ఎర్రుపాలెం: ధరణి స్థానంలో తీసుకొచ్చిన భూభారతి చట్టం దేశ చరిత్రలో నిలిచిపోతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. భూభారతిపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రెవెన్యూ గ్రామాల్లో ఈ నెల 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమాడు గ్రామంలో.. భూముల రీ సర్వే, రెవెన్యూ సదస్సును మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వాతంత్య్రం వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలు

మిగతా 2వ పేజీలో ▶

ఎర్రగడ్డ మానసిక వైద్యశాలలో కలుషిత ఆహారం

- ఒకరి మృతి.. 70 మంది రోగులకు అస్వస్థత
- ఆస్పత్రిలో కలెక్టర్, డీఎంఈ తనిఖీలు
- ఆహారం, నీటి నమూనాలను పరీక్షకు పంపిన అధికారులు

5 లో



హైదరాబాద్‌లోని గోషామహల్‌లో తాము నేర్చుకున్న మెళకువలను ప్రదర్శిస్తున్న 'స్వాట్' బృందం పోలీసులు

మహిళా పోలీసులతో 'స్వాట్'

మహిళా నిరసనకారుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన సిటీ పోలీసులు

అతివల గౌరవానికి భంగం కలగకుండా అదుపులోకి తీసుకునేలా తర్ఫీదు

35 మందికి వివిధ అంశాల్లో 45 రోజుల శిక్షణ

ఈ టీమ్స్‌ను ప్రారంభించిన కొత్వాల్ సీవీ ఆనంద్

2 లో



తెలుగు విద్యార్థులకు న్యాయ సహాయం



- బీఆర్‌ఎస్ తరఫున అండగా ఉంటామన్న కేటీఆర్
- అమెరికా చట్టాలపై అవగాహనతో మసలుకోవాలని సూచన
- యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్– డాలస్ విద్యార్థులతో భేటీ

- వివరాలు 12లో



మీడియా సమావేశంలో మంత్రి జూపల్లి

ప్రపంచ సుందరి పోటీల ఖర్చు రూ.30 కోట్లే

- స్పాన్సర్‌షిప్స్ ద్వారా రూ.21 కోట్లు సమకూరాయి.. మరో రూ.10 కోట్ల ఒప్పందాలు పెండింగ్‌లో ఉన్నాయి
- రూ.200 కోట్ల ఖర్చంటూ ప్రతిపక్షాల తప్పుడు ఆరోపణ: మంత్రి జూపల్లి

2 లో

'పుర' వార్డుల పునర్విభజనకు షెడ్యూల్ విడుదల

- 18 కొత్త మున్సిపాలిటీలు, 5 పాత కార్పొరేషన్లు, 7 పాత మున్సిపాలిటీలు
- జూన్ 21లోపు ప్రక్రియ పూర్తి

- 2లో

మహిళా నిరసనకారుల కోసం

మహిళా పోలీసులతో స్వాట్

ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన హైదరాబాద్ పోలీసులు

అతివల గౌరవానికి భంగం కలగకుండా అదుపులోకి తీసుకునేందుకు తర్ఫీదు

35 మందికి వివిధ అంశాల్లో 45 రోజుల శిక్షణ

ఈ టీమ్స్‌ను ప్రారంభించిన కొత్వాల్ సీవీ ఆనంద్



సీపీ ఆనంద్ ఎదుట స్వాట్ బృందాల ప్రదర్శన

సాక్షి, హైదరాబాద్: నిరసనలు..ధర్నాలు..ఆందోళనల్లో పాల్గొనే మహిళలను అదుపులోకి తీసుకునే సమయంలో వారి ఆత్మగౌరవానికి భంగం కలగకుండా ఉండేందుకు హైదరాబాద్ పోలీసులు స్వాట్ (స్విఫ్ట్ ఉమెన్ యాక్షన్ టీమ్) పేరుతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. మహిళా నిరసనకారులను అదుపులోకి తీసుకొని, పోలీస్‌స్టేషన్లకు తరలించే సందర్భాల్లో తరచూ అపశ్రుతులు చోటు చేసుకుంటున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారు. వివిధ అంశాల్లో శిక్షణ పూర్తి చేసుకున్న ఈ బృందాలను నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ మంగళవారం గోషామహల్ పోలీస్ స్టేడియంలో ప్రారంభించారు.

ఆ సందర్భంలో పుట్టిన ఆలోచన...

హైదరాబాద్‌లోని సుల్తాన్‌బజార్‌లో ఉన్న డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద ఆశా వర్కర్లు గత ఏడాది డిసెంబర్‌లో నిరసన తెలిపారు. వీరిని ముందస్తు అరెస్టు చేయడానికి అవసరమైన స్థాయిలో మహిళాపోలీసులు లేకపోవడం, ఉన్న వారికీ నైపుణ్యం లేకపోవడంతో ఆ అంశం తీవ్ర వివాదాస్పదమైంది. పోలీసులు మహిళల ఆత్మగౌరవానికి భంగం కలిగేలా ప్రవర్తించారని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన పోలీసు విభాగం మహిళా నిరసనకారుల్ని అదుపులోకి తీసుకోవడానికి మహిళా పోలీసులతో కూడిన వింగ్ ఉండాలని నిర్ణయించింది. దీంతో నగర సాయుధ విభాగం (సీఏఆర్) హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన 2024 బ్యాచ్ కానిస్టేబుళ్లతో స్వాట్ టీమ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుంది. ఒక్కో ప్లటూన్‌లో 21 మంది చొప్పున రెండింటికి రూపం ఇవ్వడానికి సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు.

గోషామహల్ పోలీస్ స్టేడియంలో స్వాట్ బృందాల ప్రదర్శన

తొలి దశలో 35 మందిని స్వాట్ కోసం ఎంపిక చేశారు. వీరికి పోలీసులతోపాటు మార్షల్ ఆర్ట్స్, మాబ్ కంట్రోల్ ఎక్స్‌పర్ట్స్‌తో 45 రోజుల పాటు శిక్షణ ఇప్పించారు. మహిళలతోపాటు పురుష నిరసనకారుల్ని అదుపు చేయడం, వారిని అదుపులోకి తీసుకోవడం, ఎలాంటి ఆయుధం లేకుండా శత్రువుతో పోరాడటం, నిరసనల సమయంలో వ్యూహాత్మకంగా వ్యవహరించడం తదితర అంశాల్లో తర్ఫీదు ఇచ్చారు. గోషామహల్ పోలీస్ స్టేడియంలో స్వాట్ బృందాలు తాము నేర్చుకున్న అంశాలను ప్రదర్శించాయి. సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తి నేతృత్వంలో పని చేయనున్న ఈ బృందాలకు ఆర్ఎస్సై మౌనిక పర్యవేక్షణలో శిక్షణ ఇచ్చారు. త్వరలోనే మరో ఏడుగురిని ఎంపిక చేసి శిక్షణ ఇస్తారు.

బైక్ స్టంట్‌తో అబ్బురపరిచిన పూజ...



ప్రదర్శన సందర్భంగా స్వాట్ సభ్యురాలు పి.పూజ బైక్ స్టంట్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈమె కడుపుపై ఓ చెక్క పెట్టిన శిక్షకులు దాని మీదుగా ద్విచక్ర వాహనంపై వెళ్లారు. దీనికోసం తాను ఎలాంటి ప్రాక్టీసు చేయలేదని, కేవలం డెమో నిర్వహించి నేరుగా వచ్చానని వివరించారు. జాతీయస్థాయిలో వాలీబాల్ ప్లేయర్ అయిన పూజ.. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోలీసు క్రీడల్లోనూ పాల్గొన్నారు. వాలీబాల్‌లో గోల్డ్, ఆర్మ్ రెజ్లింగ్‌లో బ్రాంజ్ మెడల్స్ గెల్చుకున్నారు.

ఎలాంటి దుస్తులు ధరించినా నేర్పుగా



నిరసన తెలుపుతున్న మహిళలందరూ ఒకే విధమైన దుస్తులు ధరించరు. చీర, చుడీదార్, జీన్స్ ఇలా ఏ రకమైన వస్త్రాలు ధరించిన వారిని ఎలా అదుపులోకి తీసుకోవాలి అనే దానిపై ప్రత్యేకంగా తర్ఫీదు ఇచ్చారు. ఒకే చోట గుంపుగా ఉన్న ఆందోళనకారుల్నీ సోలార్ లాక్, ప్రామిస్ లాక్ అనే టెక్నిక్స్ వాడుతూ ఎలా లిఫ్ట్ చేయాలన్నది నేర్చుకున్నాం.

- జె.ఉమ

రెండు రకాల మార్షల్ ఆర్ట్స్ శిక్షణ



స్వాట్ ట్రైనింగ్‌లో భాగంగా జిమ్ వ్యాయామం తోపాటు రెండు రకాలైన మార్షల్ ఆర్ట్స్ నేర్పించారు. కరాటేలో కట్టాస్, పంచెస్, సెల్ఫ్ డిఫెన్స్, కిక్స్... క్రామ్‌మగాలో రియల్ ఫైట్, ఏడు మూవ్‌మెంట్స్‌లో ఎదుటి వ్యక్తిని నేలకూల్చడం తదితర అంశాల్లో అవగాహన కల్పించారు.

- టి.శిల్పవర్ధన్

క్లుప్తంగా...

బనకచర్లపై తగ్గేదే లేదు

మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వ నిరసన కొనసాగుతోందని సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెప్పారు. బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకునేందుకు ఇప్పటివరకు కావలసిన అన్ని ప్రయత్నాలు చేశామని స్పష్టం చేశారు. ఇంకా చేయాల్సినవి ఉంటే అవి కూడా చేస్తామని, ఈ విషయంలో ఏమాత్రం వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని చెప్పారు. ఈ ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని, త్వరలోనే కార్యాచరణ ప్రణాళికను ప్రకటిస్తామని తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ రెండు రోజుల్లో తమ స్పందన తెలియజేస్తామన్నారు. మరింత స్పష్టత వచ్చేలా అన్ని వివరాలను వెల్లడిస్తామన్నారు. బనకచర్లపై తమ అభ్యంతరాలను కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లామని ఉత్తమ్ చెప్పారు.

అందాల పోటీలతో రాష్ట్రానికి ఏం తీసుకొచ్చారు?

ప్రశ్నించిన బీఆర్ఎస్ మహిళా నేతలు


మాట్లాడుతున్న తుల ఉమ

సాక్షి, హైదరాబాద్: అందాల పోటీలతో రాష్ట్రానికి ఏం తీసుకొచ్చారు? ఏం తీసుకొస్తారో చెప్పాలని బీఆర్ఎస్ మహిళా నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణభవన్‌లో తుల ఉమ, రమాదేవి, సుశీలారెడ్డి, సుమిత్రానంద్, అన్నపూర్ణతో కలిసి విలేకరులతో మాట్లాడారు. అందాల పోటీలకు సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డికి ఏం సంబంధమని, ఆయనతో మెమెంటోలు ఎట్లా ఇప్పిస్తారని ప్రశ్నించారు. అందాల పోటీదారులతో సీఎం రేవంత్‌రెడ్డి బిడ్డ డిన్నర్ చేయడం ఏంటని అడిగారు. అందాల పోటీల కార్యక్రమానికి సీఎం ఏడెనిమిది సార్లు వెళ్లారని, నిజాలు తెలుసుకోకుండా ఎంపీ చామల కిరణ్ మతిభ్రమించి మాట్లాడు తున్నారన్నారు. హరీశ్‌జన్మదినం సందర్భంగా తెలంగాణ భవన్ వద్ద ఫ్లెక్సీలు కడితే వచ్చిన నొప్పేమిటని, పుట్టిన రోజు ఇంకా పూర్తి కాకముందే ఫ్లెక్సీలు ఎలా తొలగిస్తారన్నారు.

వెంకయ్యనాయుడితో మందకృష్ణ భేటీ

సాక్షి, హైదరాబాద్: పద్మశ్రీ అవార్డును అందుకున్న నేపథ్యంలో మందకృష్ణ మాదిగ.. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడిని హై దరాబాదులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సుదీర్ఘ పోరాటం విజయవంతం కావడం, శ్రమ, త్యాగం, నిబద్ధతకు సరైన గౌరవంగా పద్మశ్రీ పురస్కారాన్ని మందకృష్ణ అందుకోవడంపై వెంకయ్యనాయుడు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగను అభినందించారు.

కేసీఆర్ క్షమాపణలు చెప్పాలి

ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్



సాక్షి, హైదరాబాద్: చావు నోట్లో తల పెట్టి, తల తాకట్టు పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చానని చెప్పుకొనే మాజీ సీఎం కేసీఆర్.. రాష్ట్ర అవతరణ దినోత్సవం కూడా జరుపుకోరా? అని తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ప్రశ్నించారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా, పార్టీ అధ్యక్షునిగా రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాలను జరపనందుకు ప్రజలకు ఆయన క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సాయికుమార్ మంగళవారం గాంధీ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ కోసమే పుట్టిన పార్టీ నేతలు.. ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన రాష్ట్ర అవతరణ ఉత్సవాలకు హాజరు కాకుండా అవమానించారని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజలు ఆనందంగా ఉంటే ఓర్వలేని కొందరు నేతలు విదేశాల్లో తిరుగుతున్నారని విమర్శించారు.

ప్రపంచ సుందరి పోటీల ఖర్చు రూ.30 కోట్లే

స్పాన్సర్‌షిప్స్ ద్వారా రూ.21 కోట్లు సమకూరాయి

- మరో రూ.10 కోట్ల ఒప్పందాలు పెండింగ్‌లో ఉన్నాయి
- అవి వస్తే నయాపైసా ఖర్చు కానట్టే...
- రూ.200 కోట్ల ఖర్చంటూ ప్రతిపక్షాల తప్పుడు ఆరోపణ
- పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు


సచివాలయంలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి. చిత్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ సుందరి పోటీల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.30 కోట్లు వెచ్చిస్తే..స్పాన్సర్‌షిప్ రూపంలో రూ.21 కోట్ల ఆదాయం సమకూరిందని పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. మరో రూ.10 కోట్లకు సంబంధించి స్పాన్సర్‌షిప్ ఒప్పందాలు పెండింగ్‌లో ఉన్నాయని, ఆ మొత్తం కూడా సమకూరితే ప్రభుత్వానికి నయాపైసా కూడా ఖర్చు లేకుండా ఈ అంతర్జాతీయ స్థాయి పోటీలను నిర్వహించినట్టవుతుందని చెప్పారు. మిస్ వరల్డ్ సంస్థ అవసరాలకు రూ.3 కోట్లు ఇచ్చామని, అవి కూడా ఖర్చులో భాగంగానే చూపామని వెల్లడించారు. మంగళవారం ఆయన సచివాలయంలో మరో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ పోటీల రూపంలో ప్రపంచ మీడియాను తెలంగాణకు రప్పించటం ద్వారా ఇక్కడి పర్యాటక ప్రాంతాలపై ప్రపంచస్థాయిలో విస్తృత చర్చకు వీలు కల్పించామని, ఫలితంగా తెలంగాణ పర్యాటకానికి రూ.10 వేల కోట్ల విలువైన ప్రచారం లభించి ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దీర్ఘకాలంలో దీని ఫలితాలు అద్భుతంగా ఉండబోతున్నాయన్నారు. పర్యాటకం, హస్తకళలు, చేనేత ఉత్పత్తులకు మంచి ప్రమోషన్ వచ్చిందని, మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లను ప్రపంచానికి పరిచయం చేశామని, ఆ వేడుకల నిర్వహణ, ఆతిథ్యం పట్ల పోటీదారులు, మిస్ వరల్డ్ సంస్థ ప్రతినిధులు, మీడియా ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు. పరిస్థితి ఇలా ఉంటే, బీఆర్ఎస్, బీజేపీ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా మిస్ వరల్డ్ పోటీల నిర్వహణపై విష ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిస్ వరల్డ్ పోటీలకు రూ.200 కోట్లు ఖర్చు అయ్యాయంటూ కేటీఆర్, హరీశ్‌రావు తదితరులు ఆరోపిస్తున్నారని, అంత ఖర్చు ఎలా అయ్యిందో ఆధారాలు చూపాలని, తనను తెలంగాణభవన్‌కు రమ్మన్నా, అబిడ్స్ చౌరస్తాకు రమ్మన్నా చర్చకు వస్తానని, నిరూపించలేకపోతే అంత ఖర్చు కాలేదని ఒప్పుకొని ముక్కు నేలకురాయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పాలనలో టూరిజం ప్రమోషన్ కార్యక్రమాలకు రూ.115 కోట్లకు పైగా ఖర్చు చేశారని, దానివల్ల ఎన్ని ఉద్యోగాలు వచ్చాయో తెలపాలని, ఇప్పుడు తాము ఇంత పెద్ద ఈవెంట్‌ను దాదాపు ఖర్చు లేకుండా నిర్వహించగలిగామని వెల్లడించారు. చౌమొహల్లా ప్యాలెస్ డిన్నర్‌లో ఒక్కో ప్లేట్ భోజనం ఖరీదు రూ.లక్ష అని, సుందరీమణులకు 30 తులాలు చొప్పున బంగారం ఇచ్చారని తప్పుడు వార్తలు రాయించారన్నారు. చౌమొహల్లా ప్యాలెస్ డిన్నర్‌కు ఫైవ్ స్టార్ హోటల్ నుంచి భోజనం తెప్పించామని, ఒక్కో ప్లేట్ ఖర్చు రూ.8,200 మాత్రమే అయ్యిందని చెప్పారు. ఐఏఎస్ అధికారులతో కాళ్లు మొక్కించుకున్న ఘనత కేసీఆర్ దేనని అన్నారు. పోటీదారులకు పిసరు కూడా బంగారం ఇవ్వలేదని పేర్కొన్నారు. తనపట్ల అభ్యంతరకరంగా వ్యవహరించారంటూ మిస్ ఇంగ్లండ్ మిల్లామ్యాగీ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని, ఆమె ఆరోపణలే నిజమైతే మిగతా 108 మంది పోటీదారులు చివరి వరకు సంతృప్తిగా, సంతోషంగా ఎలా ఉండగలిగారని ప్రశ్నించారు. తాము మళ్లీ హైదరాబాద్‌కు వస్తామని, తమ జీవితంలో హైదరాబాద్‌కు ప్రత్యేక స్థానం ఉంటుందని వారు చెప్పారని గుర్తు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మిస్ వరల్డ్ పోటీలు విజయవంతం కావటంతో ఓర్వలేకనే ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయన్నారు. వారి పార్టీల్లోని సమస్యలపై ప్రజల దృష్టి మరల్చేందుకు ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, పర్యాటకశాఖ డైరెక్టర్ హన్మంతు జండగే, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ కె.లక్ష్మి పాల్గొన్నారు.

చరిత్రలో చిరస్థాయిగా భూభారతి



▶ మొదటి పేజీ తరువాయి

రైతులకు ఉపయోగపడితే, బీఆర్ఎస్ తీసుకొచ్చిన ధరణితో మాత్రం అందరూ అవస్థ పడ్డారని భట్టి విమర్శించారు. ఈ నేపథ్యంలోనే తాము ఇచ్చిన హామీ మేరకు భూభారతి చట్టం తీసుకొచ్చామని చెప్పారు. ప్రతీ భూకమతానికి ఆధార్ కార్డు మాదిరి భూధార్ ఇస్తామని, అసైన్‌మెంట్ కమిటీలు ఏర్పాటు చేసి మిగులు భూములకు ఇంటి పట్టాల పంపిణీని చేపడతామని వెల్లడించారు. భూసమస్యల పరిష్కారం కోసం కోర్టులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా రెవెన్యూ అధికారులే పరిష్కరించేలా అప్పీల్ వ్యవస్థ ఏర్పాటు చేశామని డిప్యూటీ సీఎం తెలిపారు.

ఆధునిక టెక్నాలజీతో భూ రికార్డులు భద్రం

ధరణి చట్టం ఆసరాగా చేసుకుని, భూములు లేకుండానే పాస్ పుస్తకాల్లో చూపిస్తూ లక్షలాది ఎకరాల భూమికి బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు నిధులు కట్టబెట్టిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. అలా నిధులు పొందిన వారిలో ఎక్కువగా ఆ పార్టీ శ్రేణులే ఉన్నారని అన్నారు. ఆగస్టు 15 నాటికి భూభారతి చట్టంతో భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించి రైతులకు భద్రత కల్పిస్తామన్నారు. నెల రోజుల్లో 6వేల మంది సర్వేయర్ల ద్వారా డ్రోన్, డీజీపీఎస్ టెక్నాలజీతో పొరపాట్లు లేకుండా భూరికార్డులు భద్రం చేస్తామని చెప్పారు.

భూభారతితో అవకతవకలకు కళ్లెం

గత సంవత్సరం సంక్షేమ పథకాలన్నీ ఒకేసారి ప్రారంభించడంతో రైతు భరోసా నిధులు ఆలస్యంగా ఇచ్చామని, ఈసారి మాత్రం వరి నాట్ల కంటే ముందే రైతుల ఖాతాల్లో జమ చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. గతంలో కొందరు అసలు భూమి కన్నా రికార్డుల్లో ఎక్కువగా నమోదు చేసి రైతుబంధు కాజేశారని, ఇకపై అలా జరగొద్దనే భూభారతి చట్టం తీసుకొచ్చామని తెలిపారు. అనంతరం భూముల రీసర్వేతో లాభాలను సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిత్తల్, సర్వే సెటిల్‌మెంట్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాశ్, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సర్వే ల్యాండ్ జేడీ ప్రసన్నలక్ష్మి వివరించారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

‘పుర’ వార్డుల పునర్విభజనకు షెడ్యూల్ విడుదల

18 కొత్త మునిసిపాలిటీలు, 5 పాత కార్పొరేషన్లు, 7 పాత మునిసిపాలిటీలు

జూన్ 21లోపు ప్రక్రియ పూర్తి కావాలంటూ ఉత్తర్వులు

- ఔటర్ రింగ్‌రోడ్డు లోపలి మునిసిపాలిటీలకు మినహాయింపు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 30 మునిసిపల్ వార్డుల విభజనకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. ఇందులో 18 కొత్త మునిసిపాలిటీలు కాగా, మిగతావి పాత కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు. మునిసిపల్ పరిపాలన విభాగం ఆధ్వర్యంలో వార్డుల విభజన ప్రక్రియ మంగళవారం నుంచి జూన్ 21 వరకు పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించింది.ఈ మేరకు మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ రెండు ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఉన్న మునిసిపాలిటీల్లో కొత్త ప్రాంతాల కలయికతోపాటు, కొత్తగా ఏర్పాటైన మునిసిపాలిటీల్లో వార్డుల పునర్విభజన చేపట్టనున్నారు. కాగా ఔటర్ రింగురోడ్డు (ఓఆర్ఆర్) పరిధిలో ఉన్న 13 మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల పునర్విభజన జోలికి వెళ్లలేదు. ఓఆర్ఆర్ లోపలి కార్పొరేషన్లు, మునిసిపాలిటీలను కలిపి కొత్తగా మూడు కార్పొరేషన్లుగా మార్చాలని యోచిస్తున్న నేపథ్యంలో వాటి జోలికి వెళ్లలేదు.

21లోపు వార్డుల విభజన: 18 కొత్త మునిసిపాలిటీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం గత అసెంబ్లీ సమావేశాల్లోనే చట్టం చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయా మునిసిపాలిటీలకు వార్డుల సంఖ్యను పురపాలక శాఖ ప్రతిపాదించింది. ఈ మేరకు ఆయా మునిసిపాలిటీల్లో వార్డుల విభజన పూర్తి చేయాలి. ప్రస్తుతం ఉన్న ఐదు కార్పొరేషన్లు, ఏడు మునిసిపాలిటీల్లోనూ వార్డుల సంఖ్య పెంచాల్సి ఉంది. ఈ ప్రక్రియ ఈ నెల 21వ తేదీలోపు పూర్తి చేయాలి.

ప్రస్తుత మునిసిపల్ కార్పొరేషన్లలో...

మహబూబ్‌నగర్	49 నుంచి 60 వార్డులు
మంచిర్యాల	36 నుంచి 60
కరీంనగర్	60 నుంచి 66
రామగుండం	50 నుంచి 60
కొత్తగూడెం	34 నుంచి 60

ప్రస్తుత మునిసిపాలిటీల్లో

నర్సంపేట	24 నుంచి 30 వార్డులు
పరిగి	15 నుంచి 18
కొల్లాపూర్	20 నుంచి 19
ఆలేరు	12 నుంచి 12
బాన్సువాడ	19 నుంచి 19
జగిత్యాల	48 నుంచి 50
హాలియా	12 నుంచి 12

కొత్త మునిసిపాలిటీల్లో వార్డుల విభజన ప్రక్రియ ఇలా..

కోహీర్	16	ఇస్నాపూర్	22
కేసముద్రం	16	చేవెళ్ల	18
అశ్వారావుపేట	22	మొయినాబాద్	26
స్టేషన్‌ఘన్‌పూర్	18	ములుగు	20
మద్దూర్	16	ఇచ్చోడ	12
ఏదులాపురం	32	కల్లూరు	20
దేవరకద్ర	12	అలియాబాద్	20
గడ్డపోతారం	18	మూడుచింతలపల్లి	24
గుమ్మడిదల	22	ఎల్లంపేట	24

వార్డుల పునర్విభజనకు చేపట్టే కార్యక్రమాలు ఇలా..

- జూన్ 3: మునిసిపాలిటీల్లో ఫీల్డ్ సర్వే చేసి డ్రాఫ్ట్ ప్రతిపాదనలు సిద్ధం చేయడం
- జూన్ 4: ప్రజలు, ప్రజాప్రతినిధులకు నోటీసులు జారీ చేసి సూచనలు కోరడం, పత్రిక ప్రకటన ఇవ్వడం
- జూన్ 5-11: ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి అభిప్రాయాలు స్వీకరణ
- జూన్ 12-16: అందిన సూచనల పరిశీలన, విచారణ
- జూన్ 17-18: కలెక్టర్ సమీక్షకు పంపిణీ
- జూన్ 19: సీఎండీఏకు నివేదిక పంపడం
- జూన్ 20-21: తుది నోటిఫికేషన్ విడుదల

‘నేతన్నకు భరోసా’కు మార్గదర్శకాలు

బడ్జెట్‌లో రూ.48 కోట్ల కేటాయింపు: మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: ‘నేతన్నకు భరోసా’ పథకానికి ఈ నెల 2న మార్గదర్శకాలను జారీ చేసినట్లు చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. ఇందుకోసం రూ.48 కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకంలో భాగంగా.. జియో ట్యాగ్ చేసిన మగ్గాలపై పనిచేస్తున్న వారికి వేతన ప్రోత్సాహకం కింద.. గరిష్టంగా ఏటా నేత కార్మికులకు రూ.18,000, అనుబంధ కార్మికులకు రూ.6,000 అందించనున్నట్లు తెలిపారు. ఇందువల్ల దాదాపు 40,000 మంది చేనేత, అనుబంధ కార్మికులు లబ్ధి పొందుతారని వివరించారు. చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలకు ప్రత్యేకంగా రూపొందించిన యూనిక్ లోగోను జత చేయనున్నట్లు తెలిపారు. 18 ఏళ్ల నిండి జియో ట్యాగ్ చేసిన మరమగ్గాలపై పనిచేసే కార్మికులు, ప్రీలూమ్, ప్రిపరేటరీ పనులైన.. డైయింగ్, టైయింగ్, డిజైనింగ్, వార్పింగ్, వైండింగ్, సైజింగ్ తదితర అనుబంధ పనులు చేసే కార్మికులు, వార్షికాదాయంలో చేనేత వృత్తి ద్వారా కనీసం 50 శాతం ఆర్జిస్తున్న వారు అర్హులని పేర్కొన్నారు. ఈ పథకం కింద జియో ట్యాగ్ చేసిన మగ్గాల ద్వారా కనీసం 50 శాతం కంటే ఎక్కువ వార్పులు పూర్తి చేసిన వారికి నేరుగా వేతన ప్రోత్సాహకం కింద.. ఏటా రెండు విడతలుగా (ఏప్రిల్ నుండి సెప్టెంబర్, అక్టోబర్ నుండి మార్చి) బ్యాంకు ఖాతాలోకి నేత కార్మికునికి రూ.9,000, అనుబంధ కార్మికునికి రూ.3,000 జమ చేయనున్నట్లు వివరించారు. కాగా, మొదటి విడతలో 50 శాతం వార్పులు పూర్తి చేయని వారు, రెండో విడతలో పూర్తి చేసినట్లయితే మొత్తం ప్రోత్సాహకాన్ని.. సంవత్సరాంతంలో చేనేత, అనుబంధ కార్మికులకు అందించనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు.

అమ్మమాట.. అంగన్‌వాడీ బాట

- ఈనెల 10 నుంచి 17 వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- మార్గదర్శకాలు విడుదల చేసిన రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ



సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఈ నెల 10వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ‘అమ్మమాట–అంగన్‌వాడీల బాట’అంటూ వివిధ రకాల అంశాలతో కార్యక్రమాలు చేపట్టనుంది. 10వ తేదీ నుంచి అంగన్‌వాడీలను పూర్తిస్థాయిలో తెరుస్తారు. అయితే ఆలోపు స్వచ్ఛ అంగన్‌వాడీ కార్యక్రమం నిర్వహించాలి.

- అంగన్‌వాడీల్లో అందిస్తున్న వసతులు, అమలు చేస్తున్న పథకాలపై 6న జిల్లా సంక్షేమాధికారి ఆధ్వర్యంలో స్వయం సహాయ సంఘాల సమన్వయంతో ర్యాలీలు నిర్వహించాలి.
- జూన్ 10న అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, పేరెంట్స్ గ్రూప్ సెల్ఫీ, గ్రామ స్థాయిలో ప్రజాప్రతినిధులు, మహిళా స్వయం సహాయక సంఘాలతో సమావేశం, జూన్ 11న మూడేళ్లు పైబడిన చిన్నారులను గుర్తించి వారి నివాసాలను సందర్శించి అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతున్న సేవలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం, పిల్లలను చేర్చేలా ప్రోత్సహించడం చేపట్టాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు దాటిన పిల్లలకు గ్రాడ్యుయేషన్‌డే నిర్వహించి ప్రైమరీ స్కూళ్లలో చేర్పించాలి.
- జూన్ 12, 13, 16న పోషన్ కిచెన్ గార్డెన్, పోషకాహార వివరాలను హైలెట్ చేసి, స్టడీ మెటీరియల్ పంపిణీ చేయాలి. చైల్డ్ ఫ్రెండ్లీ వాతావరణం అంగన్‌వాడీల్లో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- జూన్ 17న కేంద్రాల్లో తల్లిదండ్రులు, గ్రామపెద్దల సమక్షంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించాలి. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

ప్లంజ్‌పూల్‌పై తుది అధ్యయనం

శ్రీశైలం డ్యామ్‌ను పరిశీలిస్తున్న పుణే నిపుణుల బృందం

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం డ్యామ్ ప్లంజ్‌పూల్‌పై మంగళవారం పుణేకు చెందిన నిపుణుల బృందం తుది అధ్యయనం ప్రారంభించింది. గతంలోనే బేతమెట్రిక్ సర్వే, అండర్‌వాటర్ వీడియోగ్రఫీ, ఫొటోగ్రఫీని చేపట్టారు. తాజా పరిస్థితిని తెలుసుకొని మరమ్మతులు చేసేందుకు మరోసారి అధ్యయనం చేస్తున్నారు. ప్లంజ్‌పూల్ ప్రాంతంలో ఎంత వైశాల్యంలో, ఎంత లోతు, ఎంత పొడవు, వెడల్పు గోతులు ఏర్పడ్డాయనేది తెలుసుకునేందుకు నీటిలో లేజర్ టెక్నాలజీని ఉపయోగించి బేతమెట్రిక్ సర్వే చేస్తున్నారు. అండర్‌వాటర్ వీడియోగ్రఫీ, ఫొటోగ్రఫీ కూడా చేస్తారు. ఈ సర్వే నాలుగు రోజులు కొనసాగనుంది. అనంతరం పాత, కొత్త అధ్యయనాలపై కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ స్టేషన్ విశ్లేషణ చేస్తుంది. గోతులు పూడ్చడానికి, సిలిండర్ల పటిష్టతకు, స్పిల్‌వే కటాఫ్‌కు మరమ్మతులు, గ్యాలరీలో అధిక సీపేజీలు, లీకేజీలను అరికట్టడానికి ఎలాంటి పనులు చేపట్టాలనే అంశాలపై ప్రభుత్వానికి తుది నివేదికలు, డిజైన్‌లు, అంచనాలు అందజేస్తుంది. ఈ అధ్యయనాల కోసం రాష్ట్ర జలవనరుల శాఖ రూ.3.68 కోట్లు కేటాయించింది.

మొరాయించిన కేబుల్ వే: మంగళవారం డ్యామ్ ముందుభాగంలోని ప్లంజ్‌పూల్ ప్రాంతానికి సామగ్రిని తరలిస్తుండగా కేబుల్ వేలో సాంకేతిక సమస్య తలెత్తి నిలిచిపోయింది. కేబుల్ వే ఆపరేటింగ్ సిస్టమ్‌ను పునరుద్ధరించి సాయంత్రం నుంచి అధ్యయనాన్ని కొనసాగించారు. తొలి రోజు అధ్యయనంలో పుణే నుంచి వచ్చిన సాంకేతిక నిపుణులతోపాటు డ్యామ్ ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి, ఈఈ వేణుగోపాల్‌రెడ్డి, ఏఈలు పాల్గొన్నారు.

పోషకలోపం.. ఊబకాయం!

డబుల్ బర్డెన్ ఆఫ్ మాల్‌న్యూట్రిషన్‌తో బాధపడుతున్న తెలంగాణ యువత



22 ఏళ్ల వయస్కుల్లో 29% మందిలో పోషకాహార లోపం.. 19% మందిలో స్థూలకాయం

- పురుషులతో పోలిస్తే మహిళల్లో పెరుగుతున్న స్థూలకాయం
- అధిక బరువుతో ఇబ్బందిపడుతున్న 18.8% మంది అతివలు
- ధనవంతుల ఇళ్లలో స్థూలకాయం... పేదల్లో పోషకాహార లోపం
- చదువుకోని/చదువుకున్న తల్లులు ఉన్న ఇళ్లలోనూ స్పష్టమైన తేడా
- యంగ్ లైవ్స్ సర్వే–2023లో కలవరపెట్టే గణాంకాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 22 ఏళ్ల యువతలో ఒకవైపు స్థూలకాయం పెరుగుతుండగా మరోవైపు పోషకాహార లోపం కూడా తీవ్రంగా కనిపిస్తోంది. దీన్ని నిపుణులు 'డబుల్ బర్డెన్ ఆఫ్ మాల్‌న్యూట్రిషన్'గా పేర్కొంటున్నారు. తెలంగాణ యువత ఆరోగ్య పరిస్థితులు ప్రమాదకరంగా మారుతున్నట్లు 'యంగ్ లైవ్స్'రౌండ్–7 సర్వే (2023–24) ఫలితాలు హెచ్చరిస్తున్నాయి. ఈ సర్వే ప్రకారం 22 ఏళ్ల యువతలో 19 శాతం మంది అధిక బరువు/ఒబేసిటీతో ఉండగా 29 శాతం మంది తక్కువ బరువుతో ఉన్నారు. 2016తో పోలిస్తే స్థూలకాయం రెండింతలైంది. అయితే ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే పురుషులతో పోలిస్తే మహిళల్లో స్థూలకాయం ఎక్కువగా (18.8%) కనిపిస్తోంది. పురుషుల్లో ఇది 14 శాతంగా ఉంది. మధుమేహం, గుండెజబ్బుల వంటి ప్రమాదాలకు దీన్ని కేంద్రంగా నిపుణులు గుర్తించారు. ఇప్పటికే 22.7% మహిళలు హై కార్డియోవ్యాస్కులర్ రిస్క్‌లో ఉన్నారని హెచ్చరిస్తున్నారు. ఇంతకంటే ఆందోళనకరమైన విషయం ఏమిటంటే పోషకాహార లోపంతో బాధపడుతున్న వారి సంఖ్య కూడా తెలంగాణలో 29 శాతంగా ఉన్నట్లు సర్వే తేలింది. అందులో గ్రామీణ యువతలో తక్కువ బరువు ఉన్నవారి శాతం 30.9% కాగా.. పట్టణాల్లో ఇది 23.8% శాతంగా ఉంది. ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో, తల్లులు తక్కువ చదువుకున్న కుటుంబాల్లో ఈ పరిస్థితి మరింత ఎక్కువగా ఉందని సర్వే పేర్కొంది.

మానసిక ఒత్తిడిలో యువత

తెలంగాణలో వివిధ కారణాల వల్ల యువతలో 2023 నాటికి 71.3 శాతం మోస్తరు స్థాయి ఒత్తిడికి గురవుతున్నారని సర్వేలో వెల్లడైంది. పెద్దల్లో ఇది 68 శాతంగా ఉంది. వారిలో పురుషులు 66.7 శాతంగా ఉంటే మహిళలు 75.9 శాతంగా ఉన్నారు. ఇక 22.6% మందిలో మితమైన ఆందోళన, 17.47% మందిలో మితమైన డిప్రెషన్ లక్షణాలు బయటపడ్డాయి. మహిళలకంటే పురుషులు తక్కువ మానసిక సమస్యలకు గురవుతున్నట్లు గణాంకాల ద్వారా తేలింది. పట్టణ యువతలో వాటి ప్రభావం మరింత ఎక్కువగా ఉండటం గమనార్హం. కోవిడ్ తరువాత భావోద్రేకం లక్షణాలు 1.5 శాతం పెరిగినట్లు సర్వే తేల్చింది. కరోనా తర్వాత ఆరోగ్యంగా ఉండాలనే అభిలాష ప్రజల్లో పెరిగిందని.. గతంలో 23 శాతం మందే ఐదు రకాల ఆహార పదార్థాలు తీసుకోగా ఇప్పుడు వారి సంఖ్య 37 శాతానికి చేరినట్లు పేర్కొంది.

అక్కడలా.. ఇక్కడిలా..

సామాజిక, ఆర్థిక స్థితిగతులు కూడా వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నట్లు సర్వేలో తేలింది. సామాజికంగా దిగువస్థాయి వర్గాల్లో పోషకాహార లోపం ఎక్కువగా ఉండగా ఆరోగ్యంపై సరైన అవగాహన, వైద్యం లేకపోవడం వల్ల ఈ సమస్య ఏటా ఎక్కువవుతోంది. అదే సమయంలో ధనవంతుల ఇళ్లలో ఊబకాయ సమస్య ఎక్కువగా ఉంటుండగా పోషకాహార లోపంతో బాధపడే వారి సంఖ్య చాలా తక్కువ అని తేలింది. 2016లో ధనవంతుల ఇంటి యువతలో స్థూలకాయం 30.6% ఉండగా.. పేదల్లో ఇది 14.0% మాత్రమే. అలాగే పేదల్లో తక్కువ బరువుతో 36.1 శాతం మంది ఉండగా ధనవంతుల్లో అది 21.5 శాతంగా ఉంది.

విద్యా స్థాయిల తేడాల వల్ల కూడా..

తల్లుల విద్యాస్థాయి ఎక్కువగా ఉన్నప్పుడు, వారి పిల్లల్లో ఆరోగ్య సమస్యలు తక్కువగా ఉన్నాయని సర్వే స్పష్టం చేస్తోంది. ఉదాహరణకు తల్లికి పదేళ్లకుపైగా చదువు ఉంటే వారి పిల్లల్లో తక్కువ బరువు కలిగి ఉన్న వారు 24.1% ఉండగా స్థూలకాయం 27.6% వరకు ఉంది. విద్య, ఆర్థిక స్థితి, మహిళా సంక్షేమం ఇవన్నీ పోషకాహారం, పిల్లల భవిష్యత్తుపై ప్రభావం చూపుతున్నాయని ఈ అధ్యయనం ద్వారా తెలుస్తోంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ప్రభుత్వం పాఠశాల స్థాయిలో పోషకాహారం, ఆరోగ్య విద్య, మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. అలాగే పేద కుటుంబాలకు ప్రత్యేక ఆహార భద్రత కార్యక్రమాలు మరింత బలపరచాల్సిన అవసరం ఉంది.


స్థూలకాయం.. తక్కువ బరువు ఇలా... (శాతాల్లో)

వర్గం	స్థూల కాయం	తక్కువ బరువు
యువత (2023)	19.0	29.0
పెద్దలు (2016)	11.0	31.0
మహిళలు (2023)	18.8	33.5
పురుషులు (2023)	14.0	26.0
గ్రామీణ ప్రాంతం	14.2	30.9
పట్టణ ప్రాంతం	31.9	23.8

పోషకాహార వినియోగం
ఐదుకు మించి ఆహార పదార్థాలు తీసుకున్న వారు

వర్గం	శాతం
యువత (2023)	37.3
పెద్దలు (2016)	22.8
పురుషులు	35.0
మహిళలు	34.8
పట్టణం	35.0
గ్రామీణం	38.0
అధిక సంపన్న వర్గం	45.0
తక్కువ సంపన్న వర్గం	31.4





క్లుప్తంగా...

భాష్యం ప్రభంజనం

గుంటూరు ఎడ్యుకేషన్: జేఈఈ అడ్వాన్స్‌డ్–2025 ఫలితాల్లో భాష్యం ప్రభంజనం సృష్టించిందని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. గుంటూరులోని మెయిన్ క్యాంపస్‌లో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ అఖిల భారతస్థాయి ఓపెన్ కేటగిరిలో 33వ ర్యాంకు కైవసం చేసుకున్న తమ విద్యార్థి సోమిశెట్టి వెంకటసాయి చక్రి ఈడబ్ల్యూఎస్ విభాగంలో 3వ ర్యాంకర్‌గా నిలిచినట్లు చెప్పారు. తమ విద్యార్థులు 5,000లోపు 218 ఆలిండియా ర్యాంకులు సాధించారని తెలిపారు. జెఈఈ మెయిన్స్‌లో ఓపెన్ కేటగిరిలో 100 పర్సంటైల్‌తో పాటు ఆలిండియా 18వ ర్యాంకు సాధించిన జి.సాయిమనోజ్ఞకు రూ. ఐదు లక్షలు, జేఈఈ అడ్వాన్స్‌డ్ ఓపెన్ కేటగిరిలో ఆలిండియా 33వ ర్యాంకు సాధించిన ఎస్.వెంకటసాయి చక్రికి రూ.ఐదు లక్షలు. శ్రీకర గణేష్, ఎస్. ఆకాష్ లకు రూ.రెండులక్షలు, టి.విక్రమ్ లెవీ, డి. జస్వంత్ బాలాజీలకు రూ. లక్ష చొప్పున నగదు ప్రోత్సాహక చెక్కులను అందజేశారు.

ఆదిత్య విద్యార్థుల అద్భుత ఫలితాలు..

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో తమ విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించి ప్రతిభ చూపారని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి సోమవారం తెలిపారు. మీసాల జయచంద్ర ఓపెన్ కేటగిరిలో ఆలిండియా 169వ ర్యాంక్, ఆదిత్య అభిషేక్ 257, జి.రామశశాంక్ 281, శుభశ్రీవల్లీ ఆత్రేయ 296వ ర్యాంకులు సాధించారన్నారు. వీరితో పాటు 500 లోపు 15 మంది, వెయ్యిలోపు 25 మంది, 3 వేల లోపు 62 మంది, 5 వేల లోపు 82 మంది ర్యాంకులు కైవసం చేసుకున్నారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఆదిత్య హాస్టల్ డైరెక్టర్ లక్ష్మీరాజ్యం, డైరెక్టర్ శృతి, ఎస్.సుగుణ, కో–ఆర్డినేటర్ లక్ష్మీకుమార్, ఐఐటీ క్యాంపస్ ప్రిన్సిపాల్ మెయిన, అకడమిక్ డైరెక్టర్ రాఘవరెడ్డి, గంగిరెడ్డి అభినందించారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 'తిరుమల' ప్రభంజనం

రాజమహేంద్రవరం రూరల్: ప్రతిష్టాత్మక జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో తమ తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యద్భుత ఫలితాలు సాధించినట్లు తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. వివిధ కేటగిరీల్లో జాతీయ స్థాయిలో తమ విద్యార్థులు కె.ప్రణీత్ 2వ ర్యాంకు, కె.యశ్వంత్ సాత్విక్ 8, ఇ.వర్షిత్ 12, ఎం.సుమంత్‌దొర 38, మజ్జి పురుషోత్తమరావు 39, కె.అభినవ్ 42, జి.సుజోష్‌రాజ 43, జి.అఖిల్‌సాయి 45, తుమాటి పూజిత అఖిల్ రాజ్‌కుమార్ 85, ఆర్.చరణ్‌తేజ 86, కప్పల వెంకట రామవినీష్ 127, పాతపాటి వెంకట వివేక్ వర్మ 132, మువ్వల లిఖిత 137వ ర్యాంకులు సాధించారని వివరించారు. వీటితో పాటు 165, 174, 193, 195, 226, 231, 238, 243, 245, 246, 270, 272, 275, 276 ర్యాంకులు సాధించారన్నారు. 1000 లోపు 99 మంది, 3000 లోపు 272 మంది, 10,000 లోపు 641 మంది ర్యాంకులు సాధించారని, 400 మంది పైన విద్యార్థులు ఐఐటీలో సీట్లు సాధించగలరని చెప్పారు.

కేకేఆర్ గౌతమ్ విద్యార్థుల ఉత్తమ ఫలితాలు

గుడివాడటౌన్: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో కేకేఆర్ గౌతమ్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని కేకేఆర్ గౌతమ్ స్కూల్ ప్రిన్సిపాల్ సత్యారామ్ సోమవారం తెలిపారు. ఈ ఫలితాల్లో తమ పూర్వ విద్యార్థులు వివిధ కేటగిరిలలో 100 లోపు 13 ర్యాంకులు సాధించారన్నారు. తమ విద్యార్థిని కొరికన రసజ్ఞ ఆల్ ఇండియా 8వ ర్యాంకు, ఎం. మణిదీప్ వర్మ 21, ఎస్.నిర్మిత్ 29, సీహెచ్. చేతన్ 34, కె. ధీరజ్ 37, ఎల్. చర్విత 41, జి. ప్రత్యూష 47, ఎన్. హేమంత్ అభిరామ్ 48, పివి శ్రీ వినయ్ 50వ ర్యాంకులతో పాటు 54, 73, 78, 91 ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు.

వరంగల్‌లో కరోనా కలకలం

- ఓ పీజీ వైద్యురాలికి, మరో ఆరుగురికి పాజిటివ్?



ఎంజీఎం: వరంగల్ నగరంలో కరోనా కలకలం రేపుతోంది. ఎంజీఎం ఆస్పత్రిలోని జనరల్ మెడిసిన్ విభాగంలో పీజీ వైద్యురాలికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణైంది. సదరు వైద్యురాలు దగ్గు, జ్వరంతో బాధపడుతుండగా కరోనా పరీక్ష నిర్వహించగా పాజిటివ్ రావడంతో ఆమె మంగళవారం వెంటనే హైదరాబాద్‌లోని తన స్వగృహానికి ఐసోలేషన్‌కు వెళ్లిపోయింది. అలాగే నగరంలోని ఓ ప్రైవేట్ ల్యాబ్‌లో చేసిన పరీక్షల్లో ఆరుగురికి పాజిటివ్ వచ్చినట్లు తెలిసింది. వీరంతా వివిధ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ఈ విషయంపై ఇటు ఎంజీఎం, అటు వైద్యారోగ్యశాఖ అధికారులను వివరణ కోరగా తమ వద్ద ఎలాంటి పాజిటివ్ కేసులు నమోదు కాలేదని చెబుతున్నారు. ప్రైవేట్ ల్యాబ్ కేంద్రంగా చేసిన పరీక్షల్లో వస్తే తాము పాజిటివ్‌గా నిర్ధారించలేమని పేర్కొన్నారు.

నెట్ వాడకం హైజంప్!



రాష్ట్ర యువతలో భారీగా పెరిగిన ఇంటర్నెట్ వినియోగం

- 2016లో 22 ఏళ్ల వారిలో ప్రతి 10 మందిలో ముగ్గురులో నెట్ వాడకం
- 2023 నాటికి మూడు రెట్లు పెరుగుదల
- అదే కాలానికి టెన్త్, ఇంటర్‌లో పెరిగిన ఉత్తీర్ణత శాతం
- బాల్య వివాహాలు, త్వరగా తల్లులైన వారిలో ఇంటర్ చదివిన వారు 15 శాతమే
- యంగ్ లైవ్స్ రౌండ్ 7 సర్వేలో వెల్లడించిన సెస్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర యువతలో ఇంటర్నెట్ వాడకం భారీ స్థాయిలో పెరిగినట్లు 'ఆర్థిక, సామాజిక అధ్యయన కేంద్రం (సెంటర్ ఫర్ ఎకానమిక్ అండ్ సోషల్ స్టడీస్'యంగ్ లైవ్స్ రౌండ్ 7 పేరిట నిర్వహించిన సర్వే వెల్లడించింది. 2016లో 22 ఏళ్ల వయస్కుల్లో ప్రతి 10 మందిలో ముగ్గురు ఇంటర్నెట్ వాడగా 2023 నాటికి వారిలో ఏకంగా 8 మంది ఇంటర్నెట్ వాడినట్లు సర్వే పేర్కొంది. అలాగే 2023లో 22 ఏళ్ల వయసు వారిలో నెట్ వాడకం మూడు రెట్లు పెరిగిందని.. ప్రతి 10 మందిలో 9 మంది ఇంటర్నెట్‌ను విస్తృతంగా వినియోగిస్తున్నట్లు సర్వే తెలిపింది. 2016లో ఇంటర్నెట్ వినియోగం పేదల్లో 6 శాతం ఉంటే ఇప్పుడది ఏకంగా 86 శాతానికి పెరిగినట్లు సర్వే గుర్తించింది. కోవిడ్ మహమ్మారి వ్యాప్తి దేశంలో రోజువారీ డిజిటల్ కార్యకలాపాల వాడకాన్ని మరింతగా అందుబాటులోకి తెచ్చిందని సర్వే అభిప్రాయపడింది. అయితే కంప్యూటర్ వినియోగం మాత్రం సంపన్నుల్లోనే కొనసాగుతోందని వివరించింది. విద్యార్హతలు పెరిగినా వారిలో సమగ్రంగా చదవడం మాత్రం పెరగలేదని సర్వే అభిప్రాయపడింది. గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక వెనుకబాటు ఉన్న ఎస్సీ, ఎస్టీ, ప్రతికూలతలు ఉన్న సామాజిక వర్గాలు, బాల్యవివాహాలు చేసుకున్న వారు ఉన్నత విద్యను ఇంకా అందుకోలేకపోతున్నారని 'సెస్'నివేదిక స్పష్టం చేసింది.

టెన్త్, ఇంటర్ వారిలో పెరుగుదల..

రాష్ట్రంలో విద్యారంగం వేగంగా మారుతోంది. పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసుకుంటున్న యువత శాతం గణనీయంగా పెరుగుతోంది. అదే సమయంలో యూనివర్సిటీల్లో చేరికలు కాస్త తక్కువగా ఉంటుండగా బాల్య వివాహాలు చేసుకుంటున్న వారు చదువుకు దూరమవుతున్నారు. ఏడేళ్ల వయసు తేడా ఉన్న యువతను లక్ష్యంగా చేసిన ఈ సర్వేను 'సెస్'నిర్వహించింది. 2016 22 ఏళ్ల వారిని, 2023లో 22 ఏళ్ల వారిని పరిగణనలోకి తీసుకొని ఈ సర్వే నిర్వహించారు.

పదో తరగతిలో..: ఈ సర్వే ప్రకారం పాఠశాల విద్యలో విద్యార్థులు పురోగతి సాధించారు. సెండరీ విద్య పూర్తి చేసిన వారు 2016లో 74 శాతం మంది ఉంటే అది 2023 నాటికి 83 శాతానికి చేరింది. అలాగే హయ్యర్ సెకండరీలో 53 శాతం నుంచి 61 శాతానికి పెరిగిందని సర్వే వెల్లడించింది. ఈ రెండు దశల్లోనూ ఉత్తీర్ణతలో లింగభేదం పెద్దగా లేదని సర్వే వివరించింది. ఇక యూనివర్సిటీ స్థాయి విద్యలో 10 % ఎన్‌రోల్‌మెంట్ పెరిగినట్లు సర్వేలో వెల్లడైంది. బాల్య వివాహాలు చేసుకున్న వారు లేదా త్వరగా తల్లులైన వారిలో హయ్యర్ సెకండరీ విద్య పూర్తి చేసిన వారు 15 శాతం మాత్రమేనని.. అదే ఆలస్యంగా వివాహాలు చేసుకున్న వారు 67 శాతం మంది ఇంటర్ విద్యను పూర్తి చేసుకున్నట్లు సర్వే తెలిపింది.

ఉన్నత విద్య..

గ్రామీణులకు ఉన్నత విద్య పట్టణాల్లోని వారితో పోలిస్తే అంతగా అందుబాటులో లేదని సర్వే వెల్లడించింది. పట్టణ ప్రాంతాల్లోని వారికి 65 శాతం యూనివర్సిటీలు అందుబాటులో ఉంటే గ్రామీణ ప్రాంతాల్లోని వారికి 43 శాతమే అందుబాటులో ఉన్నాయని నివేదిక తెలిపింది. అలాగే ఆర్థిక స్తోమతపరంగా చూస్తే సంపన్నులకు 66 శాతం, పేదలకు 38 శాతమే అవకాశాలున్నాయని వివరించింది. సామాజిక రంగాలవారీగా చూస్తే ఎస్సీలకు 42 శాతం అవకాశాలు ఉంటే ఇతర వర్గాలకు 68 శాతం ఉన్నత విద్య అందుబాటులో ఉన్నట్లు సర్వే తేల్చింది. గత ఏడేళ్లలో దిగువ తరగతి వారిలో హయ్యర్ సెంకడరీ పూర్తి చేసిన వారి నిష్పత్తి 2016లో 40 శాతంగా ఉంటే అది 2023 నాటికి 54 శాతానికి పెరిగినట్లు సర్వే వివరించింది. యూనివర్సిటీ ఎన్‌రోల్‌మెంట్‌లో వారి సంఖ్య 27 శాతం నుంచి 38 శాతానికి పెరిగినట్లు తెలిపింది. అదే ఎగువ తరగతి వారిలో యూనివర్సిటీ ఎన్‌రోల్‌మెంట్ 61 శాతం నుంచి 66 శాతానికి పెరిగినట్లు సర్వే గుర్తించింది.

డిజిటల్ డివైజ్‌లు	పాతతరం		కొత్తతరం	
	2016లో 22 ఏళ్ల వారు	2023లో 29 ఏళ్ల వారు	2016లో 15 ఏళ్ల వారు	2023లో 22 ఏళ్ల వారు
తరచూ ఇంటర్నెట్ వినియోగం	36.0	79.5	14.6	89.7
రోజూ ఇంటర్నెట్ వినియోగం	26.9	76.9	5.3	88.5
తరుచూ కంప్యూటర్ వాడకం	15.4	17.6	11.2	24.3

సఫారీలో పెద్దపులి



నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ టైగర్ రిజర్వు పరిధిలో సఫారీ ప్రయాణికులకు పెద్దపులులు తరచూ దర్శనమిస్తున్నాయి. ఫర్హాబాద్ వ్యూ పాయింట్ నుంచి వస్తున్న సఫారీ ప్రయాణికులకు తిరుగు ప్రయాణంలో గుండం వద్ద పెద్దపులి కనిపించింది. అకస్మాత్తుగా పులి నడుచుకుంటూ వెళ్తున్న దృశ్యాలను పర్యాటకులు తమ ఫోన్లలో బంధించారు. ఇటీవల కాలంలో సఫారీ ప్రయాణికులకు పులులు తరచూ కనిపిస్తున్నాయని డీఎఫ్‌వో రోహిత్ తెలిపారు.

– మన్ననూర్

బస్సు గేర్ బాక్సులో బుస్‌బుస్..!



జగిత్యాల టౌన్: ఆర్టీసీ బస్సు గేర్ బాక్సులో పాము దూరడంతో ప్రయాణికులు భయభ్రాంతులై పరుగులు తీశారు. వివరాలివి. మంగళవారం ఉదయం కరీంనగర్ జిల్లా నుంచి జగిత్యాల జిల్లాకు వస్తున్న పల్లె వెలుగు బస్సు.. జగిత్యాల పట్టణంలోని కరీంనగర్ డెయిరీ ప్రాంతానికి చేరుకుంది. అక్కడ రోడ్డుకు అడ్డంగా పాము రావడాన్ని గమనించిన డ్రైవర్.. దాన్ని కాపాడే ఉద్దేశంతో బస్సును అకస్మాత్తుగా నిలిపివేశాడు. రోడ్డు దాటి వెళ్లాల్సిన పాము.. బస్సు కింది భాగం నుంచి గేర్ బాక్సులోకి దూరింది. దీంతో ప్రయాణికులు ఆందోళనకు గురై బస్సు దిగి పరుగులు తీశారు. ఏం చేయాలో తెలియని డ్రైవర్ బస్సును రోడ్డుపైనే నిలిపి ఉంచడంతో అర్ధగంట పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. స్థానిక యువకులు గేర్‌బాక్సులో దూరిన పామును బయటకు లాగి చంపిన అనంతరం.. బస్సు అక్కడి నుంచి బయలుదేరింది.

బూట్లు ధరించి నివాళులర్పిస్తారా?

రాహుల్‌పై సీఎం మోహన్ యాదవ్ ఆగ్రహం

భోపాల్: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మంగళవారం మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా దివంగత ప్రధాని, తమ నాన్నమ్మ ఇందిరా గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన బూట్లు ధరించి నివాళులర్పించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. రాహుల్ తీరు పట్ల మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బూట్లు ధరించి నివాళులర్పించడం మన భారతీయ సంస్కృతి, సంప్రదాయలకు విరుద్ధమని పేర్కొన్నారు. దివంగత ప్రధానమంత్రిని రాహుల్ అగౌరవపర్చారని మండిపడ్డారు. రాహుల్ సంస్కారం, విలువలు లేవని ఆరోపించారు. నివాళులర్పించేటప్పుడు హూందాగా వ్యవహరించాలని హితవు పలికారు.

మీరు భాషా నిపుణులా? చరిత్రకారులా?

ఇతరుల మనోభావాలను దెబ్బ తీసేలా ఎలా వ్యాఖ్యలు చేస్తారు?

- క్షమాపణ చెప్పడానికి మీకు ఏమైనా ఇబ్బందా?
- నటుడు కమల్ హాసన్‌పై కర్ణాటక హైకోర్టు తీవ్ర ఆగ్రహం

శివాజీనగర: తమిళం నుంచే కన్నడ భాష పుట్టిందని నటుడు కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యల వివాదం కర్ణాటక హైకోర్టుకు చేరింది. థగ్‌లైఫ్ చిత్రాన్ని కర్ణాటకలో ఆడనివ్వబోమని కన్నడ సంఘాల నేతలు, సినీ చాంబర్ ప్రముఖులు ప్రకటించడం తెలిసిందే. దీంతో కమల్, ఆ సినిమా నిర్మాణదారులు.. చిత్ర విడుదలకు ఆదేశాలు ఇవ్వాలని బెంగళూరులో హైకోర్టులో సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ ఎం. నాగప్రసన్న మంగళవారం విచారించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి పలు ప్రశ్నలను కమల్ లాయర్‌కు సంధించారు. తమిళం నుంచే కన్నడ భాష పుట్టిందని చెప్పేందుకు కమల్‌హాసన్ భాషా నిపుణులా? లేక చరిత్రకారుడా? అని ప్రశ్నించారు. 'తమరు కమల్‌హాసన్ అయి ఉండవచ్చు. కానీ అనేక మంది భావాలను బాధ పెట్టేందుకు మీకు అవకాశం లేదు. మౌఖికంగా క్షమాపణ చెప్పాలి 'అని సూచించారు. భాషపై ఆయన ఏమైనా పరిశోధనలు చేశారా? నేల, నీరు, భాష ఇవన్నీ ప్రజల సెంటిమెంట్. వాటి గురించి మాట్లాడే ముందు ఆలోచించాలి. రూ.350 కోట్లు ఖర్చుపెట్టి సినిమా తీసిన మీరు సినిమా విడుదల కావాలంటే క్షమాపణ అడిగితే జరిగే నష్టం ఏమిటి అని న్యాయమూర్తి కమల్ లాయర్‌ను ప్రశ్నించారు. క్షమాపణ అడగడానికి ఇష్టం లేకపోతే కర్ణాటకలో సినిమా విడుదల చేయకండని, సినిమా థియేటర్లకు భద్రత కల్పించాలా, వద్దా.. అనే నిర్ణయం తీసుకోవడానికి ముందు క్షమాపణ అడగాలని, లేదా చేసిన వ్యాఖ్యలకు తగిన సాక్ష్యాధారాలు తీసుకురావాలని, క్షమాపణ అడగనిదే వ్యాఖ్యలు వెనక్కు తీసుకుంటాం అంటే కుదరదని న్యాయమూర్తి తేల్చిచెప్పారు. దీనిపై కమల్ న్యాయవాది స్పందిస్తూ కమల్ వ్యాఖ్యలపై ఆయన వివరణ ఇచ్చారని చెప్పారు. కమల్ ఏ సమయంలో వ్యాఖ్యలు చేశారనేది చూడాలని విజ్ఞప్తి చేశారు. కర్ణాటక చలనచిత్ర వాణిజ్య మండలి, కమల్‌హాసన్ మధ్య చర్చలకు వీలుగా విచారణను వాయిదా వేయాలని పిటిషనర్లు కోరగా.. జడ్జి జూన్ 10కి వాయిదా వేశారు.

ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌పై విచారణ జరపాలి

టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్నప్పుడు చేసిన అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపించాలని టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్స్ కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎస్సీ గురుకులాల సెక్రటరీగా పనిచేసిన సమయంలో ఆయన అంబేడ్కర్ పేరు చెప్పి రాజ్యాంగాన్ని తుంగలో తొక్కారని, దళిత విద్యార్థులకు అందాల్సిన నిధులను లూటీ చేశారని, గురుకులాల్లో దుప్పట్లు, యూనిఫారంలను కూడా వదిలిపెట్టకుండా దోపిడీ చేశారని ఆరోపించారు. మంగళవారం గాంధీభవన్‌లో రామ్మోహన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఈ ఆరోపణలు తాము చేస్తున్నవి కావని, కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చిన కాగ్ నివేదికలో పేర్కొన్న అంశాలేనన్నారు.

రేపు కేబినెట్.. పలు కీలక అంశాల చర్చ

సీఎం అధ్యక్షతన మంత్రి మండలి సమావేశం

- కాళేశ్వరం ప్రాజెక్టుపై విజిలెన్స్ కమిషన్, ఎన్‌డీఎస్‌ఏ ఇచ్చిన నివేదికపై నిర్ణయం
- గౌరవ వేతనం లేకుండా ఆదర్శ రైతుల నియామకం
- ఉద్యోగుల ఆర్థికేతర అంశాల ఆమోదం.. ఒక డీఏ అయినా ఇచ్చే చాన్స్
- రాజీవ్ యువవికాసం, వానాకాలం పంటలు, ఇందిరమ్మ ఇళ్లపై కూడా...

సాక్షి, హైదరాబాద్ : సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సమావేశం కానున్న రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశముంది. కాళేశ్వరం ప్రాజెక్టుపై రాష్ట్ర విజిలెన్స్ కమిషన్ నివేదిక, జాతీయ డ్యామ్‌ల భద్రతా ప్రాధికార సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ) ఇచ్చిన నివేదికలపై చర్చించనున్నట్టు విశ్వసనీయ సమాచారం. భారీస్థాయిలో ఇంజనీర్లపై క్రిమినల్ చర్యలతోపాటు రికవరీ చేయాలని కమిషన్ సూచించిన విషయం విదితమే.

- వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో ఆదర్శ రైతులను నియమించే అంశంపై నిర్ణయం తీసుకోనున్నారు. రైతు వేదికలకు ఆదర్శ రైతులను ఇన్‌చార్జ్‌లుగా నియమించి, భూసార పరీక్షల నిర్వహణ కిట్లు వారి అధీనంలో ఉంచడం, వ్యవసాయ అంశాలపై రైతులతో అవసరమైనప్పుడల్లా సమావేశాలు నిర్వహించి వారికి సూచనలు ఇచ్చే విధంగా వీరిని నియమిస్తారంటున్నారు. ఆదర్శ రైతులకు గౌరవ వేతనం మాత్రం ఇవ్వడం సాధ్యం కాదని సీఎం స్పష్టం చేసినట్టు ప్రభుత్వ వర్గాల సమాచారం.
- రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి ఇటీవల మంత్రులు జిల్లాల్లో పర్యటించిన సమయంలో వచ్చిన అభిప్రాయాలపై చర్చిస్తారు. పథకం ఎంపికలో ఎలాంటి పారదర్శకత కొనసాగించాలన్న దానిపై చర్చించడంతోపాటు, ఈ పథకాన్ని ఎప్పటి నుంచి ప్రారంభించాలన్న దానిపై మంత్రివర్గ స్పష్టత ఇవ్వనున్నట్టు తెలిసింది.
- ఉద్యోగులు ఆందోళన బాటలో ఉన్న సమయంలో రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్ నేతృత్వంలో లోకేశ్ కుమార్, కృష్ణభాస్కర్‌ల ఆధ్వర్యంలో ప్రభుత్వం కమిటీని నియమించిన విషయం విదితమే. ఈ కమిటీ గతవారంలోనే తన నివేదికను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు అందించింది. ఈ నివేదికపై చర్చించి ఆర్థికపరమైన భారం పడే అంశాలను ప్రస్తుతానికి పక్కనపెట్టి, ఆర్థికేతర అంశాలను ఆమోదించేలా చర్చించనున్నట్టు తెలిసింది. అయితే ఐదు కరువు భత్యాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని క్లియర్ చేయాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఒక డీఏ అయినా క్లియర్ చేసే అవకాశం లేకపోలేదన్న చర్చ జరుగుతోంది.
- వానాకాలం పంటల అంశం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొనసాగుతున్న తీరుపై కూడా చర్చించే అవకాశముంది. వాస్తవంగా జూన్ 2వ తేదీన కనీసం వంద ఇళ్లను ప్రారంభిస్తామని అధికారులు స్పష్టం చేసినా, అందుకు సంబంధించి ఎలాంటి కార్యక్రమాలు చోటుచేసుకోని విషయం విదితమే.



“తీసుకోని నిర్ణయాల వల్లే వేదన కలుగుతుంది.
- బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 4 జూన్ 2025

రష్యాకు తత్వం బోధపడాలి!

శాంతి సాధన కోసం తుర్కియేలో రష్యా–ఉక్రెయిన్‌ల మధ్య చర్చలకు 24 గంటల ముందు ‘ఆపరేషన్ స్పైడర్స్ వెబ్’ పేరిట ఉక్రెయిన్ ప్రయోగించిన వందలాది డ్రోన్లు ఆదివారం రష్యా సైనిక స్థావరాలు అయిదింటిలో భారీ విధ్వంసం సృష్టించగలిగాయి. మరోవైపు రష్యా అంతకుముందూ, ఆ తర్వాతా ఉక్రెయిన్ నగరాలపై బాంబుల వర్షం కురిపించింది. ఇలా పరస్పర దాడుల నేపథ్యంలో సోమవారం జరిగిన చర్చలు సహజంగానే గంటన్నరలో ముగిశాయి. కరచాలనాలు లేకుండా, కాల్పుల విరమణ ఊసెత్తకుండా యుద్ధఖైదీల మార్పిడిపై ఒప్పందం కుదుర్చుకుని రెండు బృందాలూ నిష్క్రమించాయి. అయిదు స్థావరాలపై ఉక్రెయిన్ దాడులకు ప్రయత్నించిన మాట వాస్తవమే అయినా మూడు చోట్ల దాడుల్ని నిరోధించగలిగామని రష్యా చెప్పుకుంటోంది. అందుకు భిన్నంగా తమ డ్రోన్లు రష్యాలోని 41 బాంబర్ విమానాలను ధ్వంసం చేశాయని ఉక్రెయిన్ వివరిస్తోంది. దానికి వేలకోట్ల నష్టం వాటిల్లిందని చెబుతోంది. రష్యా దాడుల పర్యవసానంగా ఈ మూడేళ్ల కాలంలో ఉక్రెయిన్ సైన్యం వేలాదిమందిని కోల్పోయింది. ఇలాంటి నష్టాలను పెద్ద దేశం కనుక రష్యా భర్తీ చేసుకోగలుగుతోంది. అందుకే నల్లసముద్రంలో రష్యా దూకుడును తగ్గించేందుకు ఉక్రెయిన్ పూర్తిస్థాయిలో డ్రోన్‌లను నమ్ముకున్నట్టు కనబడుతోంది. యుద్ధం మొదలైన తొమ్మిది నెలల తర్వాత ఉక్రెయిన్ తొలిసారి 2022 డిసెంబర్‌లో రష్యా భూభాగంలో దాడులు మొదలుపెట్టింది. ఈ మూడేళ్ల కాలంలో తన స్థావరాలు, ఇంధన డిపోలు, యుద్ధ విమానాల గోడౌన్లు పటిష్ఠం చేసుకోవటంలో రష్యా శ్రద్ధ పెట్టిన మాట నిజమే అయినా ఉక్రెయిన్ సైతం డ్రోన్ల వినియోగంలో తన సామర్థ్యాన్ని మెరుగుపరుచుకునే పనిలోబడింది. ఆ విషయంలో అది విజయవంతమైందని ఆదివారంనాటి దాడులు వెల్లడిస్తున్నాయి.

ప్రత్యర్థి దేశం తమతో పోలిస్తే పిపీలకమని, తమది అగ్రరాజ్యం, సంపన్న దేశమని మిడిసిపడే పరిస్థితి వర్తమాన కాలంలో ఎవరికీ లేదని ఉక్రెయిన్ దాడి వెల్లడిస్తోంది. యుద్ధం తప్పనిసరైనప్పుడు అందుకు అనుగుణంగా లోతైన అధ్యయనం చేసి, ఎప్పటికప్పుడు తనను తాను తీర్చిదిద్దుకున్న పక్షమే దీటుగా నిలబడగలుగుతుంది. ఉక్రెయిన్ ఆ పని చేయగలిగిందని ఈ ఉదంతం నిరూపిస్తోంది. యుద్ధం ప్రారంభించిందీ, దాన్ని వద్దు వద్దని ఎంతమంది చెబుతున్నా వినకుండా కొనసాగిస్తున్నదీ రష్యాయే గనుక అది ప్రస్తుత నష్టానికి తనను తానే నిందించుకోవాలి. చర్చలు ప్రారంభమయ్యాకైనా గౌరవప్రదంగా కాల్పుల విరమణకు సిద్ధమై తన డిమాండ్లేమిటో చెబితే వాటిపై ఉక్రెయిన్ వైఖరేమిటో తేటతెల్లమయ్యేది. చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడినా, నిలిచిపోయిన యుద్ధాన్ని తిరిగి కొనసాగనీయరాదన్న ఆత్రుత అందరిలో వుండేది. అందువల్ల కొంత రాజీకి ఉక్రెయిన్‌ను ఒప్పించటానికి కూడా ప్రయత్నాలు సాగేవి. కానీ చర్చలకు ఒప్పుకున్నాక కాల్పుల విరమణ ఇంకా ఉనికిలోకి రాలేదన్న ఏకైక కారణంతో అది దాడుల్ని కొనసాగించింది. రష్యా దురాక్రమించిన భూభాగమంతా వెనక్కిస్తే తప్ప యుద్ధ విరమణ ఉండబోదని మొన్న జనవరి నెలాఖరున ఉక్రెయిన్ చెప్పటంతో ఆగ్రహించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆ దేశానికి ఇకపై అమెరికా నిఘా సమాచారం అందబోదని ప్రకటించారు. తాజా దాడులు గమనిస్తే ఉక్రెయిన్ ఆ అవరోధాన్ని కూడా అధిగమించగలిగిందని అర్థమవుతుంది. పైగా రష్యా గడ్డపైకి ట్రక్కుల్లో డ్రోన్లు తీసుకెళ్లి, లక్ష్యాలను చేరుకోగానే అవి ఒక్కసారిగా ఎగిరి యుద్ధ విమానాలను ధ్వంసం చేసేలా పథకం రచించింది.

ఈ పరిణామానికి రష్యా ఎటూ ఆందోళన పడుతుంది. కానీ పాశ్చాత్య దేశాలు సైతం కంగారు పడక తప్పదు. ఎందుకంటే ఎవరి నిఘా సాయమూ లేకుండా చవగ్గా లభించే డ్రోన్లతో రష్యావంటి దేశంలో పెనువిధ్వంసం సృష్టించగలగటం మాటలు కాదు. తమ పొరుగునేవుండి, తమ ప్రోత్సాహంతో రష్యాను చీకాకు పర్చటానికి ముందుకొచ్చిన చిన్న దేశం సైనికంగా ఇంత పటిష్ఠం కావటం పాశ్చాత్య దేశాలు జీర్ణించుకోలేనిది. 2014 మొదట్లో ఉక్రెయిన్ అధ్యక్షుడిగా వుండిన విక్టర్ యెనుకోవిచ్ తమ కీలుబొమ్మ కాలేదని అతన్ని కుట్రపూరితంగా పడగొట్టి జెలెన్‌స్కీని ప్రతిష్ఠించింది పాశ్చాత్య దేశాలే. అందుకు అమెరికా సైతం దన్నుగా నిలబడింది. నాటోను తూర్పువైపు విస్తరించాలన్న ఆ దేశాల దురాలోచనే ఇందుకు కారణమని గ్రహించిన రష్యా అధ్యక్షుడు పుతిన్ 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్ దురాక్రమణకు తెరతీశారు.

డ్రోన్ దాడుల్లో రష్యా కోల్పోయిన యుద్ధ విమానాలు టియూ–95, టియూ–160 విమానాలు. అవి క్రూయిజ్ క్షిపణుల్ని ప్రయోగించగల సామర్థ్యం వున్నవి. ఉక్రెయిన్ చెబుతున్నదే నిజమైతే రష్యా వైమానిక పాటవం 34 శాతం కోల్పోయిందని సైనిక నిపుణుల అంచనా. వీటిని తిరిగి సమకూర్చుకోవాలంటే వేలాది కోట్ల రూబుళ్ల వ్యయమవుతుంది. రష్యాకు తత్వం బోధపడినట్టేనా? తమ దాడులతోపాటు పాశ్చాత్య దేశాలు రష్యాపై ఆంక్షల తీవ్రతను పెంచాలన్నది జెలెన్‌స్కీ వాదన. కానీ అమెరికా కనుసన్నల్లో నడిచే ఆ దేశాలు అందుకు సిద్ధపడలేవు. యుద్ధాన్ని ప్రారంభించటం సులభమే, కొనసాగించటమూ పెద్ద కష్టం కాదు. కానీ ముగించటం అత్యంత క్లిష్టమైనది. ఇరుపక్షాలకూ అప్పటికే యుద్ధం ప్రతిష్ఠాత్మకంగా మారిపోతుంది. విరమణకు సిద్ధపడితే దేశాన్ని పాదాక్రాంతం చేశారన్న అపఖ్యాతి వస్తుంది. అలాంటి అవమానాన్ని దిగమింగటానికి జెలెన్‌స్కీ సిద్ధంగా వున్నా పుతిన్ ససేమిరా అనటమే ప్రస్తుత సమస్య. ఇప్పటికే ఎంతో జాప్యం జరిగింది. కనుక ఈ యుద్ధం ఆపటానికి ప్రపంచ దేశాలు ప్రయత్నించాలి. తగిన హామీలిచ్చి పుతిన్‌ను ఒప్పించాలి.

ప్రత్యామ్నాయంగా ఎదగడమే మార్గం

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

అమెరికా అధ్యక్షుడుగా డోనాల్డ్ ట్రంప్ రెండోసారి పగ్గాలు చేపట్టిన నాటి నుండి ప్రపంచ దేశాలపై విరుచుకుపడుతున్నారు. ఒక పక్క సామ్రాజ్యవాద భావనతో అనేక దేశాలపై అధిక సుంకాలు విధిస్తూ మరొక పక్క విద్య, ఆరోగ్య వ్యవస్థలపై విధ్వంసపు దాడి చేస్తున్నారు. ట్రంప్‌లో జాత్యాహంకార భావాలు మిన్నంటుతున్నాయి. నిజానికి అమెరికా ఒకనాడు ప్రసిద్ధి చెందినది హార్వర్డ్, కొలంబియా యూనివర్సిటీల లాంటి వాటి వల్లనే. ఈ యూనివర్సిటీలు సామ్రాజ్యవాదానికి భిన్నంగా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు నెలవుగా రూపొందించబడ్డాయి. ఈ రెండు విశ్వవిద్యాలయాల్లో ఆర్థిక, సామాజిక, పరిపాలన రాజకీయ శాస్త్రాల్లో నిష్ణాతులైన ప్రపంచ జ్ఞానులు ఆవిర్భవించారు. అందులో అంబేడ్కర్ ఒకరు. అంబేడ్కర్ అమెరికాలో తాను స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అనుభవించానని స్వయంగా చెప్పారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ అనుభవించిన స్వేచ్ఛను గూర్చి డబ్ల్యూ.ఎన్. కుబేర్ ఇలా విశ్లేషించారు: అంబేడ్కర్ అమెరికా వెళ్ళడంతో ఆయనలో నూత్న వికాసం వచ్చింది. ముఖ్యంగా అందరు కలిసి భోజనం చేయడం అనేది ఆయన ఇండియాలో చూడలేదు. ఇండియాలో కొందరు భోజనం చేస్తుంటే, కొందరు నిలుచుండేవారు. కలిసి భోజనం చేసే సంస్కృతి లేదు. జీవన వ్యవస్థలో కుల వ్యత్యాసాలు, మత వ్యత్యాసాలు విపరీతంగా ఉన్నాయి. మనిషిని మనిషిగా చూడలేని సంస్కృతిని చూసిన ఆయన ఒక్కసారి ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకోవడం చూసి ఆశ్చర్యపోయారు. న్యాప్కిన్‌తో చేతులు తుడుచుకోవడం, ముఖ్యంగా సూట్ ధరించి కాలేజీకి వెళ్ళడం, క్లాసులో అందరు సమానంగా కూర్చోవడం, ఉపాధ్యాయుడికి భేదభావాలు లేకపోవడం వంటివన్నీ ఆయనకి కొత్తగా అనిపించాయి. ఒకే విద్యా ప్రపంచంలో అన్ని రకాలైనటువంటి భావజాలాలు ఉండటం చూసి ఆయన విస్తుపోయారు. ఇలా భారతీయ మేధావులెందరో అమెరికన్ విశ్వవిద్యాలయాల్లో అధ్యయనం చేయటమే గాక ఆ విశ్వవిద్యాలయాల్లో ఉండే స్వేచ్ఛను గురించి అక్కడి అధ్యాపకులైన సెలిగ్మన్, జాన్ డ్యూయీ వంటి వారి విద్యా సంపన్నత గురించి; జాతి, కుల, మత, వివక్ష లేకుండా అక్కడ విద్యార్థుల కుండే స్వేచ్ఛా స్వాతంత్ర్యాల గురించి ఎంతో కొనియాడారు.

అయితే ఇప్పుడు ప్రెసిడెంట్ ట్రంప్ స్వభావం జాతి వివక్షలో హిట్లర్‌ను మించి ఉంది. హార్వర్డ్ యూనివర్సిటీకి చేస్తున్న ఆర్థిక వ్యయాన్ని గురించి ట్రంప్ ప్రపంచం మొత్తానికి గగ్గోలుపెట్టి చెప్పుతున్నారు. కానీ ఆ యూనివర్సిటీలో అధ్యయనం చేసిన మేధావులు, సాంకేతిక నిపుణులు, నోబెల్ బహుమతి గ్రహీతలు, పరిపాలనా శాస్త్ర పండితులు అమెరికాకు ఎంత కీర్తి తెచ్చారు? అమెరికాకు ఎంత సాంకేతిక సాంస్కృతిక జ్ఞానాన్ని తీసుకువచ్చారు? ఎంత మానవ హక్కుల పోరాట శక్తిని ప్రపంచానికి అందించారు? ఈ విషయాన్ని జ్ఞాపకం చేసుకోలేకపోతున్నారు. ఒక పక్క గాజాపై మారణహోమం జరపడానికి యూదుల దేశమైన ఇజ్రాయెల్‌ని ప్రోత్సహిస్తూ, మరోపక్క హార్వర్డ్ యూనివర్సిటీ యూదా (యూదు) జాతి యువకులు అమెరికా తెల్లజాతి వారిని అణచివేస్తున్నారని మాట్లాడడం ఆయనలో ఉన్న ద్వైదీభావానినికి నిదర్శనాలు. నల్లజాతీయుడైన ప్రెసిడెంట్ ఒబామా తీసుకువచ్చిన అనేక విద్యా, వైద్య సంస్కరణలకు ట్రంప్ చరమగీతం పాడారు.



అమెరికాకు చెందిన ‘నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్’ వార్షిక బడ్జెట్ సుమారు 48 బిలియన్ డాలర్లు. దీనికి తోడు సుమారు 2,500 విశ్వవిద్యాలయాలు, ఆస్పత్రుల్లో పనిచేసే పరిశోధకులకు గ్రాంట్లు మంజూరు చేసేవారు. ఒక్క పెన్ను పోటుతో ట్రంప్ వీటన్నింటికీ నిధుల్లో కోత పెట్టారు. ఎయిడ్స్, క్యాన్సర్ వంటి వ్యాధులను అరికట్టే వ్యాక్సిన్ల అభివృద్ధి, సరికొత్త చికిత్సా విధానాల రూపకల్పన, ఔషధాల తయారీ, మానసిక ఆరోగ్య పరిరక్షణ, అరుదైన జబ్బుల నివారణకు ఈ నిధులు ఎంతగానో తోడ్పడేవి. కొలంబియా యూనివర్సిటీకి 400 మిలియన్ డాలర్ల గ్రాంటును కుదించారు. ప్రపంచ దేశాలకు అందించే నిధులనూ నిలిపివేశారు. దాంతో లైంగిక వ్యాధులు, హెచ్ఐవీ నివారణ, టీకాల అభివృద్ధి ప్రాజెక్టులు ఒక్కసారిగా మందగమనంలోకి జారిపోయాయి. ట్రంప్ నిర్ణయం వల్ల అమెరికా జాతీయ వైద్య సంస్థ ఆధ్వర్యంలోని సుమారు 800 పరిశోధక ప్రాజెక్టులు సాగడానికి, విపత్తుల నివారణకు... నిధుల కటకట ఏర్పడిందని ప్రముఖ సైన్స్ జర్నల్ ‘నేచర్’ విశ్లేషించింది.

ట్రంప్ భారతదేశంతో చెలిమి చేస్తున్నట్టు నటిస్తూ అమెరికన్ విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులను తరిమివేయాలని చూస్తున్నారు. భారతీయుల మేధస్సు మీద గొడ్డలి వేటు వేయాలని చూస్తున్నారు. జాన్ డ్యూయీ రూపొందించిన విద్యా ప్రజాస్వామ్య దృక్పథాన్ని నాశనం చేయాలని చూస్తున్నారు. డ్యూయీ తన ‘ప్రజాస్వామ్యం’ అనే గ్రంథంలో ఈ విధంగా తెలియజేశారు: ‘ప్రజాస్వామ్యం ఒక ప్రత్యేక రాజకీయం కంటే, ఒకే పద్ధతిలో సాగే ప్రభుత్వం కంటే కూడా విస్తృతమైంది. ప్రజాస్వామ్యం మనుష్యులందరూ కలిసి జీవించగలిగే విధానాన్ని రూపొందిస్తుంది. మనిషికి ప్రజాస్వామ్యం పరిణ తి తీసుకొస్తుంది. మనిషికి ప్రజాస్వామ్యం నైతికతను నేర్పుతుంది. ప్రజాస్వామ్యం సామాన్య, సామాజిక సంక్షేమ విలువలకు, మానవ సంపూర్ణ జీవన సంస్కృతీ విస్తరణకు, ఒక వ్యక్తికి మానవ విలువలు ఉండే క్రమాన్ని రూపొందించడానికి నిర్మాణ సూత్రాలు ఇస్తుంది. ప్రజాస్వామ్యం మానవ విలువల శాస్త్రం’. ఆయన చెప్పిన ప్రతి వాక్యం అంబేడ్కర్ మీద పని చేసింది. ట్రంప్ చేస్తున్న పనులు చూస్తుంటే డ్యూయీ వచించిన మాటలకు ఎంత వ్యతిరేకంగా పనిచేస్తున్నారో అర్థమవుతుంది. తద్వారా అంతకు ముందు అమెరికాకు అంతర్ శక్తిగా ఉన్న విద్యా సంస్కృతిపై గొడ్డలి వేటు వేస్తున్నారు. ఇది మొత్తం ఆసియా దేశాల్లో విస్తృతమవుతున్న విద్యా సాంకేతిక, జ్ఞాన సంపత్తిపై దాడిగానే మనం భావించాలి.



◆ ఒక పక్క గాజాపై మారణహోమం జరపడానికి యూదుల దేశమైన ఇజ్రాయెల్‌ని ప్రోత్సహిస్తూ, మరోపక్క హార్వర్డ్ యూనివర్సిటీ యూదా (యూదు) జాతి యువకులు అమెరికా తెల్లజాతి వారిని అణచివేస్తున్నారని మాట్లాడడం ఆయనలో ఉన్న ద్వైదీభావానికి నిదర్శనం.

◆ ప్రాచీన కాలం నుండి భారతదేశం ఇతర దేశాలకు ఎలా విద్యను, సంస్కృతిని, సాంకేతికతను, తత్వశాస్త్రాన్ని, కళలను, మానవ పరిణామ శాస్త్రాన్ని అందించిందో అలా ఇప్పుడూ అమెరికాకు ప్రత్యామ్నాయంగా దేశాన్ని నిలబెట్టాలి.

ఈ నేపథ్యంలో భారతదేశ ప్రజలు, పాలకులు మేల్కొని మన విశ్వవిద్యాలయాలను సుసంపన్నం చేసుకొని అతి ప్రాచీన కాలం నుండి భారతదేశం ఇతర దేశాలకు ఎలా విద్యను, సంస్కృతిని, సాంకేతికతను, తత్వశాస్త్రాన్ని, కళలను, మానవ పరిణామ శాస్త్రాన్ని అందించిందో అలా ఇప్పుడు కూడా అందించడానికి సిద్ధపడి అమెరికాకు ప్రత్యామ్నాయంగా దేశాన్ని నిలబెట్టాలి. ఫలితంగా మన విద్యా ఉత్పత్తులు పెరుగుతాయి. తన విద్యా ఉత్పత్తుల ద్వారా అమెరికా ఎంతో సంపదను పోగు చేసుకుంటోంది. దానికి ట్రంప్ ఉద్దేశపూర్వకంగానే గండి కొడుతున్నారు. ఈ సందర్భాన్ని చైనా ఉపయోగించుకోవాలని చూస్తోంది. భారత్ కూడా తన శక్తిమేర ఉన్నత విద్యా వ్యవస్థను పటిష్ఠం చేసుకుని అలనాటి నలంద, తక్షశిల వంటి ప్రపంచ స్థాయి విశ్వ విద్యాలయాలను అభివృద్ధి చేయాలి. అప్పుడే దేశం నిజమైన ప్రగతి బాట పడుతుంది.

వ్యాసకర్త దళితోద్యమ నాయకులు I 98497 41695

సోషల్ మీడియా

క్షమాపణ చెప్పాల్నా?



కన్నడం గురించి కమల్ హాసన్ చెప్పింది వాస్తవికంగా తప్పు. అలాగని ఆయన కన్నడ భాషను ఉద్దేశపూర్వకంగా అవమానించారని అనడంలోనూ అర్థం ఉండదు. ఆయన అలా ఎందుకు చేస్తారు? కానీ ఆయన ఒక క్షమాపణ చెప్పేసి వివయాన్ని ముగించకపోవడం అంతకంటే అర్థరహితం. నువ్వు ఒక తప్పు చేశావు; నీకు ఎవరినీ బాధించే ఉద్దేశం లేదు; కానీ దానివల్ల ఇంకెవరో గాయపడ్డారు. అయినా క్షమాపణ చెప్పనక్కరలేదు అనడమంటే నువ్వు చెప్పింది సరైనదే అని నమ్ముతున్నట్టు.

- సుమంత్ రామన్, టీవీ హోస్ట్

ఎలాంటి కనెక్షన్?



యుద్ధానికి తెర లేపినప్పుడల్లా పాకిస్తాన్‌కు రుణాలు, గ్రాంట్ల మీద ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఎందుకు ఆంక్షలను సడలిస్తాయి? చూస్తుంటే ఇండియాతో జరిగిన నాలుగు రోజుల ఘర్షణ ఈ సంస్థలకు పాక్ పట్ల మౌనాంగీకారం ఇచ్చినట్టుంది! క్వెట్టా షూరా, హక్కానీ నెట్‌వర్క్, ఆఖరికి అల్ కాయిదాకు కూడా పాక్ చురుగ్గా సాయం చేస్తున్నప్పుడూ అమెరికా, పాశ్చాత్య దేశాలు ఎప్పుడూ సాయం ఆపలేదు.

- అమ్రుల్లా సలేహ్, అఫ్గాన్ నాయకుడు

కావాల్సిన మొండితనం



ఇజ్రాయెల్, ఉక్రెయిన్‌లను ప్రత్యేకమైనవిగా మలుస్తున్నవి వాటి పోరాట పటిమ, యుద్ధ వ్యూహాలు కాదు. సమాచార యుద్ధం పట్ల వాటి పట్టనితనం. ఎన్ని ప్రతికూల రాతలు రాసినా, దౌత్యపరంగా ఒంటరిని చేసినా వాటి పోరాటాన్ని ప్రభావితం చేయడం లేదు. నా దేశం కూడా అట్లాంటి నిరోధక శక్తిని వృద్ధి చేసుకుంటుందని ఆశ.

- అమిత్ శాండిల్య, కాలమిస్ట్

అసలుదే పోయింది!



అమెరికాలో ఏఐ బాట్స్... కస్టమర్ సర్వీస్ ఉద్యోగాలను చంపేయడమే కాదు, మొత్తంగా ‘కస్టమర్ సర్వీస్’ అనేదాన్నే చంపేశాయి.

- దేవా కట్టా, దర్శకుడు

నడుపు చాలు!



నువ్వు ఒక మనిషికి థార్ బండి ఇవ్వు, ఉన్నట్టుండి అతడు ‘ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్’ సినిమా యాక్షన్ సీన్‌కు దర్శకత్వం వహిస్తున్నా అనుకుంటాడు. అది కారు కాదు, చక్రాలతో కూడిన అహం.

- సోనమ్ మహాజన్, విశ్లేషకురాలు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

ఉగ్రవాదుల లక్ష్యం నెరవేరిందా?



సయ్యద్ రఫీ

మన దేశ నిఘా, రక్షణ సంస్థలకు చిక్కకుండా సునాయాసంగా పట్టపగలు పహల్‌గామ్‌లో పనిపెట్టుకుని, పురుషులనే, ధర్మ ప్రస్తావన తెచ్చిమరీ పిట్టలను కాల్చినట్లు కాల్చి చంపిన విషయం తెలిసిందే. ఆ చంపే తీరు చూస్తుంటే ఒక హిడెన్ అజెండా ఉందని స్పష్టంగా అర్థమై పోయింది. దానికో లక్ష్యం కూడా ఉండే కానీ, అది నెరవేరలేదు. ఆ శక్తులకు ఈ సందర్భంలో, దేశంలో మతకలహాలు సృష్టించాలనే ప్రణాళిక ఉండి ఉండే. కానీ వారి అంచనాలు తారుమారు అయ్యాయి. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌తో పాటు ఎంఐఎం వంటి పార్టీలు అన్నీ రాజకీయాలకు అతీతంగా కేంద్రానికి మద్దతు నివ్వడం, అలాగే మతాలకు అతీతంగా ప్రజలందరూ ఐకమత్యాన్ని చాటడం ఇందుకు కారణాలని చెప్పాలి.

ముందు దేశం, ఆ తరువాతే మతం, ప్రతిపక్షం, ఇంకేదైనా అన్నట్టు వ్యవహరించడం, ఆదర్శంగా నిలిచింది. యాదృచ్ఛికంగా పాకిస్తాన్‌లో ఉగ్రవాదుల స్థావరాలను చిన్నాభిన్నం చేసి వచ్చిన సమాచారాన్ని పంచుకున్న ఆర్మీ కల్నల్ సోఫియా ఖురేషి ఒక ముస్లింగా ఉండడం ద్వారా, ప్రపంచంలో భారత దేశాన్ని భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలబెట్టింది. పాకిస్తాన్ ముస్లిం దేశం కాబట్టి, భారత దేశ ముస్లింలు మతానికే ప్రాధాన్యత ఇస్తారేమో అనే అపోహ ఈ ఉగ్రదాడి తరువాత తొలిగి పోవడం శుభ పరిణామం. పహల్‌గామ్ సంఘటన తరువాత భారతీయ ముస్లింలు దాన్ని ఖండించిన తీరు భారతదేశ మిశ్రమ సంస్కృతి స్థిరమైనదని ప్రపంచానికి చాటింది. ఉగ్రవాద దాడికి ప్రతిస్పందించడంలో భారతదేశం ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే పాక్ లోని అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకోవడంలో ఆసక్తి చూపలేదు. కేవలం ఉగ్రవాదులను నిర్మూలించడంలో మాత్రమే దృఢంగా ఉన్నది. భారత్ తన ప్రాదేశిక సమగ్రతను, పౌరుల గౌరవాన్ని కాపాడుకోవడానికి వెనుకాడదని నిరూపించుకుంది.

వ్యాసకర్త చిత్ర దర్శకుడు

మహారాష్ట్ర రాజకీయాల మెలోడ్రామా

సందర్భం



జిల్లా గోవర్ధన్

మహారాష్ట్రలో గత మూడేళ్ల నుండి వాయిదాపడిన 29 మున్సిపల్ కార్పొరేషన్, 257 నగర పురపాలక, ఇతర స్థానిక పంచాయతీ ఎన్నికలను రాబోయే నాలుగు నెలల్లో పూర్తి చేయాల్సిందిగా 2025 మే 6న సుప్రీంకోర్టు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. అంతే, ప్రాంతీయ పార్టీలు... ముఖ్యంగా, ఉభయ శివసేన, నేషనలిస్ట్ కాంగ్రెస్ (ఎన్సీపీ) పార్టీలు వారి వారి కార్యకర్తలను ఏకతాటిపై తెచ్చే ప్రయత్నంలో ఉన్నాయి. మినీ అసెంబ్లీ ఎన్నికలుగా పేర్కొనే ఈ ఎన్నికల జయాపజయాలు జాతీయ విషయాలపై కాకుండా, స్థానిక సమస్యలపైనే ఆధారపడుతుంటాయి.

ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఉద్ధవ్ థాకరే శివసేనకు... పుణె మునిసిపల్ కార్పొరేషన్, దగ్గర్లో ఉన్న పింప్రీ చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్, శరద్ పవార్ ఎన్సీపీ పార్టీలకు ఖాలే ఖిల్లా(కంచుకోట)గా చెప్పుకుంటారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఈ పార్టీలు ఇక్కడ పట్టు కోల్పోవటంతో, తిరిగి వారి ఉనికిని క్రియేట్ చేయటానికి సీనియర్ పవార్, ఉద్ధవ్ థాకరే క్షేత్ర స్థాయి ఎన్నికల విజయం కోసం పావులు కదుపుతున్నారు.

227 కార్పొరేటర్లు ఉన్న ముంబై మున్సిపల్ కార్పొరేషన్, దేశంలోనే అతిపెద్ద, అతి పురాతన (1889) ప్రజాప్రతినిధుల సంస్థ. డెబ్బై నాలుగు వేల కోట్ల రెవెన్యూ బడ్జెట్‌తో, గత ముప్పై సంవత్సరాల నుండి గ్రేటర్ ముంబై కార్పొరేషన్ శివసేన ఆధీనంలో ఉంది. 2017 ఎన్నికల్లో 84 సీట్లు సాధించింది శివసేన. అప్పట్లో జరిగిన పోటాపోటీ ఎన్నికలో బీజేపీ 82 సీట్లు గెలిచి, కేవలం రెండు సీట్లు మాత్రమే శివసేనకు వెనుకంజలో ఉంది. కానీ, 2022లో పార్టీ చీలికతో 42 మంది సేన కార్పొరేటర్లు ఇప్పుడు ఏక్‌నాథ్ షిండే వర్గంలోకెళ్ళిపోయారు. కార్పొరేషన్ ఎన్నికలు సమీపించటంతో మాజీ కార్పొరేటర్లు కూడా కొందరు ఉద్ధవ్ పార్టీకి తిలోదకాలు ఇచ్చారు. అయినా, మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన 20 మంది ఉద్ధవ్ శివసేన ఎమ్మెల్యేలలో ముంబై సిటీకి చెందినవారు 10 మంది! రాబోయే కార్పొరేషన్ ఎన్నికలకు ఇది వారికి ఒక విధంగా ఆశా కిరణమే అనొచ్చు.

రాజ్ థాకరే ప్రాతినిధ్యం వహిస్తున్న మహారాష్ట్ర నవ నిర్మాణ సేన (ఎంఎన్ఎస్) ఇప్పటివరకూ, ఉద్ధవ్ శివసేనకు ఓట్ కట్టర్ గానే నష్టం చేకూర్చింది. సందర్భోచితంగా స్థానిక బీజేపీ నేతలు, రాజ్ థాకరే పార్టీని తమకు అనుకూలంగా వాడుకుంటారు. ఉద్ధవ్, రాజ్ కలిసి ఎన్నికల బరిలో దిగితే ఇరు పార్టీలకు కలిసి వస్తుంది అని రాజకీయ విశ్లేషకులే కాక, పార్టీ కార్యకర్తలు సైతం తరచుగా చెపుతుంటారు. కానీ, అది ఇంత వరకూ జరగ లేదు.



◆ ‘రాబోయే స్థానిక ఎన్నికల్లో అజిత్ పవార్ వర్గం, మీ పార్టీతో చేతులు కలుపుతుందా?’ అన్న విలేఖరి ప్రశ్నకు శరద్ పవార్, ‘ముఝందు ఈ రెండు పార్టీలు విలీనం అయినా ఆశ్చర్యం లేదు’ అంటూ తన పార్టీ నేతలను కూడా విస్మయంలో ముంచారు.

2024 డిసెంబరులో రాష్ట్ర ముఖ్య మంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్ ప్రమాణ స్వీకారం చేయగానే, ప్రతిపక్షంలో ఉన్న ఉద్ధవ్ థాకరే వెళ్ళి ఆయనను కలవటం, మహాయుతి భాగస్వామి షిండే వర్గంలో కలకలం సృష్టించింది; ‘టిట్ ఫర్ టాట్’ అన్నట్టు శివసేన (షిండే) నేత, ఉపముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే, రాజ్ సాహెబ్ ఇంటికెళ్ళి ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇదంతా గమనిస్తే, ప్రస్తుతం ఇక్కడి రాజకీయాల్లో ‘దోస్తీ దుష్మనీ’కి నిర్వచనమే తెలియటం లేదు. ఇక, మొన్న జరిగిన మరాఠీ సినీ కార్యక్రమంలో ఒక విలేఖరి అడిగిన ప్రశ్నకు ఎం.ఎన్.ఎస్. నేత రాజ్ థాకరే, ‘మహారాష్ట్ర సంక్షేమం కోసం తన పార్టీ ఉద్ధవ్ శివసేనకు మద్దతివ్వటానికి సిద్ధమే’ అని అన్నారు. మరుసటి రోజు ముంబై నగర వీధుల్లో, థాక్రే బ్రదర్స్ ‘మహారాష్ట్ర హిత్’ కోసం ఒక్కటవ్వాలి అని శివసేన పోస్టర్లు వెలిశాయి.

ఇక బాబాయి, అబ్బాయిల (ఎన్సీపీ పార్టీల) విషయానికి వస్తే, ‘రాబోయే స్థానిక ఎన్నికల్లో అజిత్ పవార్ వర్గం, మీ పార్టీతో చేతులు కలుపుతుందా?’ అన్న విలేఖరి ప్రశ్నకు శరద్ పవార్, ‘ముఝందు ఈ రెండు పార్టీలు విలీనం అయినా ఆశ్చర్యం లేదు’ అంటూ తన పార్టీ నేతలను కూడా విస్మయంలో ముంచారు.

2019 నుండి మహారాష్ట్ర రాజకీయాలు చిత్ర విచిత్రంగా మలుపులు తిరుగుతూనే ఉన్నాయి. భాజపాతో 30 ఏళ్ల సంబంధం తెగతెంపులు చేసుకుని ఉద్ధవ్ థాకరే కాంగ్రెస్ ఎన్సీపీలతో మైత్రి కుదుర్చుకుని ముఖ్యమంత్రి కావటం; తర్వాత, 2022 జూన్‌లో ఏక్‌నాథ్ షిండే 52 మంది శివసేన ఎమ్మెల్యేలతో ఉద్ధవ్‌ను పదవీచ్యుతుణ్ణి చేసి భాజపా సహాయంతో సీఎం కావటం; మరో సంవత్సరం గడిచాక (2023 జూలై) అజిత్ దాదా, 43 ఎన్సీపీ ఎమ్మెల్యేలను తీసుకెళ్ళి, భాజపా కనుచలువతో ఉపముఖ్యమంత్రి కావటంతో మహారాష్ట్ర రాజకీయ రంగస్థలంలో మెలోడ్రామా చోటు చేసుకుంది.

రాష్ట్ర స్థాయి నేతలకు అతీతంగా, గ్రామ, జిల్లా, నగర స్థాయిలో అధికారం కోసం ఉబలాటపడే నాయకులు మాత్రం ముంబైలోని వారి అగ్ర నాయకుల ఫర్మాన్ పట్టించుకోదలచుకో లేదు. శివసేన, ఎన్సీపీ రెండూ రెండు వర్గాలుగా విడిపోయినప్పటికీ, క్షేత్ర స్థాయిలో ఈ పార్టీల నాయకులు, వాలంటీర్లు వారికి తోచిన రీతిలో సమీకరణలు చేసుకుంటున్నారు. అయితే స్థానిక నాయకులను తమ ‘గ్రిప్’లో ఉంచుకోవాలనే ప్రయత్నమే పవార్, థాకరే పార్టీలు చెప్పే మెర్జర్ ధోరణి రహస్యం.

వ్యాసకర్త మాజీ పీఎఫ్ కమిషనర్, ముంబై I 98190 96949

ఆత్మ శుద్ధి

నిర్మలమైన హృదయం కలిగి ఉండి, మత్సరభావం లేకుండా, ప్రశాంత చిత్తంతో ఎల్లవేళలా సృష్టిలోని సమస్త జీవుల పట్ల స్నేహ భావం కలిగి ఉంటూ, ఇతరులతో సంభాషణల సమయంలో ప్రియంగా మాట్లాడేవారి హృదయాలలో పరమేశ్వరుడు కొలువు తీరి ఉంటాడని విజ్ఞులు చెబుతారు. ‘కావాలని మనస్సులోని ఆలోచనలను పాపకర్మలు చేయడం వైపుకు మరలనీయకుండా, చెడ్డ పనులను తలపెట్టక, ధర్మమార్గాన్ని ఎన్నడూ విడిచి పక్కదోవ పట్టకుండా చూసుకుంటూ, చెడ్డపేరు తెచ్చిపెట్టే పనుల జోలికి వెళ్ళకుండా, ఇరుగుపొరుగున అందరూ తమను మెచ్చుకునే పద్ధతిలో జీవనం సాగించే వ్యక్తులు దేవతలతో సమానమైనవారే అవుతారని, వారిలో ఇంకేమి తక్కువని అలా అనకుండా ఉండగలం?’ అని వెన్నెలకంటి సూరన రచనయైన ‘ఆంధ్ర శ్రీ విష్ణుపురాణము’ ప్రశ్నించి చెప్పింది. పుణ్యానికైనా, పాపానికైనా, సుఖానికైనా, దుఃఖానికైనా మనిషి చేసే ఆలోచనలే ముఖ్యం కాబట్టి, ప్రయత్న పూర్వకంగా మనసును చెడు ఆలోచనల వైపుకు మళ్ళకుండా చూసుకోవడం మనిషికి అవసరం అన్నది పై మాటల సారాంశంగా భావించవచ్చు. సరిగా ఈ ఆలోచననే నొక్కి చెప్పినట్లుగా, బుద్ధిలో సందేహము, నిర్మలత్వము లేకుండా ఆచరించబడే కర్మల నిష్ప్రయోజకత్వాన్ని ఎఙ్గయకవి రచించిన ‘సకలనీతికథా నిదానము’ ప్రథమాశ్వాసములోని ఈ కింది తేటగీతి పద్యం తేలికైన మాటలలో చెప్పింది.



చిత్తశుద్ధి లేక చేసిన జపమును
తపము హోమవిధియు దానములును
దేవతార్చనములు భావింప నిష్ఫల
మట్లుగాన వలయు నాత్మ శుద్ధి.

మనసు నిర్మలంగా ఉండడం, చేసే పనియందు లగ్నమై ఉండడం – కార్యాచరణలో ఈ రెండూ చాలా ముఖ్యమైనవని తెలుసుకోవాలి. ఏకాగ్రచిత్తంతో చేయని ఏ పని కూడా సరైన ఫలితాలను ఇవ్వదు. మనసులో నిర్మలత్వం లేని దానము, దేవతార్చన కూడా నిష్ఫలమే అవుతాయి. అందువలన మనసును – అంటే ఆత్మను, బుద్ధిని నిర్మలంగా ఉంచుకోవడం ఎంతైనా అవసరం అని పై పద్యం సారాంశం. సువాసనలు వెదజల్లే పూవులను పూచే మొక్కలకు, రుచికరమైన పండ్లను ఫలించే చెట్లకు, మూలాలు భూమి పొరలలోని మట్టిలో నిక్షిప్తమై ఉన్నట్లుగా, ఇహపరాలలో మనిషికి ఆధ్యాత్మిక సౌఖ్యాలను అందించే పుణ్యానికి మూలాలు నిర్మలమైన చిత్తంతో ఈ భువిపై జీవనంలో ఆచరించే సత్కర్మలలోనే ఉంటాయన్నది కాదనలేని నిజం.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు; జ్యేష్ఠ మాసం; **తిథి** శు.నవమి రా.1.40 వరకు, తదుపరి దశమి; **నక్షత్రం:** ఉత్తర పూర్తి (24 గంటలు); **వర్జ్యం:** ప.11.28 నుండి 1.11 వరకు; **దుర్ముహూర్తం:** ఉ.11.35 నుండి 12.27 వరకు; **అమృత ఘడియలు:** రా.9.50 నుండి 11.33 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు; **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు; **సూర్యోదయం:** 5.28, **సూర్యాస్తమయం:** 6.27

11న విశ్వాస పరీక్ష

- పోలండ్ ప్రధాని ప్రకటన

వార్సా: జూన్ 11వ తేదీన పార్లమెంట్‌లో తమ ప్రభుత్వంపై విశ్వాస పరీక్ష ఉంటుందని పోలండ్ ప్రధాన మంత్రి డొనాల్డ్ టస్క్ ప్రకటించారు. అధ్యక్ష పదవికి తాజాగా జరిగిన ఎన్నికల్లో పోటీ చేసిన వార్సా మేయర్, అధికార లిబరల్ పార్టీ అభ్యర్థి రఫాల్ ట్రస్కోవ్‌స్కీ ఓటమిపాలైన నేపథ్యంలో మంగళవారం టస్క్ ఈ విషయం తెలిపారు. పోలండ్ రాజ్యాంగం ప్రకారం రోజువారీ వ్యవహారాల్లో ప్రధాని సారథ్యంలోని ప్రభుత్వానికే ఎక్కువ అధికారాలుంటాయి. కీలకమైన విదేశీ వ్యవహారాలు, బిల్లుల ఆమోదం వంటి అధికారాలు మాత్రం అధ్యక్షుడి చేతుల్లో ఉంటాయి. దీంతో, యూరోపియన్ యూనియన్(ఈయూ) అనుకూలుగా ఉన్న టస్క్‌కు, నాటో అనుకూలుడిగా పేరున్న ఎన్నికైన అధ్యక్షుడు కరోల్ నవ్‌రొకితో వ్యవహారాలు చక్కబెట్టడం కత్తి మీద సాముగానే భావిస్తున్నారు. నూతన పరిణామాల నేపథ్యంలోనే టస్క్ విశ్వాస పరీక్షకు వెళ్లాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు.

దిగుబడి లేక.. అప్పులు తీరక
రైతు ఆత్మహత్య



ఉట్నూర్ రూరల్: అప్పుల బాధతో ఒక రైతు బలవన్మరణానికి పాల్పడాడు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం శంభుగూడ గ్రామా నికి చెందిన సెడ్మకి పులాజీరాం (35) యాసంగిలో పత్తి సాగు చేశాడు. అయితే ఆశించిన దిగుబడి రాకపోవడంతో పెట్టుబడికి తెచ్చిన అప్పులు పెరిగాయి. మరోవైపు తన సోదరుడు బాజీరావు అప్పుల బాధతో మూడు నెలల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. అతని భార్య ఇంటి నుంచి వెళ్లిపోవడంతో.. ఇద్దరు పిల్లలు పులాజీరాం వద్దే ఉంటున్నారు. ఈ క్రమంలో సోదరుడు చేసిన రూ.2 లక్షల అప్పుకు తోడు.. తాను చేసిన రూ.3 లక్షలు కలిసి మొత్తం రూ.5 లక్షల రుణం ఎలా చెల్లించాలోనని కొంతకాలంగా మధనపడుతున్నాడు. సోమవారం చేనుకు వెళ్లాడు. అక్కడే పురుగు మందు తాగి పడి పోయాడు. అపస్మారక స్థితిలో కనిపించాడు. వెంటనే అతన్ని ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు రిమ్స్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు.

ఎర్రగడ్డ మానసిక వైద్యశాలలో
కలుషిత ఆహారం

- ఒకరి మృతి.. 70 మంది రోగులకు అస్వస్థత
- ఆస్పత్రిలో కలెక్టర్, డీఎంఈ తనిఖీలు
- ఆహారం, నీటి నమూనాలను పరీక్షకు పంపిన అధికారులు

శ్రీనగర్ కాలనీ (హైదరాబాద్): ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో కలుషిత ఆహారం కారణంగా ఒక రోగి మృతిచెందగా, 70 మంది అస్వస్థతకు గురయ్యారు. సోమవారం ఆసుపత్రిలో ఆహారంతో పాటు పరమాన్నం, అరటిపండ్లు, గుడ్లను రోగులకు అందించారు. అయితే సాయంత్రం కొందరు రోగులు వాంతులు, తీవ్ర విరోచనాలతో సతమతమయ్యారు. అందులో డీసీ వార్డులోని కరణ్ (35) అనే రోగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది వారికి చికిత్సను అందించారు. అందరూ కోలుకోగా కరణ్ మంగళవారం ఉదయం మృతి చెందాడు. రోగి మృతిచెందడంతో సూపరింటెండెంట్ డాక్టర్ అనిత, ఇతర వైద్యులు వంటగది, నీటి సరఫరా తీరును పరిశీలించారు. అస్వస్థతకు కారణమైన ఆహారం లేకపోవడంతో రోగుల మలాన్ని ఆసుపత్రిలోని మైక్రోబయాలజీ విభాగానికి పంపారు. అలాగే వార్డుల్లోని నీటి నమూనాలను పరీక్షల నిమిత్తం నారాయణగూడలోని ఐపీఎంకు పంపించినట్లు డాక్టర్ అనిత తెలిపారు. మృతిచెందిన కరణ్ మానసిక సమస్యలతో, బుద్ధిమాంద్యంతో బాధపడుతూ 2023 నుంచి ఇక్కడ చికిత్స పొందుతున్నాడు. కాగా, కరణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించామని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. కలుషిత ఆహారం ఘటనపై లోతుగా విచారణ చేస్తున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిత రాయిరాల తెలిపారు. రాష్ట్ర డీఎంఈ డాక్టర్ ఎ.నరేంద్రకుమార్ మంగళవారం ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిని పరిశీలించి, సిబ్బందిని పలు అంశాలపై ఆరా తీశారు.

ఆస్పత్రిలో కలెక్టర్ తనిఖీలు

కలుషిత ఆహారం కారణంగా రోగి మృతిచెందడంతో ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిని మంగళవారం రాత్రి హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సందర్శించారు. అస్వస్థతకు గురైన రోగుల పరిస్థితిని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ, మొత్తం 70 మంది రోగులు సోమవారం సాయంత్రం అస్వస్థతకు గురయ్యారని అందులో కరణ్ అనే రోగి మంగళవారం మృతిచెందాడని తెలిపారు. తాగునీరు, రోగుల మలాన్ని పరీక్షలకు పంపామని, ఘటనపై లోతుగా విచారణ చేపడుతున్నామని పేర్కొన్నారు. ఇద్దరు రోగులను ఉస్మానియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించామని, మానసిక ఆసుపత్రిలో అస్వస్థతకు గురైన రోగులు, ఉస్మానియాలో ఉన్న ఇద్దరు రోగులు క్షేమంగా ఉన్నారని వెల్లడించారు. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని చెప్పారు. నమూనాల ఫలితాలు బుధవారం ఉదయానికి వస్తాయని అప్పుడు ఎక్కడ లోపం జరిగిందో స్పష్టంగా తెలుస్తుందన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఆద్యకళ.. ఆదివాసీ చరిత్రను
ప్రపంచానికి చాటేది

- తిరుమలరావు ఎంతో కష్టపడి 5వేల రకాల ఆదివాసీ వస్తువులను సేకరించారు
- ఆద్యకళా సంపదపై మీడియా సమావేశంలో వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న కోదండరాం. చిత్రంలో సీనియర్ సంపాదకుడు కె.శ్రీనివాస్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఆద్య కళ..సొంత సంస్థ కాదని, ఆదివాసీ చరిత్రను ప్రపంచానికి చాటేదని వక్తలు అన్నారు. ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు సేకరించిన ఆదివాసీ వస్తువులను మ్యూజియంగా ఏర్పాటు చేయాలని, ఆద్యకళ..అపోహలు..వివరణలపై మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్, ఎమ్మెల్సీ కోదండరాం, సన్నిదానశర్మ, కె.సత్యవతి తదితరులు మీడియాతో మాట్లాడారు. తిరుమలరావు సేకరించిన 5వేలకు పైగా ఆదివాసీ వస్తువుల ఏర్పాటుకు భవనవసతి కావాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. దీనికి సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు ఆదేశించారని, ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆవరణలో ఆద్యకళ ప్రదర్శనశాల ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. రూ.3 కోట్లతో భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. ఈ క్రమంలో కొందరు ఈ పనులను అడ్డుకోవడం దారుణమన్నారు. దీనికి అపోహలు..అపార్థాలే కారణమని తెలియడంతో ఆద్యకళ తరఫున తగిన వివరణ ఇచ్చి, అవగాహన కల్పించడం అవసరమని భావిస్తున్నామని చెప్పారు.

ఈ మ్యూజియం అంతిమంగా ప్రజలది

'ఇది ఎవరి వ్యక్తిగత ఆస్తి కాదు. ప్రజలది. అన్ని మ్యూజియంలలో ఉన్నట్టే, నిర్వహణకు అవసరమైన నామమాత్రపు ప్రవేశ రుసుము తప్ప, ఇందులో ఎటువంటి వ్యాపారమూ ఉండదు. వ్యాపార సంస్థలకు విశ్వవిద్యాలయ భూములు కేటాయిస్తే చెప్పే అభ్యంతరాలు..ఆద్యకళ విషయంలో ఏ మాత్రం వర్తించవు. ప్రభుత్వేతర విద్యాసంస్థ లేక స్వచ్ఛంద సంస్థ, విశ్వవిద్యాలయం, ప్రభుత్వం ఉమ్మడిగా ప్రదర్శనశాలలు నిర్వహించడం ప్రపంచమంతా ఉన్న ఆనవాయితీయే. అమెరికా, యూకే, దక్షిణాఫ్రికా వంటి దేశాలలో అనేక సుప్రసిద్ధ విశ్వ విద్యాలయాల ఆవరణల్లో ఇలాంటి మ్యూజియంల నిర్వహణ జరుగుతోంది. ఆద్యకళ మ్యూజియంతో ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రతిష్ట మరింత ఇనుమడిస్తుంది. ఆదివాసీ జీవన అధ్యయనంతో ముడిపడిన సామాజిక శాస్త్రం, మానవశాస్త్రం, ఆధునిక భాషా విభాగాలకు ఈ మ్యూజియం ఒక పరిశోధన కేంద్రంగా ఉపయోగపడుతుందని'వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రజలకే వెన్నుపోటు

నమ్మించి.. నట్టేట ముంచిన కూటమి ప్రభుత్వం

సూపర్ సిక్స్ సహా 143 హామీలను తుంగలో తొక్కిన సీఎం చంద్రబాబు

'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ' పేరుతో నాడు ఇంటింటా బాండ్లు పంపిణీ

ఏడాదిలో రూ.1,51,604 కోట్లు అప్పు చేసినా ఒక్క హామీ అమలు చేయని సర్కారు

హామీల అమలుపై ప్రశ్నించే గొంతులను రెడ్‌బుక్ కుట్రలతో నొక్కేస్తున్న వైనం

టీడీపీ కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసంపై వైఎస్సార్‌సీపీ ఉద్యమబాట

ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు (జూన్ 4)ను 'వెన్నుపోటు దినం'గా పాటించాలని వైఎస్ జగన్ పిలుపు

నేడు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజక వర్గాల్లో వైఎస్సార్‌సీపీ నిరసన ర్యాలీలు

తక్షణమే హామీలు అమలు చేయాలని కోరుతూ అధికారులకు డిమాండ్ పత్రాలు ఇవ్వనున్న నేతలు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

శ్రీవారి మెట్టు దివ్యదర్శనం టోకెన్ల కౌంటర్లు తాత్కాలికంగా మార్పు

- ఇకపై అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌లో అందుబాటు

తిరుమల: శ్రీవారి మెట్టు నుంచి కాలినడకన తిరుమలకు వెళ్లే భక్తులకు దివ్యదర్శనం టోకెన్ల జారీ కౌంటర్లను తాత్కాలికంగా శ్రీవారి మెట్టు నుంచి అలిపిరిలోని భూదేవి కాంప్లెక్స్‌కు మార్చాలని టీటీడీ నిర్ణయించింది. ఈ మేరకు నూతన కౌంటర్లు శుక్రవారం సాయంత్రం నుంచి అందుబాటులోకి రానున్నాయి. ఇదే అంశానికి సంబంధించి టీటీడీ ఈవో శ్యామలరావు మంగళవారం వర్చువల్ సమావేశం ద్వారా టీటీడీ అధికారులతో సమీక్షించారు. శనివారం శ్రీవారి దర్శనం నిమిత్తం శుక్రవారం సాయంత్రం దివ్య దర్శనం టోకెన్లు మంజూరు చేయనున్నట్టు పేర్కొన్నారు.

రూ.10.11 కోట్ల గంజాయి, డ్రగ్స్ దహనం



గంజాయి, డ్రగ్స్‌ను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

పటాన్‌చెరు టౌన్ (హైదరాబాద్): నాలుగు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 27 కేసుల్లో పట్టుబడిన గంజాయి, డ్రగ్స్‌ను ఎక్సైజ్ అధికారులు మంగళవారం ఇస్నాపూర్‌లో తగులబెట్టారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్‌చందార్ తెలిపిన వివరాలివి. మెదక్ డిప్యూటీ కమిషనర్ జె.హరికిషన్‌ఆదేశాల మేరకు.. సంగారెడ్డి జిల్లాలోని నాలుగు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 27 కేసులకు సంబంధించి స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాలను ఇస్నాపూర్‌లోని మెడికేర్ వేస్టేజ్ మేనేజ్‌మెంట్ ప్రాంతంలో దహనం చేశారు. వీటిలో పటాన్ చెరు, సంగారెడ్డి, నారాయణఖేడ్, అందోల్ కేసుల్లో పట్టుబడిన 209.162 కేజీల గంజాయి, 7 గ్రాముల డైజోఫామ్, 0.496 కేజీల ఆల్ప్రాజోలం, 0.468 కేజీల పప్పిస్ట్రా, 90.23 కేజీల ఎంఎంసీ తదితర మత్తు పదార్థాలున్నాయి వీటి విలువ రూ.10.11 కోట్లు. కార్యక్రమంలో జిల్లాలోని ఎక్సైజ్ సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

గోరక్షణలో ప్రభుత్వం విఫలమైంది

గవర్నర్‌కు వీహెచ్‌పీ వినతిపత్రం

సాక్షి, హైదరాబాద్ : ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలకు కక్కుర్తి పడి గోరక్షణలో ఘోరంగా విఫలమవుతోందని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆరోపించింది. రాష్ట్రంలో గోవులకు రక్షణ కల్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకునేలా ఆదేశించాలని కోరుతూ మంగళవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు వీహెచ్‌పీ పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా వీహెచ్‌పీ నేతలు గవర్నర్ దృష్టికి పలు విషయాలు తీసుకెళ్లారు. ప్రభుత్వం హిందువుల మనోభావాలను గాలికి వదిలేసిందని, గోరక్షణ విషయంలో విఫలమైన పోలీసులు హిందువులపైనే అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని పేర్కొన్నారు. గోరక్షణ కోసం చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినా అవి నామమాత్రంగానే ఉన్నాయని వివరించారు. జీహెచ్‌ఎంసీ ఏర్పాటుచేసిన హోల్డింగ్ పాయింట్లలో ఎన్ని ఆవులను పట్టుకున్నారు..వాటిని ఎక్కడికి తరలించారనే లెక్కలు లేవని తెలిపారు. సమస్యను పరిష్కరిస్తానని గవర్నర్ హామీ ఇచ్చారని నేతలు వెల్లడించారు.

రాజన్న గోశాలలో మరో ఆరు కోడెల మృతి

- ఇప్పటివరకు మొత్తం 26 పశువుల మృతి
- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెల్లడి

వేములవాడ అర్బన్: వేములవాడ శివారులోని తిప్పాపూర్ గోశాలలో మంగళవారం మరో ఆరు కోడెలు చనిపోయాయని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రవీందర్‌రెడ్డి తెలిపారు. అకాల వర్షాలు.. అనారోగ్య కారణాలతో తిప్పాపూర్‌లోని గోశాలలో మొదటి రోజు 8 కోడెలు, రెండవ రోజు ఐదు, మూడో రోజు నాలుగు, సోమవారం మూడు, మంగళవారం ఆరు.. మొత్తంగా ఇప్పటివరకు 26 కోడెలు మృతిచెందినట్లు ఆయన పేర్కొన్నారు. గోశాలలో ప్రస్తుతం 1,300 పశువులు ఉండగా మంగళవారం మరో నాలుగు కోడెలు అనారోగ్యానికి గురయ్యాయని, మొత్తంగా 14 పశువులు అనారోగ్యంతో బాధపడుతున్నాయని రవీందర్‌రెడ్డి వెల్లడించారు. వీటికి మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. భక్తులు రాజన్నకు సమర్పించే కోడెల వయసు కనీసం ఏడాదిన్నర ఉండేలా చూసుకోవాలని ఆయన కోరారు.

కోడెల సంరక్షణకు చర్యలు..

వరుసగా కోడెలు మృతిచెందుతుండటంతో పలుమార్లు పరిశీలించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పలు చర్యలకు ఆదేశించారు. గోశాలలో గుంతలు పడిన చోట, బురద ఉన్న స్థలంలో మొరం పోయించి చదును చేయించారు. పారిశుధ్య పనులు చేయించారు. కోడెలకు మెరుగైన దాణా, పచ్చిగడ్డి అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఐదుగురు వెటర్నరీ వైద్యుల బృందం గోశాలలో ఉండి సేవలు అందిస్తోంది.

భూమి పోతుందన్న మనస్తాపంతో..
దివ్యాంగుడికి గుండెపోటు

అనాథలైన ఇద్దరు చిన్నారులు



భిక్షపతి (ఫైల్)

మర్కూక్ (గజ్వేల్): తన వ్యవసాయ భూమి ట్రిపుల్‌ఆర్ భూ సేకరణలో పోతుందనే బాధతో ఓ దివ్యాంగుడు గుండెపోటుతో మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలంలోని నర్సన్నపేట గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎంబరి భిక్షపతి (45) తనకున్న 30 గుంటల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇద్దరు కుమార్తెలు 3వ తరగతి, 5వ తరగతి చదువుతున్నారు. 15 రోజుల క్రితం ట్రిపుల్‌ఆర్ భూసేకరణపై భిక్షపతికి సంబంధిత అధికారులు నోటీసులు అందించారు. ఈ క్రమంలో నష్టపరిహారం తక్కువగా వస్తుందని, పిల్లల భవిష్యత్తు ఎలా అని భిక్షపతి తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో సోమవారం హఠాత్తుగా ఛాతీలో నొప్పి రావడంతో గజ్వేల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మంగళవారం తెల్లవారుజామున అతడు మృతిచెందాడు. దీంతో మృతుని బంధువులు, గ్రామస్తులు ఇద్దరు ఆడపిల్లలతో కలిసి నర్సన్నపేట రోడ్డుపై బైఠాయించారు. రెండేళ్ల క్రితమే భిక్షపతి భార్య అనసూయ అనారోగ్యంతో మృతి చెందింది. తల్లిదండ్రులు చనిపోవడంతో ఇద్దరు చిన్నారులు అనాథలయ్యారు. కాగా, విషయం తెలుసుకున్న మృతుడి పదవతరగతి స్నేహితులు చిన్నారులకు రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

రణ పంచతంత్రం

రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్‌ల దండు దాడితో మారిన యుద్ధవ్యూహాలు

అగ్రరాజ్యం అమెరికాకు సరిసాటిగా ప్రపంచంలోనే పేరెన్నికగన్న రష్యా గత మూడేళ్లుగా ఉక్రెయిన్‌ను యుద్ధంలో ముచ్చెమటలు పట్టిస్తోంది. యుద్ధం తొలినాళ్లలోనే ఉక్రెయిన్ రాజధాని కీవ్‌ను వందలాది ట్యాంకలతో చుట్టేసి ఆక్రమించినంత పనిచేసిన రష్యా ఆతర్వాత కాస్తంత వెనుక్కు తగ్గింది. అణ్వాయుధాలు లేని ఉక్రెయిన్ ఏనాటికైనా తన ముందు తలవంచక తప్పదన్న రష్యా నిఘా నిర్లక్ష్యం తాజాగా భారీ మూల్యాన్నే చెల్లించుకుంది. ఉక్రెయిన్ డ్రోన్ల దండు 'స్పైడర్ వెబ్' పేరుతో చేసిన దాడి ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కొత్తతరహా రణతంత్రంగా మార్మోగిపోతోంది. దీంతో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు యుద్ధవ్యూహాలకు పదును పెట్టక తప్పదని ఈ ఉదంతం మరోసారి నిరూపించింది. గతంలో యుద్ధట్యాంకులను ఎంత త్వరగా ముందుకు ఉరికిస్తే అంత త్వరగా శత్రుదేశ భూభాగం మన వశం అవుతుందనే భావన ఉండేది. ఇప్పుడు ఎంత మెరుపువేగంతో డ్రోన్లను సరైన లక్ష్యందిశగా పంపితే అంత త్వరగా సమరక్షేత్రంలో జైత్రయాత్ర పూర్తిచేయొచ్చనే వాదన మొదలైంది. ఉక్రెయిన్ స్పైడర్ వెబ్ దాడి ప్రపంచవ్యాప్తంగా ఐదు రకాలుగా రణవ్యూహాలను రాటుదేల్చాల్సిన పరిస్థితిని తీసుకొచ్చిందని యుద్ధరంగ నిపుణులు చెబుతున్నారు. ఆ ఐదింటి గురించి ఓసారి పరిశీలిస్తే..



1. దాడి కంటే వ్యూహం కీలకం

యుద్ధంలో ఎంత బలంగా కొట్టామనేది కాదు. ఎక్కడ ఎప్పుడు ఎలా కొట్టామనేది ముఖ్యం. దాడి కంటే వ్యూహం ప్రధానమని తాజా ఘటన మరోసారి నిరూపించింది. లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం కంటే ముందు.. ముందస్తు ప్రణాళికలో ఎలాంటి పొరపాట్లులేకుండా చూసుకోవాలి. తొందరపాటు నిర్ణయాలు అస్సలు పనికిరావు. రష్యా వైమానికస్థావరాలపై దాడి కోసం తాము దాదాపు ఏడాది, ఏడాదిన్నరకాలంగా వ్యూహరచన చేస్తున్నామని ఆదివారం దాడి తర్వాత ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు. ఖచ్చితమైన దాడి కంటే అత్యంత స్పష్టమైన ప్రణాళిక అనేదే యుద్ధవిజయానికి కీలకం. కొత్త తరహా వ్యూహాన్ని రచించడం, దాని అమలుకు సిబ్బందిని మోహరించడం, దాడి చేయడం, దాడి తర్వాత అక్కడి నుంచి మెరుపువేగంతో అదృశ్యమవడం అనేవి ముఖ్యం.

2. రవాణా మార్గాలు.. రణతంత్ర ఆయుధాలు

యుద్ధంలో సరిహద్దుల వద్దకు క్షిపణులను, భారీ బాంబులను తరలించడానికి స్వదేశంలోని రహదారులనే ఏదేశమైనా ఉపయోగించుకుంటుంది. కానీ ఉక్రెయిన్ ఈ దాడిలో రష్యన్ రహదారులనూ ఉపయోగించుకుంది. డ్రోన్లను సరిహద్దు దాటించాక ఎవరూ గుర్తుపట్టకుండా చెక్క క్యాబిన్లలో సర్దిపెట్టి వాహనాల్లోకి ఎక్కించారు. తర్వాత వందల కిలోమీటర్ల దూరం వరకు రోడ్డుమార్గంలోనే తీసుకెళ్లారు. సరిహద్దు దాటొచ్చిన డ్రోన్లను ఉక్రెయిన్ సమీప ప్రాంతాల్లో ఉపయోగించకుండా ఇలా వందల కిలోమీటర్లు తరలిస్తుందనే రష్యా అధికారులు అస్సలు ఊహించలేదు. అందుకే సుదూర ప్రాంతాల్లో ఎక్కడా వాహనాల తనిఖీలు జరగలేదు. యుద్ధంవేళ దేశవ్యాప్తంగా భారీ కంటైనర్లను సైతం తనిఖీచేయాలనే కొత్త నిబంధనను ఈ ఉదంతం తెరమీదకు తెస్తోంది. ప్రతీ కంటైనర్‌ను తనిఖీచేస్తే ఇంతటి దాడుల నుంచి ఏ దేశమైనా రక్షణ పొందొచ్చనే కొత్త పాఠాన్ని ఈ దాడి బోధిస్తోంది. రష్యాలో జరిగే అక్రమ సరకు రవాణా మార్గాలను ఉక్రెయిన్ తనకు అనుకూలంగా మలుచుకుంది. ఏదైనా దేశంలో జరిగే స్మగ్లింగ్, అక్రమ రవాణా అనేది ఇలాకూడా వైమానికస్థావరాలపై దాడులకు పరోక్షంగా కారణమవుతుందని ఈ ఉదంతం చాటుతోంది.

3. బుల్లి డ్రోన్‌తోనూ భారీ లక్ష్యం బద్దలు!

ఆదివారం రష్యాలో ధ్వంసమైన విమానాలను ఉక్రెయిన్ ప్రధాన భూభాగం నుంచి సుదూర ప్రాంతాల్లో నిలిపి ఉంచారు. ఈ విమానాలను ఉక్రెయిన్ తన సొంత భూభాగం నుంచి లక్ష్యంగా చేసుకుని దాడిచేయాలంటే దీర్ఘశ్రేణి క్షిపణి కావాలి. ఆ క్షిపణి తయారీకి భారీ స్థాయిలో వ్యయం తప్పదు. సైబీరియా, ఆర్కిటిక్ ఖండ సమీప రష్యా వైమానిక స్థావరాలపై దాడి చేయాలంటే అత్యంత సుదూరాలకు ప్రయాణించే బాలిస్టిక్ క్షిపణులు అవసరం. కానీ ఇవేం లేకుండానే ఇదే పనిని బుల్లి డ్రోన్లు అత్యంత సులభంగా పూర్తిచేయగలవని తాజా ఘటనతో స్పష్టమైంది. అంటే సుదూర లక్ష్యాల ఛేదనకు వందల కోట్ల ఖర్చుతో తయారైన క్షిపణులతో పనిలేదని ఈ ఘటనతో తేలిపోయింది. లక్ష్యం ఎంత దూరంగా ఉందనేది ముఖ్యంకాదు. దానికి ఎంత దగ్గరి నుంచి బద్దలుకొట్టగలం అనేదే ప్రధానం.

4. తక్కువ వ్యయంతో ఎక్కువ నష్టం చేయొచ్చు..

ముల్లును ముల్లుతోనే తీయాలనేది పాత సామెత. యుద్ధవిమానాలను కూల్చేయాలంటే మనం కూడా యుద్ధవిమానంతోనో, క్షిపణితోనో దాడి చేసి నాశనం చేయాల్సిన పనిలేదని ఈ దాడి కొత్త విషయాన్ని చెబుతోంది. అత్యంత భారీ వ్యయంతో రూపుదిద్దుకున్న బాంబర్ విమానాలను నాశనం చేయడానికి అత్యంత చవకైన డ్రోన్లు ఉంటే చాలు. ఉక్రెయిన్ దాడిలో రష్యాకు చెందిన 41 యుద్ధవిమానాలు ధ్వంసమయ్యాయి. వాటి విలువ ఏకంగా రూ.60,000 కోట్లు ఉంటుందని అంచనా. ఇంతటి శక్తివంతమైన అస్త్రాలను నిర్వీర్యంచేసేందుకు మనం కూడా అంతే స్థాయిలో ఖర్చుచేయాల్సిన పనిలేదని ఈ దాడి ఘటన తేటతెల్లంచేసింది. స్పైడర్స్ వెబ్ దాడి తర్వాత రణతంత్రాల పాఠాలను తమకూ బోధించాలని కొన్ని మిత్రదేశాలు బతిమాలినట్లు అంతర్జాతీయమీడియాలో కథనాలు వెలవడ్డాయి. అణ్వస్త్ర దేశంకాకపోయినా ఇప్పుడీ దాడితో ఉక్రెయిన్ ఒక్కసారిగా వార్ హాట్‌ఫేవరెట్‌గా నిలిచింది.

5. మనం మాత్రమే రహస్యం అనుకుంటే సరిపోదు..

రహస్య స్థావరం అనేది రహస్యంగా ఉంటేనే బాగుంటుంది. అందరికీ తెల్సిపోయాక రహస్య స్థావరం అంటే బాగోదు. గగనతల నిఘా నేత్రాలు కొలువైన శాటిలైట్లయుగంలో ప్రతీదీ బహిరంగమే. అందుకే ఫలానా చోట స్థావరం ఉందని తెలిసినా దానిపై దాడి చేయడం అసాధ్యం అనే స్థాయిలో దానికి భద్రత కల్పించడం అవశ్యమని తాజా ఘటనతో నిరూపితమైంది. నిఘా సంస్థ కార్యాలయంలో రహస్యాలు ఎంత భద్రంగా ఉంటాయో, నిఘా సంస్థ పరిసరాలు సైతం అంతే రక్షణాత్మకంగా ఉండాలని తాజా ఘటన చాటింది. రష్యా ఇంటెలిజెన్స్ సంస్థ ఎఫ్ఎస్‌బీ ప్రాంతీయ ప్రధాన కార్యాలయం సమీపంలోనే తమ కమాండర్‌సెంటర్‌ను నిర్వహించామని ఉక్రెయిన్ ప్రకటించింది. దీంతో శత్రు దేశాలపై నిఘాతోపాటు స్వీయ నిఘాపైనా మరింత దృష్టిపెట్టాల్సిన ఆవశ్యకతను ఈ ఉదంతం గుర్తుచేస్తోంది. అధునాతన ఆయుధాలకంటే అద్భుతమైన ఆలోచనలే ఆయాదేశాలకు అసలైన అస్త్రాలుగా అక్కరకొస్తాయని స్పైడర్స్‌వెబ్ ఘటన ఉద్ఘాటిస్తోంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

డ్రోన్ వార్‌ఫేర్!

కొత్త రకం యుద్ధం ● భారత్‌కు పెను హెచ్చరిక

డ్రోన్ల రంగప్రవేశంతో యుద్ధాల తీరుతెన్నులే సమూలంగా మారిపోతున్నాయి. యుద్ధ విమానాలు మొదలుకుని చిన్నపాటి ఆయుధాల దాకా అన్నింటికీ డ్రోన్లు అతి సమర్థమైన ప్రత్యామ్నాయాలుగా మారుతున్నాయి. ఈ కొత్త తరం డ్రోన్ వార్‌ఫేర్‌కు ఉక్రెయిన్ చేపట్టిన ఆపరేషన్ స్పైడర్స్ వెబ్ పరాకాష్టగా నిలిచింది. ఇది ప్రపంచ దేశాలకు, ముఖ్యంగా పక్కలో పాక్ వంటి దాయాది ఉన్న భారత్‌కు పెను హెచ్చరిక సంకేతమే. నిఘా నేత్రాలకు చిక్కకుండా డ్రోన్లను కీలక సైనిక స్థావరాల, పౌర వ్యవస్థల సమీపానికి చేర్చగలిగితే చాలు, వాటిపై పెను దాడులకు పాల్పడవచ్చు. ఊహించలేనంత నష్టం కలగజేయవచ్చు. పాక్ ప్రేరేపిత ఉగ్ర ముఠాల స్లీపర్ సెల్స్ దేశమంతటా చొచ్చుకుపోయి మాటేసి ఉన్నాయన్న నిఘా హెచ్చరికల నేపథ్యంలో మనకిది ఆందోళనకర పరిస్థితేనని రక్షణ నిపుణులు అంటున్నారు. అలాంటి దాడులను కాచుకోవడం నిజంగా కత్తిమీద సామేనని అభిప్రాయపడుతున్నారు.

నాలుగేళ్ల క్రితమే: మన సైనిక దళాలను లక్ష్యం చేసుకుని నాలుగేళ్ల క్రితమే డ్రోన్ దాడులకు తెగబడ్డారు. 2021లో జమ్మూలోని వైమానిక స్థావరంపై రెండు డ్రోన్లతో దాడులు చేశారు. వాటి ద్వారా అత్యాధునిక పేలుడు పదార్థాలను (ఐఈడీ) ఎయిర్‌బేస్‌పైకి జారవిడిచారు. అవి అదృష్టవశాత్తూ బహిరంగంగా నిలిపి ఉంచిన యుద్ధవిమానాలు, హెలికాప్టర్లకు, సిబ్బందికి దూరంగా పడి పేలడంతో పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. ఆ ఐఈడీలు పాక్ సైన్యం అందజేసినవేనని దర్యాప్తులో తేలింది. వాటి తయారీలో ఉపయోగించిన ముడి పదార్థాలన్నీ మిలిటరీ గ్రేడ్‌కు చెందినవని నిర్ధారణ అయింది. పాక్ నుంచి మనకు ఎన్నిరకాలుగా పెను ముప్పు పొంచి ఉందో చెప్పేందుకు ఇది ఉదాహరణ మాత్రమే.

అదే పాక్ యుద్ధ తంత్రం!: ప్రత్యక్ష పోరులో పాక్ కనీసం కొద్ది రోజుల పాటు కూడా భారత్ ముందు నిలవలేదని ఆపరేషన్ సిందూర్, అనంతర ఘర్షణలు మరోసారి నిరూపించాయి. కనుక పాక్ తనకు బాగా అలవాటైన సూడో యుద్ధ నీతినే నమ్ముకుంటుందనడంలో సందేహం లేదు. ఉగ్ర ముఠాలకు మనపై దాడులకు ప్రేరేపించి, అందుకు కావాల్సిన సరంజామా అంతా అందించి సాయపడుతుంది. ఈ ముప్పుకు డ్రోన్ల రూపంలో ఇప్పుడు కొత్త కోరలు మొలిచినట్టే. కనుక భారత్ అత్యంత అప్రమత్తతతో మెలగక తప్పదు. అందుకే భారత్ డ్రోన్ దాడులను సమర్థంగా కాచుకుని, పూర్తి స్థాయిలో తిప్పికొట్టే వ్యవస్థలను యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరముంది. భారత్ తన కీలక సైనిక స్థావరాలు, మౌలిక వ్యవస్థల రక్షణను మరింత కట్టుదిట్టం చేసేందుకు సమగ్ర విధానాన్ని రూపొందించుకోవాల్సి ఉంటుందని రక్షణరంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

'సిందూర్'లో డ్రోన్ల హవా

ఆపరేషన్ సిందూర్, తదనంతర ఘర్షణల్లో డ్రోన్లు కీలక పాత్ర పోషించాయి. ఆపరేషన్ తొలి రోజు మే ఏడో తేదీన పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర శిబిరాలు, స్థావరాలను మన సైన్యం నేలమట్టం చేయడం తెలిసిందే.

→ అందుకు ప్రతి చర్యగా పాక్ ప్రధానంగా నమ్ముకున్నది డ్రోన్ దాడులనే. మన సరిహద్దుల పైకి వందలాది డ్రోన్లు ప్రయోగించింది. వాటిలో చాలావరకు మన భూభాగంలోకి ప్రవేశించాయి.

→ ఫలితంగా పాక్‌తో జరిగిన నాలుగు రోజుల ఘర్షణల్లో భారత్ కూడా డ్రోన్లను విస్తృతంగా వినియోగించింది.

→ పాక్ వైమానిక స్థావరాలపై దాడులకు ముందు యుద్ధ విమానాల ముసుగులో డ్రోన్లను పంపి దాయాది కీలక రాడార్ వ్యవస్థలు ఎక్కడెక్కడున్నదీ పక్కాగా పసిగట్టింది. ఆ వెంటనే గుక్కతిప్పుకోనివ్వని క్షిపణి దాడులతో వాటిని ధ్వంసం చేసింది.

→ తర్వాత పాక్‌లోని 11 కీలక వైమానిక స్థావరాలను నేలమట్టం చేసి చావుదెబ్బ తీసింది. రాడార్ వ్యవస్థలను కోల్పోయిన పాక్ నిస్సహాయంగా చూస్తుండటం తప్ప ఏమీ చేయలేకపోయింది. పాక్ ఆర్మీ చీఫ్‌తో పాటు సైనిక ఉన్నతాధికారులు బ్యాంకర్లలో తల దాచుకోవాల్సి వచ్చింది. కేవలం డ్రోన్లను ఎరగా వేసి భారత్ ఇంతటి ఫలితాలు సాధించడం విశేషం.

- సాక్షి, నేషనల్ డెస్క్

అమెరికా.. భయం భయం

విశాల భూభాగం ప్రతికూలంగా మారుతున్న వైనం ● తక్షణం అమెరికా రక్షణాత్మక చర్యలు తీసుకోవాలంటున్న నిపుణులు

వాషింగ్టన్: సముఉజ్జీలుగా మాత్రమేకాదు అమెరికా, రష్యాలకు సువిశాల భూభాగం విషయంలోనూ సారూప్యత ఉంది. రష్యాపై ఉక్రెయిన్ 'స్పైడర్ వెబ్' డ్రోన్ల దాడి తర్వాత అమెరికాకు ఇదే తరహా ముప్పు పొంచి ఉందన్న వార్తలు ఇప్పుడు అమెరికా పౌరుల భయాందోళనలను పెంచేస్తున్నాయి. అమెరికా సొంత భూభాగంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా మిత్ర దేశాల పరిధిలోని అమెరికా నేవీ, వైమానిక స్థావరాలపై డ్రోన్ల మెరుపుదాడి తప్పదని విశ్లేషణలు వెలువడుతున్నాయి. ''తమకు ఇలాంటి ముప్పు లేదని అమెరికా రాజకీయ శ్రేణులు, సైనిక వర్గాలు చెప్పడానికి లేదు. రష్యా మాదిరే అమెరికా సైతం బుల్లి డ్రోన్ల దాడులను ముందే పసిగట్టడం చాలా కష్టం. వైమానిక స్థావరాల్లోని బాంబర్ విమానాలు బాగా బలిసిన బాతుల్లా అక్కడే తిష్టవేస్తాయి. వీటిని సులభంగా డ్రోన్లతో నాశనం చేయొచ్చు'' అని గతంలో యుద్ధక్షేత్రాల నుంచి ప్రత్యక్షంగా రిపోర్టింగ్ చేసిన మాజీ డిఫెన్స్ జర్నలిస్ట్ టైలర్ రోగోవే వ్యాఖ్యానించారు. టైలర్ ప్రస్తుతం 'ది వార్ జోన్' అనే పత్రికకు ఎడిటర్ ఇన్ చీఫ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సైనిక, భద్రతా వ్యవహారాలపైనే ఈ పత్రిక ప్రధానంగా కథనాలు వెలువర్చుతుంది.

చైనాలో 400.. అమెరికాలో 22

అమెరికాలో యుద్ధవిమానాలకు రక్షణ ఏర్పాట్లు ఏపాటివో 'అమెరికా కాంగ్రెషనల్' నివేదికలే స్పష్టంచేస్తున్నాయి. యుద్ధ విమానాల షెల్టర్ల కోసం చైనా ఏకంగా 400 వరకు అత్యంత పటిష్టమైన హ్యాంగర్‌వంటి నిర్మాణాలను పూర్తిచేసింది. కానీ అగ్రరాజ్యంగా చెప్పుకునే అమెరికాలో ఇలాంటివి కేవలం 22 ఉన్నాయి. డ్రోన్లు లోపలిదాకా వచ్చి నేరుగా విమానంపైనా పడకుండా ఇలాంటి నిర్మాణాలు సమర్థవంతంగా అడ్డుకుంటాయి. తైవాన్ విషయంలో చైనాతో అమెరికా గగనతల యుద్ధానికి దిగితే చైనా డ్రోన్ల ఆధిపత్యం తప్పదని ఓ నివేదిక పేర్కొంది. వ్యూహాత్మక, అంతర్జాతీయ అధ్యయనాల కేంద్రం(సీఎస్ ఐఎస్) 2023 నివేదిక ప్రకారం చైనా డ్రోన్లు/ క్షిపణులు అమెరికా విమానాలు గాల్లోకి లేచేలోపే పార్కింగ్ స్థలాల్లోనే నాశనంచేసి అక్కడే సమాధి చేస్తాయని ఆ నివేదిక సారాంశం. ''ఇన్నాళ్లూ అన్ ఐడెంటిఫైడ్ ఫ్లయింగ్ ఆబ్జెక్ట్ (యూఎఫ్ఓ)లుగా పిలుచుకునే వస్తువులు వాస్తవానికి శత్రు నిఘా డ్రోన్లు అయి ఉండొచ్చు. ఇన్నాళ్లూ వాటిని గుర్తు తెలియని ఎగిరే వస్తువులుగా పొరపడ్డారు. దశాబ్దాలుగా ఈ ఎగిరే వస్తువులు చాలా వరకు అమెరికా వ్యూహాత్మక ప్రదేశాలపైనే చక్కర్లు కొట్టడం ఈ వాదనలకు బలం చేకూరుస్తోంది'' అని టైలర్ రోగోవే అన్నారు.

వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు కొత్త పోర్టల్

ఆరు నెలల్లోగా ఆస్తుల నమోదు తప్పనిసరి

సాక్షి, న్యూఢిల్లీ: వక్ఫ్ ఆస్తుల మెరుగైన నిర్వహణ, పారదర్శకతను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త పోర్టల్‌ను తీసుకురానుంది. ఈనెల 6వ తేదీన యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్, ఎంపవర్‌మెంట్, ఎఫిషియెన్సీ అండ్ డెవలప్‌మెంట్(ఉమీద్) పేరుతో పోర్టల్‌ను ప్రారంభించేందుకు రంగం సిద్ధమైంది. వక్ఫ్ (సవరణ) బిల్లు–2025 ప్రకారం కేంద్రం దేశవ్యాప్తంగా ఉన్న వక్ఫ్ ఆస్తుల నమోదు ప్రక్రియ కోసం 'ఉమీద్‌పోర్టల్‌ను తీసుకువస్తోంది. ఏప్రిల్ 5న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నూతన చట్టానికి ఆమోద ముద్ర వేయడం తెల్సిందే. 'ఉమీద్‌పోర్టల్ అందుబాటులోకి వచ్చిన ఆరు నెలల్లోగా దేశ వ్యాప్తంగా ఉన్న వక్ఫ్ ఆస్తుల పూర్తి వివరాల నమోదు తప్పనిసరి. సంబంధిత రాష్ట్ర వక్ఫ్ బోర్డులు ఈ ప్రక్రియను చేపడతాయి. ఏదైనా కారణాలతో రిజిస్ట్రేషన్ ఆగిపోతే అదనంగా 2 నెలల సమయం ఇచ్చే అవకాశం ఉంది. ఏదైనా ఆస్తిని మొత్తానికే రిజిస్టర్ చేయకపోతే వివాదాస్పద ఆస్తిగా పరిగణించి వక్ఫ్ ట్రిబ్యునల్‌కు పంపుతారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

పార్లమెంట్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలి

ప్రధాని మోదీకి 16 విపక్ష పార్టీల లేఖ

సాక్షి, న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రవాద దాడి, పాకిస్తాన్‌పై భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన మధ్యవర్తిత్వ వ్యాఖ్యలు, పాకిస్తాన్ దాడుల్లో సామాన్య పౌరుల మృతి వంటి పరిణామాలపై చర్చించడానికి పార్లమెంట్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ సహా 16 విపక్ష పార్టీలు ప్రధాని నరేంద్ర మోదీకి సంయుక్తంగా లేఖ రాశాయి. విపక్ష నేతలు మంగళవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో సమావేశమయ్యారు.


కుప్పకూలిన నెదర్లాండ్స్ ప్రభుత్వం

ది హేగ్: వలసల విధానాలపై తలెత్తిన విభేదాల నేపథ్యంలో నెదర్లాండ్స్‌లోని సంకీర్ణ ప్రభుత్వం ఏడాది కూడా కాకుండానే మంగళవారం కుప్పకూలింది. ప్రధానమంత్రి డిక్ స్కూఫ్ సారథ్యంలోని ప్రభుత్వం నుంచి తప్పుకుంటున్న కీలకమైన పార్టీ ఫర్ ఫ్రీడమ్(పీవీవీ) సారథి గీర్ట్ వైల్డర్స్ ప్రకటించారు. తమ పార్టీ మంత్రులు సైతం కేబినెట్ నుంచి వైదొలిగారన్నారు. రాజీనామా లేఖలను రాజుకు అందజేస్తామని చెప్పారు. దీంతో, స్కూఫ్, మంత్రివర్గం కూడా రాజీనామాల బాట పట్టింది. అయితే, ఆయన ఆపద్ధర్మ ప్రధానిగా మారారు. ఎన్నికలయ్యేదాకా కొనసాగుతానని చెప్పారు.

సీమాంతర ఉగ్రవాదానికి కొత్త రెడ్‌లైన్

- యుద్ధంలో చిన్నచిన్న తప్పిదాలు ముఖ్యం కాదు
- అంతిమ ఫలితాన్నే పరిగణనలోకి తీసుకోవాలి
- సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ స్పష్టీకరణ

పుణే: వెయ్యిసార్లు గాయపర్చడం ద్వారా భారత్‌ను రక్తసిక్తం చేయాలన్న విధానాన్ని పాకిస్తాన్ అమలు చేస్తోందని ఇండియా చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్(సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ చెప్పారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా సీమాంతర ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కొత్త రెడ్‌లైన్ గీశామని చెప్పారు. మంగళవారం మహారాష్ట్రలోని సావిత్రిబాయి పూలే పుణే యూనివర్సిటీలో 'భవిష్యత్తు యుద్ధాలు, యుద్ధ రీతులు' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. యుద్ధంలో జరిగిన చిన్నచిన్న తప్పిదాల కంటే అంతిమంగా ఏం సాధించామన్నదే చాలా ముఖ్యమని తేల్చిచెప్పారు. తాత్కాలిక నష్టాల కారణంగా సైన్యంపై ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండదని వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో కొన్ని యుద్ధ విమానాలు కోల్పోయామంటూ తాను చేసిన ప్రకటనను కొందరు తప్పుపట్టడాన్ని జనరల్ అనిల్ చౌహాన్ ఖండించారు. మనవైపు జరిగిన నష్టం గురించి మీడియా ప్రతినిధులు అడిగినప్పుడు స్పందించానని చెప్పారు. ఇలాంటి చిన్నపాటి నష్టాలకు ఏమాత్రం ప్రాధాన్యం లేదని, ఫలితాన్నే పరిగణనలోకి తీసుకోవాలని అప్పుడే స్పష్టంచేశానని ఉద్ఘాటించారు. శత్రువు పట్ల మన ప్రతిస్పందన ఎలా ఉందన్నదే కీలకమని వ్యాఖ్యానించారు. జరిగిన నష్టం గురించి, అంకెల గురించి మాట్లాడుకోవడం సరైంది కాదన్నారు. యుద్ధంలో ఎలాంటి నష్టం జరిగినా సైన్యం నైతిక స్థైర్యం కాపాడుకోవాలన్నారు. యుద్ధం, హింస ఉన్నచోట రాజకీయ జోక్యం కూడా ఉంటుందని తెలియజేశారు. ఆపరేషన్ సిందూర్‌లోనూ అదే జరిగిందని చెప్పారు. పహల్గాం ఉగ్రవాద దాడి కంటే కొన్ని వారాల ముందు పాకిస్తాన్ సైన్యాధిపతి జనరల్ ఆసీం మునీర్ భారత్‌కు, హిందువులకు వ్యతిరేకంగా విషం కక్కారని అనిల్ చౌహాన్ గుర్తుచేశారు. భారత్ పట్ల దశాబ్దాలుగా కొనసాగుతున్న పాకిస్తాన్ విద్వేషాన్ని ఆయన మాటలు ప్రతిబింబించాయని తెలిపారు. భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాదాన్ని ఎగదోస్తే ఇకపై తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆపరేషన్ సిందూర్ పాకిస్తాన్‌కు తెలియజెప్పామని పేర్కొన్నారు. ఉగ్రవాద దాడులకు, అణు బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదన్నారు.



అనిల్ చౌహాన్

పాక్‌పై నిర్ణయాత్మక విజయం

48 గంటలపాటు నిర్విరామంగా దాడులు చేసి ఇండియాను ఓడించాలని ప్రణాళిక సిద్ధం చేసిన పాకిస్తాన్ కేవలం 8 గంటల్లోనే చేతులెత్తేసిందని అనిల్ చౌహాన్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత్ దాడులను తట్టుకోలేక పాకిస్తాన్ కాళ్లబేరానికి వచ్చిందని పేర్కొన్నారు. ఆ ఆపరేషన్ ఇంకా కొనసాగితే చావుదెబ్బ తప్పదన్న సంగతికి పాక్‌కు తెలిసిపోయిందని వెల్లడించారు. కాల్పుల విరమణ, చర్చల ప్రతిపాదన తొలుత పాకిస్తాన్ నుంచే వచ్చిందని స్పష్టంచేశారు. ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్తాన్‌పై నిర్ణయాత్మక విజయం సాధించామని మరోసారి తేల్చిచెప్పారు. పాకిస్తాన్‌కు 'ఇన్నింగ్స్ డిఫీట్' మిగిలిందని అన్నారు. ఈ ఆపరేషన్ ఇంకా ముగిసిపోలేదని, పాకిస్తాన్‌తో ఘర్షణ తాత్కాలికంగా ఆగిపోయిందని తెలిపారు.

ఆగస్ట్ 3న పరీక్షకు అనుమతించండి


నీట్–పీజీ నిర్వహణ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఎన్‌బీఈ

న్యూఢిల్లీ: నీట్–పీజీ,2025 పరీక్షను గతంలో షెడ్యూల్‌చేసిన జూన్ 15వ తేదీకి బదులు ఆగస్టు మూడో తేదీన ఒకే షిఫ్ట్‌లో నిర్వహించేందుకు అనుమతించాలని సుప్రీంకోర్టును నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్(ఎన్‌బీఈ) కోరింది. దేశ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యకళాశాలల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నీట్–పీజీ, 2025ను జూన్ 15న రెండు షిఫ్ట్‌లలో నిర్వహించాలని గతంలో నిర్ణయించడం తెల్సిందే. అయితే రెండు షిఫ్టులకు బదులు ఒకే షిఫ్ట్‌లో అదే తేదీన పరీక్షను నిర్వహించాలని సుప్రీంకోర్టు మే 30నాటి తీర్పు చెప్పింది. దీంతో తీర్పుకు అనుగుణంగా నడుచుకోవాలని ఎన్‌బీఈ భావించింది. '' జూన్ 15న 2 షిఫ్ట్‌లకు బదులు ఒకే షిఫ్ట్‌లో పరీక్ష నిర్వహణ సాధ్యాసాధ్యాలపై మా పరీక్ష టెక్నాలజీ భాగస్వామి టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌ను మే 30న సంప్రతించాం. జూన్ 15న ఒకే షిఫ్ట్‌లో లక్షలాది మంది అభ్యర్థుల కోసం వేలాది ఎగ్జామ్ సెంటర్లను అందుబాటులోకి తేవడం అసాధ్యమని టీసీఎస్ తెలిపింది. చివరకు అదనపు మౌలిక సదుపాయాలతో ఆగస్ట్ మూడో తేదీన పరీక్ష సాధ్యమని టీసీఎస్ పేర్కొంది. దీంతో ఈ తేదీని మేం ఖాయం చేసుకున్నాం'' అని కోర్టుకు ఎన్‌బీఈ తెలిపింది.

అన్నార్థులపై మళ్లీ పేలిన తూటా

గాజాలో మరో 27 మంది మృతి

రఫా: గాజాలోని పాలస్తీనియన్ల పట్ల ఇజ్రాయెల్ మరోసారి పాశవికంగా వ్యవహరించింది. ఆహార పంపిణీ కేంద్రం వద్దకు వెళ్తున్న వారే లక్ష్యంగా జరిపిన కాల్పుల్లో 27 మంది మృత్యువాతపడ్డారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు, ఇద్దరు మహిళలు ఉన్నారు. ఇది మూడు రోజుల్లో జరిగిన మూడో కాల్పుల ఘటన కావడం గమనార్హం. మంగళవారం ఉదయం జరిగిన కాల్పుల్లో కనీసం 184 మంది గాయపడినట్లు రెడ్ క్రాస్ తెలిపింది. ఐరాస మానవ హక్కుల విభాగం కూడా ధ్రువీకరించింది. మృతదేహాలను ఖాన్‌యూనిస్‌లోని నాస్సెర్ ఆస్పత్రికి తరలించారు. బుల్లెట్లు తగిలిన క్షతగాత్రులను అంబులెన్సుల్లో వేరే ఆస్పత్రులకు తరలిస్తుండగా చూశామని, కొందరు ఉత్త చేతులతోనే వెనుదిరిగి వస్తుండగా, నేలపై పడిన ఖాళీ పిండి సంచులు రక్తపు మరకలతో తడిచిపోయాయని అసోసియేటెడ్ ప్రెస్ రిపోర్టర్ ఆహార పంపిణీ కేంద్రం వద్ద దారుణ పరిస్థితిని వివరించారు. కాగా, పంపిణీ కేంద్రం వద్ద నిర్దేశించిన బాటను వదలి తమ బలగాల దిశగా వస్తున్న అనుమానితులనే కాల్చామని, హెచ్చరిక కాల్పులను సైతం వీరు లెక్కచేయలేదని ఇజ్రాయెల్ ఆర్మీ అంటోంది. గాజాలో ఇజ్రాయెల్ ఏర్పాటు చేసిన మిలటరీ జోన్లలో అమెరికాకు చెందిన ఫౌండేషన్ ఆహార పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటి నుంచి కాల్పుల ఘటనలు కొనసాగుతున్నాయి. హమాస్ శ్రేణులకు ఆహార పదార్థాలు అందకుండా చేయాలన్నదే తమ లక్ష్యమని ఇజ్రాయెల్ అంటుండగా..ఆకలిని ఆయుధంగా చేసుకోవడం తగదని ఐరాస అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఇప్పుడు ఏర్పాటు చేసిన ఆహార పంపిణీ కేంద్రాలు ఆకలిని ఏమాత్రం తీర్చలేవని అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. ఆది, సోమవారాల్లో ఆహార పంపిణీ కేంద్రాల వద్దకు వచ్చిన వారిపై ఆర్మీ జరిపిన కాల్పుల్లో 34 మంది ప్రాణాలు విడిచారు. ఆహార పంపిణీ బాధ్యతలు చేపట్టిన గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్ మాత్రం తమ కేంద్రాల వద్ద గానీ, చుట్టుపక్కల గానీ ఎటువంటి హింసాత్మక ఘటనలు జరగలేదని చెబుతోంది. మంగళవారం 21 ట్రక్కుల ఆహారాన్ని పంపిణీ చేశామని తెలిపింది. కాల్పుల ఘటనలన్నీ రఫాలో ఇజ్రాయెల్ మిలటరీ జోన్లలోని పంపిణీ కేంద్రాల వద్దే చోటుచేసుకున్నాయి. ఇక్కడికి మీడియాను ఆర్మీ చాలా పరిమితంగా అనుమతిస్తోంది. గతంలో గాజాలోని సుమారు 20 లక్షల మందికి నిత్యం 600 ట్రక్కుల్లో ఆహార పదార్థాలు అందేవి. వీరందరికీ ఈ ఆహారమే ఆధారం. ఇజ్రాయెల్ ఆర్మీ నెలలపాటు కొనసాగించిన దిగ్బంధనం కారణంగా ఆహార నిల్వలు పూర్తి స్థాయిలో అడుగంటాయి.



ద.కొరియా అధ్యక్షుడిగా లీ జే మ్యుంగ్

సియోల్: దక్షిణ కొరియాలో కొద్దినెలలుగా నెలకొన్న రాజకీయ సంక్షోభానికి తెరపడింది. మంగళవారం నిర్వహించిన అధ్యక్ష ఎన్నికల్లో విపక్ష డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ కొరియా పార్టీకి చెందిన లీ జే మ్యుంగ్ విజయం సాధించారు. అధికార పార్టీ నేత, పీపుల్ పవర్ పార్టీ అభ్యర్థి కిమ్ మూన్ సూ ఓడిపోయారు. గత డిసెంబర్‌లో దేశవ్యాప్తంగా అత్యయిక స్థితి(మార్షల్ లా) విధించి పరువుతో పాటు అంతిమంగా పదవి సైతం కోల్పోయిన పదవీచ్యుత యూన్ సుక్ యెల్ స్థానంలో ఓటర్లు తమ నూతన దేశాధ్యక్షుడిగా మ్యుంగ్‌ను ఎన్నుకున్నారు. అయితే చిరకాల మిత్రదేశాలు అమెరికా, జపాన్‌లకు బదులుగా చైనా, ఉత్తరకొరియాలకు అనుకూలంగా మాట్లాడతారనే అపవాదు మ్యుంగ్‌కు ఉంది.

మీరేమైనా చరిత్రకారులా?

- కమల్ హాసన్‌పై కర్ణాటక హైకోర్టు ఆగ్రహం
- వివాదాస్పద వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పేది లేదు
- కర్ణాటకలో 'థగ్ లైఫ్' రిలీజ్ ఆపేస్తామన్న నటుడు

బెంగళూరు: బహుభాషా నటుడు కమల్ హాసన్‌పై కర్ణాటక హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కన్నడ భాషకు మూలాలు తమిళంలోనే ఉన్నాయంటూ చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పేందుకు కమల్ నిరాకరించడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. 'ఇటువంటి వ్యాఖ్యలు చేయడానికి మీరేమైనా చరిత్రకారులా, భాషా శాస్త్రవేత్తనా? ఏ ఒక్క భాష వేరొక భాష నుంచి ఉద్భవించదు. ఒకే ఒక్క క్షమాపణతో సద్దుమణిగే వివాదమిది..'అంటూ జస్టిస్ నాగ ప్రసన్న పేర్కొన్నారు. ఏ ఒక్క పౌరుడికీ ఇతరుల మనోభావాలను దెబ్బతీసే హక్కు లేదు. మాటమాత్రంగా క్షమాపణ కూడా చెప్పలేరా అంటూ వ్యాఖ్యానించారు. కమల్ వ్యాఖ్యల కారణంగా రాష్ట్రంలో అశాంతి నెలకొంది. కన్నడ ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలి'అని న్యాయమూర్తి అన్నారు. కమల్ క్షమాపణ చెప్పేదాకా రాష్ట్రంలో థగ్ లైఫ్ సినిమాను ప్రదర్శించనీయబోమంటూ కేఎఫ్‌సీసీ ప్రకటించిన నేపథ్యంలో సినిమాను ప్రదర్శించే థియేటర్ల వద్ద తగు భద్రత కల్పించాలంటూ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషన్ వేసిన పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ నాగప్రసన్న సారథ్యంలోని ధర్మాసనం విచారణ జరిపింది. అయితే, కన్నడ మూలాలు తమిళంలోనే ఉన్నాయంటూ చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పబోనని నటుడు కమల్ హాసన్ స్పష్టం చేశారు. కన్నడ పట్ల తనకు ఎలాంటి దురుద్దేశాలు లేవని ఆయన కర్ణాటక హైకోర్టుకు తెలిపారు. కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్(కేఎఫ్‌సీసీ)తో ఒక అంగీకారం కుదిరేదాకా 'థగ్ లైఫ్'విడుదలను రాష్ట్రంలో నిలిపివేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కేఎఫ్‌సీసీకి కమల్ పంపిన లేఖను సీనియర్ న్యాయవాది ధ్యాన్ చిన్నప్ప కోర్టులో చదివి వినిపించారు. అందులో కమల్ తన వ్యాఖ్యలకు వివరణ మాత్రమే ఇచ్చారు. క్షమాపణ మాత్రం చెప్పలేదని జస్టిస్ నాగ ప్రసన్న పేర్కొన్నారు. సారీ చెప్పడం గౌరవప్రదమైన విషయమన్నారు. భాషలు చాలా ఉండవచ్చు, కానీ దేశం ఒక్కటే ఈ విషయంలో విభజన ఉండరాదని న్యాయమూర్తి చెప్పారు.

సాక్షి హైదరాబాద్

బుధవారం । 4 । జూన్ । 2025



డీపీతో టోపీ!

సైబర్ నేరగాళ్లు సరికొత్త పంథాలో డబ్బులు స్వాహా చేస్తున్నారు. మొదట డబ్బు పంపినట్లు నమ్మించి, నకిలీ రసీదులు పంపి, ఆపై అందినకాడికి దండుకుంటున్నారు. -8లో



అవసరమా.. ఆకర్షణీయమా?

ప్రస్తుతం మార్కెట్లో రకరకాల వాటర్ బాటిళ్లు లభిస్తున్నాయి. ఆకర్షణీయమైన ప్లాస్టిక్ బాటిళ్లతో అనారోగ్య, పర్యావరణ సమస్యలు వెంటాడుతున్నాయి. - సిటీప్లస్‌లో



వాతావరణం

నగరంలో బుధవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 33, కనిష్ఠంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.



జేఎన్టీయూ స్నాతకోత్సవంలో విద్యార్థినికి గోల్డ్ మెడల్ అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

స్నాతకోత్సాహం

జేఎన్టీయూలో అలరించిన వేడుకలు

కేపీహెచ్‌బీకాలనీ: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్టీయూ) 13వ స్నాతకోత్సవం మంగళవారం ఆద్యంతం ఉత్సాహంగా కొనసాగింది. యూనివర్సిటీ చాన్స్‌లర్ హోదాలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు వీసీ కిషన్ కుమార్ రెడ్డి, రెక్టార్ విజయ్‌కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు ఘన స్వాగతం పలికారు. గతానికి భిన్నంగా స్నాతకోత్సవ కార్యక్రమంలో యూనివర్సిటీ అధికారులు సంప్రదాయ వస్త్రధారణతో అలరించారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థుల కేరింతలు, అభినందనలు తెలిపేందుకు వచ్చిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ఆనందోత్సాహాల నడుమ స్నాతకోత్సవం పండగ వాతావరణాన్ని తలపించింది.

విజ్ఞానాన్ని సమాజానికి అందించాలి: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

విజ్ఞానాన్ని సంపాదించడమే కాదు దాన్ని సమాజానికి ఉపయోగపడే విధంగా వినియోగించడమే నిజమైన విద్య అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. జేఎన్టీయూ స్నాతకోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.. విద్యార్థుల విజయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని కొనియాడారు. విద్యార్థులు సృజనాత్మకత, నైతిక విలువలతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం వివిధ విభాగాల్లో బంగారు పతకాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రదానం చేశారు.

ఎంతో ఆనందంగా ఉంది..



గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. 5 గోల్డ్ మెడల్స్ రావటంతో ఆనందంగా ఉంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతోనే ఇది సాధ్యమైంది.
–నవ్యశ్రీ, ఈసీఈ విభాగం

నా కల సాకారమైంది



సివిల్ ఇంజినీరింగ్‌లో 3 గోల్డ్ మెడల్స్ వచ్చాయి. మా నాన్న ఉపాధ్యాయుడు. ఎంతోమంది విద్యార్థులకు చదువు గొప్పతనం గురించి చెబుతుంటారు. నా తల్లిదండ్రుల కృషి చాలా ఉంది.
– పి.సుప్రియ, సివిల్ ఇంజినీరింగ్



నా 'బంగారమే': కుమార్తెను ముద్దాడుతున్న ఓ తల్లి

వాక్‌వే పనులను వేగవంతం చేయాలి

జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్



కేబీఆర్ పార్క్ జీహెచ్‌ఎంసీ వాక్‌వేలో పర్యటిస్తున్న కమిషనర్ కర్ణన్

బంజారాహిల్స్: కేబీఆర్ పార్క్‌లో వాక్‌వే పనులను వేగవంతం చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కేబీఆర్ పార్క్ వాక్‌వే పనులను పరిశీలించారు. లైసెన్స్ తీసుకున్న పెట్ డాగ్స్‌ను మాత్రమే పార్క్‌లోకి తీసుకురావాలని కమిషనర్ ఆదేశించారు. కేబీఆర్ పార్క్ చుట్టూ హెచ్ సిటీ ద్వారా చేపట్టే ఫ్లైవర్లు, అండర్ పాసులు కోర్టు ఆదేశాల మేరకు నిర్మిస్తున్నారా? అంటూ ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులను వివరణ అడిగారు. సెన్సిటివ్ జోన్ పరిధిలోనే పనులు చేపట్టినట్లు ప్రాజెక్టు ఇంజినీర్లు కమిషనర్‌కు వివరించారు. ఆయన వెంట అడిషనల్ కమిషనర్ సుభద్రా దేవి, డీసీ సమ్మయ్య, ప్రాజెక్టు ఎస్ఈ శ్రీలక్ష్మి, ఈఈ నాయక్, డిప్యూటీ ఈఈ హరీష్, సర్కిల్ ఈఈ విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లాలాగూడ లోకో మోటివ్‌కు ప్రథమ బహుమతి



సాక్షి, సిటీబ్యూరో: వారణాసిలోని బనారస్ లోకోమోటివ్ వర్క్స్ (బీఎల్‌డబ్ల్యూ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌ల 'అందాల పోటీ'ల్లో దక్షిణమధ్య రైల్వే లాలాగూడ ఎలక్ట్రిక్ లోకో షెడ్‌కు చెందిన లోకోమోటివ్ (నంబర్ 37364)కు మొదటి బహుమతి లభించింది. ఈ బహుమతిని దక్షిణ రైల్వేలోని రాయపురం ఎలక్ట్రిక్ లోకో షెడ్‌తో సంయుక్తంగా పంచుకుంది. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్, లాలాగూడ ఎలక్ట్రిక్ లోకోషెడ్ బృందాన్ని అభినందించారు. భారతీయ రైల్వేల ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌ల అందాల పోటీగా పేరొందిన క్యాబ్ అప్‌గ్రేడేషన్ పోటీని రైల్వే బోర్డు మే 23, 24 తేదీల్లో వారణాసిలో 42వ ఎలక్ట్రిక్ లోకో మెయింటెనెన్స్ స్టడీ గ్రూప్ (ఎం.ఎస్.జి) సమావేశంలో నిర్వహించింది. ఈ ప్రతిష్టాత్మక లోకో పోటీలో 16 జోనల్ రైల్వేలు, మూడు ఉత్పత్తి యూనిట్లు పాల్గొన్నాయి. శుభ్రత, పెయింట్ వర్క్, వాస్తవికత, ప్రదర్శన వంటి అంశాలను ప్రామాణికంగా తీసుకొని ఎంపిక చేశారు.



రెడీ!

నేడు బల్దియా సర్వసభ్య సమావేశం

- నగరంలో ముసురుకున్న సమస్యలు
- నిలదీసేందుకు సిద్ధమైన ప్రతిపక్షాలు



ఏం జరిగేనో.. ఎలా ముగిసేనో?

సాక్షి, సిటీబ్యూరో:

జీహెచ్‌ఎంసీ పాలకమండలి సర్వసభ్య సమావేశానికి అటు రాజకీయ పార్టీలు, ఇటు అధికారులు రెడీ అయ్యారు. జీహెచ్‌ఎంసీలో ఎప్పుడు సర్వసభ్య సమావేశం జరిగినా రసాభాస, గందరగోళాలు షరామామూలుగా మారాయి. ఈ నేపథ్యంలో బుధవారం జరగనున్న సమావేశం కూడా అదే మాదిరిగా జరుగుతుందో, అందుకు భిన్నంగా సవ్యంగా సాగుతుందో చూడాల్సిందే. మొక్కుబడి తంతు, లక్షల ఖర్చుతో ప్రజాధనం దుబారా తప్ప ప్రజల సమస్యలు పరిష్కారం కావనే అభిప్రాయాలున్నాయి. చివరిసారిగా గత జనవరి 30న జరిగిన సమావేశంలో జీహెచ్‌ఎంసీ చరిత్రలోనే ఎప్పుడూలేని విధంగా బీఆర్ఎస్ కార్పొరేటర్లను మార్షల్స్‌తో బయటికి పంపించడాన్ని వారు ఇంకా మరిచిపోలేదు. ఈ నేపథ్యంలో వారు నేటి సమావేశంలో తమ సత్తా చూపే అవకాశం ఉంది.

నిర్వహణపై ఆరోపణలు..

సమావేశం నిర్వహణపై బీజేపీ కార్పొరేటర్లు బహిరంగంగానే విమర్శించడంతో నేటి సమావేశం మరింత ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. మేయర్.. తాను ఎంపిక చేసిన కొందరికే సభలో మాట్లాడే అవకాశం కల్పిస్తూ, మిగతా వారికి అవకాశం ఇవ్వడం లేదని ఆరోపించారు. అంతేకాదు.. మాట వినని అధికారులపై ఒత్తిడి పెంచేందుకే కొన్ని ప్రశ్నల్ని ఎంపిక చేస్తున్నారని కూడా తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో మేయర్ అన్ని పార్టీల వారికీ సమాన అవకాశం కల్పిస్తారా? లేక కొందరికే ప్రాధాన్యమిస్తారా? అనేది చర్చనీయాంశంగా మారింది. జీహెచ్‌ఎంసీ పాలకమండలి గడువు కూడా ఎక్కువ కాలం లేకపోవడంతో పార్టీలకతీతంగా కార్పొరేటర్లు తమ వార్డుల్లో ఎక్కువ పనులు జరగాలని కోరుకుంటున్నారు. తమ వార్డుల్లోని సమస్యలను పరిష్కరించాలంటూ తమ వాణి బలంగా వినిపించడం ద్వారా స్థానిక ప్రజల దృష్టిలో పడాలని భావిస్తున్న కార్పొరేటర్లు ఎక్కువ మంది ఉన్నారు. దీంతో స్థానిక సమస్యల్ని ప్రస్తావించేందుకు తమకు అవకాశం ఇవ్వాలని పోటీపడే పరిస్థితి కనిపిస్తోంది.

సమస్యలు ఎన్నెన్నో..

గత కమిషనర్ ఇలంబర్తి హయాంలో ఒకే సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రస్తుత కమిషనర్ కర్ణన్‌కు ఇది తొలి సర్వసభ్య సమావేశం. నగరంలోని పలు ప్రాంతాలు వివిధ సమస్యలతో సతమతమవుతున్నాయి. ముఖ్యంగా వీధిదీపాల సమస్య ఎక్కువగా ఉంది. గతంలో వీధిదీపాల నిర్వహణ పనులు చేసిన ఈఈఎస్ఎల్(ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్) గడువు ముగిసిపోవడంతో కొత్త ఏజెన్సీ ఎంపికకు టెండర్లు పూర్తి కావాల్సి ఉంది. పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఆశించిన ఫలితాలు కనిపించడం లేదు.

- వర్షాలొస్తున్నా ఇంకా పూడికతీత వంటి పనులు పూర్తి కాలేదు. వర్షాకాలంలో తక్షణం విధుల్లో ఉండాల్సిన మాన్సూన్ టీమ్స్ ఎంపిక టెండర్ల దశలోనే ఉంది. ఈ టీమ్స్‌తో పాటు ఉండాల్సిన వాహనాల టెండర్లకు సంబంధించి కొందరికి ప్రయోజనం కలిగేలా అధికారులు వ్యవహరిస్తున్నారంటూ సీఎం రేవంత్‌రెడ్డికి 'జాగృతి' అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత రాసిన బహిరంగలేఖ విస్తృతంగా ప్రచారమైంది.
- వివిధ అవసరాల కోసం చాలా ప్రాంతాల్లో రోడ్లు తవ్వి వదిలేశారు. పనులు పూర్తయిన చోట సైతం తిరిగి పూడ్చలేదు. దాంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. బర్త్ సర్టిఫికెట్ల జారీలో ఆస్పత్రులు, ఇంజినీరింగ్ పనుల్లో కాంట్రాక్టర్లతో మిలాఖతై బల్దియా ఇంజినీర్లు అవకతవకలకు పాల్పడుతుండటం వెల్లడైంది. హోటళ్లలో నాణ్యత లేని ఆహారంపై ప్రస్తుతం తనిఖీలు కూడా జరగడం లేదు. అక్రమ నిర్మాణాలు, దోమల బెడద తదితర సమస్యలు సరేసరి.ఈ నేపథ్యంలో ఎవరే సమస్యలు ప్రస్తావిస్తారో, ఎందుకోసం ఎక్కువ పట్టుబడతారో వేచి చూడాల్సిందే!

ఔటర్.. ఔరా!

- ఐటీ, పరిశ్రమలకు స్థలాల కేటాయింపునకు కసరత్తు
- సెజ్ తరహాలో ఏర్పాటు చేయాలని నిర్ణయం
- కంపెనీలు, నివాసాలు ఒకేచోట ఉండేలా ప్రణాళికలు



ఓఆర్ఆర్ చుట్టూ అభివృద్ధికి సర్కారు అడుగులు

సాక్షి, సిటీబ్యూరో: భాగ్యనగరానికి మణిహారమైన ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)ను ఉద్యోగ, ఉపాధి అవకాశాల కేంద్రంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా కేంద్రాలతో అనుసంధానంగా ఉంటూ ఇతర నగరాలకు వెళ్లేందుకు అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలతో నిర్మితమైన ఔటర్ చుట్టూ ఐటీ, పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం శరవేగంగా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. హైదరాబాద్ చుట్టూ 158 కిలో మీటర్ల పొడవైన ఈ రహదారి ప్రాంతాలలో సెజ్ తరహాలో కంపెనీలకు స్థలాలను కేటాయించాలని నిర్ణయించారు. ఇదే సమయంలో సంస్థలకు చేరువలో నివాసాలు ఉండేలా కసరత్తు చేస్తున్నారు. దీంతో నగరాభివృద్ధి విస్తరించడంతో పాటు వాక్ టు వర్క్ విధానంలో ఆయా ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందుతాయి.

కనిష్ఠంగా వెయ్యి ఎకరాలు..

ఔటర్ చుట్టూ పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వ భూములను సేకరించేందుకు రెవెన్యూ అధికారులు కసరత్తు చేస్తున్నారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఔటర్‌కు సమీపంలోని కొన్ని ప్రాంతాలు, విమానాశ్రయానికి దగ్గరగా ఉండే మరికొన్ని ప్రాంతాలను ఇప్పటికే పరిశీలించారు. శేరిలింగంపల్లి, మహేశ్వరం, చేవెళ్ల, ఇబ్రహీంపట్నం మండలాల పరిధిలో ఒక్కోచోట వెయ్యి ఎకరాలకు తక్కువ కాకుండా భూములను సేకరించాలన్న అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. మరోవైపు గతంలో ఏవైనా సంస్థలకు స్థలాలు ఇచ్చి అవి ఇంకా కార్యకలాపాలు ప్రారంభించకపోతే వాటిని వెనక్కి తీసుకునే మార్గాలను కూడా అధికారులు అన్వేషిస్తున్నారు. ఇందుకు అవసరమైన విధివిధానాలను రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు.

వాక్ టు వర్క్ తరహాలో..

ఔటర్ చుట్టూ రానున్న పరిశ్రమలు వాక్ టు వర్క్ విధానంలో ఉండాలని ప్రభుత్వ పెద్దలు నిర్ణయించారు. కంపెనీలకు చేరువలోనే నివాసాలు ఉండేలా ప్రణాళికలు చేస్తున్నారు. స్పెషల్ ఎకనామిక్ జోన్ (సెజ్) తరహాలో ఒకేచోట 300 ఎకరాల భూములు సేకరించాలని, పరిశ్రమలు, ఐటీ సంస్థలకు సమీపంలో ప్రభుత్వ స్థలాలను అభివృద్ధి చేస్తే అక్కడ నివాసం ఉండేందుకు వీలుంటుందని రెవెన్యూ అధికారుల భావిస్తున్నారు. ఇందుకోసం 300 గజాల చొప్పున ప్లాట్లుగా విభజించాలని నిర్ణయించారు. రోడ్లు, తాగునీరు, మురుగు నీటి వ్యవస్థలను అందుబాటులో ఉండేలా ప్రణాళికలు చేస్తున్నారు.

అభివృద్ధి విస్తరణ..

ఇప్పటికే ఫాక్స్‌కాన్ సంస్థ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సమీపంలో యాపిల్ ఫోన్ విడిభాగాల తయారీ ప్లాంట్‌కు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. దీంతో పాటు మహేశ్వరం మండలం తుక్కుగూడలో ఎలక్ట్రానిక్ సిటీ బాగా ప్రాచుర్యం పొందింది. ఈ రెండు పరిశ్రమలతో పాటు షాబాద్ మండలంలో విద్యుత్ బస్సుల తయారీ, టెక్స్‌టైల్స్ పరిశ్రమలు ఇప్పటికే తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. కొత్తగా ఏర్పాటు చేయనున్న ఐటీ, పరిశ్రమల హబ్‌లలో పరిశ్రమలు, ఐటీ సంస్థలతో పాటు వాటికి సమీపంలో విద్యా సంస్థలు, వినోద కార్యకలాపాలు నిర్వహించే సంస్థలు, రెస్టారెంట్లను ప్రారంభిస్తే అభివృద్ధి మరింత విస్తరించే అవకాశముంది.

వైద్యశాఖకు ▸

'గోషామహల్ స్టేడియం'



అశ్విక దళం షెడ్‌ను ప్రారంభిస్తున్న సీపీ

ఉస్మా'నయా' ఆస్పత్రి కోసం 31 ఎకరాల 39 గుంటలు

- అప్పగించిన పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్
- మిగతా 11 ఎకరాల 38 గుంటల్లో పోలీసు నిర్మాణాలు
- స్వాధీనం చేసుకున్న వాహనాలకు ప్రత్యేక భవనం
- వివరాలు వెల్లడించిన సిటీ కొత్వాల్

సాక్షి, సిటీబ్యూరో: అఫ్జల్‌గంజ్‌లోని ఉస్మానియా ఆస్పత్రిని గోషామహల్‌లో శివకుమార్ లాల్ పోలీసు స్టేడియం ప్రాంతానికి తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన కసరత్తు సైతం ప్రారంభమైంది. మొత్తం 43 ఎకరాల 37 గంటల ఈ స్టేడియం స్థలం నుంచి 31 ఎకరాల 39 గుంటలు ఆస్పత్రికి, 11 ఎకరాల 38 గుంటలు పోలీసు అవసరాలకు కేటాయించారు. కొత్త ఉస్మానియా ఆస్పత్రికి కేటాయించిన స్థలాన్ని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ మంగళవారం వైద్యశాఖకు అప్పగించారు. మిలిగిన స్థలంలో పోలీసు నిర్మాణాలను త్వరలో ప్రారంభించనున్నారు.

అదనంగా మరో రెండు ఎకరాలు..

ప్రస్తుతం గోషామహల్‌లోని పోలీసుస్టేడియం ప్రాంగణంలో ఓ పక్క స్టేడియం, సిటీ సెక్యూరిటీ వింగ్ కార్యాలయం, డాగ్ స్క్వాడ్, అశ్విక దళంతో పాటు శిథిలమైన కొన్ని పోలీసు క్వార్టర్స్ కూడా ఉన్నాయి. వీటికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో అమరుల స్తూపం ఉండగా దాన్నే పోలీసు అధికారులు గ్రౌండ్‌గా వినియోగిస్తున్నారు. ఈ స్తూపానికి ఏమాత్రం నష్టం వాటిల్లకుండా, సముచిత ప్రాధాన్యం ఇస్తూ స్టేడియంతో పాటు ఇతర నిర్మాణాలు చేపట్టనున్నారు. దీనికోసం సర్కారు రూ.55 కోట్లు మంజూరు చేసింది. అశ్వికదళం కోసం తాత్కాలికంగా నిర్మించిన 24 షెడ్లను ఆనంద్ మంగళవారం ప్రారంభించారు. తాత్కాలిక ప్రాతిపదికన డాగ్ స్క్వాడ్‌ను బేగంపేటలోని పోలీసు క్వార్టర్స్‌లోకి పంపారు. ఈ స్థలానికి అదనంగా ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) వద్ద మరో రెండు ఎకరాలు నగర పోలీసు విభాగానికి కేటాయించింది. ఇక్కడ కెన్నెల్ వింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

ఆ వాహనాలు శిథిలం కాకుండా..

నగరంలోని ఏడు జోన్లకు సంబంధించిన పోలీసులు వివిధ సందర్భాల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను ప్రస్తుతం ఈ స్టేడియంలోనే ఉంచుతున్నారు. వీటికి ఎలాంటి రక్షణ లేకపోవడంతో ఎండకు ఎండి, వానకు తడిసి శిథిలం అవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే కొత్త నిర్మాణాల్లో భాగంగా ఈ వాహనాల కోసం ఐదు అంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. పక్కనే మరో నాలుగు అంతస్తుల్లో సీఎస్‌డబ్ల్యూ, సీటీసీలతో పాటు ట్రైనింగ్ సెంటర్ నిర్మిస్తారు. మిగిలిన ప్రాంతంలో స్టేడియం, గ్రౌండ్స్ ఉండనున్నాయి. ఉస్మానియా ఆస్పత్రి కోసం ప్రభుత్వం గోషామహల్ స్టేడియం ప్రాంగణం నుంచి 25 ఎకరాలు తీసుకుంటున్న నేపథ్యంలో.. దీనికి ప్రతిగా ఆరాంఘర్ ప్రాంతంలో 12 ఎకరాలను పోలీసు విభాగానికి కేటాయించింది. ఈ స్థలంలో రాష్ట్ర స్థాయి బ్యారెక్స్, ప్లేగ్రౌండ్, డ్రిల్ ఏరియా నిర్మించాలని డీజీపీ కార్యాలయం నిర్ణయించింది.

రహదారులు సైతం విస్తరణకు ప్రతిపాదనలు..

ఎన్నికలతో పాటు బోనాలు, గణేష్ ఉత్సవాలతో పాటు ఇతర కీలక బందోబస్తుల కోసం ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి వచ్చే బలగాల కోసం ఈ బ్యారెక్స్ వినియోగించనున్నారు. అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించనున్న వీటిలో ఉన్నతాధికారుల కోసమూ కొన్నింటిని కేటాయించనున్నారు. గోషామహల్ స్టేడియం ప్రాంతంలో ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్న నేపథ్యంలో ఆ చుట్టు పక్కల ఉన్న రహదారులపైనా ప్రభుత్వ విభాగాలు దృష్టి పెట్టాయి. ప్రస్తుతం అది వాణిజ్య ప్రాంతం కావడంతో పాటు రోడ్లన్నీ ఇరుకుగా ఉంటాయి. ఆస్పత్రి నిర్మాణం ప్రారంభంతోనే ఈ రోడ్ల విస్తరణకూ చర్యలు చేపట్టనున్నారు. ఆస్పత్రి చుట్టూ 30, 60, 100 అడుగుల వెడల్పుతో రోడ్లు నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. దీనికోసం ఇప్పటికే అధికారులు సర్వే సైతం ప్రారంభించినట్లు తెలిసింది. ప్రస్తుతం ఉన్న రోడ్ల స్థితిగతులు, కొత్త వాటి కోసం సేకరించాల్సిన ఆస్తులు, కూల్చివేతలపై లోతుగా అధ్యయనం చేస్తున్నారని సమాచారం.



చేపట్టబోయే పోలీసు నిర్మాణాలపై వివరిస్తూ..

మహా దారిలో..

ఔటర్ నుంచి ట్రిపుల్ ఆర్ వరకు గ్రీన్‌ఫీల్డ్ రోడ్లు



- జాతీయ, రాష్ట్ర రహదారులతో అనుసంధానం
- మొదటి దశలో 10 రహదారులకు హెచ్‌ఎండీఏ ప్రణాళికలు

సాక్షి, సిటీబ్యూరో: ఔటర్‌రింగ్ రోడ్డు నుంచి కొత్తగా నిర్మించనున్న రీజినల్ రింగ్‌రోడ్డు వరకు గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్ల పనులకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) సన్నాహాలు చేపట్టింది. రావిర్యాల నుంచి ఆమన్‌గల్ మార్గంలో నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ తరహాలోనే మరో 10 ప్రాంతాల్లో రహదారుల విస్తరణకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఔటర్ నుంచి రీజినల్ రింగ్‌రోడ్డుకు జాతీయ, రాష్ట్ర రహదారులను అనుసంధానం చేస్తూ వీటిని నిర్మించనున్నారు. ఓఆర్ఆర్ నుంచి ట్రిపుల్ ఆర్ వరకు ప్రజలు సాఫీగా రాకపోకలు సాగించేందుకు అనుగుణంగా విశాలమైన రహదారులు అందుబాటులో ఉంటాయని హెచ్‌ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. ఉత్తర, దక్షిణ భాగాలుగా రెండు దశల్లో నిర్మించనున్న సుమారు 350 కిలోమీటర్ల మేర అనుసంధానం చేసే విధంగా గ్రీన్‌ఫీల్డ్ రోడ్లను దశలవారీగా నిర్మించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఇరువైపులా టౌన్‌షిప్‌లు

ఔటర్ నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వరకు ఆధునిక సదుపాయాలతో టౌన్‌షిప్‌లు నిర్మించనున్నారు. ఇందుకోసం వివిధ ప్రాంతాల్లో రైతుల నుంచి భూములు సేకరించి లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్‌కు అనుగుణంగా లే అవుట్‌లను అభివృద్ధి చేయాలని హెచ్‌ఎండీఏ భావిస్తోంది. వీటిని గ్రీన్‌ఫీల్డ్ రోడ్లకు ఇరువైపులా నిర్మించనున్నారు. ప్రజలు నివాస సముదాయాల నుంచి తేలిగ్గా గ్రీన్‌ఫీల్డ్‌కు చేరుకొనే సదుపాయం ఉంటుంది. ప్రతి లే అవుట్‌ను అన్నిమౌలిక సదుపాయాలతో డిజైన్ చేసేందుకు ప్రతిపాదించారు. రైతుల నుంచి భూములు సేకరించి ఏర్పాటు చేసే లేఅవుట్‌లలో 60 శాతం భూమిని తిరిగి వారికే అందజేయనున్నారు. మిగతా 40 శాతం భూమిని హెచ్‌ఎండీఏ తీసుకోనుంది. ప్రస్తుతం ప్రతిపాదించిన రావిర్యాల– ఆమన్‌గల్ మార్గంలో మొదటి దశలో రేడియల్ రోడ్డుకు ఇరువైపులా కి.మీ పరిధిలో 21 లక్షల చదరపు మీటర్ల (518.92 ఎకరాలు) విస్తీర్ణంలో టౌన్‌షిప్‌ను, రెండో దశలో 500 మీటర్ల పరిధిలో మరొకదానిని అభివృద్ధి చేసే ప్రతిపాదనలు ఉన్నాయి.

త్వరలో రతన్‌టాటా గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పనులు..

ఫ్యూచర్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా ఓఆర్ఆర్ రావిర్యాల ఇంటర్‌చేంజ్ నుంచి ఆమన్‌గల్ వరకు నిర్మించనున్న 41.50 కి.మీ. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పనులను హైకోర్టు స్టే ఎత్తివేసిన వెంటనే ప్రారంభించేందుకు హెచ్‌ఎండీఏ అనుబంధ హెచ్‌జీసీఎల్ సంస్థ సిద్ధంగా ఉన్నాయి. ఇందుకోసం రూ.1,665 కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనా.రెండోదశలో మీర్‌ఖాన్‌పేట్ నుంచి ట్రిపుల్ ఆర్ వద్ద అమన్‌గల్ వరకు రూ.2,365 కోట్ల వ్యయంతో 22.3 కిలోమీటర్లు నిర్మించనున్నారు.

ఇవీ ప్రత్యేకతలు..

- గ్రీన్‌ఫీల్డ్ రోడ్లు 100 మీటర్ల వెడల్పుతో కూడిన యాక్సెస్ కంట్రోల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేలు. ఆరు లైన్ల ప్రధాన రహదారి (3+3 లేన్)
- భవిష్యత్తులో 8 లైన్‌లకు (4+4) విస్తరించే అవకాశం ఉంటుంది.
- రావిర్యాల–ఆమన్‌గల్ గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు మధ్యలోనే మెట్రో కారిడార్ కోసం 20 మీటర్ల భూమిని కేటాయిస్తారు.ఈ మార్గంలో ఎట్‌గ్రేడ్ (భూమార్గంలో)గా మెట్రో కారిడార్ రానుంది.
- గ్రీన్‌ఫీల్డ్ రోడ్లకు రెండు వైపులా 3–లైన్‌ల సర్వీస్ రోడ్లు ఉంటాయి. 2 మీటర్ల చొప్పున గ్రీన్‌బెల్ట్‌ను (పచ్చదనం) ఏర్పాటు చేస్తారు.
- రెండు వైపులా 3 మీటర్ల సైకిల్ ట్రాక్, 2 మీటర్ల వెడల్పుతో ఫుట్‌పాత్, మరో 2 మీటర్ల యూటిలిటీ కారిడార్‌ను ఏర్పాటు చేయనున్నారు.

వేర్వేరుగా రెయిన్ వాటర్, సీవరేజ్ లైన్లు

జలమండలి ఎండీ



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని సీవరేజ్, వాననీటి కాలువ అనుసంధానం పాయింట్లను గుర్తించి రెండు లైన్లను వేర్వేరుగా నిర్మించాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు. జీహెచ్ఎంసీ, జలమండలి శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సోమవారం మలక్‌పేట్‌లోని నల్గొండ చౌరస్తాలో సీవరేజ్ మరమ్మతు పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. రెండు దశాబ్దాల క్రితం నాటి సీవరేజ్ లైను శిథిలమైపోవడంతో అవుట్‌లెట్ లేక వర్షం కురిసిన సమయాల్లో సీవరేజ్ రహదారిపై పొంగుతున్నట్టు గుర్తించారు. సీవరేజ్ లైన్లు ధ్వంసమైన ప్రాంతాన్ని పరిశీలించారు. మలక్‌పేట్ ఆర్‌యూబీ వరకు సీవరేజ్ లైన్ల నిర్మాణం చేపట్టడానికి అధికారులతో చర్చించారు. కొత్త సీవరేజ్ లైన్ల వల్ల తాత్కాలికంగా మురుగు సమస్య తలెత్తకుండా ఉంటుందని అన్నారు. అలాగే సమీపంలోని భవనాలనుంచి ఉత్పన్నమయ్యే సీవరేజ్‌ను ఎక్కడికక్కడే కాకుండా ఒకే అవుట్‌లెట్ వద్ద అనుసంధానం చేయడానికి ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే సమీపంలోని అన్ని సీవరేజ్ లైన్లను, మ్యాన్ హోళ్లను డీసిల్టింగ్ చేసి మురుగు పొంగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తులో సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారంకోసం ఇరు శాఖల అధికారులు సర్వే నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్ డైరెక్టర్ అమరేందర్ రెడ్డి, సీజీఎం నాగేందర్, జీఎం ఇతర అధికారులు, హైడ్రా అధికారులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి

ఇద్దరిపై పోక్సో కేసు నమోదు

సైదాబాద్: అన్నా, అంకుల్ అని తమను ఆప్యాయంగా పిలిచే బాలికపై ఇద్దరు అమానుషంగా వ్యవహరించారు. వేర్వేరు సందర్భాలలో ఆ బాలిక నిస్సహాయతను అవకాశంగా తీసుకొని ఇద్దరు లైంగిక దాడికి ఒడిగట్టారు. దళిత మైనర్ బాలికపై దాష్టీకానికి పాల్పడిన ఇద్దరిపై సైదాబాద్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. సైదాబాద్ పీఎస్ పరిధిలో నివసించే బాలిక (16) ఇటీవల పదవ తరగతి పూర్తి చేసింది. తనను ఆటోలో స్కూల్‌కు తీసుకెళ్లే వ్యక్తిని బాలిక అంకుల్ అని పిలిచేది. అదే వ్యక్తి మాయమాటలతో బాలికను లోబరుచుకొని తన నివాసంలో పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. మరో సందర్భంలో బాలిక నివాసానికి సమీపంలో ఉండే ఓ యువకుడు టీవీ చూడటానికి తమ ఇంటికి వచ్చిన బాలికను లోబర్చుకుని లైంగిక దాడి చేశాడు. కొద్ది రోజులకు బాలిక ఈ విషయాన్ని తండ్రి, ఇతర బంధువులకు తెలియజేయడంతో సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలికను భరోసా కేంద్రానికి తరలించిన పోలీసులు..నిందితులు ఇద్దరినీ అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారని తెలిసింది.

సూడో పోలీసుల అరెస్టు



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

నాంపల్లి: స్పా సెంటర్ల నుండి డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు సూడో పోలీసులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. హబీబ్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నవాబ్‌సాబ్‌కుంటకు చెందిన మహ్మద్ ఫయాజ్, షాలిబండకు చెందిన మిర్చి అహ్మద్ అలియాస్ సయ్యద్ అహ్మద్ హష్మీలు అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించేందుకు నకిలీ పోలీసు అవతారం ఎత్తారు. ఇద్దరూ మినీ వైర్‌లెస్ స్పై కెమెరాను తీసుకుని స్పా సెంటర్లకు వెళ్లి నిర్వాహకులను బెదిరించారు. ఈ క్రమంలో ఇటీవల మాసబ్‌ట్యాంక్‌లోని ఓ స్పా సెంటర్‌కు వెళ్లి డబ్బులు డిమాండ్ చేశారు. మరికొన్ని చోట్ల కూడా రూ.50 వేల నుండి రూ.60 వేల వరకు వసూలు చేశారు. పోలీసులకు అందించిన విశ్వసనీయ సమాచారంతో టాస్క్‌ఫోర్స్, మాసబ్‌ట్యాంక్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి నకిలీ పోలీసులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి వద్ద నుండి రూ.20 వేలు నగదు, ఒక సెల్‌ఫోన్, మినీ వైర్‌లెస్ స్పై కెమెరాను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ అల్లం-వెల్లుల్లి పేస్ట్ తయారీదారుడి అరెస్టు



నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ నిల్వలతో మహ్మద్ ఫైసల్

చాంద్రాయణగుట్ట: నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రంపై మంగళవారం సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, బండ్లగూడ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నిర్వాహకుడిని అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి రూ.1.40 లక్షలు విలువ చేసే 870 కేజీల అల్లం వెల్లులి పేస్టు, 4 కేజీల టైటానియం డయాక్సైడ్, 16 కేజీల మోనో సిట్రేట్, 4 కేజీల కలర్ టర్మరిక్ పౌడర్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బండ్లగూడ పటేల్‌నగర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ ఫైసల్ స్థానికంగా గుట్టు చప్పుడు కాకుండా నిబంధనలకు విరుద్ధంగా నకిలీ అల్లం వెల్లులి పేస్టు తయారు చేస్తున్నాడు. ఎఫ్ఏ ఫుడ్ ప్రొడక్ట్స్ పేరిట అవసరమైన దుకాణదారులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం తయారీ కేంద్రంపై దాడులు నిర్వహించారు.

నకిలీ వైద్యుడి అరెస్టు

సనత్‌నగర్: ఎలాంటి విద్యార్హతలు లేకుండా క్లినిక్ నిర్వహిస్తూ..అమాయకుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఓ నకిలీ వైద్యుడిని బేగంపేట పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ జయచందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రసూల్‌పురా అన్నానగర్‌లో ఓ నకిలీ వైద్యుడు ఆస్పత్రి నిర్వహిస్తున్నాడనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ వరలక్ష్మీ నేతృత్వంలో ఇతర పోలీసు సిబ్బంది కలిసి సోమవారం సాయంత్రం ఆకస్మికంగా దాడి చేశారు. అన్నానగర్‌లో జి.మహేందర్ అనే వ్యక్తి క్లినిక్‌ను నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. అతని వద్ద ఎటువంటి విద్యార్హతకు సంబంధించిన పత్రాలు లేకపోగా నిజమైన వైద్యుడి మాదిరిగానే మెడలో స్టెతస్కోపు, ఆస్పత్రిలో రక్తపోటు గుర్తించే యంత్రం, థర్మామీటరు, మందులు రాసే చీటీల పుస్తకం, మధుమేహ పరీక్షా యంత్రం, పల్స్ ఆక్సోమీటర్, ఇతర ఔషధాలను క్లినిక్‌లో గుర్తించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఓల్డ్ సఫిల్‌గూడకు చెందిన మహేందర్ ఎటువంటి విద్యార్హతలు, పత్రాలు లేకున్నా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు వైద్యం చేస్తూ, మందులను రాసిస్తున్నారు. దీంతో నిందితుడిని అరెస్టు చేసి క్లినిక్‌లో ఉన్న వైద్య పరికరాలు, ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు.

మద్యం మత్తులో వ్యక్తిపై దాడి

దుండిగల్: అకారణంగా ఓ వ్యక్తిపై ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడి గాయపరిచిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. దుండిగల్ డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయానికి చెందిన వినోద్ సోఫా రిపేర్ వర్క్‌లు నిర్వహిస్తుంటాడు. ఈ నెల 2న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయంలోని బ్లాక్ నెంబరు 22లోని ఓ దుకాణం ముందు తన స్నేహితులతో కలిసి అశోక్ సిగరెట్ తాగుతుండగా.. ఇద్దరు వ్యక్తులు వచ్చి అశోక్‌ను ఇక్కడకు ఎందుకు వచ్చావంటూ దుర్భాషలాడారు. అంతటితో ఆగకుండా కర్రలు, బెల్ట్‌తో దాడి చేశారు. అడ్డుకునేందుకు యత్నించిన స్థానికులను సైతం బెదిరించారు. గాయాలైన బాధితుడు సూరారం మల్లారెడ్డి ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని ఇంటికి రాగా, అక్కడికి సైతం దాడికి పాల్పడిన వ్యక్తులు చేరుకుని మళ్లీ బెదిరించారు. దాడి చేసిన వ్యక్తులు మద్యం మత్తులో ఉన్నారని అశోక్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు దుండిగల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డీపీతో టోపీ!

దుబాయ్‌లో ఉన్న వ్యక్తి డిస్‌ప్లే పిక్చర్‌తో వాట్సాప్

- దాని ఆధారంగా ఇక్కడ ఉన్న సోదరుడికి సందేశం
- అక్కడ నుంచి నగదు పంపినట్లు నకిలీ రసీదు సృష్టి
- వీసా ఏజెంట్ పేరిట కథ నడిపి రూ.1.9 లక్షలు స్వాహా

సాక్షి, సిటీబ్యూరో: రాజకీయ నాయకులు, అధికారులు, స్నేహితులు, కుటుంబీకుల ఫొటోలు వాట్సాప్ డిస్‌ప్లే పిక్చర్లుగా ఏర్పాటు చేసుకుని, అత్యవసరమంటూ డబ్బు గుంజిన డీపీ ఫ్రాడ్స్ ఇప్పటి వరకు చూశాం. ఇప్పుడు కొత్త ఎత్తులు వేస్తున్న సైబర్ నేరగాళ్లు ముందు డబ్బు పంపినట్లు నమ్మించి, నకిలీ రసీదులు పంపి, ఆపై అందిన కాడికి దండుకుంటున్నారు. ఈ సరికొత్త ఫ్రాడ్ రూ.1.9 లక్షలు కోల్పోయిన బాధితుడి తరఫున ఆయన భార్య మంగళవారం సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి వచ్చింది. దీనిపై కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. నగరానికి చెందిన ఓ వ్యక్తి సోదరుడు దుబాయ్‌లో ఉంటారు. అతడి ఫొటోలు వాట్సాప్ డీపీగా పెట్టుకున్న సైబర్ నేరగాళ్లు గత శుక్రవారం నగర వాసికి సందేశం పంపారు. అది తన సోదరుడి నుంచే వచ్చినట్లు భావించిన ఆయన అనేక అంశాలపై చాటింగ్ చేశారు. తాను త్వరలోనే తిరిగి రానున్నానని చెప్పిన నేరగాడు తన వద్ద ఉన్న కొంత నగదు పంపుతున్నట్లు చెప్పాడు. దీనికోసం అంటూ నగరవాసి నుంచి బ్యాంకు ఖాతా వివరాలు తెలుసుకున్నాడు. కొద్దిసేపటికి వెస్టర్న్ యూనియన్ మనీ ట్రాన్స్‌ఫర్ ద్వారా ఆ ఖాతాలోకి భారీ మొత్తం జమ చేసినట్లు సృష్టించిన నకిలీ రసీదు షేర్ చేశాడు. ఆ మొత్తం 24 గంటల్లో బ్యాంకు ఖాతాలోకి వచ్చి చేరుతుందని నమ్మించాడు. ఇది జరిగిన దాదాపు గంట తర్వాత



తాను భారత్ తిరిగి వచ్చే ప్రయత్నాల్లో ఉండగా దుబాయ్ ఎంబసీ అధికారులు అడ్డుకున్నట్లు సందేశం పంపాడు. వీసా ఇబ్బందుల కారణంగా ఇలా జరిగిందని, ఓ ఏజెంట్ మిమ్మల్ని సంప్రదిస్తాడని, అతడు చెప్పినట్లు చేస్తే తాను బయటకు వస్తానని నమ్మించాడు. కొద్దిసేపటికి వీసా ఏజెంట్ మాదిరిగా ఫోన్ చేసి మాట్లాడిన మరో వ్యక్తి వీసా పునరుద్ధరణ కోసం రూ.లక్ష చెల్లించాలంటూ బ్యాంకు ఖాతాల్లో వేయించుకున్నాడు. ఆపై వీసా పని పూర్తయిందని, విమాన టిక్కెట్లు ఖరీదు చేయాలంటూ మరో రూ.90 వేలు బదిలీ చేయించుకున్నాడు. చివరకు దుబాయ్‌లో ఉన్న స్నేహితుడిని నేరుగా సంప్రదించిన నగర వాసి తాను మోసపోయినట్లు తెలుసుకున్నారు. ఈ మేరకు బాధితుడి భార్య సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

సమన్వయంతో సమస్యలు నివారించండి

- వర్షాకాల సన్నద్ధతపై అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి
- పోలీస్, ట్రాఫిక్, హైడ్రా, జీహెచ్ఎంసీ అప్రమత్తంగా ఉండాలి
- మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ 24 గంటలు అందుబాటులో..



సాక్షి, సిటీబ్యూరో: వర్షాలు పడినప్పుడు హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్, ఇతర సమస్యలు తలెత్తకుండా పోలీస్, ట్రాఫిక్, హైడ్రా, జీహెచ్ఎంసీ విభాగాలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నాలుగు విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని వర్షాలు, వరదలకు సంబంధించి కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి మానిటరింగ్ చేసేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకునేందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. వర్షాకాల సన్నద్ధతపై ఆయా విభాగాల అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నగరంలో అసంపూర్తిగా ఉన్న నాలాల పూడికతీత పనుల్ని వీలైనంతగా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ 24 గంటలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఇప్పటికే గుర్తించిన 141 వాటర్ లాగింగ్ పాయింట్స్‌వద్ద రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ పనుల పురోగతి గురించి ఈ సందర్భంగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. హార్వెస్టింగ్ వెల్స్‌లోకి చేరే వర్షపు నీటిని ఆటోమేటిక్ పంపులతో బయటకు పంపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాతావరణ శాఖ సూచనలకు అనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్(సీఆర్‌యూ)లో సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని చెరువులు, నాలాలు, రోడ్ల విస్తరణ, అభివృద్ధికి సంబంధించి ప్రత్యేక పాలసీని తయారు చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ అధికారులు శేషాద్రి, మాణిక్ రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, హెచ్ఎండీఏ, తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మళ్లీ పోలీస్ చేతికి జేమ్స్ స్ట్రీట్ భవనం

- రాంగోపాల్‌పేట పోలీస్ స్టేషన్ త్వరలో అక్కడికి తరలింపు
- సందర్శించిన సీపీ సీవీ ఆనంద్



రాంగోపాల్‌పేట్ పోలీసు స్టేషన్‌ను సందర్శించిన సిటీ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్

బన్సీలాల్‌పేట్: హెచ్ఎండీఏ మరమ్మతులు చేపట్టిన జేమ్స్ స్ట్రీట్ భవనాన్ని పోలీస్ శాఖకు అప్పగించారని, త్వరలోనే రాంగోపాల్‌పేట పోలీస్ స్టేషన్ ఇక్కడికి వస్తుందని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడించారు. సికింద్రాబాద్ ఎంజీ రోడ్డులోని రాంగోపాల్‌పేట్ పురాతన పోలీసు స్టేషన్‌ను మంగళవారం ఉత్తర మండలం డీసీపీ రష్మి పెరుమాల్, నగర ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే తదితరులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సీవీ ఆనంద్ మాట్లాడారు. రాంగోపాల్‌పేట్ పాత పోలీసు స్టేషన్‌కు హెచ్ఎండీఏ మరమ్మతులు నిర్వహించి బ్రహ్మాండంగా తయారు చేశారన్నారు. సదరు స్టేషన్‌ను తిరిగి తమకు అప్పగించడం జరిగిందని తెలిపారు. త్వరలో హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. జేమ్స్ స్ట్రీట్ భవనం 1870 సంవత్సరంలో నిర్మించారు. అప్పటి నుంచి 2016 వరకు సుదీర్ఘ కాలం రామ్‌గోపాల్‌పేట్ పోలీసు స్టేషన్ ఇక్కడే కొనసాగింది. ఆ తర్వాత మరమ్మతుల కోసం తొమ్మిదేళ్ల క్రితం హెచ్ఎండీఏ స్వాధీనం చేసుకుని..ఇప్పుడు అప్పగిస్తోంది. రానున్న కొద్ది రోజుల్లో రాంగోపాల్‌పేట్ పోలీసు స్టేషన్‌కు సంబంధించిన వస్తువులను తిరిగి ఇక్కడి తీసుకవచ్చి పోలీసు కార్యకలాపాలు సాగించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే పురానీ హవేలిలోని సిటీ పోలీసు కమిషనర్ కార్యాలయం మరమ్మతులు పూర్తి కావచ్చాయని, త్వరలో ఈ భవనాన్ని ప్రారంభించి అక్కడి నుంచీ నగర పోలీసు కార్యకలాపాలు కొనసాగిస్తామని ఆయన వెల్లడించారు.

బీజేపీ కార్పొరేటర్లతో కిషన్‌రెడ్డి సమావేశం

సాక్షి, సిటీబ్యూరో: బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ కార్పొరేటర్లతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో లేవనెత్తాల్సిన అంశాలపై ఆయన వారితో చర్చించారు. బస్తీ పర్యటనలో తన దృష్టికి వచ్చిన సమస్యలను ఆయన ప్రస్తావించారు. వర్షాకాల సన్నద్ధతపైన ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కార్పొరేటర్లకు సూచించారు. అలాగే గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాద ఘటనలో ప్రభుత్వ నిర్లక్ష్యంపైన కూడా ప్రశ్నించాలని సూచించారు. గ్రేటర్ సమస్యలపై బల్దియా మీటింగ్‌లో అంశాల వారీగా ఏయే కార్పొరేటర్లు ఏం మాట్లాడాలనే దానిపై కిషన్ రెడ్డి దిశానిర్దేశం చేశారు.

నిజామాబాద్‌లో ఘరానా దొంగల ముఠా అరెస్ట్

నగరానికి చెందిన ఇద్దరు పాతనేరస్తులు ఉన్నట్లు గుర్తింపు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లాలో చోరీలకు పాల్పడిన హైదరాబాద్ వాసులను అక్కడి పోలీసులు పట్టుకున్నారు. ఈమేరకు మంగళవారం నిజామాబాద్ సీపీ పోతరాజు సాయిచైతన్య వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు ఇళ్లలో చోరీలకు పాల్పడిన కేసులు నమోదయ్యాయి. దీంతో పోలీసులు ఘటన స్థలంలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి, ఆధారాలను సేకరించి దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ అమేర్‌పై అనుమానం రావడంతో ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం అదుపులోకి తీసుకొని విచారణ చేశారు. అమేర్ చిన్నతనంలో పిక్‌ప్యాకెట్లకు పాల్పడేవాడని, దొంగతనాలు చేసేటప్పుడు హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ ఆసిఫ్‌తో పరిచయం ఏర్పడింది. అబ్దుల్ ఆసిఫ్ తనకు పరిచయం ఉన్న వసీం, సోహైల్, జావీద్ ఖాన్, రియాజ్, అలీ, ఆసిఫ్ ఖాన్‌ను మహమ్మద్ అమేర్‌కు పరిచయం చేశాడు. వీరంతా గతంలో నేరాలకు పాల్పడినవారే. అందరూ కలిసి ఒక ముఠాగా ఏర్పడి పక్కా ప్రణాళికతో దొంగతనాలు చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా ముఠా సభ్యులు నిజామాబాద్ నగరంలోని ఆటోనగర్, ధర్మపురి హిల్స్, పెయింటర్ కాలనీ, డ్రైవర్ కాలనీ, అక్బర్‌నగర్ కాలనీ, శాంతినగర్‌లలో సుమారు 24 ఇళ్ల తాళాలు పగలగొట్టి దొంగతనాలు చేశారు. వీరు హైదరాబాద్ శివారులోని షాపూర్, జీడిమెట్ల పరిసర ప్రాంతాలలో 15 ఆటోలను కూడా దొంగతనం చేశారు. ముఠా సభ్యులపై నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డి, హైదరాబాద్ నగరాలలో కేసులు నమోదైనట్లు సీపీ వెల్లడించారు. కేసులో బబ్లూ, అలీ అనే నిందితులు పరారీలో ఉన్నారని, మిగతా వారిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు.

అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి..

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



చంద్రశేఖర్ మృతదేహం

మొయినాబాద్: బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై మృగవని పార్కు వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్‌కు చెందిన వడ్డె చంద్రశేఖర్ (38) సోమవారం రాత్రి బైక్‌పై హైదరాబాద్ నగరానికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా అర్ధరాత్రి 12.10 గంటల సమయంలో మృగవని పార్కు వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై పడ్డ అతనికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం వెంటనే స్థానిక భాస్కర ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లతో విదేశాలకు..

ఓ కన్సల్టెన్సీ నిర్వాకం

- అమెరికా నుంచి తిరిగొచ్చిన విద్యార్థి సర్టిఫికెట్ పరిశీలనలో బయటపడ్డ వైనం
- కేరళలో తయారీ.. హైదరాబాద్‌లో విక్రయం
- ఇద్దరి అరెస్ట్..ఒకరి పరారీ



నకిలీ సర్టిఫికెట్లు చూపిస్తున్న శంషాబాద్ ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్, సీఐ బాలరాజు



రిమాండ్‌కు తరలించిన ఇద్దరు నిందితులు

శంషాబాద్: అమెరికా నుంచి డిపోర్ట్ అయిన విద్యార్థి సర్టిఫికెట్ నకిలీదిగా తేలడంతో హైదరాబాద్‌లోని ఓ నకిలీ సర్టిఫికెట్ విక్రయిస్తున్న కన్సల్టెన్సీ గుట్టు రట్టైంది. శంషాబాద్ ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన మేరకు..నల్గొండ జిల్లా పారేపల్లిగూడెం గ్రామానికి చెందిన పకీరు గోపాల్‌రెడ్డి 2018లో మధురై కామరాజ్ విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ డిగ్రీ పూర్తి చేసినట్లు సర్టిఫికెట్లు సమర్పించి ఏడాదిన్నర కిందట అమెరికాలోని వెబ్‌స్టర్ వర్సిటీలో 28 వేల డాలర్ల ఫీజు చెల్లించి ఉన్నత చదువులో ప్రవేశం పొందాడు. 15 నెలలు చదివిన తర్వాత ఇంటికి తిరిగి వచ్చి ఐదు నెలలు ఇక్కడే ఉన్నాడు. నాలుగురోజుల కిందట అమెరికా వెళ్లిన అతడిని అక్కడి ఇమిగ్రేషన్ అధికారులు యునివర్సిటీలో ఇన్‌యాక్టివ్ విద్యార్థిగా గుర్తించి స్వదేశానికి తిప్పిపంపారు. దీంతో తిరిగి వచ్చే క్రమంలో ఆదివారం శంషాబాద్ విమానాశ్రయంలో ఇమిగ్రేషన్ అధికారులు అతడి వీసాతో పాటు విద్యార్హత సర్టిఫికెట్లు పరిశీలించగా నకిలీ సర్టిఫికెట్ గుట్టు బయటపడింది. దీంతో అతన్ని ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పోలీసులకు అప్పగించారు.

పదిహేను మందికి పైగా..

నకిలీ సర్టిఫికెట్లపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు గోపాల్‌రెడ్డిని విచారించగా బీఎన్‌రెడ్డి నగర్ టీచర్స్ కాలనీలో ఉన్న ధనలక్ష్మీ ఒవర్సీస్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థలో రూ.80 వేలకు డిగ్రీ సర్టిఫికెట్ కొనుగోలు చేసినట్లు చెప్పాడు. సీఐ బాలరాజు ఆధ్వర్యంలో ఎస్ఐ సిద్దేశ్వర్ పోలీసుల బృందం ధనలక్ష్మీ ఒవర్సీస్ సంస్థపై దాడులు చేశారు. సంస్థ నిర్వాహకుడు కాతోజు అశోక్‌ను అరెస్ట్ చేయడంతో పాటు అక్కడ ఉన్న మధురై కామరాజ్, ఉస్మానియా వర్సిటీలకు చెందిన 17 నకిలీ డిగ్రీ, ప్రొవిజినల్ మార్కుల పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. సరైన విద్యార్హత లేకుండా విదేశీ విద్యనభ్యసించాలనుకునే వారు ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తూ నకిలీ సర్టిఫికెట్ అందజేస్తున్నట్లు గుర్తించారు. పదిహేనుమందికిపైగా నకిలీ సర్టిఫికెట్లతో విదేశీ విద్యకు వెళ్లినట్లు విచారణలో అశోక్ వెల్లడించాడు. కేరళకు చెందిన వ్యక్తికి ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.30 వేలు ఇస్తే..అతడే సర్టిఫికెట్లు తయారుచేసి పంపిస్తున్నట్లు తెలిపాడు. అశోక్ నుంచి నకిలీ సర్టిఫికెట్లతో పాటు వివిధ బ్యాంకులకు చెందిన నకిలీ స్టాంపులు, నకిలీ ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్లు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, రూ.10 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. గోపాల్‌రెడ్డి, అశోక్‌లను రిమాండ్‌కు తరలించగా కేరళకు చెందిన వ్యక్తి కోసం గాలిస్తున్నారు.

డివిజన్‌ను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహాలక్ష్మి

హిమాయత్‌నగర్ : హిమాయత్‌నగర్ డివిజన్‌ను నగరంలో రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలని కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ అధికారులకు సూచించారు. మంగళవారం ఆమె డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఫుట్‌పాత్‌పై చెట్ల కొమ్మల తొలగింపు, వీధి దీపాల పనులను పర్యవేక్షించారు. డివిజన్ అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డీఎంసీ మారుతీ దివాకర్, ఏఎంహెచ్ఓ డాక్టర్ హేమలత, మున్సిపల్ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

బన్సీలాల్‌పేట్: గాంధీనగర్‌లోని కురుమ కులస్తుల శ్మశానవాటికను కబ్జా చేసినవారిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కురుమ సంఘం ఉపాధ్యక్షుడు చీర శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కుర్మ సంఘం నాయకులతో కలిసి జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్, సికింద్రాబాద్ తహసీల్దార్ పాండు నాయక్, హైడ్రా ఏసీపీ తిరుమల్‌ను మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కబ్జాదారులు నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి మున్సిపల్ నుంచి భవన నిర్మాణ అనుమతులు తీసుకున్నారన్నారు. శ్మశానవాటిక స్థలాన్ని కాపాడాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సునీల్, శివప్రసాద్, నటరాజ్, ప్రవీణ్‌కుమార్, సుశీల్, వినోద్, యశ్వంత్, దినేష్, రాజు, సంతోష్ పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించిన బోర్డు అధికారులు

కంటోన్మెంట్: రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాల తొలగింపునకు వెళ్లిన బోర్డు అధికారులకు విచిత్ర ఘటన ఎదురైంది. సదరు నిర్మాణంలో ఉన్న పెంపుడు కుక్కలు కూల్చివేతలకు అడ్డు తగిలాయి. దీంతో బోర్డు అధికారులు డాగ్ క్యాచింగ్ సిబ్బందిని రంగంలోకి దింపి పని పూర్తి చేయడం గమనార్హం. వివరాల్లోకి వెళ్తే.. కంటోన్మెంట్ 6 వార్డు అమరజ్యోతి కాలనీలో రోడ్డు వేసేందుకు వెళ్లిన బోర్డు అధికారులు సదరు రోడ్డు ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. దీంతో సంబంధిత వార్డు ఇంజినీర్ జిష్ణు ఈ విషయాన్ని సీఈఓ మధుకర్ నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆక్రమణలు తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. పోలీసుల బందోబస్తు మధ్య మంగళవారం కూల్చివేస్తుండగా కుక్కల రూపంలో మరో సవాలు ఎదురైంది. దీంతో కంటోన్మెంట్ డాగ్ క్యాచింగ్ వాహనాన్ని తెప్పించి మరీ పని పూర్తి చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఆక్రమణల అంశాన్ని తమ దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

22న బ్రాహ్మణ మెగా వివాహ పరిచయ వేదిక

నల్లకుంట: అఖిల బ్రాహ్మణ సమాజాభివృద్ధి సంస్థ(ఏబీసీడీ) స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని ఈనెల 22న శ్రీ రుక్మిణి పాండురంగ స్వామి కల్యాణం, రాష్ట్ర స్థాయి ఉచిత బ్రాహ్మణ మెగా వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి డాక్టర్ ఎస్ఎస్ సుబ్రమణ్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూనల్లకుంట కో-ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీ కమ్యూనిటీహాల్‌లో ఉదయం ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. పరిచయ వేదిక అనంతరం సంస్థ సర్వసభ్య సమావేశం ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 10లోగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

రైల్లో ప్రయాణికుల బ్యాగులు చోరీ

కాచిగూడ: రెండు వేర్వేరు రైళ్లలో ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళా ప్రయాణికుల హ్యాండ్ బ్యాగులను దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... జీడిమెట్లలో నివాసం ఉంటున్న వినయ్ సేతియ భార్యతో కలిసి కాచిగూడకు రావడానికి బెంగళూర్‌లో అశోకపురం ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. అనంతపురం రైల్వే స్టేషన్ సమీపంలో తన భార్య హ్యాండ్ బ్యాగులను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. బ్యాగులో సెల్‌ఫోన్, ఏటీఎం కార్డు, ఆధార్ కార్డు, రూ.500 నగదు ఉంది. మరో ఘటనలో మంజుదేవి కాచిగూడకు రావడానికి మహారాష్ట్రలోని జాలులు రైల్వే స్టేషన్‌లో కోయంబత్తూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. నాందేడ్ వద్ద ఆమె హ్యాండ్ బ్యాగును దొంగలు ఎత్తుకెళ్లారు. బ్యాగులో సెల్‌ఫోన్, ఆధాకర్‌కార్డు, రూ.5,500 నగదు ఉంది. వినయ్ సేతియా ఫిర్యాదు మేరకు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి అనంతపురం రైల్వే పోలీస్ స్టేషన్‌కు, మంజు దేవి ఫిర్యాదు మేరకు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

తస్మాత్ జాగ్రత్త...

- లోతైన మ్యాన్‌హోల్ మూతలపై రెడ్ పెయింట్
- మ్యాన్‌హోల్ లోపల సేఫ్టీ గ్రిల్స్
- వరదల నేపథ్యంలో హెచ్చరిక బోర్డులు



పనులను పరిశీలిస్తున్న జలమండలి జీఎం హరిశంకర్, మేనేజర్ రాంబాబు



సేఫ్టీగ్రిల్ నాణ్యతను పరిశీలిస్తున్న సిబ్బంది ..

బంజారాహిల్స్: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్లపై వరదనీరు నిలిచిపోవడంతో పాటు లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. దీంతో పలు ప్రాంతాల్లో ప్రజలు వరదనీరు వెళ్లేందుకు మ్యాన్‌హోల్ మూతలను ఇష్టానుసారం తెరుస్తున్నారు. ఇలా లోతైన మ్యాన్‌హోల్ మూతలు తెరవడంవల్ల ప్రమాదాలు పొంచి ఉండడంతో అప్రమత్తమైన జల మండలి అధికారులు ముందస్తు జాగ్రత్తలతో వర్షాకాల కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. ఇందులో భాగంగానే ఎక్కడైతే ప్రమాదకరంగా లోతైన మ్యాన్‌హోల్స్ ఉన్నాయో వాటిని తేలికగా ప్రజలు గుర్తించేందుకు వీలుగా మ్యాన్‌హోల్ మూతలపై రెడ్ పెయింట్ వేస్తున్నారు. ఏ మ్యాన్‌హోల్ మూతలమీద అయితే రెడ్ పేయింట్ ఉంటుందో అది లోతైన మ్యాన్‌హోల్‌గా గుర్తుంచుకుని జాగ్రత్తగా ఉండాలని వాటిని ఎట్టి పరిస్థితుల్లో తెరవవద్దని సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేస్తున్నారు. గత రెండు రోజులుగా జలమండలి డివిజన్ -6 పరిధిలో మ్యాన్‌హోల్‌ల మూతలపై రెడ్ పెయింట్ వేసే ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. వర్షాకాలం సమీపించిన నేపథ్యంలో మరో వారం రోజుల్లో డివిజన్ -6 పరిధిలో అన్ని మ్యాన్‌హోల్‌లపై పెయింట్ వేసే ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

18 వాటర్ లాగింగ్ పాయింట్‌లు ...

డివిజన్ -6 పరిధిలో వరదనీరు వెళ్లే మార్గాలు, ఎక్కువగా వరద నిలిచే ప్రాంతాలపై జీహెచ్‌ఎంసీ అధ్యయనం చేసి ఆ జాబితాను జలమండలి అధికారులకు పంపించింది. డివిజన్ -6 పరిధిలోని 12 వాటర్ సెక్షన్ల పరిధిలో 18 వాటర్ లాగింగ్ పాయింట్‌లు ఉన్నట్లుగా గుర్తించారు. ఆయా వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద ఉన్న మ్యాన్‌హోళ్లు ఆరు అడుగుల లోతుకంటే తక్కువగా ఉన్నా వాటికి కూడా సేఫ్టీ గ్రిల్ ఏర్పాటు చేసి మూతలపై రెడ్ పెయింట్ వేస్తున్నారు. ప్రతి సెక్షన్‌కు ఒక టీంను ఇందుకోసం ఏర్పాటు చేశారు.

1089 లోతైన మ్యాన్‌హోల్‌లు ...

జలమండలి డివిజన్-6 పరిధి కిందకు వచ్చే ఫిల్మ్‌నగర్, తట్టిఖానా, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, సోమాజిగూడ, ఎల్లారెడ్డిగూడ, ఎర్రగడ్డ, బోరబండ, ఎస్‌పీఆర్ హిల్స్, వెంగళరావునగర్, ఎస్సార్ నగర్, ఫతేనగర్ వాటర్ సెక్షన్ల పరిధిలో 1089 లోతైన మ్యాన్‌హోల్‌లు ఉన్నట్లుగా అధికారులు గుర్తించారు. ఈ మ్యాన్‌హోల్‌లు ఆరు అడుగుల కంటే ఎక్కువ లోతులో ఉన్నాయి. వీటన్నింటి మూతలమీద ప్రస్తుతం రెడ్ పెయింట్ వేస్తున్నారు. వరదనీరు వచ్చినప్పుడు పొరపాటున ఎవరైనా మ్యాన్‌హోల్ తెరిచినా అందులో పడిపోకుండా ఉండేందుకు సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నారు. లాకింగ్ సిస్టమ్‌తో కూడిన సేఫ్టీగ్రిల్‌పై నిలబడినా అది విరగదు. మనుషులు కూడా మ్యాన్‌హోల్‌లో పడిపోరు. డివిజన్ -6 పరిధిలో మొత్తం 30వేల మ్యాన్‌హోల్స్ ఉండగా అందులో 1089 మ్యాన్‌హోల్స్ లోతైనవిగా గుర్తించడమే కాకుండా అక్కడ అజాగ్రత్తగా ఉంటే ప్రమాదం అనే బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.

సమస్య ఉంటే 155313 ను సంప్రదించాలి

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న మ్యాన్‌హోల్ మూతలను పౌరులు ఎవరూ తెరవరాదు. ఇది ప్రమాదకరమన్న విషయం తెలియ చేసేందుకు మూతలపై రెడ్ పెయింట్ వేస్తున్నాము. సేఫ్టీ గ్రిల్స్ కూడా బిగిస్తున్నాము. ఎక్కడైనా వరద సమస్య తలెత్తితే 155313కి కాల్ చేస్తే సిబ్బంది వచ్చి సమస్యను పరిష్కరిస్తారు. డీప్ మ్యాన్‌హోల్స్ ఉన్న ప్రాంతాలు గుర్తించడానికే జాగ్రత్తలకోసం మూతలపై రెడ్ పెయింట్ వేయడమే కాకుండా హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేస్తున్నాం.

హరిశంకర్ జీఎం జలమండలి డివిజన్ 6

అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదు



స్థానికులతో మాట్లాడుతున్న వెల్దండ వెంకటేష్

ఫిలింనగర్: అభివృద్ధి పనులకు అడ్డుపడటం దారుణమని జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ అన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్, ఫిలింనగర్, జ్ఞానీజైల్‌సింగ్ నగర్‌లో గత నెల 30న రూ. 19.5 లక్షల తాను ప్రారంభించిన సీసీ రోడ్డు పనులను, ఎమ్మెల్యే దానం నాగేందర్ లేకుండా ఎలా ప్రారంభిస్తారని ఆయన అనుచరులు అడ్డుకోవడం సరికాదన్నారు. మంగళవారం ఆయన పనులు ఆగిన ప్రాంతం నుంచే ఎమ్మెల్యేకు ఫోన్ చేసి మాట్లాడారు. ఎమ్మెల్యే స్పందిస్తూ పనులు ఆపిన విషయంపై ఆరాతీస్తానని, ఎవరు అడ్డుకున్నారో తెలుసుకుంటానని చెప్పారు. అభివృద్ధికి పార్టీలకు అతీతంగా సహకరించాలని కోరారు. రోడ్డు పనులు వెంటనే మొదలు పెట్టాలని అధికారులకు సూచించారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

హిమాయత్‌నగర్ : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ఐఎన్‌టీయూసీ జాతీయ, రాష్ట్ర నేతలు అన్నారు. కార్మికుల హక్కులను నిర్మూలించడానికి మోదీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఎదుర్కొనేందుకు దేశ వ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమిస్తామన్నారు. మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఐఎన్‌టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శులు బాబర్ సలీమ్ పాషా, బి.వెంకటేశ్వర్ రెడ్డి, జాతీయ కార్యదర్శి ఆర్‌డి.చంద్రశేఖర్ మాట్లాడారు. మోదీ ప్రభుత్వ హయాంలో శ్రామికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్మిక చట్టాల్లో మార్పులను కార్మిక వర్గం తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఇటీవల కొందరు నకిలీ కాంగ్రెస్ నేతలు ఐఎన్‌టీయూసీ పేరును దుర్వినియోగం చేస్తున్నారని, వారి ప్రయత్నాలను మానుకోవాలని హెచ్చరించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంపీ సంజీవరెడ్డి నాయకత్వం వహించే ఐఎన్‌టీయూసీ మాత్రమే నిజమైనదని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వై.నాగన్న గౌడ్, అదిల్ షరీఫ్, వి.భాస్కర్ రెడ్డి, ఉమా నాగేంద్రమణి, రాష్ట్ర ఉపాధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి, విజయ్ కుమార్ యాదవ్, సోలొమన్ రాజు, సురేష్, నరసింహా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి....

వెంగళరావునగర్ : మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన వెంగళరావునగర్‌కాలనీ కమ్యూనిటీహాల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో సరిపడినన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదన్నారు. అన్ని కాలనీలు, బస్తీల్లో ప్రభుత్వం సీసీలు ఏర్పాటు చేసి దానికి కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేయాలని, అప్పుడే చిల్లర దొంగతనాల నుంచి అంతర్జాతీయ టెర్రరిస్టుల వరకు అందరి కదలికలు గమనించవచ్చన్నారు. సీసీలు లేకుండా కమాండ్ కంట్రోల్ ఎందుకని ప్రశ్నించారు. నగరంలో వీధి దీపాల ఏర్పాటుపై ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదన్నారు. డివిజన్‌లో రోడ్లు కావాలని స్థానికులు అడుగుతున్నారని, వెంగళరావునగర్‌కాలనీ అయ్యప్పగ్రౌండ్‌లో కమ్యూనిటీహాల్ నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయిందన్నారు. త్వరలోనే అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీనిచ్చారు. జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు దీపక్‌రెడ్డి, నాయకులు కిలారి మనోహర్, వెంకటేశ్వరరావు, శౌరిరాజు, రాజశేఖర్, ప్రసాద్, అర్జున్, నాగార్జునరెడ్డి, సికింద్రాబాద్ ఆర్‌డీఓ రఘురాంశర్మ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

శ్రీనగర్‌కాలనీ: బస్తీలు, కాలనీల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్దే లక్ష్యంగా ముందుకుసాగుతున్నామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. బస్తీలు, కాలనీల్లోని సమస్యలను నేరుగా తెలుసుకునేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. మంగళవారం నాగార్జుననగర్ కమ్యూనిటీహాల్‌లో స్థానికులతో పాటు రెవెన్యూ, విద్యుత్, జీహెచ్‌ఎంసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తేగా అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. హైదరాబాద్ పేరుకే మెట్రో నగరమని, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని, సీసీ కెమెరాలు పనిచేయడం లేదని, బస్తీలు, కాలనీల్లో సైతం సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. వీధిలైట్లు కూడా సరిగా పనిచేయలేని స్థితిలో భాగ్యనగరం ఉందని, కేంద్ర నిధులతో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తానన్నారు. నాగార్జుననగర్ కమ్యూనిటీహాల్‌లో ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, కాలనీ ప్రెసిడెంట్ మౌళి, సెక్రటరీ విష్ణువర్ధన్‌రెడ్డి, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, కుంబాల గంగరాజు, ప్రేమ్‌కుమార్, సందీప్‌యాదవ్, శాంతికుమార్, అనంతలక్ష్మి, సుప్రియగౌడ్, హరీష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే ఉద్యోగుల సంక్షేమం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఐఎన్‌టీయూసీ నేతలు

హిమాయత్‌నగర్ : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ అనుబంధ తెలంగాణ రాష్ట్ర ఇందిరా ప్రియదర్శిని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెం.8 విడుదల చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం నారాయణగూడ చౌరస్తాలో యూనియన్ అధ్యక్షురాలు గండు అన్నపూర్ణ ఆధ్వర్యంలో నేతలు ఒద్దిరాజు శ్రీదేవి, శివరాణి, యాదమ్మ, ఖమర్ తహెరా తదితరులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గండు అన్నపూర్ణ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ. లక్ష నుంచి రూ.2 లక్షలకు, హెల్పర్స్‌కు రూ.50 వేల నుంచి రూ. లక్షకు పెంచారన్నారు. 60 ఏళ్లు దాటిన వారికి అనారోగ్యం ఇతర కారణాల వల్ల వాలంటరీ రిటైర్మెంట్ తీసుకునే అవకాశం, ఆసరా పెన్షన్ సౌకర్యం కల్పిస్తూ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.విజయ్ కుమార్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి కొత్త సీతారాములు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రణీత్ కుమార్ పాల్గొన్నారు.

సీఎం సభలను అడ్డుకుంటాం



మాట్లాడుతున్న తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి

హిమాయత్‌నగర్: రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారులకు తీపి కబురు ప్రకటిస్తారని ఆశిస్తే, అది చేదుగా మారిందని తెలంగాణ ఉద్యమ కారుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది. మంగళవారం బషీర్ బాగ్ దేశోద్ధారక భవన్ లో టీయూజేఏసీ సెక్రటరీ జనరల్ తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి అధ్యక్షతన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసి చైర్మన్ సుల్తాన్ యాదగిరి మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం పోరాటాలు చేసిన ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని వివిధ పోరాట రూపాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి గుర్తు చేశామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు తీరని ద్రోహం చేసిందన్నారు. ఇందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఉద్యమకారుల హక్కులను సాధించుకునేందుకు త్వరలోనే కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు బత్తుల సోమయ్య, క్రిష్టఫర్, బాకారం లావణ్య, కోతి మాధవరెడ్డి, సుచరిత, అంజలి, సునీత, సుజీ, వెంకటలక్ష్మి, అరుణ, ఎం.శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్ కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాట రూ.17, నల్లవంకాయ.23, పొడుగు వంకాయ. 23, బెండకాయ.45, పచ్చిమిర్చి.40, బజ్జిమిర్చి.28, క్యాప్సికం.57, పచ్చికాకరకాయ.45, పందిరిబీర.50, క్యాబేజీ.18, క్యారెట్.35, దొండకాయ.18, గుండు బీన్నీస్.115, గింజచిక్కుడు.75, గోకరకాయ.45, కీర.23, దోసకాయ.18, బీట్‌రూట్.19, ఉల్లిగడ్డ.20, ఆలుగడ్డ.24, చామగడ్డ.35, మొరంగడ్డ.21, కందగడ్డ.45, క్యాలిఫ్లవర్.23, సొరకాయ.11, పొట్లకాయ.18, అరిటికాయ.11, మునగకాయ.4, మామిడికామ.41, ముల్లంగి.4-5, ఉల్లిపారక.45. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకూ అందుబాటులో ఉంటాయి.

దరఖాస్తుల ఆహ్వానం

రహమత్‌నగర్ : బోరబండలోని తెలంగాణ రాష్ట్ర గురుకుల బాలుర, బాలికల పాఠశాల, కళా శాలల్లో అతిథి అధ్యాపక ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమణమ్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లిష్ , సామాజిక శాస్త్రం, వృక్ష శా స్త్రం, జీవ శాస్త్రం, రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం, మాథమెటిక్స్‌జేఎల్, పీఈటీ, స్కావెంజర్, స్వీపర్ ఉద్యోగాలకు అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారులు జూన్ 10న నేరుగా కళాశాలలో దరఖాస్తులను అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 7330908473, 96182 49353 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

కాచిగూడ: ప్రేమ విఫలమై ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... శంషాబాద్, పెద్దగొల్లపల్లికి చెందిన మల్లేష్ కుమారుడు కొత్తపల్లి మహేష్ కుమార్ (27) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ప్రేమ విఫలమై జీవితంపై విరక్తిచెంది అతను ఉందానగర్-జూకల్ రైల్వే స్టేషన్ల మధ్య రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళల అభివృద్ధికి నైపుణ్య శిక్షణ



కిట్ అందజేస్తున్న దావుదీ బోహ్రా

హైదరాబాద్: మహిళా సాధికారికతకు దావూదీ బోహ్రా ప్రాజెక్ట్ సెంటర్ ఫర్ కేర్‌గివర్ ట్రెనింగ్ అండ్ డెవలప్‌మెంట్ కృషి చేస్తుందని సంస్థ వ్యవస్థాపకురాలు ప్రియ అనంత్ అన్నారు. మంగళవారం సంస్థ ఆధ్వర్యంలో 20 మంది మహిళలకు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. వారికి హెల్త్‌కేర్, కేర్‌గివింగ్ శిక్షణ ద్వారా స్థిరమైన ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్ట్ రైజ్ ద్వారా దావూదీ బోహ్రా సమాజం ఆరోగ్యం, పోషణ, విద్య, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాల్లో దిగువ తరగతి కుటుంబాల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ రైజ్ వలంటీర్ అమ్మార్ షాకిర్, అస్మిత మడిపోజు తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

వెంగళరావునగర్ : గుర్తు తెలియని వ్యక్తులు ఓ మహిళ మెడలో బంగారు గొలుసును లాక్కెళ్లిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఫిల్మ్‌నగర్‌కు చెందిన అంజమ్మ సోమవారం సికింద్రాబాద్‌కు వెళ్లి వెండి వస్తువులు తయారు చేయించుకుని యూసుఫ్‌గూడ బస్తీకి వచ్చింది. సమీపంలోని కల్లు కాంపౌండ్‌లో కల్లు తాగుతుండగా ముగ్గురు మహిళలు వచ్చి ఆమెతో మాటలు కలిపారు. ఆ తర్వాత కొద్ది సేపటికి ముగ్గురూ కలిసి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కెళ్లారు. బాధితురాలు మంగళవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎద్దులను తరలిస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు

వెంగళరావునగర్ : అక్రమంగా ఎద్దులను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు అదుపులోకి తీసుకుని మధురానగర్ పోలీసులకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం మంగళవారం ఉదయం కార్మికనగర్ సమీపంలో ముబీన్, సల్మాన్ ముస్తాఫా అనే వ్యక్తులు 9 ఎద్దులను పాతబస్తీ దూద్‌బౌలీ నుంచి ఎర్రగడ్డకు తరలిస్తున్నారు. పోలీసులు వారిని తనిఖీ చేయగా అక్రమంగా ఎద్దులను తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహనాలను సీజ్ చేసిన పోలీసులు డ్రైవర్లతో పాటు వాహనాల యజమాని మహ్మద్ నవీద్ ఖురేషిపై ఫిర్యాదు చేశారు. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో నర్సింగ్ సూపర్‌వైజర్ మృతి



స్వప్న (ఫైల్)

ఖైరతాబాద్: డ్యూటీలో ఉన్న నర్సింగ్ సూపర్‌వైజర్ గుండెపోటుతో మృతిచెందిన సంఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కేరళకు చెందిన స్వప్న సెబాస్టియన్ బంజారాహిల్స్ కేర్ హాస్పిటల్‌లో నర్సింగ్ సూపర్‌వైజర్‌గా పని చేస్తుంది. మంగళవారం ఉదయం డ్యూటీలో ఉన్న ఆమె వాష్ రూంలో కిందపడటంతో అపస్మారకస్థితికి చేరుకుంది. సిబ్బంది ఆమెను ఎమర్జెన్సీ విభాగానికి తరలించి చికిత్స అందిస్తుండగా మధ్యాహ్నం మృతి చెందింది. హార్ట్ ఎటాక్ కారణంగానే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

వైభవంగా ధ్వజారోహణం



కిషన్ రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న త్రినాథ్‌బాబు



ప్రత్యేక అలంకారంలో వేంకటేశ్వర స్వామి



ధ్వజారోహణం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

హిమాయత్‌నగర్: హిమాయత్‌నగర్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యా యి. ఉదయం మిథున లగ్నంలో ధ్వజారోహణం చేశారు. అనంతరం శేష వాహన సేవ, సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ, రాత్రి హనుమంత వాహన సేవలను ఘనంగా నిర్వహించారు.

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రత్యేక పూజలు

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు కేంద్ర మంత్రి, కిషన్ రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, నాయకులు మాధవి తదితరులు పాల్గొన్నారు.

పలు విమానాలు రద్దు

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయానికి రాకపోకలు సాగించే పలు విమానాలు రద్దు కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. స్పైస్ జెట్‌కు సంబంధించి శివమొగ్గ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి రావాల్సిన విమానంతోపాటు తిరుపతి నుంచి హైదరాబాద్ రావాల్సిన మరో విమానం రద్దు అయింది. శంషాబాద్ విమానాశ్రయం నుంచి తిరుపతి వెళ్లాల్సిన విమానం కూడా రద్దు కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారిక కార్యాచరణ సంబంధిత విషయాల కారణంగా విమానాలు రద్దు అయినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు తెలిపాయి.

కాస్ట్ అకౌంటెంట్స్ కమిటీ చైర్మన్‌గా ఖాజా



లక్డీకాపూల్: ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్ మేనేజింగ్ కమిటీ చైర్మన్‌గా సీఎంఏ ఖాజా జలాలుద్దీన్ ఎన్నికయ్యారు. 2025– 26 సంవత్సరానికి గత నెల 31న ఎన్నిక జరిగింది. గతంలో ఫెలో మెంబర్‌గా వ్యవహరించిన ఖాజాకు రెండు దశాబ్దాలకుపైగా అనుభవం ఉంది. ముఖ్యంగా కాస్ట్ అకౌంటింగ్ రికార్డులు, కాస్ట్ ఆడిట్‌లు, ఎంఐఎస్, అకౌంట్స్, ఫైనాన్స్, ఆడిటింగ్, ఆదాయపు పన్ను, అంతర్గత ఆడిట్లు, బ్యాంక్ ఆడిట్లు, జీఎస్టీ వంటి విభాగాల్లో విశేష సేవలు అందించారు. ప్రస్తుతం ఆయన ప్రాక్టీసింగ్ కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్‌గా పని చేస్తున్నారు. వైస్ చైర్మన్‌గా సీఎంఏ ఎన్ గణేష్, కార్యదర్శిగా సీఎంఏ కీర్తి గుప్తా, కోశాధికారిగా సీఎంఏ మునునూరి బాలకృష్ణ ఎన్నికయ్యారు. సభ్యులుగా సీఎంఏ డాక్టర్ లావణ్య కందూరి, సీఎంఏ హిమ విద్య ననగవరపు, సీఎంఏ డీ వెంకట రాంబాబు, సీఎంఏ ఎల్ ఎస్ శృతి కనిగల్పుల, సీఎంఏ ఈవీ ఉషారాణి ఉన్నారు.

అందాల పోటీలతో ఒరిగిందేమీ లేదు

నాగోలు: హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రపంచ అందాల పోటీల పేరుతో రూ.200 కోట్ల ప్రజాధనం వృథా తప్ప తెలంగాణకు ఏం మేలు జరిగిందని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై.సతీష్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పైసా పెట్టుబడి రాకపోగా మిస్ వరల్డ్ పోటీలకు వచ్చిన అందగత్తెలను వేధింపులకు గురి చేసి ప్రపంచవ్యాప్తంగా తెలంగాణకు చెడ్డపేరు తీసుకొచ్చారని పేర్కొన్నారు. రేవంత్ సర్కారు తీరుతో తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ దిగజారిందని విచారం వ్యక్తం చేశారు.

షాదాన్‌లో నేషనల్ లెవల్ సింపోజియం



సింపోజియంలో ఉత్తమ బహుమతి గెలుచుకున్న బృందం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని షాదాన్ ఉమెన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ క్యాంపస్‌లో మంగళవారం టెక్ట్రాన్–25 నేషనల్ లెవల్ ప్రాజెక్ట్ సింపోజియం నిర్వహించారు. సుమారు 75 బృందాలు పాల్గొని మెషీన్ లెర్నింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డీప్ లెర్నింగ్, ఏఐ, సైబర్ సెక్యూరిటీ వంటి విభిన్న విభాగాల్లో ప్రాజెక్టులతో సాంకేతిక ప్రావీణ్యాన్ని ప్రదర్శిస్తూ పోటీపడ్డారు. షాదాన్ ఉమెన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు కొత్త ఆవిష్కరణలతో ఉత్తమ ప్రాజెక్ట్ కింద రూ.5 వేల ప్రథమ బహుమతిని గెలుచుకున్నారు. స్టాన్లీ బృందం రూ.3 వేలతో ద్వితీయ బహుమతి, ఓయూ బృందం రూ.2 వేలతో తృతీయ బహుమతిని అందుకున్నాయి. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ మహ్మద్ షా ఆలం రసూల్ ఖాన్, జాయింట్ సెక్రటరీ డాక్టర్ జెహ్రా ఖాన్, డైరెక్టర్ డాక్టర్ రెహ్మాన్ షరీఫ్, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

నగరంలో నేడు

- తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట రథసారధి రావి నారాయణరెడ్డి 118వ జయంతి కార్యక్రమం ఉదయం 10.30 గంటలకు లోటస్‌పాండ్‌లోని రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో జరుగుతుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో వేసవి సెలవుల సందర్భంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్ జరుగుతుంది.
- రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్‌లో డిజైన్ ఎక్స్‌ప్లోర్ సమ్మర్ ఇన్నోవేషన్ క్యాంపు–2025 ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజు నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

జంక్షన్‌లో 'జాం'జాటం!

- తార్నాక చౌరస్తాలో భారీగా స్తంభిస్తున్న వాహనాలు
- పాఠశాలలు తెరిస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉండే అవకాశం
- చక్కదిద్దాలంటున్న వాహనచోదకులు



సాక్షి, సిటీబ్యూరో: అది తార్నాక్ జంక్షన్.. దాదాపు దశాబ్ద కాలం మూసి ఉంది.. ఎట్టకేలకు ఇటీవల దానిని తెరిచారు. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా అక్కడ భారీగా వాహనాలు స్తంభిస్తున్నాయి. ట్రాఫిక్ జామ్‌తో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ–లాలాపేట వైపుల నుంచి రాకపోకలు సాగించడానికి గతంలో ఈ జంక్షన్‌ను వినియోగించేవారు. తార్నాక ఫ్లైఓవర్ నిర్మాణానికి ముందు హబ్సిగూడ–మెట్టుగూడ వైపు నుంచి రాకపోకలు సాగించడానికి ఈ జంక్షన్ ఉపకరించింది. 1990లో తార్నాక ఫ్లైఓవర్ అందుబాటులోకి వచ్చింది. మెట్రోరైలు ప్రాజెక్ట్ నిర్మాణానికి ముందు ఈ జంక్షన్ వద్ద ఒకే ట్రాఫిక్ పోలీసు అధికారి విధులు నిర్వర్తించే వారు. తర్వాత ట్రాఫిక్ భారీగా పెరగడంతో ఆ సంఖ్య ఎనిమిదికి పెరిగింది.రోజురోజుకూ జంక్షన్‌లో ట్రాఫిక్ పెరుగుతుండటంతో పాటు ఇతర పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న ట్రాఫిక్ విభాగం ఉన్నతాధికారులు 2015 జులైలో ఈ జంక్షన్‌ను మూసేశారు.

ఏప్రిల్‌లో ప్రయోగాత్మకంగా ప్రారంభించి...

ఈ చౌరస్తా మూసివేత తర్వాత లాలాపేట నుంచి ఉస్మానియా యూనివర్సిటీ వైపు వెళ్లే వాహనాలు హెచ్‌ఎండీఏ కార్యాలయం వరకు వెళ్లి యూ టర్న్ చేసుకుని వచ్చేవి. యూనివర్సిటీ నుంచి లాలాపేట వైపునకు వెళ్లే వాహనాలు రైల్వే డిగ్రీ కళాశాల వద్ద యూ–టర్న్ తీసుకుని వచ్చేలా మార్పులు చేశారు. అయితే కిలోమీటర్ దూరం వెళ్లి యూటర్న్‌లు తీసుకోవాల్సి రావడంతో కొన్నాళ్లకు ఈ చౌరస్తాను తెరవాలంటూ ట్రాఫిక్ విభాగానికి విజ్ఞప్తులు అందాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు ఈ ఏడాది ఏప్రిల్ 20 నుంచి ఈ జంక్షన్‌ను ప్రయోగాత్మకంగా తెరిచారు.

ట్రాఫిక్ జామ్‌కు అనేక కారణాలు...

ఈ జంక్షన్ ద్వారా ఓయూ వైపు నుంచి వచ్చే వాహనాలు నేరుగా లాలాపేట వైపు, కుడివైపు తిరిగి హబ్సిగూడ వైపు వెళ్లేందుకు వీలు కల్పించారు. లాలాపేట వైపు నుంచి వచ్చే వాహనాలు నేరుగా ఓయూ వైపు వెళ్లడానికి, కుడి వైపు తిరిగి మెట్టుగూడ వైపు రావడానికి అవకాశం ఇచ్చారు. మెట్టుగూడ వైపు నుంచి వచ్చే వాహనాలు మాత్రం ఈ చౌరస్తా వద్ద కుడివైపు తిరిగి ఓయూ వైపు వెళ్లే అవకాశం లేదు. నేరుగా హెచ్‌ఎండీఏ కార్యాలయం వరకు వెళ్లి, యూ టర్న్ తీసుకుని వచ్చి, చౌరస్తా వద్ద ఎడమ వైపు తిరిగి ఓయూ రూట్‌లోకి వెళ్లాలి. హబ్సిగూడ వైపు నుంచి వచ్చే వాహనాలు కూడా తార్నాక జంక్షన్ వద్ద కుడి వైపు తిరిగి లాలాపేట వైపు వెళ్లే అవకాశం లేదు. ఈ వాహనాలు ఎడమ వైపు తిరిగి, రైల్వే డిగ్రీ కాలేజీ వరకు వెళ్లి యూ టర్న్ తీసుకోవాలి. ఆపై చౌరస్తా వరకు వచ్చి ఎడమ వైపు తిరిగి లాలాపేట వైపు వెళ్లాలి. అయితే ఈ రెండు వైపుల నుంచి వచ్చే వాహనాలు ఇక్కడ రైట్ టర్న్స్ తీసుకుంటుండటంతో ఇబ్బందులు వస్తున్నాయి.



మరికొన్ని రోజులు ఆగితే ఘోరమే...

ఉప్పల్ వైపు నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్లే వాహనాలు ఫ్లైఓవర్ కింద నుంచి, కుడి వైపుగా వెళ్లాలని, ఉస్మానియా యూనివర్సిటీ వైపు వెళ్లేవి ఎడమ వైపు నుంచి వెళ్లాలని తొలుత నిర్ణయించారు. ఈ మేరకు బొల్లార్డ్స్, తాళ్లు ఏర్పాటు చేసినా ఫలితం ఇవ్వకపోవడంతో ఈ విధానానికి స్వస్తి చెప్పాల్సి వచ్చింది. తార్నాకతోపాటు ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు అనేకం ఉన్నాయి. ప్రస్తుతం పీక్ అవర్స్‌లో ఈ జంక్షన్‌లో భారీగా ట్రాఫిక్ స్తంభిస్తోంది. విద్యా సంస్థలకు వేసవి సెలవులు ముగిసి తెరుచుకుంటే ట్రాఫిక్ పెరుగుతుందని, అప్పుడు పరిస్థితులు మరింత దారుణంగా తయారవుతాయని వాహనదారులు అభిప్రాయపడుతున్నారు. దీనిపై ట్రాఫిక్ అధికారులు దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

సంక్షేమ నిధి స్టాంప్ ధర తగ్గించాలి

తెలంగాణ అడ్వకేట్ నోటరీ అసోసియేషన్ డిమాండ్



వినతిపత్రం సమర్పించిన అసోసియేషన్ అధ్యక్షుడు గంజి యాదగిరి తదితరులు

పద్మారావునగర్: సంక్షేమ నిధిస్టాంప్ ధరను రూ.200లకు తగ్గించాలని తెలంగాణ అడ్వకేట్ నోటరీ అసోసియేషన్ అధ్యక్షుడు గంజి యాదగిరి డిమాండ్ చేశారు. తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ నర్సింహారెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ బార్ కౌన్సిల్ కార్యాలయ ఇన్‌చార్జి నాగలక్ష్మిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు గంజి యాదగిరి మాట్లాడుతూ ఇప్పటివరకు సంక్షేమ నిధి స్టాంప్ ధర కేవలం వంద రూపాయలు మాత్రమే ఉండేదని, దానిని తాజాగా రూ. 250కి పెంచారన్నారు. ఈ నిర్ణయం వల్ల తెలంగాణలోని అన్ని కోర్టుల్లోని న్యాయవాదులపై ఆర్థిక భారం మోపేలా ఉందన్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. న్యాయవాదుల సంక్షేమ నిధి ప్రయోజనాన్ని రూ. 6 లక్షల నుంచి రూ. 12లక్షలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి. అనిల్‌కుమార్, ఇంతియాజ్, కోశాధికారి ఏబీ నర్సింగ్‌రావు, మయ బ్రహ్మానర్సింహ్మా, కె.నర్సింహ్మారావు, ఎం.వెంకటేష్, పి. సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రూ.4 లక్షల పీఎఫ్

– సీఎం ప్రజావాణికి ధన్యవాదాలు తెలిపిన తల్లిదండ్రులు



నోడల్ అధికారి దివ్యకు కృతజ్ఞతలు తెలుపుతున్న ప్రవీణ్ తల్లి రామలక్ష్మి

లక్డీకాపూల్: సీఎం ప్రజావాణి చొరవతో ఓ మృతుడి కుటుంబానికి రూ. 4 లక్షల ప్రావిడెంట్ ఫండ్(పీఎఫ్) అందింది. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం జరిగిన ప్రజావాణికి వచ్చిన మృతుడి తల్లిదండ్రులు ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యలకు ధన్యవాదాలు తెలిపారు. సీఎం ఎ.రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నగరంలోని జగద్గిరిగుట్టకు చెందిన పాల ప్రవీణ్ ఒక ప్రైవేట్ సంస్థలో ఉద్యోగి. ఐదేళ్ల క్రితం ఆయన ప్రమాదవశాత్తు మృతి చెందారు. పీఎఫ్ అందించాలని కుటుంబసభ్యులు అప్పటి నుంచి అధికారుల చుట్టూ తిరిగినా లాభం లేకపోవడంతో మూడు నెలల క్రితం సీఎం ప్రజావాణికి వచ్చిన మృతుడి తల్లిదండ్రులు పాల నాగేశ్వరరావు, రామలక్ష్మి అర్జీ పెట్టుకున్నారు. దీనిపై చిన్నారెడ్డి, దివ్య దేవరాజన్‌ల ఆధ్వర్యంలో అధికారులు ప్రైవేట్ సంస్థ, పీఎఫ్ అధికారులతో సంప్రదింపులు జరిపి రూ. 4 లక్షల పీఎఫ్ డబ్బులను ఇప్పించారు. దీంతో ప్రవీణ్ తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

బతుకమ్మ పండుగ నాటికి బతుకమ్మకుంట రెడీ



బతుకమ్మకుంట అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న రంగనాథ్

అంబర్‌పేట: వచ్చే బతుకమ్మ పండుగ నాటికి బతుకమ్మ కుంటను అందుబాటులోకి తీసుకువచ్చేలా కృషి చేస్తున్నట్లు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. దీనికి పరిసర ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు. బతుకమ్మకుంటలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. కుంట లోతును మరింతగా పెంచాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పరిసర ప్రాంతాల నివాసాల నుంచి డ్రైనేజీ నీరు ఎట్టి పరిస్థితుల్లోనూ కుంటలోకి రాకుండా పకడ్బందీ నివారణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. వర్షపునీటి ముంపు ముప్పును కుంట కింద జనావాసాల్లోకి రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమీపంలో స్థానికులకు కమ్యూనిటీ హాల్ నిర్మాణ అంశాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటానని స్థానికుల విజ్ఞప్తి మేరకు ఆయన స్పందించారు. కుంట అభివృద్ధి జరుగుతున్నప్పుడు వచ్చే చిన్న, చిన్న సమస్యలను క్లిష్టంగా మార్చవద్దని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి, సీపీఎం నాయకులు మహేందర్, అధికారులు, స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఆబ్కారీ శాఖలో బదిలీలు చేపట్టాలి

లక్డీకాపూల్: రాష్ట్ర ఆబ్కారీ శాఖలో ఏళ్ల తరబడి బదిలీలు స్తంభించాయని పలువురు కానిస్టేబుళ్లు ఆవేదన వ్యక్తం చేశారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమానికి ఆబ్కారీ శాఖ హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎనిమిదేళ్లుగా తమకు బదిలీలు లేవని తెలిపారు. ఇతర స్థానాలకు బదిలీ చేయాలని కోరుతూ అర్జీ పెట్టుకున్నారు. దీనిపై స్పందించిన సీఎం ప్రజావాణి ఇన్‌చార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ బదిలీల అంశంపై చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. హైదరాబాద్‌లో సైనిక్ స్కూల్ ఏర్పాటుకు చొరవ చూపాలని కోరుతూ పలువురు దరఖాస్తును సమర్పించారు. మొత్తం 221 దరఖాస్తులు అందాయని ప్రజావాణి కోఆర్డినేటర్ రాకేష్ తెలిపారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి పలు సమస్యలను చిన్నారెడ్డి, దివ్య దేవరాజన్‌లు పరిష్కరించారు.

రాష్ట్రపతి నిలయంలో వాతావరణ దినోత్సవం



బొల్లారం: ప్రపంచ వాతావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బొల్లారం రాష్ట్రపతి నిలయంలో మంగళవారం నుంచి మూడు రోజులపాటు విద్యార్థుల కోసం ప్రత్యేక వర్క్‌షాప్‌లు ప్రారంభమయ్యాయి. 10 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన విద్యార్థులు పెద్దఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను అభివృద్ధి చేయడం, పర్యావరణం పట్ల అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నారు. డ్రోన్ మేకింగ్, పాట రీ, వెల్త్ ఫ్రం వేస్ట్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, జ్యువెలరీ తయారీ, ఫైర్‌లెస్ కుకింగ్ లాంటి శిక్షణలు ఇందులో ఉన్నాయి. మంగళవారం నిర్వహించిన డ్రోన్ మేకింగ్ వర్క్‌షాప్‌నకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. పిల్లలందరికీ ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనటానికి రెండు రోజులపాటు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు అవకాశముంటుంది. పాల్గొనదలచిన విద్యార్థులు httpr://rb.ni-c.in/Qbniayam/ వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. మరిన్ని వివరాల కోసం 040–29560518 నంబరుకు సంప్రదించవచ్చు.

ఘనంగా మేరు సమ్మర్ చాలెంజ్..

– ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్‌లో పోటీల్లో ప్రతిభ చూపిన బాలలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని మేరు ఇంటర్నేషనల్ స్కూల్ వేదికగా తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ సహకారంతో నిర్వహించిన మేరు సమ్మర్ చాలెంజ్–2025లో 400కిపైగా క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించారు. రెండు రోజులపాటు జరిగిన ఈ సమ్మర్ చాలెంజ్‌లో యువ క్రీడాకారులు, కుటుంబ సభ్యులు, స్థానికులు క్రీడల్లో పాల్గొన్నారు. 40 జట్లతో 400 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో అండర్–10, అండర్–12 బాలుర ఫుట్‌బాల్, అండర్–10, అండర్–12 బాలికల బాస్కెట్‌బాల్ విభాగాలు ఉన్నాయి. ఈ పోటీలను మరింత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్, బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి అర్హత పొందిన నిపుణులు రిఫరీలుగా వ్యవహరించారు. ఈ మేరు సమ్మర్ చాలెంజ్ 2025లో విజేతలకు నిర్వాహకులు పతకాలు, ట్రోఫీలను అందించి అభినందించారు.

మెట్రో పిల్లర్లపై ఒవైసీ పోస్టర్లు

సాక్షి,సిటీబ్యూరో: నగరంలోని మెట్రో పిల్లర్లపై ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పోస్టర్లు ప్రత్యక్షమయ్యాయి. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఒవైసీ గళం.. శత్రు దేశాన్ని దీటుగా ఎదుర్కొంటున్న నాయకుడంటూ ఒవైసీ ఫొటోలతో పోస్టర్లు దర్శనమిస్తున్నాయి.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నతంగా ఎదగాలి

- బీసీ గురుకులాల విద్యార్థుల సన్మాన సభలో మంత్రి పొన్నం
- చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచన



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సనత్‌నగర్: మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత స్థానానికి ఎదిగిఆదర్శంగా నిలవాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బేగంపేట ఐఏఎస్ ఆఫీసర్స్ క్లబ్‌లో బీసీ గురుకులాలు, హాస్టళ్లలో పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. దుర్గాభవానీ (593 మార్కులు), శివానీ (590)లతోపాటు 580 మార్కులకు పైగా 31 మంది, 570 మార్కులకు పైగా 216 మంది విద్యార్థులు సాధించి వారి తల్లిదండ్రులకు, రాష్ట్రానికి పేరు తీసుకువచ్చారని కొనియాడారు. గత విద్యా సంవత్సరంలో 140 స్కూళ్లలో 100 శాతం ఉత్తీర్ణత శాతం ఉందని, మిగిలిన స్కూళ్లలో ఎందుకు తగ్గిందనే విషయమై సమీక్ష చేయాలన్నారు. విద్యార్థులకు ట్రెక్కింగ్, సెయిలింగ్ వంటి క్రీడాంశాల్లో కూడా మెలకువలు అందిస్తున్నట్లు మంత్రి వివరించారు. విద్యార్థులు పోటీ ప్రపంచంలో నెగ్గేలా పరిస్థితులను అర్థం చేసుకోవాలని సూచించారు. ఏ గురుకులంలో కూడా ఖాళీ స్థానాలు ఉండొద్దని, అన్ని పాఠశాలల్లో 100 శాతం సీట్లు నిండాలన్నారు. ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో 25 ఎకరాల్లో 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభించనున్నదని, ఇప్పటికే 58 పాఠశాలలు మంజూరయ్యాయన్నారు. జ్యోతిరావుపూలే సినిమాను అన్ని గురుకులాల్లో తల్లిదండ్రులతోసహా విద్యార్థులకు చూపెడతామని చెప్పారు. మహనీయులు జ్యోతిరావు, సావిత్రిబాయి పూలే దంపతులను ఆదర్శంగా తీసుకుని ముందుకుసాగాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, కమిషనర్ బాల మాయాదేవి, గురుకుల సెక్రటరీ సైదులు, ఎంబీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ డాక్టర్ మల్లయ్యభట్టు, సీఈఓ అలోక్‌కుమార్, మద్దిలేటి, జీవీ శ్యాంప్రసాద్‌లాల్, డాక్టర్ తిరుపతి, గురుకులాల అధికారులు, సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

అపోలో ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

తొమ్మిది నెలల చిన్నారికి విజయవంతంగా కాంక్లియర్ ఇంప్లాంట్



శస్త్రచికిత్స చేసిన చిన్నారితో వైద్యబృందం..

పంజగుట్ట: తీవ్ర శ్రవణ లోపంతో బాధపడుతున్న తొమ్మిది నెలల చిన్నారికి నగరంలోని అపోలో ఆసుపత్రి వైద్యులు అరుదైన శబ్దజ్ఞాన (కాంక్లియర్ ఇంప్లాంట్) శస్త్రచికిత్సను విజయవంతంగా చేశారు. మంగళవారం ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వినయ్ కుమార్, సీఈవో తేజశ్వీరావు మాట్లాడుతూ అమెరికాలోని గయానాలో నివసించే భారతీయ మూలాలున్న దివేక ధన్‌రాజ్, సతీష సంకిష్న దంపతుల కూతురు లావణ్యకు వినికిడి లోపం ఉందన్నారు. కాంక్లియర్ హైపోప్లాసియా, ఎడమ చెవిలో అసాధారణ కాంక్లియర్ నిర్మాణం ఉన్నట్లు స్కానింగ్‌లో తేలిందని తెలిపారు. దీంతో అంతర్జాతీయ వైద్య కేంద్రాలు చిన్నారికి శస్త్రచికిత్స చేయడానికి నిరాకరించాయన్నారు. దీంతో సొసైటీ టు ఎయిడ్ ది హియరింగ్ ఇంపైర్డ్, శ్రీ సత్యసాయి సంస్థ సహకారంతో అపోలో ఆసుపత్రిని సంప్రదించగా శిశువుకు వైద్యం అందించేందుకు సిద్ధపడ్డట్లు తెలిపారు. మే 17వ తేదీన అపోలో ఈఎన్‌టీ విభాగాధిపతి డాక్టర్.సి.వినయ్‌కుమార్, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ కె.రాంబాబు, డాక్టర్ జస్విందర్ సింగ్ సలూజా, ఇంప్లాంటేషన్ ఆడియాలజిస్ట్ డాక్టర్ ఐ.శ్రీకాంత్ బృందం లావణ్యకు శస్త్రచికిత్సను విజయవంతంగా చేసినట్లు చెప్పారు. ఈ బృందం ఇప్పటికే 2,700 కంటే ఎక్కువ కాంక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సలు చేసిన అనుభవం ఉందని పేర్కొన్నారు.

అంబేడ్కర్ వర్సిటీతో అవగాహన

కోర్సులు అందించనున్న అపోలో, కిమ్స్, దారుస్సలాం సంస్థలు



వైస్ చాన్స్‌లర్ చక్రపాణి సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న దృశ్యం

బంజారాహిల్స్: డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ఎంబీఏ, హాస్పిటల్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్(హెచ్‌హెచ్‌సీఎం) కోర్సులను అందించడానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి సమక్షంలో మూడు విద్యాసంస్థలు మంగళవారం ఒప్పందం కుదుర్చుకున్నాయి. అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్, కిమ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ, దారుస్సలాం ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌తో వేర్వేరుగా అవగాహనా ఒప్పందాలను పునరుద్ధరించిట్లు రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్.విజయాకృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అపోలో నుంచి డాక్టర్ భాస్కర్‌రెడ్డి, ప్రొఫెసర్ విజయ రుద్రరాజు, కిమ్స్ నుంచి డాక్టర్ రాజేంద్ర అన్నె, ప్రొఫెసర్ రవి కుమార్, దారుస్సలాం ఎడ్యుకేషన్ ట్రస్ట్ తరఫున డాక్టర్ మనీషా సక్సేనా ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. సమావేశంలో అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.పుష్ప చక్రపాణి, డీన్ కామర్స్ ప్రొఫెసర్ ఐ.ఆనంద్ పవార్, ప్రొఫెసర్ కిరణ్మయి, డా.వై.వెంకటేశ్వర్లు, డాక్టర్ బి.శ్రీనివాస్, డాక్టర్ పి.రాధాకృష్ణ, డాక్టర్ బర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలో హోటల్ ఆహార వ్యర్థాలా?

యజమానిపై మండిపడ్డ జలమండలి ఎండీ



మ్యాన్‌హోల్‌లో హోటల్ ఆహార వ్యర్థాలు వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అశోక్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: హోటళ్ల మురుగునీటి పైప్‌లైన్‌లోకి ఆహార వ్యర్థాలు వదలడంపై జలమండలి తీవ్రంగా పరిగణించింది. మలక్‌పేట చౌరస్తా వద్ద మ్యాన్‌హోల్‌లోకి ఆహార వ్యర్థాలను మళ్లించిన హోటల్ యజమానిపై జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సిల్ట్ చాంబర్ వారంలోగా నిర్మించుకోకుంటే హోటల్‌ను సీజ్ చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం మలక్‌పేట ప్రాంతాన్ని సందర్శించారు. డ్రైనేజీ పైప్‌లైన్లలో కరగని వ్యర్థాలు లేకుండా సాఫీగా మురుగునీరు పరుగెత్తించేందుకు జలమండలి ఆరు నెలలుగా ప్రయత్నిస్తోంది. కరగని వ్యర్థాలు మురుగు ప్రవాహానికి అడ్డుపడుతున్నట్లు మ్యాన్‌హోల్ టు మ్యాన్‌హోల్ డీ–సిల్టింగ్‌లో భాగంగా గుర్తించింది. మురుగునీటిలో కరగని వ్యర్థాలను ఎక్కడికక్కడే కట్టడి చేసేందుకు చర్యలు చేపట్టింది. ప్రధానంగా మురుగునీరు అధికంగా ఉత్పన్నమయ్యే హోటళ్లు, రెస్టారెంట్లు, హాస్టళ్లు, హాస్పిటళ్లు, మాల్స్, బేకరీలు, బహుళ నివాస సముదాయాల సీవరేజీ కనెక్షన్లపై దృష్టి సారించింది. అందులో ఉత్పన్నమయ్యే మురుగు నీరంతా ముందుగా సిల్ట్ చాంబర్‌లో చేరేవిధంగా చర్యలు చేపట్టింది. వడబోతలో ఘనపదార్థాలు ఆగిపోయి మురుగునీరు మాత్రమే డ్రైనేజీ పైప్‌లైన్‌లోకి కలిసే విధంగా సిల్ట్ చాంబర్ల ఏర్పాటును తప్పనిసరి చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే సిల్ట్ చాంబర్లు లేని కొన్ని భవనాలను గుర్తించి నోటీసులు జారీ చేసి.. తక్షణమే వాటిని నిర్మించుకోవాలని ఆదేశించింది. సీవరేజ్ పైపు లైన్లలో ఘన వ్యర్థాలను వేయడం నేరం. ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టరీత్యా శిక్షించే అవకాశం ఉంటుంది.

హెచ్‌సీయూ–సౌత్ వేల్స్ వర్సిటీ ఒప్పందం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ– ఆస్ట్రేలియాలోని సౌత్ వేల్స్ విశ్వవిద్యాలయం మధ్య ఒప్పందం కుదిరింది. మంగళవారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌ను సౌత్‌వేల్స్ విశ్వవిద్యాలయ ప్రతినిధుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావుతో ఆ బృందం ప్రత్యేకంగా సమావేశమై అంతర్జాతీయ స్థాయిలో విద్యా, ఇతర అంశాలపై పరస్పరం సహకరించుకోవడం , సంయుక్తంగా చేపట్టే కార్యక్రమాలపై చర్చించారు. విద్యా, పరిశోధనలో ప్రపంచ భాగస్వామ్యాలను పెంపొందించే దిశగా హెచ్‌సీయూ–యూనివర్సిటీ ఆఫ్ సౌత్ వేల్స్(యూఎస్‌డబ్ల్యూ) ముఖ్యమైన అడుగు వేశాయి. యూఎస్‌డబ్ల్యూ నుంచి డాక్టర్ ఆండ్రూ థాంప్సన్, శ్రీవిష్ణు ధనపాల్‌లతో కూడిన ప్రతినిధుల బృందం హెచ్‌సీయూను సందర్శించింది. నాలుగు అంశాలపై జరిగిన ఒప్పందంపై ఆ రెండు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ అంతర్జాతీయ వ్యవహారాల కార్యాలయం డైరెక్టర్ ప్రొఫెసర్ బ్రహ్మానందం, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ డీన్ ప్రొఫెసర్ జీవీఆర్‌కే ఆచార్యులు, స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్స్ డీన్ డాక్టర్ రమేశ్ కుమార్ మిశ్రా, పబ్లిక్ రిలేషన్స్ కార్యాలయం అధికారులతో కలిసి చర్చల్లో పాల్గొన్నారు.



ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరికీ హస్తభూషణంగా మారింది వాటర్ బాటిల్. మన చేతుల్లో ఉండే వస్తువుల్లో ముఖ్యమైనదిగా ఈ బాటిల్స్ మారాయి. పనిలో పనిగా గుళ్ల నుంచి జిమ్ వరకూ, స్కూల్ బ్యాగ్ నుంచి కార్ కోల్డ్ బాక్స్ వరకూ ప్రతిచోటా ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ సర్వ సాధారణం అయ్యాయి. జెన్ జీ భాషలో చెప్పాలంటే ఒక 'లైఫ్‌స్టైల్ స్టేట్మెంట్'గా అయిపోయింది. ప్లాస్టిక్ బాటిళ్లు విభిన్న డిజైన్లలో లభ్యమవుతుండటంతో మార్కెట్‌లో విపరీతంగా అమ్ముడవుతున్నాయి. మరీ ముఖ్యంగా ప్రస్తుతం స్కూల్స్ పునఃప్రారంభం అవుతున్న నేపథ్యంలో నగరంలో అధిక సంఖ్యలో ఈ ప్లాస్టిక్ బాటిల్స్ అమ్మకాలు జరుగుతున్నాయి. అయితే ఈ బాటిళ్ల వల్ల కలిగే అనారోగ్య, పర్యావరణ సమస్యలు వెంటాడుతున్నాయి. దీనిపై విస్తృత ప్రచారం ఉన్నప్పటికీ డిజైన్స్‌కి ఆకర్షితులవుతూ.. వివిధ రకాల రోగాలకు చేరువవుతున్నారు.

-సాక్షి, సిటీబ్యూరో

అవసరమా..! ఆకర్షణీయమా?



ప్రతి ఒక్కరికీ హస్తభూషణమైన వాటర్ బాటిల్

ప్లాస్టిక్ వాటర్ బాటిల్‌తో ఆరోగ్యానికి చేటు

డిజైన్స్‌కి మోజుపడి డిసీజ్‌లకు చేరువవుతున్న వైనం

నీటి వినియోగం పర్యావరణానికీ ప్రమాదకరం

స్కూల్ పునఃప్రారంభం నేపథ్యంలో సిటీలో అత్యధిక అమ్మకాలు

ప్లాస్టిక్ బాటిల్స్ ఇప్పుడు మార్కెట్లో అందుబాటులో ఉండటమే కాకుండా, రకరకాల రంగులు, డిజైన్లు, కార్టూన్ క్యారెక్టర్లు, గ్లిట్టర్ ఎఫెక్ట్స్‌తో అందరి మనసు దోచేస్తున్నాయి. ప్రత్యేకించి చిన్నపిల్లలు అవి చూసి వాటిపై మక్కువ పెంచుకుంటున్నారు. నగరంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా స్కూల్స్ పునః ప్రారంభమవుతున్న నేపథ్యంలో పిల్లల కోసం బాటిల్స్ కొనుగోలు ఎక్కువగా జరుగుతోంది. దీంతో పాటు మార్కెట్‌లో పిల్లల కోసం వివిధ మోడళ్లు అందుబాటులో ఉండటంతో కొందరు ఒకటికి మించి బాటిళ్లను వినియోగిస్తున్నారు. తల్లిదండ్రులు కూడా తక్కువ ధరకు వస్తున్నాయనే ఉద్దేశంతో పిల్లలు అడిగినట్లు రెండు మూడు రకాలు కొని పెడుతున్నారు.

స్టైలిష్ డిజైన్ల పేరిట ప్రమాదం..

బిస్ ఫినాల్-ఏ (బీపీఏ), మైక్రోప్లాస్టిక్స్ వంటి రసాయనాలు కొన్ని తక్కువ నాణ్యత గల ప్లాస్టిక్ బాటిల్స్‌లో ఉండే అవకాశముంది. ఇవి నీటిలో కలిసిపోయి మానవ శరీరంలోకి చేరినప్పుడు, హార్మోనల్ డిసార్డర్స్, మానసిక అభివృద్ధి సమస్యలు, తక్కువ నిరోధక శక్తి వంటి అనారోగ్యాలను కలిగించే ప్రమాదం ఉంది. ముఖ్యంగా చిన్న పిల్లల ఆరోగ్యానికి ఇది ఓ మౌన సంకటమే. వాస్తవానికి తల్లిదండ్రులకు దీనిపై అవగాహన లేకపోవడంతో స్టైలిష్ డిజైన్ల పేరిట ప్రమాదాన్ని కొనుగోలు చేస్తున్నారు.



ఆ బాధ్యత మనదే..

పిల్లల కోసం బాటిల్ కొంటే, దాని శక్తినీ, దుష్ప్రభావాలనూ అంచనా వేయాలి. మెటీరియల్ ఎలా ఉందో తెలుసుకోవాలి. అందం మాత్రమే కాకుండా ఆరోగ్యం అనే కోణాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ఇక స్కూల్స్, కంపెనీలు కూడా ప్లాస్టిక్ బాటిల్స్ వినియోగాన్ని తగ్గించేందుకు స్పష్టమైన మార్గదర్శకాలు అమలు చేయాల్సిన అవసరముందని నిపుణులు, సామాజిక వేత్తలు నినదిస్తున్నారు. ప్లాస్టిక్ బాటిల్ ఇప్పుడు ఒక హస్తభూషణం అవుతున్నా, దీని వెనుక ఆరోగ్యాన్ని, భవిష్యత్తును పణంగా పెట్టుకోవడం దురదృష్టకరం. మన చేతిలో ఉన్న బాటిల్ కాస్త బాధ్యతతో ఎంచుకుంటే, మన ఆరోగ్యాన్ని రక్షించడమే కాదు, భూమిని కూడా కాపాడిన వాళ్లమవుతామని ప్రకృతి ప్రేమికులు సూచిస్తున్నారు.

పర్యావరణానికి భారంగా ప్లాస్టిక్..

ప్లాస్టిక్ అనేది సహజంగా కుళ్లని పదార్థం. ప్లాస్టిక్ బాటిల్స్ ఒకసారి భూమిలో పడితే దాదాపు 450 ఏళ్ల పాటు మట్టిలో కలిసిపోవు. హైదరాబాద్ నగరంలో ప్రతి రోజు వేల సంఖ్యలో వినియోగించిన బాటిల్స్ పారేస్తున్నారు. వీటిలో మళ్లీ రీసైకిల్ అవ్వడం చాలావరకూ జరగకపోవడం వల్ల, ఈ ప్లాస్టిక్ వాడకం అత్యధిక వ్యర్థంగా మారుతోంది. నగర శుభ్రతపై కూడా ప్రభావం చూపుతోంది.



ప్రత్యామ్నాయాల వైపు చూపు..

మెటల్ బాటిల్స్ (స్టీల్, కాపర్) మునుపటి కాలంలో ఎక్కువగా వాడేవారు. ఇవి ఆరోగ్యానికి మంచివి, మైక్రోప్లాస్టిక్స్ సమస్య ఉండదు. దీర్ఘకాలికంగా వాడవచ్చు. కానీ ప్లాస్టిక్ బాటిల్స్‌లో ఉన్న డిజైన్ వైవిధ్యం, తక్కువ ధర, తక్కువ బరువు వల్ల ప్రజలు వాటిపైనే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. ఈ స్థితిలో డిజైనర్లకు, తయారీదారులకు కూడా నూతన బాధ్యత ఉంది.. ఆరోగ్యానికి హానీ లేకుండా, ఆకర్షణీయమైన డిజైన్లతో మెటల్ బాటిల్స్ తయారు చేయడం మాత్రమే దీనికి ఏకైక పరిష్కారం. వీలుంటే గ్లాస్ బాటిల్లు వినియోగించడం మరింత ఉత్తమం.





భాగ్యనగరానికి బై..బై..

మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొన్న మిస్ సౌత్ ఆఫ్రికా మియా లే రౌక్స్ తన స్వదేశానికి మంగళవారం బయలుదేరారు. విమానాశ్రయంలో ఆమెకు సంప్రదాయ పద్ధతిలో గౌరవంగా వీడ్కోలు పలికారు.

– సాక్షి, సిటీ బ్యూరో

డిజిటల్ మార్కెటింగ్‌లో ఏఐ ఆధారిత కోర్సు..

సాక్షి, సిటీబ్యూరో: కొండాపూర్‌లో ఉన్న కేఎల్‌హెచ్ గ్లోబల్ బిజినెస్ స్కూల్ (కేఎల్‌హెచ్ జీబీఎస్) ఏఐ ఆధారిత డిజిటల్ మార్కెటింగ్‌లో కొత్త కోర్సును అందించనుంది. ఈ విషయాన్ని మంగళవారం నిర్వహించిన సమావేశంలో స్కూల్ ప్రతినిధులు తెలిపారు. అభివృద్ధి చెందుతున్న డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో కృత్రిమ మేధస్సు (ఏఐ)ను మేళవించే నైపుణ్యాన్ని ఇది అందిస్తుందని, ఈ హైబ్రిడ్-ఫార్మాట్ ప్రోగ్రామ్ జూన్ 15న ప్రారంభం కానుందని వివరించారు. విద్యార్థులకు మాత్రమే కాకుండా ఫ్రీలాన్సర్లు, కంటెంట్ క్రియేటర్లు, మార్కెటింగ్ నిపుణులకు కూడా ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సమావేశంలో సంస్థ వైస్ ప్రెసిడెంట్ కోనేరు లక్ష్మణ్ హవిష్ బిజినెస్ స్కూల్ డీన్ డాక్టర్ ఆనంద్ బేతపూడి పాల్గొన్నారు.

ముగిసిన బాక్స్ క్రికెట్ ప్రీమియర్ లీగ్

బీసీపీఎల్ సీజన్ 4లో విజేతగా భాగ్యనగర్ టైగర్స్



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ది పిచ్ వేదికగా నిర్వహించిన ఈ తరం ట్రెండింగ్ గేమ్ 'బాక్స్ క్రికెట్ ప్రీమియర్ లీగ్' (బీసీపీఎల్) 2025 సీజన్ 4 ఉత్కంఠభరితంగా ముగిసింది. ఈ సంవత్సరం బాక్స్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ శక్తివంతమైన 10 జట్ల జాబితాను సేకరించింది. ప్రతి జట్టులో 8 మంది ఆటగాళ్లతో 80 మంది క్రీడాకారులు తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. లీగ్‌లో భాగంగా చివరి పోరులో భాగ్యనగర్ టైగర్స్, డైనమైట్ జట్టును ఢీకొట్టింది. ముందుగా బ్యాటింగ్ చేసిన డైనమైట్స్ 7 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 65 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. భాగ్యనగర్ టైగర్స్ తమ అద్భుత ప్రదర్శనతో కేవలం 3.5 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించగలిగింది. టైగర్స్ దివా అద్భుత ప్రదర్శనతో ఛాంపియన్‌షిప్‌లో కీలక పాత్ర పోషించాడు. మార్వాడి రాయల్స్ మాయన్ లాయల్ టోర్నమెంట్‌లో టెస్ట్ బౌలర్‌గా గుర్తింపు పొందాడు. బెస్ట్ బ్యాట్స్‌మన్ టైటిల్‌ను పవర్ హిట్టర్స్ రచనేష్ దుబే గెలుచుకున్నాడు. ముఖ్య అతిథిగా డాక్టర్ అజయ్ కుమార్ అగర్వాల్, గోపాల్ బల్దవ, వేద్ ప్రకాష్ జోషి, శ్రీకిషన్ శర్మ, పురుషోత్తం పాల్గొన్నారు.

సెక్రటేరియట్ వద్ద సైక్లింగ్



లక్డీకాపూల్ : ఒకప్పుడు మధ్యతరగతి నేస్తం.. ఇప్పుడు కొందరికి వ్యాయామ సాధనంగా మారింది.. పెట్రోల్‌తో పనిలేదు, డబ్బులు ఎక్కువ ఖర్చు చేయనక్కర్లేదు. ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో మంగళవారం ఘనంగా వేడుకలు జరిగాయి. ఇందులో భాగంగా రాష్ట్ర సచివాలయం ముందు కొంత మంది సైక్లిస్టులు 10కిలోమీటర్లు సైక్లింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సైక్లిస్ట్, నేచర్ క్యూర్ ఆస్పత్రి డాక్టర్ ఎం.నాగలక్ష్మి మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ఆ దిశగా వారిని మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. ముఖ్యంగా వర్కింగ్ ఉమెన్స్ పనిచేసే చోట తగిన గుర్తింపు అవసరమన్నారు.

మిస్ యూనివర్స్ సన్నాహకం..

సాష్ కార్యక్రమంలో సందడి చేసిన మిస్ యూనివర్స్ ఔత్సాహికులు

రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 30 మంది పోటీదారుల ఎంపిక

7, 8 తేదీల్లో గ్రాండ్ ఫినాలే..



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ప్రతిష్టాత్మక మిస్ వరల్డ్ సందడి ముగిసిందో లేదో మరో అంతర్జాతీయ గ్లామర్ వేదిక 'మిస్ యూనివర్స్' సందడి మొదలైంది. మిస్ యూనివర్స్ పోటీల్లో భాగంగా మంగళవారం నగరంలోని దస్పల్లా హోటల్ వేదికగా సాష్ నిర్వహించారు. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనాలనుకునే ఔత్సాహికులు ఈ సాష్ ఈవెంట్‌లో తమ క్యాట్ వాక్‌తో అలరించారు. మిస్ యూనివర్స్ తెలంగాణ, మిస్ యూనివర్స్ ఆంధ్రప్రదేశ్ ఎడిషన్ల కోసం పోటీదారులుగా ప్రతి రాష్ట్రం నుంచి 15 మంది ఎంపిక కాగా ఈ రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 30 మంది అలరించారు. అంతర్జాతీయ అందాల వేదికపై భారతీయ ప్రశస్తిని సగర్వంగా ప్రదర్శించేందుకు తెలుగు అమ్మాయిలు సన్నద్ధమవుతున్నారు, బ్యూటీ రంగంలో మన ప్రత్యేకతను చాటుకుంటున్నామని మిస్ యూనివర్స్ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ప్రసాద్ గారపాటి తెలిపారు. తెలుగు సాంస్కృతిక వారసత్వాన్ని ప్రదర్శిస్తూ భారత్‌కు ప్రాతినిధ్యం వహించడానికి విభాగాల్లో తలపడనున్నామని మిస్ యూనివర్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ సునీత సంతోషం వ్యక్తం చేశారు. ప్రపంచ ప్రఖ్యాత కొరియోగ్రాఫర్ ఆంటోనీ గుంజాల్వెస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన కంటెస్టెంట్‌లకు ఈ నెల 6న మాదాపూర్‌లోని అర్రైవల్ హోటల్స్ వేదికగా మిస్ యూనివర్స్ ఆర్గనైజేషన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంది. 7, 8 తేదీల్లో నగరంలోని ధారా రిసార్ట్ అండ్ కన్వెన్షన్‌లో గ్రాండ్ ఫినాలే నిర్వహించి విజేతలను ఎంపిక చేస్తుంది. మిస్ యూనివర్స్ ఇండియా రియా సింఘా విజేతకు కిరీటం ధరింపజేస్తారు. రాష్ట్ర సమాచార–సాంకేతిక, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్, టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

7, 8 తేదీల్లో గ్రాండ్ ఫినాలే..





సబ్ లెఫ్టినెంట్‌గా ముఫకంజా కళాశాల పూర్వ విద్యార్థి

నగరం నుండి నావికాదళానికి



బంజారాహిల్స్: నగరానికి చెందిన ఓ యువకుడు భారత నావికాదళంలో సబ్ లెఫ్టినెంట్ అధికారిగా బాధ్యతలు చేపట్టాడు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ముఫకంజా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (ఎంజేసీఈటీ) నుండి మహ్మద్ అబూబకర్ 2022 సివిల్ ఇంజినీరింగ్‌లో గ్రాడ్యుయేట్ అయ్యారు. కళాశాలలో ఉన్న సమయంలో చదువుతోపాటు క్రీడల్లోనూ ఆయన తనదైన ప్రతిభను చూపారు. ఆటలన్నా, పోటీలన్నా ముందుండేవాడు. అదే తత్వం అతని లక్ష్యాన్ని చేరుకునేలా చేసింది.

రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం..

అబూబకర్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డ్ (ఎస్ఎస్‌బీ)లో అర్హత సాధించారు. కేరళలోని ఎజిమలలోని ఇండియన్ నావల్ అకాడమీలో కఠినమైన శిక్షణ పొందారు. మే 31న పాసింగ్ అవుట్ పరేడ్‌లో పాల్గొన్న అతను అధికారికంగా భారత నావికాదళంలో అధికారిగా చేరారు. అబూబాకర్ కళాశాల సమయంలోనూ క్రీడల్లో ముందుండేవాడు. అంతేకాకుండా రాష్ట్రం తరుపున సైతం పోటీల్లో పాల్గొన్నారు. కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్‌గా వ్యవహరించిన అబుబాకర్ నైనిటాల్‌లో జరిగిన 7–ఎ–సైడ్ జాతీయ స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో, ఇండో–నేపాల్ అంతర్జాతీయ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఎంజేసీఈటీ, తెలంగాణ రాష్ట్రం తరుపున రెండింటికీ ప్రాతినిధ్యం వహించాడు.

లక్ష్యం కోసం ముందుకు..

అనుకున్న లక్ష్యాన్ని సాధించడానికి అవసరమైన కఠోరశ్రమ ఎంతో అవసరం. ఒకవైపు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం వల్లనే తనకు ఈ అవకాశం లభించిందని అంటున్నారు అబుబాకర్. తన ఈ ప్రయాణంలో కళాశాల యాజమాన్యం ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. భారత సాయుధ దళాలకు అవసరమైన అధికారిగా నిలపడంలో, మార్గదర్శకత్వం చూపడంలో అవసరమైన శిక్షణ అందించడంలో సహాయపడిన ఫిజికల్ డైరెక్టర్ మహ్మద్ యూసుఫుద్దీన్, స్పోర్ట్స్ చైర్మన్ అమీర్ జావీద్ తదితరుల సేవలను ఆయన గుర్తుచేశారు. తనతోపాటు ఇటీవలి కాలంలో తమ కళాశాల నుండి దాదాపు 25 మందికి పైగా విద్యార్థులు రక్షణ, ప్రభుత్వ రంగ సంస్థలు, పౌర పరిపాలనతో సహా వివిధ ప్రభుత్వ సేవల్లో ప్రతిష్టాత్మక పదవులను అలంకరించారన్నారు. నావికాదళంలో పనిచేయడాన్ని తాను ఎంతో గర్వంగా భావిస్తున్నానని అన్నారు. యువత సైతం తమ ఆలోచనలను సుసాధ్యం చేసుకోవడానికి అవసరమైన లక్ష్యాలను ఏర్పచుకోవాలన్నారు.

ఓస్! ఇంతేనా?!

ప్రపంచ జనాభా మొత్తాన్ని ఒక ముద్దలా చేస్తే ఆ ముద్ద ఎంత పరిమాణంలో ఉంటుంది? ఏమిటీ పిచ్చి ప్రశ్న?! పిచ్చి ప్రశ్న కాదు. కొందరు శాస్త్రవేత్తలకు వచ్చిన ఆలోచన! వారి ఆలోచనకు తాజాగా ఒక గణిత శాస్త్రవేత్త అంచనా వేసి పెట్టారు. ఆయన లెక్క ప్రకారం - ప్రస్తుత ప్రపంచ జనాభాను మొత్తం ఒక ముద్దలా చేస్తే ఆ ముద్ద ఎంత పరిమాణంలో ఉంటుందో తెలుసా? మీరు అనుకున్న దాని కంటే చాలా చిన్నదిగా! ఇదేం జవాబు? లెక్కా పక్కా ఉండక్కర్లేదా? ఉంది.. లెక్క ఉంది.. పక్కాగా కూడా ఉంది.

'రెడిట్' ఇంటర్నెట్ ఫోరమ్‌లో 'కివి2703' అనే అకౌంట్‌లో ఒక అజ్ఞాత గణితశాస్త్ర నిపుణుడు ప్రపంచ జనాభా మొత్తాన్ని ఒక ముద్దగా (మీట్ బాల్) గా చేస్తే 0.6 మైళ్లు.. అంటే కిలోమీటరు వెడల్పు లోపలే ఉంటుందని అంచనా వేశారు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే, న్యూయార్క్‌లో 1250 అడుగుల ఎత్తయిన 'ఎంపైర్ స్టేట్ బిల్డింగ్'కు రెండున్నర రెట్లు, లేదా పారిస్‌లో 1063 అడుగుల ఐఫిల్ టవర్‌కు మూడింతలకు పైగా ఎత్తులో ఆ మీట్‌బాల్ ఉంటుందని ఆయన లెక్క తేల్చారు.

- సాక్షి, స్పెషల్ డెస్క్

మనుషులుగా లెక్కిస్తే కోట్లలో
ముద్దగా చేసి చూస్తే మాత్రం తక్కువే!
యూఎస్ సెంట్రల్ పార్క్‌లో 'మీట్‌బాల్'గా ప్రపంచ జనాభా
గ్రాండ్ కాన్యన్‌లో 'మీట్ కోన్'గా యుగాల జనాభా
గణిత శాస్త్రవేత్తల గ్రాఫిక్ అంచనాలు


ఊహాచిత్రం : న్యూయార్క్ సెంట్రల్ పార్క్‌లో 'మీట్ బాల్'

సెంట్రల్ పార్క్‌లో 'మీట్‌బాల్'

మానవ 'మీట్‌బాల్' పరిమాణాన్ని లెక్కించటానికి అజ్ఞాత గణితవేత్త కొన్ని ప్రాథమిక అంచనాలను తీసుకున్నారు. ప్రస్తుత ప్రపంచ జనాభాను 788 కోట్లుగా వేసుకున్నారు. ఒక్కో మనిషి సగటు బరువును 62 కిలోలుగా అనుకున్నారు. మానవ శరీరాల సాంద్రతను క్యూబిక్ మీటరుకు 985 కిలోగ్రాములుగా లెక్కించారు. క్యూబిక్ మీటరు అంటే ఒక మీటరు పొడవు, ఒక మీటరు వెడల్పు, ఒక మీటరు ఎత్తు ఉన్న ప్రదేశం. ఈ అంచనాల నుంచి 'హ్యూమన్ మీట్‌బాల్' ఎంత పరిమాణంలో ఉంటుందో లెక్కించారు. ఆ లెక్క ప్రకారం భూమి పైన ఉన్న 788 కోట్ల మందిని ఒక చక్కటి బంకతో కలిపి ముద్ద చేస్తే ఇంచుమించు ఒక కిలోమీటరు వెడల్పులో గోళాకారం తయారైంది. ఆ ఎర్రటి మాంసపు బంతిని న్యూయార్క్ సెంట్రల్ పార్క్ మధ్యలో ఉంచితే ఎలా ఉంటుందో కూడా ఆయన ఒక విజువల్ సృష్టించారు.

గ్రాండ్ కాన్యన్‌లో 'మీట్ కోన్'

అమెరికాలోని సుప్రసిద్ధ యూట్యూబ్ చానళ్లలో 'వీసాస్' ఒకటి. విద్య, సైన్స్, గణితం వంటి అంశాలపై 40 ఏళ్ల మైకేల్ స్టీవెన్స్ వీడియోలు చేస్తుంటాడు. ఈ యూట్యూబ్ చానల్‌లో గతంలో పోస్ట్ చేసిన ఒక వీడియోను చూసి మానవ మీట్‌బాల్‌ను అంచనా వెయ్యటానికి స్ఫూర్తి పొందారు రెడిట్ అజ్ఞాత గణిత శాస్త్రవేత్త. ఆరిజోనా రాష్ట్రంలో కొలరాడో నది ఒడ్డున ఉన్న గ్రాండ్ కాన్యన్ లోయలో... సృష్టి ఆరంభం నుంచి ఉన్న మానవ జనాభానంతా (సుమారు 10,600 కోట్లు) పోస్తే, ఆ లోయలో 15 కుప్పలు తయారైనట్లు 'వీసాస్' ప్రెజెంటర్ మైకేల్ స్టీవెన్స్ గ్రాఫిక్స్‌తో చేసిన వీడియో అది. అంతమంది జనాభాను ఒక చోట చేర్చినా కూడా ఆ లోయ ఇంకా ఖాళీగానే ఉండటం విశేషం అని స్టీవెన్స్ అంటారు. 446 కి.మీ. పొడవు, కొన్నిచోట్ల 1.6 కి.మీ. వరకు లోతు ఉన్న ఆ లోయలో.. కెనడాకు చెందిన గ్రాఫిక్ డేటా విజువలైజేషన్ బ్లాగర్ ఇస్మాయిల్ శాంటోస్ బ్రాల్ట్ జనాభాను నింపారు. మనిషి సగటు బరువును 70 కిలోలుగా వేసుకుని, 49 కోట్ల టన్నుల బరువుతో 700 కోట్ల మంది జనాభాను ఒక కుప్పగా చేరిస్తే అదే పరిమాణంలో 15 కుప్పలు తయారయ్యాయి. ఈ వీడియో ప్రేరణతోనే ఇప్పుడీ రెడిట్ శాస్త్రవేత్త ప్రస్తుత జనాభాతో మీట్‌బాల్‌ను సృష్టించారు.


గ్రాండ్ కాన్యన్ లోయలో వీసాస్ రూపకల్పన చేసిన 'మీట్‌కోన్'

శాస్త్రవేత్త గారూ.. మీరు ఓకేనా ?

గణిత శాస్త్రవేత్త సమాధానం చూసి చాలామంది ఆశ్చర్యపోయారు. 788 కోట్ల జనాభాను ముద్దగా చేస్తే 'ఇంతేనా ఉండేది.. ఇంత చిన్నాగానా' అని ఒక నెట్ యూజర్ ఆశ్చర్యపోతే, 'ఇంతకన్నా పెద్దదిగా ఉంటుంది అనుకున్నానే..' అని ఇంకొక యూజర్ కామెంట్ చేశారు. మరొకరైతే, 'మీరు బాగానే ఉన్నారా సైంటిస్టు గారూ?' అని గణిత శాస్త్రవేత్తపై జోక్ వేశారు. గతంలో – మానవజాతి ఆవిర్భవించినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రపంచ జనాభా అంతటిని కలిపి అమెరికాలోని గ్రాండ్ కాన్యన్ లోయలోకి చేరిస్తే ఎంత పరిమాణంలో ఉంటుందో ఒక సైన్స్ యూట్యూబ్ చానల్ వేసిన గ్రాఫిక్స్ నుంచి స్ఫూర్తి పొంది ఈ గణిత శాస్త్రవేత్త తాజాగా తన లెక్కలు వేశారట. మానవులందరూ ఒక చోట శంఖం ఆకారంలో కుప్పగా ఆ వీడియోలో ఉండగా, అజ్ఞాత శాస్త్రవేత్త అదే ప్రయోగాన్ని ఒక గుండ్రటి మాంసపు ముద్దగా చేసి చూపించారు.

డాలస్‌లో హరీశ్‌రావు జన్మదిన వేడుకలు

- పలువురు బీఆర్‌ఎస్ ముఖ్య నేతల హాజరు
- తెలంగాణ భవన్ వద్ద హరీశ్ ఫ్లెక్సీలను తొలగించిన జీహెచ్‌ఎంసీ


కేక్ కట్ చేస్తున్న కొప్పుల ఈశ్వర్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు జన్మదిన వేడుకలను సోమవారం డాలస్‌లో నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొని కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్, బీఆర్ఎస్ నాయకులు హరీశ్‌రెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే హరీశ్‌రావు జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ వద్ద ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలను జీహెచ్‌ఎంసీ సిబ్బంది తొలగించారు. హరీశ్‌రావు ఫ్లెక్సీల తొలగింపుపై కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు.

కోమటిచెరువు వద్ద హరీశ్ సైకత శిల్పం

హరీశ్‌రావు పుట్టినరోజు సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సిద్దిపేటలోని కోమటిచెరువు వద్ద హరీశ్‌రావు సైకత శిల్పం ఆవిష్కరించారు.

నేడు తెలంగాణ జాగృతి మహా ధర్నా

కేసీఆర్‌కు 'కాళేశ్వరం' నోటీసులు ఇవ్వడంపై నిరసన



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావుకు కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ కమిషన్ నోటీసులివ్వడంపై నిరసన వ్యక్తం చేస్తూ తెలంగాణ జాగృతి బుధవారం మహాధర్నా నిర్వహించనుంది. ఈమేరకు తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. ఇందిరాపార్కు వద్ద ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే ఈ ధర్నాకు కవిత నేతృత్వం వహిస్తారు. తెలంగాణ నేలను సస్యశ్యామలం చేసిన కేసీఆర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పూరితంగా నోటీసులిచ్చిందని ఆరోపించారు. జాగృతి ఆధ్వర్యంలో జరిగే ఈ మహాధర్నాకు రాష్ట్రం నలుమూలల నుంచి కేసీఆర్ అభిమానులు, జాగృతి శ్రేణులు హాజరవుతాయని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టును పడావు పెట్టడంతో రైతాంగానికి జరుగుతున్న నష్టం, కాళేశ్వరం విచారణ కమిషన్ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న క్షుద్ర రాజకీయాలను ఎత్తి చూపేందుకే ఈ మహాధర్నా చేపడుతున్నట్లు తెలంగాణ జాగృతి ప్రకటించింది.

జాగృతిలో చేరికలు

మంగళవారం హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కవిత సమక్షంలో తెలంగాణ జాగృతిలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ వాదాన్ని మరింత బలంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. చేరికల కార్యక్రమంలో తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, నాయకులు కొట్టాల యాదగిరి, మహిళా విభాగం కన్వీనర్ మరిపెల్లి మాధవి, కందుల మధు, జితేందర్, హైదరాబాద్ యూత్ కన్వీనర్ పరకాల మనోజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాల హరీశ్.. నిజాలు మాట్లాడు

సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: వానాకాలం సీజన్ మొదలవుతున్న సమయంలో అడ్డగోలు అబద్ధాలతో రైతులను తప్పుదోవ పట్టించేందుకు మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రయత్నాలు చేస్తున్నారని విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. విత్తనాలు, పచ్చిరొట్ట విత్తనాలకు సంబంధించి రోజుకో అబద్ధం చెప్తూ రైతులను అయోమయానికి గురిచేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం అన్వేశ్‌రెడ్డి తన కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ తన పేరును అబద్ధాల హరీశ్‌రావుగా మార్చుకోవాలని ఎద్దేవా చేశారు. తెలంగాణ రైతులకు జీలుగ, జనుము అందించడం లేదని ప్రభుత్వంపై హరీశ్ చేసిన ఆరోపణలు అర్థరహితమన్నారు. ప్రభుత్వం ముందస్తుగానే పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులోకి తీసుకొచ్చిందని చెప్పారు. ఈ వానాకాలం 2025 సీజన్‌కి తెలంగాణలో 88 వేల క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు అన్వేశ్‌రెడ్డి గుర్తుచేశారు. ఇందులో ఇప్పటివరకు రైతులు 60,165 క్వింటాళ్లు వినియోగించుకున్నారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఇంకా పచ్చిరొట్ట విత్తనాలు 27,835 క్వింటాళ్లు నిల్వ ఉన్నాయని, వాటిలో జీలుగ 24,381 క్వింటాళ్లు, జనుము 3,352 క్వింటాళ్లు, పిల్లిపెసర 102 క్వింటాళ్లు రైతులకు సిద్ధంగా ఉన్నాయని అన్వేశ్‌రెడ్డి వెల్లడించారు. అనవసరపు ఆరోపణలు చేయకుండా వాస్తవాలను హరీశ్‌రావు తెలుసుకోవాలన్నారు.

లుకలుకలు.. కుమ్ములాటలు

▶ మొదటి పేజీ తరువాయి

కనిపించినా సీనియర్లు, జూనియర్లు అనే విభేదాలు మరింత పెరిగాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జూనియర్లకు, ప్యారాచూట్ల (బయటి పార్టీల నుంచి వచ్చిన వారికి)కు కమిటీల్లో ప్రాధాన్యత నిచ్చారనే అసంతృప్తి వ్యక్తమవుతుండటం గమనార్హం. ఇంకోవైపు మహిళా కాంగ్రెస్ నేతలు గాంధీభవన్‌లోని టీపీసీసీ అధ్యక్షుడి చాంబర్ ముందు తమకు ప్రాధాన్యత లభించడం లేదంటూ ధర్నాకు దిగడం కూడా చర్చనీయాంశమైంది. అయితే, టీ కప్పులో తుపాను మాదిరి ఆ వివాదం ముగిసినా, పార్టీలో ప్రాధాన్యత అంశం అంతర్గతంగా అగ్గిని రాజేస్తూనే ఉంది.

మంత్రులపై ఫిర్యాదులు.. పాలనపై విమర్శలు



సీఎంకు, మంత్రులకు మధ్య సఖ్యత లేదనే అభిప్రాయం వ్యక్తమవుతుండగా, కొందరు మంత్రుల పనితీరుపై ఎమ్మెల్యేలు ఫిర్యాదులు చేసేంతవరకు పరిస్థితి వెళ్లిపోయింది. ఇక రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై కూడా పార్టీలో తీవ్రంగానే చర్చ జరుగుతోంది. ఎంత చేసినా ప్రజల మన్ననలు రావడం లేదని పార్టీ నేతలు చెబుతుంటే, తాము చేసినవన్నీ పార్టీ ప్రజల్లోకి తీసుకెళ్లడం లేదనే అభిప్రాయంతో ప్రభుత్వ పెద్దలున్నారు. ఈ క్రమంలో వీలున్నంత త్వరగా మంత్రివర్గ విస్తరణ జరగాల్సిందేనని, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి పట్టు నిరూపించుకోకపోతే పార్టీ గ్రాఫ్ డౌన్ కావడం ప్రారంభమవుతుందని కాంగ్రెస్ నేతలే బహిరంగ వ్యాఖ్యలు చేస్తుండడం గమనార్హం.

గులాబీకి 'కుటుంబ ముల్లు' పోటు



బీఆర్‌ఎస్‌లో ఇప్పుడు ఎమ్మెల్సీ కవిత వ్యవహారం ప్రకంపనలు సృష్టిస్తోంది. పార్టీలో ఆమె ఇప్పుడు రె'బెల్స్' మోగిస్తున్నారు. తండ్రి కేసీఆర్‌ను విమర్శించకుండా వ్యూహాత్మక వ్యాఖ్యలు చేస్తూ, ప్రశ్నలు వేస్తూ గులాబీ పార్టీకి కొరకరాని కొయ్యగా మారిపోయారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వాస్తవానికి వరంగల్‌లో పార్టీ రజతోత్సవ సభకు ముందు అంతర్గత చర్చలకే పరిమితమైన ఆమె, ఆ తర్వాత గేర్ మార్చారు. సభ నిర్వహణ గురించి కేసీఆర్‌కు స్వదస్తూరితో రాసిన లేఖ బీఆర్‌ఎస్‌లో అశాంతిని బహిర్గతం చేసింది. ఆ లేఖ లీక్ కావడం, ఆ లీకేజీ వెనుక ఎవరున్నారన్న దానిపై చర్చోపచర్చలు జరుగుతుండడం అటు బీఆర్‌ఎస్‌నే కాదు, ఇటు రాష్ట్ర రాజకీయ వర్గాలను కూడా కుదిపేశాయి. కేసీఆర్ దేవుడని, అయితే ఆయన చుట్టూ దెయ్యాలున్నాయంటూ కవిత చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారాన్నే రేపాయి. అమెరికా నుంచి వచ్చిన వెంటనే శంషాబాద్ విమానాశ్రయంలోనే ఆమె పేల్చిన బాంబు మంటలు ఇంకా చల్లారలేదు. ఆ తర్వాత ఆమె స్పీడ్ మరింత పెంచారు.

ఇష్టాగోష్టిలో బాంబు పేల్చిన కవిత

మీడియాతో ఇష్టాగోష్టి పేరుతో కవిత మరో రాజకీయ ఆటం బాంబు పేల్చారు. బీజేపీతో పొత్తు కుదుర్చుకునేందుకు బీఆర్‌ఎస్‌లో ప్రయత్నాలు జరుగుతున్నాయని, దాన్ని అడ్డుకుంటున్నందుకే తనను బయటకు పంపాలని చూస్తున్నారంటూ కవిత చేసిన వ్యాఖ్యలు అధినేత కేసీఆర్‌ను సైతం ఇరకాటంలో పడేశాయి. అంతటితో ఆగని కవిత తెలంగాణ జాగృతి పేరుతో బలోపేతం అయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. బీఆర్‌ఎస్‌తో సమాంతరంగా జాగృతిని తీసుకెళ్తానని చెప్పకనే చెపుతున్న ఆమె, పరోక్షంగా పార్టీని సవాల్ చేస్తూ ధర్నాకు దిగుతున్నారు. కేసీఆర్‌కు కాళేశ్వరం విచారణ కమిషన్ నోటీసులు ఇవ్వడానికి నిరసనగా చేపడుతున్న ధర్నాతో.. బీఆర్‌ఎస్ చేయలేని పనిని తాను చేస్తున్నానని పార్టీ కేడర్‌కు సంకేతాలిచ్చే ప్రయత్నాలు చేస్తుండడం గమనార్హం. ఈ కుటుంబ పంచాయతీ కేడర్‌ను అయోమయానికి గురి చేస్తోంది. ఇలావుండగా.. ఎప్పుడూ లేని విధంగా ఇటీవల హరీశ్‌రావు ఇంటికి కేటీఆర్ వెళ్లడం కూడా అటు బీఆర్‌ఎస్ లోనూ, ఇటు రాజకీయ వర్గాల్లోనూ చర్చకు దారి తీస్తోంది. ఇంత జరుగుతున్నా.. కేటీఆర్ నాయకత్వాన్ని ప్రశ్నించే రీతిలో కవిత అస్త్రాలు సంధిస్తున్నా కేసీఆర్ మాత్రం మౌన ముద్రలోనే ఉండడం గమనార్హం.

కమలం.. కలహాల కాపురం



సాధారణంగా బీజేపీలో అంతర్గత విభేదాలు బహిర్గతం కావు. ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ భావజాలంతో నడిచే ఆ పార్టీలో ఎంతటి వివాదాలు, భిన్నాభిప్రాయాలైనా లోలోపలే పరిష్కరించుకుంటారు. కానీ తెలంగాణ బీజేపీలో మాత్రం పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు గ్రూపులుగా విడిపోయి వ్యవహరిస్తున్నారనే చర్చ జరుగుతోంది. ఎమ్మెల్యేల మధ్య సఖ్యత లేదని, ఎంపీల్లోని ఏ ఇద్దరూ ఒక్కచోట కూర్చుని మాట్లాడుకునే పరిస్థితి లేదని ఆ పార్టీ వర్గాలే వ్యాఖ్యానిస్తున్నాయి. ఇక పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి ఎంపిక విషయంలో పెద్ద రచ్చే నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఎంతగా అంటే అసలు ఏ నాయకుడిని ఎంపిక చేయాలో పార్టీ అధిష్టానానికి కూడా అంతుపట్టనంతగా ఈ పదవి కోసం నేతలు పోట్లాడుకుంటున్నట్టు బీజేపీలో జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఏడాది తర్వాత కూడా కిషన్‌రెడ్డినే రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారంటే ఆ పార్టీలో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. జిల్లా పార్టీ అధ్యక్షుల ఎంపిక వ్యవహారంలోనూ బహిరంగ విమర్శలు వ్యక్తమయ్యాయి.


రాజాసింగ్ టార్గెట్ ఎవరో?



రాష్ట్ర బీజేపీలో కీలక నేతగా, ఫైర్‌బ్రాండ్‌గా గుర్తింపు పొందిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రచ్చ రచ్చ చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు పార్టీ నుంచి సస్పెండ్ అయ్యి, ఆ తర్వాత మళ్లీ పార్టీలోకి వచ్చి కమలం గుర్తుపైనే ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు. అయితే, ఈసారి ఎన్నికల్లో గెలిచిన తర్వాత రాజాసింగ్ స్టైల్ మార్చారు. ఎప్పటిలాగా ఎంఐఎంను కాకుండా ఈసారి సొంత పార్టీ నేతలనే టార్గెట్ చేస్తూ వస్తున్నారు. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు పార్టీలో పెద్ద చర్చకే దారి తీస్తున్నాయి. 'మా పార్టీ నేతలకు ప్యాకేజీలు ఇస్తే ఏ పార్టీనయినా విలీనం చేసుకుంటారు..' అంటూ ఆయన వ్యాఖ్యానించడం తీవ్ర దుమారాన్ని రేపింది. ఆయన్ను మరోమారు సస్పెండ్ చేస్తారనేంత వరకు ఈ వ్యవహారం వెళ్లింది. అయితే ఆ అంశంపైనా ఆయన తీవ్రంగా స్పందించారు. తనను సస్పెండ్ చేస్తే ఒక్కొక్కరి జాతకాలు బయట పెడతానంటూ హెచ్చరించడం పార్టీ నేతలను ఇరకాటంలో పెట్టింది. ఈ నేపథ్యంలో ఆయన అసలు రాష్ట్ర పార్టీలో ఎవరిని టార్గెట్ చేశారన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. రాష్ట్ర శాఖ అధ్యక్షుడి ఎంపిక, పార్టీ ఎమ్మెల్యే చేస్తున్న వివాదాస్పద వ్యాఖ్యల విషయంలో.. అధిష్టానం పట్టీపట్టనట్టుగా ఉండటం, ఎలాంటి జోక్యం చేసుకోకపోవడం పార్టీ వర్గాల్లో హాట్‌టాపిక్ అవుతోంది. ఈ విధంగా.. ఎన్నికలకు మూడేళ్లకు పైగా సమయం ఉన్నప్పుడే ఈ మూడు ప్రధాన పార్టీల్లో జరుగుతున్న లొల్లి, అసెంబ్లీ ఎన్నికల నాటికి ఎంత తీవ్రంగా మారుతుందోనన్న చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది.

గాంధీభవన్‌లో రోజుకు ఇద్దరు

- ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు తెలుసుకోనున్న కార్పొరేషన్ చైర్మన్లు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు
- మళ్లీ ప్రారంభం కానున్న మంత్రులతో ముఖాముఖి
- నేడు గాంధీభవన్‌కు మంత్రి పొన్నం



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులతోపాటు ప్రభుత్వంలో భాగస్వాములైన నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటారు. ప్రతిరోజూ ఇద్దరు చొప్పున నేతలు గాంధీభవన్‌లోనే ఉండి...అక్కడకు వచ్చే ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేసేలా టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్ కుమార్‌గౌడ్ కార్యాచరణ రూపొందించారు.

- తొలిదశలో భాగంగా ఈనెల 10వ తేదీ నుంచి జూలై 4వ తేదీ వరకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ల చైర్మన్లు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అందుబాటులో ఉండే ప్రణాళిక తయారు చేశారు. ఏ కార్పొరేషన్ చైర్మన్ ఏ తేదీన గాంధీభవన్‌లో ఉండాలనే పని విభజన కూడా పూర్తి చేశారు. ఈ మేరకు గాంధీభవన్ వర్గాలు టైంటేబుల్ విడుదల చేశాయి.
- రెండో దశలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు కూడా అందుబాటులో ఉంటారని, ఆదివారాలు మినహా ప్రతిరోజూ ఇద్దరు నేతలు గాంధీభవన్‌లో ఉండి ప్రజల సమస్యలు తెలుసుకుంటారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి.
- మరోవైపు గతంలో ప్రారంభించిన మంత్రులతో ముఖాముఖి కార్యక్రమం కూడా పునఃప్రారంభం కానుంది. చాలారోజుల తర్వాత బుధవారం ఉదయం 11 గంటల నుంచి ఒంటిగంట వరకు మంత్రి పొన్నం ప్రభాకర్ గాంధీభవన్‌లో ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలపై దరఖాస్తులు తీసుకుంటారు.

పత్రికల గొంతు నొక్కే ఉత్తర్వు చెల్లదు

ట్రయల్ కోర్టు ఆదేశాలను కొట్టేసిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: పత్రికల గొంతు నొక్కేలా ఎలాంటి ఆదేశాలు ఇవ్వడం చెల్లదని హైకోర్టు అభిప్రాయపడింది. జాతీయ భద్రతతోపాటు ఇతర కొన్ని ప్రమాదకర సందర్భాల్లో మాత్రమే గ్యాగ్ ఆర్డర్ జారీ చేయాలన్న సుప్రీం కోర్టు తీర్పును ప్రస్తావించింది. 2022లో ఓ వెబ్‌సైట్, యూట్యూబ్ చానల్‌పై ట్రయల్ కోర్టు ఇచ్చిన గ్యాగ్ ఉత్తర్వును కొట్టేసింది. తమకు వ్యతిరేకంగా అవమానకరమైన, అపవాదు తీసుకొచ్చేలా ఓ వెబ్‌సైట్‌లో వీడియోలు, చిత్రాలు, నివేదికలు, ప్రచురణలు, వ్యంగ్య చిత్రాలు ప్రచురించడాన్ని, ప్రసారం చేయడాన్ని నిలిపివేయాలని కోరుతూ మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ కూకట్‌పల్లి కోర్టును ఆశ్రయించింది. ట్రయల్ కోర్టు మేఘాకు అనుకూలంగా ఉత్తర్వులు జారీ చేసింది. 2022 డిసెంబర్ 2న కూకట్‌పల్లి కోర్టు ఇచ్చిన ఈ గ్యాగ్ ఆర్డర్‌ను సవాల్ చేస్తూ వెబ్‌సైట్, యూట్యూబ్ నిర్వాహకులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పత్రికా స్వేచ్ఛను అడ్డుకొనేలా ఇచ్చిన ఆదేశాలను కొట్టేయాలని కోరారు. కింది కోర్టు ఇచ్చిన ఉత్తర్వు రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1) (ఏ), 19 (1) (జీ)లను ఉల్లంఘిస్తోందని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ టి.వినోద్‌కుమార్, జస్టిస్ పి. శ్రీసుధ ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది. ట్రయల్ కోర్టు జారీ చేసిన అభ్యంతరకరమైన ఉత్తర్వును కొట్టేస్తున్నామని స్పష్టం చేసింది.

నక్సల్స్‌ను పాకిస్తాన్‌తో పోల్చడం బాధ్యతారాహిత్యం

బీజేపీ రాష్ట్ర ముఖ్య ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జ్ ఎన్వీ సుభాష్



సాక్షి, హైదరాబాద్: నక్సలైట్లను పాకిస్తాన్ ఆర్మీతో పోల్చుతూ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు అత్యంత బాధ్యతారాహిత్యమైనవని బీజేపీ రాష్ట్ర ముఖ్య ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జ్ ఎన్వీ సుభాష్ విమర్శించారు. మహేశ్‌గౌడ్ వింతగా, అజ్ఞానిలా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఎన్వీ సుభాష్ మీడియాతో మాట్లాడుతూ 'రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అజ్ఞానాన్ని సంస్థాగతంగా పెంచుతోంది. జాతీయ, భౌగోళిక రాజకీయ అంశాలపై వారి నాయకుడు రాహుల్ గాంధీకి ఉన్న అవగాహన లోపాన్ని అనుకరిస్తున్నట్టు మహేశ్‌గౌడ్ వ్యాఖ్యలు నిరూపిస్తున్నాయి. ఇంతకంటే హాస్యాస్పదమైన పోలిక ఉంటుందా? పాకిస్తాన్ శత్రుత్వ విధానాలున్నా.. అది ఒక గుర్తింపు ఉన్న దేశం. నక్సలైట్లు భారతదేశంలో హింసాత్మక, రాష్ట్ర వ్యతిరేక తిరుగుబాటుదారులు. ఈ రెండింటిని పోల్చడం కాంగ్రెస్ జాతీయ భద్రత, దౌత్యంపై అవగాహనరాహిత్యాన్ని చూపుతోంది' అని సుభాష్ విమర్శించారు.

కర్ణాటక కెనరా బ్యాంకులో భారీ చోరీ

59 కిలోల బంగారం.. రూ.5.2 లక్షల నగదు మాయం

బెంగళూరు: కర్ణాటకలోని కెనరా బ్యాంకు శాఖలో భారీ దొంగతనం జరిగింది. దుండగులు సుమారు 59 కిలోల బంగారం, రూ.5.2 లక్షల నగదును ఎత్తుకుపోయారు. విజయపుర జిల్లా మనగుళి పట్టణంలోని బ్యాంకు శాఖలో మే 24వ తేదీ రాత్రి చోటుచేసుకున్న ఈ చోరీ వివరాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. గుర్తు తెలియని 6 నుంచి 8 మంది దుండగులు బ్యాంకు లోపలికి ప్రవేశించి ముందుగా అలారం వ్యవస్థను ఆపేశారు. మారు తాళం చెవితో కీలకమైన లాకర్‌ను తెరిచారు. అందులో ఉన్న మొత్తం 59 కిలోల బంగారంతోపాటు రూ.5.2 లక్షల నగదును మూటగట్టుకుపోయారు. మే 25వ తేదీన ఉదయం ఊడ్చేందుకు వచ్చిన పనిమనిషి బ్యాంకు షట్టర్ తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించి మేనేజర్‌కు సమాచారం అందించింది. ఈ మేరకు మేనేజర్ 26వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎత్తుకుపోయిన బంగారమంతా రుణాల కోసం ఖాతాదారులు తాకట్టు పెట్టిందేనని మేనేజర్ చెప్పారని ఎస్పీ లక్ష్మణ్ నింబర్గి చెప్పారు.

తెలుగు విద్యార్థులకు న్యాయ సహాయం

- బీఆర్‌ఎస్ తరఫున అండగా ఉంటామన్న కేటీఆర్...
- అమెరికా చట్టాలపై అవగాహనతో మసలుకోవాలని సూచన
- యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్- డాలస్ విద్యార్థులతో భేటీ... డాలస్‌లో ఐటీ కంపెనీల ప్రతినిధులతోనూ సమావేశం

సాక్షి, హైదరాబాద్: అమెరికాలో వివిధ కారణాలతో ఇబ్బందులు పడుతున్న భారతీయ విద్యార్థులకు అండగా నిలుస్తామని భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు భరోసా ఇచ్చారు. ఎన్నో ఆశలతో ఉన్నత విద్య కోసం అమెరికాకు వచ్చిన విద్యార్థులు స్థానిక చట్టాలపై అవగాహన లేకుండా ఏవైనా తప్పులు చేస్తే వారికి బీఆర్‌ఎస్ అమెరికా విభాగం తరఫున న్యాయ సహాయం చేస్తామని చెప్పారు. అమెరికాకు వచ్చిన విద్యార్థులు ఏదైనా కారణంతో స్వదేశానికి తిరిగి వస్తే ఆ విద్యార్థితో పాటు వారి కుటుంబం కూడా ఎంతో ఆవేదనకు గురవుతుందని, ఈ నేపథ్యంలో భారతీయ విద్యార్థుల్లో మనోధైర్యం నింపేందుకు బీఆర్‌ఎస్ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. అమెరికాలోని భారతీయ విద్యార్థులు కూడా స్థానిక చట్టాలతో పాటు అక్కడి సమాజంలో వస్తున్న మార్పులను అర్థం చేసుకుని మసలుకోవాలని సూచించారు. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్- డాలస్‌లో చదువుకుంటున్న భారతీయ విద్యార్థులతో కేటీఆర్ మాట్లాడారు. యూనివర్సిటీ విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. గతంలో భారతీయులు అమెరికాలో ఉద్యోగాలు, చదువు కోసం ఎన్నో వ్యయ ప్రయాసలు పడేవారని కేటీఆర్ గుర్తు చేశారు.


తెలుగు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న కేటీఆర్

వేగంగా మారిన ప్రపంచ పరిణామాలతో అనేక సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో అమెరికాలో అవకాశాలు కూడా పెరిగాయని అన్నారు. ర్యాంకులు, గ్రేడ్ల కోసం కాకుండా జీవిత లక్ష్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు. కేవలం ఉద్యోగాల కోసం మాత్రమే కాకుండా సమాజంలో ప్రపంచంలో మంచి మార్పు తీసుకువచ్చే దిశగా ప్రయత్నం చేయాలని పిలుపునిచ్చారు.

అధికారంలోకి వచ్చాక ఐటీ మరింత అభివృద్ధి

మంగళవారం డాలస్‌లో అక్కడి ఐటీ కంపెనీల యాజమాన్య ప్రతినిధులతో కూడా కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణలో తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత ఐటీ పరిశ్రమను మరింత విస్తృతంగా అభివృద్ధి చేస్తామన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో ఐటీ రంగంలో తెచ్చిన విప్లవాత్మక విధానాల వల్లే హైదరాబాద్‌లో ఐటీ పరిశ్రమ శరవేగంగా అభివృద్ధి చెందిందని చెప్పారు. ప్రభుత్వాలు, ఐటీ కంపెనీలు కలిసి పని చేస్తేనే ఏఐ రంగంలో దేశ యువత పోటీ పడగలుగుతుందన్నారు. అమెరికాలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో చిన్న, మధ్య తరహా ఐటీ కంపెనీలు భారత్‌లో ఖండాంతర సెంటర్లను ఏర్పాటు చేసే అవకాశముందని చెప్పారు. దీంతో ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలకు కూడా ఐటీ రంగంవిస్తరించి ఉద్యోగ అవకాశాలు మెరుగు పడతాయని అన్నారు. తమ తొమ్మిదేళ్ల పాలనలో ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్, సిద్దిపేట, నిజామాబాద్, ఆదిలాబాద్ వంటి నగరాల్లోనూ ఐటీ హబ్‌లు నిర్మించామని తెలిపారు. అమెరికాలోని యువత భారత్‌లో పెట్టుబడులు పెట్టి మాతృభూమి రుణం తీర్చుకోవాలని కోరారు.

కేసీఆర్ జీవితం స్ఫూర్తిగా...

సాహసోపేత నిర్ణయాల ద్వారానే కలలు సాకారం అవుతాయనేందుకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ జీవితమే సాక్ష్యమని కేటీఆర్ అన్నారు. నలభై ఏళ్ల వయసులోనే తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించి అవహేళనలు ఎదురైనా 14 ఏళ్ల నిరంతర పోరాటంతో ప్రత్యేక రాష్ట్రాన్ని కేసీఆర్ సాధించారని చెప్పారు. అమెరికాలో విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత తిరిగి భారత్‌కు వచ్చి కంపెనీలు ప్రారంభించాలని, ఆవిష్కరణల యుగంలో అవకాశాలు అందిపుచ్చుకోవాలని విద్యార్థులను కోరారు. భారత్‌లో సవాళ్లతో పాటు అవకాశాలు కూడా ఉన్నాయన్నారు. మేధో వలస భారత్‌కు పెను సవాలుగా మారిందంటూ, ప్రవాస భారతీయ విద్యార్థులు దేశ, తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

డ్రగ్స్ కేసును అంటగట్టాలని చూస్తే ఊరుకోను

- కానిస్టేబుల్ గుణశేఖర్‌తో నాకేంటి సంబంధం ?
- ఇప్పుడు అతను నా వద్ద విధుల్లో లేడు.. ఏ విచారణకైనా నేను సిద్ధం
- సీబీఐ విచారణ కోరుతూ కేంద్ర హోంమంత్రికి లేఖ రాశా
- తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి



తిరుపతి మంగళం: తిరుపతి ఏఆర్ కానిస్టేబుల్ గుణశేఖర్ డ్రగ్స్ వ్యవహారంలో పట్టుబడితే అది పూర్తిగా పోలీసుల వైఫల్యమేనని, దీనిని తనకు అంటగట్టేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఎంపీ గురుమూర్తి మీడియాతో మాట్లాడారు. గతంలో తన దగ్గర గన్‌మేన్‌గా పనిచేసిన గుణశేఖర్‌ను, ఈ ఏడాది ఫిబ్రవరి 26న ప్రభుత్వానికి తిప్పి పంపానని గుర్తు చేశారు. ఇప్పుడు అతను డ్రగ్స్ వ్యవహారంలో పట్టుబడితే ఆ బాధ్యత పోలీసు శాఖదేనని, తనకేం సంబంధమని అన్నారు. ఈ వ్యవహారంపై ఏ విచారణకైనా సిద్ధమని, ఇప్పటికే దీనిపై సీబీఐ విచారణ కోరుతూ కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశానని చెప్పారు.పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతి, తిరుమలలో శాంతిభద్రతలు కొరవడ్డాయని, తగిన చర్యలు తీసుకోవాలని ఇటీవల కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు లేఖ రాసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తనపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసేవాళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకూ పోరాడుతానని హెచ్చరించారు.

రెడ్‌బుక్ వత్తాసు

అదుపు తప్పిన 'పోలీసు'

నడిరోడ్డుపై కొట్టే అధికారం పోలీసులకు ఎవరిచ్చారు? | వీళ్లే కేసులు పెట్టి.. వీళ్లే తీర్పులిచ్చేస్తే కోర్టులెందుకు?

తెనాలి ఘటనపై నిప్పులు చెరిగిన వైఎస్ జగన్

రాష్ట్రంలో పోలీసులు తెలుగుదేశం పార్టీకి చెందిన రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ వారు సాక్షాత్తు కొందరు డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలను కలెక్షన్‌ఏజెంట్లుగా వాడుకుంటున్నారు. మద్యం విక్రయాలు మొదలు, ఇసుక, మట్టి, పేకాట క్లబ్బుల వరకు ఎమ్మెల్యేలు దగ్గరుండి నడిపిస్తున్నారు. పోలీసులు వాటికి రక్షణ కల్పిస్తున్నారు. పోలీసులు మామూళ్లు వసూలు చేసి, పోలీసులకింత, ఎమ్మెల్యేకు ఇంత, చంద్రబాబుకు ఇంత, లోకేశ్‌కు ఇంత అని పంపకాలు చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఇదే జరుగుతోంది.

ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులు కనిపిస్తున్నాయి. ప్రతి మందు షాపు దగ్గర డబ్బులు తీసుకుని అనధికారికంగా పర్మిట్ రూములకు అనుమతిస్తున్నారు. ప్రతి పర్మిట్ రూమ్, ప్రతి బెల్ట్ షాపు నుంచి పోలీసులు మామూళ్లు తీసుకుంటున్నారు. ఇసుక, పేకాట, మట్టి, సిలికా, క్వార్ట్ జ్, ల్యాటరైట్.. ఇలా ఏ వనరునూ వదలకుండా అన్ని చోట్లా యథేచ్ఛగా వసూళ్ల కార్యక్రమం జరుగుతోంది. పోలీసులను దొంగల ముఠాలో భాగస్తులుగా చేసి వారిని వాడుకుంటున్నారు. అసలు ఈ రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ అనేది ఉందా?

గొడవల వల్ల కేసులుండొచ్చు. ఆ కేసుల్లో ఎవరిది తప్పు.. ఏది న్యాయం.. అనేది నాకు తెలియదు. నేను వాటిని వెనకేసుకు రావడం లేదు. కానీ పద్ధతి అనేది ఒకటి ఉంటుంది. ఆరోపణలు చేసే వ్యక్తులే జడ్జిలుగా మారిపోకూడదని మాత్రం గట్టిగా చెబుతున్నా. మీరు ఆరోపణలు చేసినప్పుడు కోర్టు ఇరువైపులా వాదనలు విన్న తర్వాత ఎవరిది న్యాయం, ఎవరిది అన్యాయం అనేది చూసి తీర్పు ఇస్తుంది. అప్పటి వరకు కేసులున్న ప్రతి ఒక్కరూ ముద్దాయిలు కారు. కేసులున్నాయనే కారణంతో వారిని నడిరోడ్డు మీదకు తీసుకొచ్చి, దారుణంగా కొట్టి, వారి కుటుంబాన్ని, వారి పరువు ప్రతిష్టలను మంటగలిపే అధికారం పోలీసులకు ఎవరిచ్చారు? అలాగైతే ముఖ్యమంత్రి చంద్రబాబుపై కూడా 24 కేసులున్నాయని నడిరోడ్డుపైకి తీసుకొచ్చి కొడతారా? అలా చేస్తే అది ధర్మమేనా?

- వైఎస్ జగన్



తెనాలిలో బాధిత యువకుల కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: 'ఎవరి మీదైనా కేసులు ఉంటే కోర్టులు చూసుకుంటాయని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని నడిరోడ్డు మీద హింసించే అధికారం పోలీసులకు ఎక్కడిదని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో యథేచ్ఛగా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్న టీడీపీ కూటమి ప్రభుత్వం ఎవరైనా ప్రశ్నిస్తే నేరంగా పరిగణిస్తోందని, పోలీసు వ్యవస్థను సీఎం చంద్రబాబు దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పూర్తిగా దిగజారుతోందని, ఆ వ్యవస్థ వికృత రూపానికి తెనాలి ఘటన సాక్ష్యంగా నిలుస్తుందని అన్నారు. ఇటీవల తెనాలిలో పోలీసులు నడిరోడ్డుపై ముగ్గురు యువకులకు అరికాలి కోటింగ్ ఇచ్చిన ఘటనకు సంబంధించి బాధిత యువకుల కుటుంబ సభ్యులను మంగళవారం ఆయన పరామర్శించి ఘటన పూర్వాపరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న అనేక సంఘటనల్లో చంద్రబాబు, ఆయన పార్టీ రెడ్‌బుక్ రాజ్యాంగం తీసుకొచ్చి పోలీసు వ్యవస్థను ఏ రకంగా దుర్వినియోగం చేస్తోందో కనిపిస్తోందన్నారు. తనకు వ్యతిరేకంగా గొంతు వినిపిస్తే, ఆ గొంతు నొక్కేందుకు చంద్రబాబు దగ్గరుండి వైఎస్సార్‌సీపీకి చెందిన మాజీ మంత్రులు, నాయకులు, కార్యకర్తలతో పాటు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై తప్పుడు కేసులు నమోదు చేయిస్తున్నారని నిప్పులు చెరిగారు. ఇంకా వారిని జైళ్లకు పంపడంతో పాటు, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం పరిపాటిగా మారిందని చెప్పారు.

మా ఆస్తుల్ని టీడీపీ ఎమ్మెల్యే పత్తిపాటి అనుచరులు కబ్జా చేస్తున్నారు

- చంపేస్తామని, డ్రగ్స్ కేసుల్లో ఇరికిస్తామని బెదిరిస్తున్నారు
- నా ప్రాణానికి హాని ఉంది
- ప్రవాసాంధ్రుడు రావి మురళీమోహన్ ఆవేదన



కబ్జాకు సంబంధించిన ఫొటోలను చూపుతున్న మురళీమోహన్, కుటుంబసభ్యులు

హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో సామాన్యులు బతికే పరిస్థితి లేదని, అక్కడ ఎమ్మెల్యే అనుచరులు టెంట్‌లు వేయించి మరీ తమ ఆస్తుల్ని కబ్జా చేస్తున్నారని ప్రవాసాంధ్రుడు రావి మురళీమోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు కబ్జాదారులకు వత్తాసు పలుకుతూ కనీసం ఫిర్యాదు కూడా తీసుకోవడం లేదన్నారు. తన ఆస్తుల వద్దకు వెళితే చంపేస్తామని, డ్రగ్స్ కేసు పెడతామని బెదిరిస్తున్నారని వాపోయారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మురళీమోహన్ మాట్లాడుతూ.. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో చెన్నై–కలకత్తా హైవేపై తమకు సాయికార్తీక్ సిటీ సెంటర్ షాపింగ్‌మాల్ ఉందన్నారు. మొత్తం 1.16 లక్షల చదరపు అడుగుల్లో రెండు సినిమా థియేటర్లు, రెండు ఫంక్షన్ హాల్స్‌తో పాటు 11 షాపులు ఉన్నాయని వివరించారు. దీనివిలువ సుమారు రూ.60 కోట్లకుపైగా ఉందన్నారు. గత ఏడాది ఆగస్టు 5వ తేదీ నుండి అక్కడి ఎమ్మెల్యే, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు అనుచరులు కందిమల్ల అంజిబాబు, వీరయ్య చౌదరి, కావూరి ఆంజనేయులు, రవీంద్రబాబు తమ షాపింగ్ మాల్ ముందు టెంట్ వేసుకుని కిరాయి రౌడీలను పెట్టారని, అద్దెకు ఉన్న వారిని బెదిరిస్తూ, షాపులపై రాళ్లతో దాడులు చేయిస్తూ థియేటర్ వారిని వస్తే చంపేస్తామని బెదిరిస్తున్నారన్నారు. సీసీ కెమెరాలన్నీ పగులగొట్టి దాదాపు అందర్నీ ఖాళీ చేయించి కబ్జాకు యత్నిస్తున్నారని తెలిపారు.

కబ్జాదారులతో పోలీసులు కుమ్మక్కు: చిలకలూరిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే సీఐ రమేష్ ఇది సివిల్ మేటర్ అంటూనే కబ్జాదారులతో కుమ్మక్కయ్యారని, కనీసం ఫిర్యాదు కూడా తీసుకోవడం లేదని మురళీమోహన్ వాపోయారు. ఆయన తల్లి సామ్రాజ్యం మాట్లాడుతూ.. తనను చెప్పలేని బూతులు తిడుతున్నారని తెలిపారు. వీరయ్యచౌదరి అనే వ్యక్తి ఎస్సీ, ఎస్టీ వారిని పక్కన పెట్టుకుని తమను బూతులు తిడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని, తమ కుటుంబానికి ఏం జరిగినా వారిదే బాధ్యత అన్నారు.

ఏపీ కేంద్రంగా ప్ర'మాదక'ర దందా..!

పోలీసు వ్యవస్థ ప్రభుత్వం చేతిలో ఉంది. కూటమి సర్కారు వచ్చి ఏడాదవుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే మద్యం, గంజాయి దందాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. సర్కారే బెల్టుషాపులను ప్రోత్సహిస్తోంది. పర్మిట్ రూంలకు ఇష్టానుసారం అనుమతులిచ్చేస్తోంది. దీనికితోడు ఇప్పుడు డ్రగ్స్ దందా వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్‌లో రూ.కోటి విలువైన కొకైన్ పట్టుబడిన కేసులో ప్రధాన నిందితుడిగా ఏపీ పోలీస్ కానిస్టేబుల్ ఉండడం కూటమి ప్రభుత్వం, పోలీసుశాఖ వైఫల్యానికి నిదర్శనం. దీనికి బాధ్యత తీసుకోవాల్సిన కూటమి సర్కారు ప్రతిపక్ష ఎంపీపై ఎదురుదాడికి దిగడం నిజంగా సిగ్గుచేటు.. హాస్యాస్పదం..

- తిరుపతి నుంచి కొకైన్, ఎఫిడ్రిన్ డ్రగ్స్ హైదరాబాద్‌కు తరలింపు
- రూ.కోటి విలువైన డ్రగ్స్‌ను పట్టుకున్న తెలంగాణ పోలీసులు
- ఆరుగురు సభ్యుల ముఠా అరెస్టు
- ప్రధాన నిందితుడు ఏపీ పోలీస్ కానిస్టేబుల్ గుణశేఖర్ పరారీ
- కూటమి ప్రభుత్వం, పోలీసు శాఖ వైఫల్యాన్ని ఇతరులపైకి నెట్టే కుటిల యత్నం

జీడిమెట్ల(హైదరాబాద్)/తిరుపతిక్రైమ్: తిరుపతి నుంచి హైదరాబాద్‌కు కొకైన్, ఎఫిడ్రిన్ వంటి మత్తు పదార్థాలు తీసుకువచ్చి అమ్మేందుకు యత్నించిన ఆరుగురు సభ్యుల ముఠాను బాలానగర్ ఎస్‌వోటీ, కూకట్‌పల్లి పోలీసులు పట్టుకున్నారు. ఏపీలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ప్రధాన నిందితుడు గుణశేఖర్ పరారీలో ఉన్నాడు. వీరి వద్ద రూ.కోటి విలువచేసే 820 గ్రాముల కొకైన్, ఎఫిడ్రిన్ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం హైదరాబాద్ షాపూర్‌నగర్‌లోని డీసీపీ కార్యాలయంలో ఇన్‌చార్జి డీసీపీ ఎస్.కోటిరెడ్డి, ఎస్‌వోటీ డీసీపీ డి.శ్రీనివాస్ తదితరులు కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

స్నేహితుడి చేత డ్రగ్స్ తరలింపు

తిరుపతికి చెందిన గుణశేఖర్ ఏపీలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. అతని స్నేహితుడు ఉన్నం సురేంద్రకు డబ్బు ఆశచూపి మే 29న 820 గ్రాముల కొకైన్, ఎఫిడ్రిన్ డ్రగ్స్ ఇచ్చి తిరుపతి నుంచి హైదరాబాద్‌కు పంపించాడు. గుణశేఖర్ చెప్పినట్లుగానే సురేంద్ర కొకైన్ తీసుకుని గుంటూరు మీదుగా నగరంలోని కూకట్‌పల్లికి చేరుకున్నాడు. ఇక్కడ సురేంద్ర తన మనుషులైన బాపట్ల జిల్లాకు చెందిన దోతిరెడ్డి హరిబాబురెడ్డి, దేవరాజు యేసుబాబులను హైదరాబాద్ రప్పించాడు. అదేవిధంగా సురేంద్ర చేగూడి, మెర్సి మార్గరెట్, షేక్ మస్తాన్ వలీలను సైతం పిలిపించుకున్నాడు. అందరూ కలిసి కూకట్‌పల్లిలోని జయనగర్‌లో కలుసుకున్నారు.

జూన్ 2న పోలీసులు బిజీగా ఉంటారని..

రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2న పోలీసులు బిజీగా ఉంటారని భావించి ఆరోజే కొకైన్ అమ్మేందుకు పథకం వేశారు. ఈ మేరకు ఆరుగురు కూకట్‌పల్లి భాగ్యనగర్ వైపు వెళ్తుండగా అనుమానం వచ్చిన పోలీసులు వారిని ఆపి తనిఖీ చేయగా కొకైన్ లభించింది. వెంటనే ఆరుగురిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించి విచారించగా అసలు బండారం బయటపెట్టారు. అసలు కొకైన్ వీరికి ఎక్కడ నుంచి వచ్చిందనే విషయం తెలియలేదు. ప్రధాన నిందితుడు గుణశేఖర్ పోలీసులకు పట్టుబడితే అసలు విషయాలు బయటకు వస్తాయి. సమావేశంలో కూకట్‌పల్లి ఏసీపీ రవికుమార్, ఇన్‌స్పెక్టర్ రాజేశ్, బాలానగర్ ఎస్‌వోటీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఎస్సై కట్కం గౌతం పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి (ఇన్‌సెట్‌లో) పోలీసులు స్వాధీనం చేసుకున్న కొకైన్

పోలీస్‌శాఖ ఆరా: గుణశేఖర్ తిరుపతిలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఇతను పంపిన మనుషులు డ్రగ్స్‌తో హైదరాబాద్‌లో పట్టుబడడంతో పోలీసు శాఖ అప్రమత్తమైంది. ఘటనపై పూర్తిస్థాయిలో ఆరా తీస్తోంది. దీనిపై తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజుతో మాట్లాడగా.. గుణశేఖర్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని చెప్పారు. పోలీస్ ఉద్యోగం చేస్తున్న వ్యక్తి ఇలా చేయడం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే కానిస్టేబుల్ గుణశేఖర్‌కు తిరుపతి ఎంపీ గురుమూర్తికి సంబంధాలు అంటగట్టే యత్నాలు జరుగుతుండడం అందరినీ విస్తుగొలుపుతోంది. కొన్ని నెలల క్రితం గుణశేఖర్ ఎంపీ వద్ద కొద్ది రోజులు గన్‌మేన్‌గా పోలీసు ఉద్యోగం నిర్వహించారు. దానిని సాకుగా తీసుకుని ఈ కేసును ఎంపీకి అంటగట్టాలని కూటమి నేతలు యత్నించడం కుట్రపూరితమే.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

జాబ్ పాయింట్

జిప్‌మర్, పుదుచ్చేరిలో 11 ఫ్యాకల్టీ పోస్టులు

జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్–రీసెర్చ్ (జిప్‌మర్), పుదుచ్చేరి.. రెగ్యులర్ ప్రాతిపదికన ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 11.
» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్–06, అసిస్టెంట్ ప్రొఫెసర్–05.
» **విభాగాలు:** మైక్రోబయాలజీ, ఫార్మకాలజీ.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎండీ(మైక్రోబయాలజీ) ఉత్తీర్ణతతో పాటు 3 నుంచి 14 ఏళ్ల బోధన అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.07.2025 నాటికి ప్రొఫెసర్ పోస్టుకు 58 ఏళ్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు 50 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,68,900 నుంచి రూ.2,20,400, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,01,500 నుంచి రూ.1,67,400.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 01.07.2025.
» **వెబ్‌సైట్:** http://https//jipmer.edu.in/

అలిమ్‌కో, కాన్పూర్‌లో 43 పోస్టులు

కాన్పూర్(ఉత్తరప్రదేశ్)లోని ఆర్టిఫిషియల్ లింబ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(అలిమ్‌కో).. వివిధ విభాగాల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 43.
» **పోస్టుల వివరాలు:** జనరల్ మేనేజర్–01, అసిస్టెంట్ మేనేజర్–01, జూనియర్ మేనేజర్–03, మెడికల్ ఆఫీసర్–01, డిప్యూటీ మేనేజర్–02, ఆఫీసర్(పీ–వో)–05, ఆఫీసర్(ఆడియాలజిస్ట్)–05, మేనేజర్(ఎఫ్–ఏ)–01, డిప్యూటీ మేనేజర్(ఎఫ్– ఏ)–01, జూనియర్ మేనేజర్(ఎఫ్–ఏ)–01, ఆఫీసర్(అకౌంట్స్)–02, అకౌంటెంట్–05, ఎస్‌ఏపీ స్పెషలిస్ట్–08, హార్డ్‌వేర్ అండ్ నెట్‌వర్క్ ఇంజనీర్–01, ఏఐ ఇంజనీర్/డేటా సైంటిస్ట్–01, స్టోర్ అసిస్టెంట్–02, ఆఫీసర్(ప్రొడక్షన్)–01, షాప్ అసిస్టెంట్–02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, బీటెక్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.05.2025 నాటికి ఆఫీసర్, స్టోర్ అసిస్టెంట్‌కు 30 ఏళ్లు, అకౌంటెంట్‌కు 34 ఏళ్లు, షాప్ అసిస్టెంట్‌కు 32 ఏళ్లు, జూనియర్ మేనేజర్, ఏఐ ఇంజనీర్‌కు 40 ఏళ్లు, అసిస్టెంట్ మేనేజర్, మెడికల్ ఆఫీసర్, స్పెషలిస్ట్‌కు 42 ఏళ్లు, జనరల్ మేనేజర్‌కు 55 ఏళ్లు, మేనేజర్‌కు 48 ఏళ్లు, మిగతా పోస్టులకు 45 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
» **దరఖాస్తులకు చివరితేది:** 07.07.2025.
» **వెబ్‌సైట్:** https://alimco.in/

పంజాబ్‌-సింధ్ బ్యాంక్‌లో మేనేజర్ పోస్టులు

పంజాబ్–సింధ్ బ్యాంక్‌లో ఒప్పంద ప్రాతిపదికన ఎంఎస్ఎంఈ రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 30.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి ఏదైనా డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. మార్కెటింగ్ లేదా ఫైనాన్స్‌లో ఎంబీఏ చేసిన వారికి ప్రాధాన్యం ఇస్తారు.
» **వయసు:** 01.05.2025 నాటికి 25 నుంచి 35 ఏళ్లు ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
» **దరఖాస్తులకు చివరితేది:** 18.06.2025.
» **వెబ్‌సైట్:** https://punjabandsindbank.co.in

జోసా కౌన్సెలింగ్.. సీటు దక్కేలా!

జాతీయ స్థాయిలోని ప్రముఖ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ఉమ్మడి ప్రవేశాల కోసం కేంద్ర విద్యాశాఖ 'ద జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ'(జోసా)ని ఏర్పాటు చేసింది. 2025-26 విద్యాసంవత్సరంలో దేశవ్యాప్తంగా 128 ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశాలకు జోసా కౌన్సెలింగ్ నోటిఫికేషన్ తాజాగా విడుదలైంది. దీనిద్వారా ఐఐటీలు, నిట్‌లు, ఐఐఈఎస్‌టీ షిబ్‌పూర్, ట్రిపుల్ ఐటీలు, ఇతర గవర్నమెంట్ ఫండెడ్ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్స్(జీఎఫ్‌టీఐ)ల్లో బీఈ/బీటెక్, బీఎస్, బీఆర్క్, బీప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ నేపథ్యంలో.. జోసా 2025 కౌన్సెలింగ్‌కు అర్హతలు, రిజిస్ట్రేషన్, ఛాయిస్ ఫిల్లింగ్, సీట్ అలాట్‌మెంట్, ఆన్‌లైన్ రిపోర్టింగ్ తదితర వివరాలు..



జోసాలో పాల్గొనే ఇన్‌స్టిట్యూట్‌లు

జోసా కౌన్సెలింగ్ ప్రక్రియ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 23 ఐఐటీలు, 32 నిట్‌లు, ఐఐఈఎస్‌టీ షిబ్‌పూర్, 26 ట్రిపుల్ ఐటీలు, 47 ఇతర గవర్నమెంట్ ఫండెడ్ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్స్(జీఎఫ్‌టీఐ)ల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఆన్‌లైన్ ఛాయిస్ ఫిల్లింగ్ ప్రక్రియ జూన్ 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ తొమ్మిది రోజులపాటు కొనసాగుతుంది. ఆరు రౌండ్లలో జోసా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఈ ఆరు రౌండ్ల తర్వాత కూడా సీట్లు మిగిలిపోతే సెంట్రల్ సీట్ అలొకేషన్ బోర్డ్(సీఎస్ఏబీ).. నిట్‌లు, ట్రిపుల్ ఐటీలు, ఇతర జీఎఫ్‌టీఐల్లో సీట్ల భర్తీకి రెండు ప్రత్యేక రౌండ్లు కౌన్సెలింగ్ నిర్వహిస్తుంది.

కోర్సులు - సీట్లు

బీఈ/బీటెక్, బీఆర్క్, బీఎస్, బీప్లానింగ్ తదితర కోర్సుల్లో అడ్మిషన్ కల్పిస్తారు. 23 ఐఐటీల్లో మొత్తం 18,160 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అలాగే 32 నిట్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ)ల్లో అందుబాటులో ఉన్న సీట్ల సంఖ్య 24,525. అదేవిధంగా 26 ట్రిపుల్‌ఐటీల్లో మొత్తం 9,940 సీట్లు ఉన్నాయి. అంతేకాకుండా 47 ఇతర గవర్నమెంట్ ఫండెడ్ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్స్ (జీఎఫ్‌టీఐ)ల్లో 10,228 సీట్లల్లో ప్రవేశాలు కల్పించనున్నారు.

జోసాలో పాల్గొనేందుకు అర్హతలు

- ఐఐటీల్లో అడ్మిషన్ పొందాలనుకునే విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ 2025లో అర్హత సాధించడంతోపాటు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులతో 10+2లో కనీసం 75 శాతం మార్కులు పొందాలి (ఎస్సీ/ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు 10+2లో కనీసం 65 శాతం మార్కులు వచ్చి ఉండాలి). దీంతోపాటు 10+2 స్థాయి బోర్డు పరీక్షల్లో టాప్ 20 పర్సంటైల్‌లో ఉండాలి.
- నిట్‌లు, ఐఐఈఎస్‌టీ, ట్రిపుల్ ఐటీలు, ఇతర జీఎఫ్‌టీఐల్లో బీఈ/బీటెక్ ప్రవేశాలకు జేఈఈ మెయిన్ బీఈ/బీటెక్ పేపర్ పరీక్షలో అర్హత సాధించాలి.
- నిట్‌లు, ఐఐఈఎస్‌టీ, ట్రిపుల్ ఐటీలు, ఇతర జీఎఫ్‌టీఐల్లో బీఆర్క్/బీప్లానింగ్‌లో ప్రవేశాలకు జేఈఈ మెయిన్ బీఆర్క్/బీప్లానింగ్ పేపర్ పరీక్షలో అర్హత సాధించాలి.
- జోసా 2025 ద్వారా ఐఐటీలు, నిట్‌లు, ఐఐఈ ఎస్‌టీ, ట్రిపుల్ ఐటీలు, ఇతర జీఎఫ్‌టీఐల్లో ప్రవేశాలు పొందేందుకు జోసా పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవడం తప్పనిసరి.

ఛాయిస్ ఫిల్లింగ్, లాకింగ్

- జోసా 2025 కౌన్సెలింగ్‌లో పాల్గొనాలనుకునే విద్యార్థులు తప్పనిసరిగా జోసా పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి.
- ఇందుకోసం జేఈఈ మెయిన్ 2025కు హాజరైన అభ్యర్థులు https://josaa.nic.in/లో తమ దరఖాస్తు నెంబర్, పాస్ వర్డ్ ద్వారా లాగిన్ అవ్వాలి. అలా లాగిన్ అయిన అనంతరం రిజిస్ట్రేషన్, ఛాయిస్ ఫిల్లింగ్, ఛాయిస్ లాకింగ్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి.
- జోసా పోర్టల్‌లో ఆన్‌లైన్ నమోదుకు, ఛాయిస్ ఫిల్లింగ్‌కు ఎలాంటి ఫీజులు చెల్లించాల్సిన పనిలేదు.
- జోసా ద్వారా సీటు పొందేందుకు 2025, జూన్3 నుంచి 12వ తేదీ మధ్యలో జోసా పోర్టల్‌లో ఆన్‌లైన్ నమోదు, ఛాయిస్ ఫిల్లింగ్ ప్రక్రియను పూర్తిచేయడం తప్పనిసరి.
- ఈ తొమ్మిది రోజుల వ్యవధిలో అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేసుకోవచ్చు. దీంతోపాటు రెండుసార్లు మాక్ సీట్ అలొకేషన్ సౌకర్యం కూడా కల్పిస్తారు. తద్వారా తమ ర్యాంకుతో సీటు లభించే కాలేజీ, ప్రోగ్రామ్‌కు సంబంధించి అభ్యర్థులు ఒక అంచనాకు వచ్చేందుకు అవకాశం ఉంటుంది.
- జూన్ 12వ తేదీలోపు విద్యార్థులు తమ అర్హతలు, ఆసక్తికి తగ్గ ప్రోగ్రామ్స్‌ను, అదేవిధంగా ఇన్‌స్టిట్యూట్‌లను తమ ప్రాథమ్యాలుగా పేర్కొంటూ.. ఛాయిస్ ఫిల్లింగ్ ప్రక్రియను అత్యంత అప్రమత్తంగా పూర్తి చేయాలి. ఛాయిస్ ఫిల్లింగ్ గడువు ముగియడానికే ముందే అభ్యర్థులు తమ ఛాయిస్‌లను లాక్ చేయాలి. లేకుంటే చివరగా సేవ్ చేసిన ప్రాథమ్యాలు ఆటోమేటిక్‌గా లాక్ అవుతాయి. ఇలా ఒకసారి లాక్ చేసిన తర్వాత మళ్లీ ఎట్టిపరిస్థితుల్లోనూ మార్చడానికి అవకాశం ఉండదు.

ఆన్‌లైన్ రిపోర్టింగ్ అత్యంత కీలకం

- ఛాయిస్ ఫిల్లింగ్, లాకింగ్ చేసిన అభ్యర్థులు జోసా పోర్టల్‌లో లాగిన్ అయి ఎప్పటికప్పుడు తమ సీటు కేటాయింపు, ఇతర వివరాలు తెలుసుకోవాల్సి ఉంటుంది. సీట్ అలొకేషన్ గురించి అభ్యర్థులకు వ్యక్తిగతంగా ఎలాంటి సమాచారం ఇవ్వరు.
- సీటు అలాట్‌మెంట్ పొందిన విద్యార్థులు సీటు పొందేందుకు నిర్దేశిత గడువు తేదీలోపు ఆన్‌లైన్ రిపోర్టింగ్ ప్రక్రియను పూర్తిచేయాలి. ఆన్‌లైన్ రిపోర్టింగ్ ప్రక్రియను పూర్తిచేయకుంటే.. సీటు రద్దవడమే కాకుండా.. తదుపరి దశల కౌన్సెలింగ్‌లో పాల్గొనే అవకాశాన్ని కూడా కోల్పోతారు.

ఫ్రీజ్, ఫ్లోట్, స్లైడ్

- సీటు అలాట్‌మెంట్ పొందిన అభ్యర్థులు మొదట 'ఇనీషియల్ సీట్ అలాట్‌మెంట్ ఇంటిమేషన్ స్లిప్'ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇందులో సీటు అలాట్‌మెంట్‌ను ఖరారు చేసుకునేందుకు అవసరమైన తదుపరి దశల వివరాలు ఉంటాయి.
- ఇలా సీటు అలాట్‌మెంట్ స్లిప్ డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత స్టెప్ 1లో.. పొందిన సీటును ఆమోదించాలి. ఆ తర్వాత ఫ్రీజ్, స్లైడ్, ఫ్లోట్‌లల్లో ఏదో ఒక దాన్ని ఎంచుకోవాలి.
- **ఫ్రీజ్** : అభ్యర్థి తొలి ప్రాథమ్యంగా పేర్కొన్న సీటు లభిస్తే తప్పనిసరిగా ఫ్రీజ్‌ను పేర్కొనాలి. దీంతో అభ్యర్థి తనకు లభించిన సీటును ఆమోదించినట్లు పరిగణిస్తారు. సదరు అభ్యర్థికి తదుపరి దశల కౌన్సెలింగ్ ప్రక్రియలో పాల్గొనే అవకాశం ఉండదు.
- **ఫ్లోట్** : తొలి ప్రాథమ్యంగా పేర్కొన్న సీటు పొందని అభ్యర్థులకు మాత్రమే తదుపరి రౌండ్స్‌లో పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. వీరు 'ఫ్లోట్' ఆప్షన్‌ను ఎంచుకుంటే.. లభించిన సీటును అంగీకరిస్తూనే.. మరింత మెరుగైన ఇన్‌స్టిట్యూట్‌లో చేరే అవకాశం కోసం తదుపరి దశల కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు వీలుకల్పిస్తారు. తదుపరి దశల్లో మెరుగైన ఇన్‌స్టిట్యూట్‌లో సీటు లభించకుంటే.. ప్రస్తుతమున్న ఇన్‌స్టిట్యూట్‌లోనే కొనసాగొచ్చు.
- **స్లైడ్** : స్లైడ్ ఆప్షన్ ఇచ్చిన విద్యార్థి ప్రస్తుతం సీటు లభించిన ఇన్‌స్టిట్యూట్‌కు ఆమోదం తెలుపుతూనే.. తదుపరి రౌండ్స్‌లో అదే ఇన్‌స్టిట్యూట్‌లో మరింత మెరుగైన ప్రోగ్రామ్‌లో అవకాశం వస్తే చేరేందుకు వీలుంటుంది.
- చివరి రౌండ్‌లో ఫ్లోట్, స్లైడ్ ఆప్షన్లకు వీలుండదు. అంటే చివరి రౌండ్ తప్ప మిగతా అన్ని రౌండ్లలోనూ అభ్యర్థులు ఫ్లోట్ నుంచి స్లైడ్/ఫ్రీజ్‌కు, అదేవిధంగా స్లైడ్ నుంచి ఫ్రీజ్‌కు తమ ఆప్షన్లను మార్చుకునేందుకు అవకాశం ఉంటుంది.

మహిళలకు 20% సూపర్‌న్యూమరరీ సీట్లు

కేంద్ర విద్యాశాఖ నిర్దేశం మేరకు ఐఐటీలు, నిట్‌లు, ఐఐఎస్‌ఈటీ, ట్రిపుల్ ఐటీలు, ఇతర జీఎఫ్‌టీఈల్లో ప్రతి అండర్‌గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లో కనీసం 20% మంది విద్యార్థినులు తప్పనిసరిగా ఉండాలి. ఇందుకోసం ఆయా ఇన్‌స్టిట్యూట్‌లలో మహిళా అభ్యర్థుల కోసం 20 శాతం సూపర్ న్యూమరరీ సీట్లును కేటాయిస్తున్నారు.

డాక్యుమెంట్స్ అప్‌లోడ్

- స్టెప్ 2లో.. అవసరమైన అన్ని డాక్యుమెంట్స్‌ను జోసా పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. అనంతరం సీటు యాక్సెప్టెన్స్ ఫీజును చెల్లించాలి. ఈ ఫీజు చెల్లించిన అభ్యర్థుల డాక్యుమెంట్లను మాత్రమే పరిశీలిస్తారు. డాక్యుమెంట్‌ను పరిశీలిస్తున్న అధికారులు అడిగే ప్రశ్నలకు నిర్దేశిత గడువులోపు సమాధానం ఇవ్వాలి. లేకుంటే సీటు రద్దు అవడంతోపాటు తదుపరి దశల కౌన్సెలింగ్‌లో పాల్గొనే అవకాశాన్ని కోల్పోయే ఆస్కారముంది.

ప్రొవిజనల్ అలాట్‌మెంట్

- జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్‌లో పొందిన ర్యాంకు, అభ్యర్థుల రిజర్వేషన్ కేటగిరీ, అభ్యర్థులు పేర్కొన్న ప్రాథమ్యాలు, అందుబాటులో ఉన్న సీట్లను పరిగనణలోకి తీసుకొని.. అభ్యర్థి డాక్యుమెంట్లను సైతం పరిశీలించిన అనంతరం నిర్దేశిత అన్ని అర్హతలు ఉన్నట్లు సంతృప్తి చెందితే 'ప్రొవిజనల్ సీట్ అలాట్‌మెంట్ లెటర్'ను జోసా పోర్టల్‌లో అందుబాటులో ఉంచుతారు. దీన్ని అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది.
- అన్ని రౌండ్ల జోసా కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ప్రొవిజనల్ సీట్ అలాట్‌మెంట్ పొందిన అభ్యర్థులు తమకు సీటు లభించిన ఇన్‌స్టిట్యూట్‌లో నిర్దేశిత గడువులోపు వ్యక్తిగతంగా రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. అక్కడ అడ్మిషన్‌కు సంబంధించిన అన్ని ప్రక్రియలను పూర్తి చేయాల్సి ఉంటుంది.
- **వెబ్‌సైట్** : https://josaa.nic.in/josaa/

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ హిస్టరీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–జనరల్ స్టడీస్–తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం–కంప్యూటర్ అవేర్‌నెస్

6 ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టైటిల్ గెలిచిన ఆరో భారతీయ కెప్టెన్‌గా రజత్ పాటీదార్ గుర్తింపు పొందాడు. గతంలో ధోని (చెన్నై సూపర్ కింగ్స్: 5 సార్లు), రోహిత్ శర్మ (ముంబై ఇండియన్స్: 5 సార్లు), గౌతమ్ గంభీర్ (కోల్‌కతా నైట్‌రైడర్స్: 2 సార్లు), శ్రేయస్ అయ్యర్ (కోల్‌కతా నైట్‌రైడర్స్: ఒక సారి), హార్దిక్ పాండ్యా (గుజరాత్ టైటాన్స్: ఒకసారి) ఈ ఘనత సాధించారు.

10 ఇప్పటి వరకు జరిగిన 18 ఐపీఎల్ ఫైనల్స్‌లో 10 సార్లు తొలుత బ్యాటింగ్ చేసిన జట్టు విజేతగా నిలిచింది. ఎనిమిది సార్లు ఛేజింగ్ చేసిన జట్టుకు టైటిల్ లభించింది.

9 ఐపీఎల్-2025లో నమోదైన సెంచరీలు. మొత్తం 18 ఐపీఎల్ సీజన్‌లలో రెండుసార్లు మాత్రమే (2023లో 12 సెంచరీలు; 2024లో 14 సెంచరీలు) పది అంతకంటే ఎక్కువ సెంచరీలు వచ్చాయి.

2 ముంబై ఇండియన్స్ తర్వాత ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)తోపాటు ఉమెన్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టైటిల్ సాధించిన రెండో జట్టుగా రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు గుర్తింపు పొందింది. స్మృతి మంధాన కెప్టెన్సీలో బెంగళూరు జట్టు 2024లో డబ్ల్యూపీఎల్ టైటిల్ గెలిచింది.

1 ఐపీఎల్ ఫైనల్లో రెండుసార్లు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచిన తొలి ఆటగాడిగా కృనాల్ పాండ్యా రికార్డుల్లోకెక్కాడు. 2017లో రైజింగ్ పుణే సూపర్ జెయింట్స్‌పై ముంబై ఇండియన్స్ విజయం సాధించిన సందర్భంలోనూ కృనాల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.



కల నిజమాయెగా.. కప్పు సొంతమాయెగా

ఐపీఎల్ కొత్త చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు



ఎన్నిసార్లు గుండెకోతలు... ఎన్ని అవమానాల పర్వాలు... ఆర్‌సీబీ అభిమాని అంటే అదో చిన్నచూపుతో చూసిన ఎన్నో సందర్భాలు... ఎప్పటికీ విజేతగా నిలవదనే వ్యాఖ్యలు... గొప్ప గొప్ప ప్లేయర్లు ఉన్నప్పుడే సాధ్యం కాలేదు ఇప్పుడేమవుతుందిలే అనే జోస్యాలు... కొన్నిసార్లు లీగ్ దశకే పరిమితమైతే మరికొన్ని సార్లు 'ప్లే ఆఫ్స్'కు చేరినా ముందంజ వేయని రోజులు... మూడు ఫైనల్స్‌లలో ఓడిన వేదన దీనికి అదనం. ఒకదశలో ఆర్‌సీబీ అభిమానుల నినాదం 'ఈ సాల కప్ నమ్‌దే' (ఈ ఏడాది కప్ మనదే) జోక్‌గా మారిపోయిన పరిస్థితి... కానీ 2008 నుంచి గెలుపోటములతో నిమిత్తం లేకుండా ఆర్‌సీబీ జెండాను తమ మనసులో నింపుకున్న ఫ్యాన్స్ గర్వపడే క్షణం వచ్చేసింది... తమ టీమ్‌లోని 18వ నంబర్ జెర్సీకి కానుక ఇస్తున్నట్లుగా ఐపీఎల్ 18వ సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) చాంపియన్‌గా నిలిచింది. లీగ్ దశలోనే అసాధారణ ప్రదర్శనలతో 'ప్లే ఆఫ్స్'కు చేరి తొలి క్వాలిఫయర్‌లోనే గెలుపుతో ఫైనల్ చేరిన టీమ్ తుది పోరులోనూ అదే జోరును కొనసాగించింది... ఒకరు కాదు ఇద్దరు కాదు జట్టులోని సమష్టితత్వం ఈ చిరస్మరణీయ విజయాన్ని అందించింది. ఎన్నో చాలెంజ్‌లను అధిగమించి రాయల్‌గా సాధించిన ఈ ట్రోఫీని బెంగళూరులో సగర్వంగా ప్రదర్శించే సమయమిది... ఘనవిజయాలు, వైఫల్యాలు అన్నింటినీ చూస్తూ ఆర్‌సీబీ పట్ల విధేయత వీడకుండా జట్టుతోనే కొనసాగిన విరాట్ కోహ్లి కెరీర్‌లో మిగిలిన ఈ ఒక్క లోటు ఈ రోజుతో తీరిపోయింది.

తొలిసారి టైటిల్ సాధించిన జట్టు | **ఫైనల్లో 6 పరుగులతో పంజాబ్ కింగ్స్‌పై గెలుపు** | **రాణించిన కోహ్లి, కృనాల్ పాండ్యా**

అహ్మదాబాద్: ఇండియన్ ప్రీమియర్ లీగ్ టోర్నీ చరిత్రలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు కొత్త చాంపియన్‌గా అవతరించింది. గతంలో మూడుసార్లు ఫైనల్ మ్యాచ్‌లలో (2009, 2011, 2016) ఓటమి పాలైన జట్టు ఎట్టకేలకు 18వ సీజన్‌లో 'ఈ సాల కప్ నమ్‌దు' (ఈ ఏడాది కప్ మనది) అంటూ ట్రోఫీని ముద్దాడింది. నరేంద్ర మోదీ స్టేడియంలో మంగళవారం జరిగిన ఫైనల్లో రజత్ పాటీదార్ సారథ్యంలోని ఆర్‌సీబీ జట్టు 6 పరుగుల తేడాతో పంజాబ్ కింగ్స్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసింది. విరాట్ కోహ్లి (35 బంతుల్లో 43; 3 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం పంజాబ్ కింగ్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 184 పరుగులే చేయగలిగింది. శశాంక్ సింగ్ (30 బంతుల్లో 61 నాటౌట్; 3 ఫోర్లు, 6 సిక్స్‌లు) అర్ధ సెంచరీ చేయగా, జోష్ ఇన్‌గ్లిస్ (23 బంతుల్లో 39; 1 ఫోర్, 4 సిక్స్‌లు) రాణించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కృనాల్ పాండ్యా (2/17) అద్భుత బౌలింగ్‌తో మ్యాచ్‌ను బెంగళూరు వైపు తిప్పగా, ఒత్తిడిలో పంజాబ్ పూర్తిగా చిత్తయింది. ఫలితంగా రెండోసారి పంజాబ్ కింగ్స్ జట్టు రన్నరప్‌ట్రోఫీతో సరిపెట్టుకుంది. 2014లో తొలిసారి ఫైనల్ చేరిన పంజాబ్ జట్టు తుది పోరులో కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు చేతిలో ఓడిపోయింది. ఐపీఎల్ టోర్నీ విజేతగా నిలిచిన బెంగళూరు జట్టుకు రూ. 20 కోట్లు... రన్నరప్ పంజాబ్ కింగ్స్ జట్టుకురూ. 12 కోట్ల 50 లక్షలు ప్రైజ్‌మనీగా లభించాయి. మూడో స్థానంలో నిలిచిన ముంబై ఇండియన్స్ జట్టుకు రూ. 7 కోట్లు, నాలుగో స్థానంలో నిలిచిన గుజరాత్ టైటాన్స్‌కు రూ. 6 కోట్ల 50 లక్షలు దక్కాయి.

సమష్టి బ్యాటింగ్ ప్రదర్శన...

ఆర్‌సీబీ ఇన్నింగ్స్‌లో విధ్వంసక ప్రదర్శనలు లేకపోయినా... ప్రధాన బ్యాటర్లంతా తలా ఓ చేయి వేయడంతో జట్టు మెరుగైన స్కోరు సాధించగలిగింది. దూకుడుగా మొదలు పెట్టిన ఫిల్ సాల్ట్ (9 బంతుల్లో 16; 2 ఫోర్లు, 1 సిక్స్) ఎక్కువ సేపు నిలవలేకపోగా, కోహ్లి జాగ్రత్తగా ఆడాడు. పవర్‌ప్లేలో జట్టు 55 పరుగులు చేసింది. తొలి వికెట్ పడ్డాక తర్వాతి నలుగురు బ్యాటర్లు తలా ఓ చేయి వేయడంలో జట్టు మెరుగైన స్కోరు సాధించగలిగింది. మయాంక్ అగర్వాల్ (18 బంతుల్లో 24; 2 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ రజత్ పాటీదార్ (16 బంతుల్లో 26; 1 ఫోర్, 2 సిక్స్‌లు), లివింగ్‌స్టోన్ (15 బంతుల్లో 25; 2 సిక్స్‌లు), జితేశ్ శర్మ (10 బంతుల్లో 24; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక పరుగులు సాధించారు. పంజాబ్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో పరుగులు ఆశించినంత వేగంగా రాకపోయినా... జేమీసన్ వేసిన 17వ ఓవర్లో 3 సిక్స్‌లతో 23 పరుగులు రాబట్టడంతో స్కోరు దాదాపు 200 వరకు వెళ్లింది. అర్ష్‌దీప్ సింగ్ వేసిన ఆఖరి ఓవర్లో ఆర్‌సీబీ 3 వికెట్లు కోల్పోయింది.

టపటపా...

సీజన్ ఆసాంతం అద్భుత ఆరంభాలతో పంజాబ్ గెలుపులో కీలక పాత్ర పోషించిన ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య (19 బంతుల్లో 24; 4 ఫోర్లు), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (22 బంతుల్లో 26; 2 సిక్స్‌లు) అసలు పోరులో ఆ ధాటిని చూపించలేకపోయారు. తడబడుతూనే ఆడిన వీరిద్దరు తక్కువ వ్యవధిలో వెనుదిరగ్గా, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (1) పేలవ షాట్‌కు వెనుదిరగడంతో జట్టు విజయావకాశాలపై దెబ్బ పడింది. మరో ఎండ్‌లో దూకుడు ప్రదర్శించిన ఇన్‌గ్లిస్‌ను కృనాల్ పాండ్యా వెనక్కి పంపడంతో కింగ్స్ గెలుపు ఆశలు ఆవిరయ్యాయి. చివర్లో శశాంక్ పోరాడినా అప్పటికే ఆలస్యమైపోయింది.

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: సాల్ట్ (సి) అయ్యర్ (బి) జేమీసన్ 16; కోహ్లి (సి అండ్ బి) అజ్మతుల్లా 43; మయాంక్ అగర్వాల్ (సి) అర్ష్‌దీప్ (బి) చహల్ 24; పాటీదార్ (ఎల్బీ) (బి) జేమీసన్ 26; లివింగ్‌స్టోన్ (ఎల్బీ) (బి) జేమీసన్ 25; జితేశ్ శర్మ (బి) వైశాక్ 24; షెఫర్డ్ (ఎల్బీ) (బి) అర్ష్‌దీప్ 17; కృనాల్ (సి) అయ్యర్ (బి) అర్ష్‌దీప్ 4; భువనేశ్వర్ (సి) ప్రియాన్ష్ ఆర్య (బి) అర్ష్‌దీప్ 1; యశ్ దయాళ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం** (20 ఓవర్లలో 9 వికెట్లకు) 190. **వికెట్ల పతనం:** 1-18, 2-56, 3-96, 4-131, 5-167, 6-171, 7-188, 8-189, 9-190. **బౌలింగ్:** అర్ష్‌దీప్ సింగ్ 4-0-40-3, జేమీసన్ 4-0-48-3, అజ్మతుల్లా 4-0-35-1, వైశాక్ 4-0-30-1, యుజువేంద్ర చహల్ 4-0-37-1.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రియాన్ష్ ఆర్య (సి) సాల్ట్ (బి) హాజల్‌వుడ్ 24; ప్రభ్‌సిమ్రన్ (సి) భువనేశ్వర్ (బి) కృనాల్ 26; ఇన్‌గ్లిస్ (సి) లివింగ్‌స్టోన్ (బి) కృనాల్ 39; అయ్యర్ (సి) జితేశ్ (బి) షెఫర్డ్ 1; నేహల్ వధేరా (సి) కృనాల్ (బి) భువనేశ్వర్ 15; శశాంక్ సింగ్ (నాటౌట్) 61; స్టొయినిస్ (సి) యశ్ దయాళ్ (బి) భువనేశ్వర్ 6; అజ్మతుల్లా (సి) (సబ్) భండగే (బి) యశ్ దయాళ్ 1; జేమీసన్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం** (20 ఓవర్లలో 7 వికెట్లకు) 184. **వికెట్ల పతనం:** 1-43, 2-72, 3-79, 4-98, 5-136, 6-142, 7-145. **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-38-2, యశ్ దయాళ్ 3-0-18-1, హాజల్‌వుడ్ 4-0-54-1, కృనాల్ పాండ్యా 4-0-17-2, సుయాశ్ శర్మ 2-0-19-0, షెఫర్డ్ 3-0-30-1.

ఐపీఎల్-18వ సీజన్ అవార్డీల వివరాలు

ఆరెంజ్ క్యాప్



(అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్)
సాయి సుదర్శన్ (గుజరాత్ టైటాన్స్)
759 పరుగులు (15 మ్యాచ్‌లు)
ఫోర్లు: 88, సిక్స్‌లు: 21, స్ట్రయిక్‌రేట్: 156.17
ప్రైజ్‌మనీ: రూ. 10 లక్షలు

పర్పుల్ క్యాప్



(అత్యధిక వికెట్లు తీసిన బౌలర్)
ప్రసిధ్ కృష్ణ (గుజరాత్ టైటాన్స్)
25 వికెట్లు (15 మ్యాచ్‌లు) వేసిన ఓవర్లు: 59
ఇచ్చిన పరుగులు: 488
ప్రైజ్‌మనీ: రూ. 10 లక్షలు

ఎమర్జింగ్ ప్లేయర్



సాయి సుదర్శన్
(గుజరాత్ టైటాన్స్)
ప్రైజ్‌మనీ: రూ. 10 లక్షలు

మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్



సూర్యకుమార్ యాదవ్
(ముంబై ఇండియన్స్)
16 మ్యాచ్‌ల్లో 717 పరుగులు
69 ఫోర్లు, 38 సిక్స్‌లు
5 అర్ధ సెంచరీలు
ప్రైజ్‌మనీ: రూ. 15 లక్షలు

'బెస్ట్ క్యాచ్' ఆఫ్ ద టోర్నీ

కామిందు మెండిస్ (సన్‌రైజర్స్ హైదరాబాద్)
ప్రైజ్‌మనీ: రూ. 10 లక్షలు

'సూపర్ స్ట్రయికర్ ఆఫ్ ద సీజన్'

వైభవ్ సూర్యవంశీ (రాజస్తాన్ రాయల్స్)
స్ట్రయిక్‌రేట్: 206.55
ప్రైజ్‌మనీ: రూ. 10 లక్షలు

'ఫెయిర్ ప్లే' అవార్డు

చెన్నై సూపర్ కింగ్స్

అత్యధిక సిక్స్‌లు కొట్టిన బ్యాటర్

నికోలస్ పూరన్ (లక్నో సూపర్ జెయింట్స్)
14 మ్యాచ్‌ల్లో 40 సిక్స్‌లు
ప్రైజ్‌మనీ: రూ. 10 లక్షలు

అత్యధిక ఫోర్లు కొట్టిన బ్యాటర్

సాయి సుదర్శన్ (గుజరాత్ టైటాన్స్)
15 మ్యాచ్‌ల్లో 88 ఫోర్లు
ప్రైజ్‌మనీ: రూ. 10 లక్షలు

'గ్రీన్ డాట్ బాల్స్ ఆఫ్ ద సీజన్'

మొహమ్మద్ సిరాజ్ (గుజరాత్ టైటాన్స్)
151 డాట్ బాల్స్
ప్రైజ్‌మనీ: రూ. 10 లక్షలు

ఐపీఎల్-18 బౌండరీ మీటర్

మొత్తం సిక్స్‌లు	మొత్తం ఫోర్లు
1294	2245

ఆర్‌సీబీకి అందిన ద్రాక్ష

విరాట్ కోహ్లి 17 సీజన్లలో కలిపి 8 వేల పరుగులు చేసినా... క్రిస్ గేల్ విధ్వంసక బ్యాటింగ్‌తో 7 సీజన్లలో రికార్డులు బద్దలు కొట్టినా... డివిలియర్స్ 11 సీజన్లలో మరచిపోలేని మెరుపు ప్రదర్శనలు చూపించినా సాధ్యం కాలేదు... ఈ ముగ్గురు కలిసి 7 సీజన్లలో టి20 క్రికెట్ మజా ఏమిటో చూపిస్తూ అభిమానులకు అంతులేని వినోదాన్ని పంచినా... అసలు లక్ష్యం మాత్రం అందనంత దూరంలో నిలిచిపోయింది... గేల్ ఎప్పుడో టీమ్‌కు దూరమయ్యాడు... డివిలియర్స్ ఇక నా వల్ల కాదంటూ మూడు సీజన్ల క్రితం తప్పుకున్నాడు...వీరిద్దరితో కలిసి ఐపీఎల్‌లో ఓవరాల్‌గా టాప్-2 భాగస్వామ్యాలు నెలకొల్పిన కోహ్లి... ఆ తర్వాత డుప్లెసిస్‌తో కలిసి మరో మూడు సీజన్లు బ్యాటింగ్ భారం మోశాడు. కానీ ఎన్ని గొప్ప ఇన్నింగ్స్‌లు వచ్చినా ఐపీఎల్ ట్రోఫీ మాత్రం దక్కలేదు! అయితే ఎట్టకేలకు బెంగళూరు ఇప్పుడు తమ కలను నెరవేర్చుకుంది. కోహ్లి ఆనందభాష్పాలు చూస్తే ఈ విజయం విలువేమిటో తెలుస్తుంది!

స్టార్లు కాకపోయినా....

పెద్ద పెద్ద పేర్లు ముఖ్యం కాదు... చిన్న ఆటగాళ్లే అయినా వారు చూపించే ప్రభావం ముఖ్యమని ఆర్‌సీబీ నిరూపించింది. టోర్నీలో పది మంది బ్యాటర్లు కనీసం అర్ధ సెంచరీలు సాధించారు. ఫైనల్‌కు ముందు జట్టు 10 మ్యాచ్‌లు గెలిస్తే 9 మంది వేర్వేరు ఆటగాళ్లు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'లుగా నిలిచారు. 'బిగ్ త్రీ'పై మాత్రమే ఆధారపడిన గెలుపును ఆశించిన జట్టులా ఈసారి బెంగళూరు ఏమాత్రం కనిపించలేదు. వైవిధ్యంతో పాటు బ్యాటింగ్ లోతును కూడా టీమ్ చూపించింది. జట్టు కష్టాల్లో ఉన్న ప్రతీ సారి నేనున్నానంటూ ఎవరో ఒకరు ముందుకొచ్చి ఆదుకున్నారు. లీగ్ దశలో పంజాబ్‌పై టిమ్ డేవిడ్, చెన్నైపై షెఫర్డ్, లక్నోపై జితేశ్ ఆడిన ఇన్నింగ్స్‌లు అసాధారణ ప్రదర్శనలుగా నిలిచాయి. ఐపీఎల్ చరిత్రలో ప్రత్యర్థి వేదికపై ఆడిన 7 మ్యాచ్‌లూ గెలిచిన తొలి జట్టుగా ఆర్‌సీబీ నిలిచింది.

సాల్ట్‌ను ఎంచుకొని...

ఐపీఎల్ వేలం సమయంలో టీమ్ డైరెక్టర్ బొబాట్ ఒక ఆసక్తికర వ్యాఖ్య చేశారు. 'వారు ఎలా ఆడతారన్నది మేం ఆలోచించడం లేదు. మేం ఎలా ఆడించాలనే ఆలోచనే అన్నింటికంటే ముఖ్యం. దాని ప్రకారమే మేం ఆటగాళ్లను ఎంచుకున్నాం' అని ఆయన చెప్పారు. హెడ్ కోచ్ ఆండీ ఫ్లవర్, మెంటార్ దినేశ్ కార్తీక్‌లతో పాటు పన్నిన వ్యూహాలు, ప్రణాళికలు బెంగళూరుకు అద్భుతంగా పని చేశాయి. కోహ్లికి జోడీగా విధ్వంసకర ఓపెనర్ కావాలంటూ కార్తీక్ పట్టుబట్టి మరీ సాల్ట్‌ను రూ. 11.25 కోట్లకు తీసుకునేలా చేశాడు. ఏకంగా 175 స్ట్రయిక్‌రేట్‌తో అతను 403 పరుగులు చేసి నమ్మకాన్ని నిలబెట్టుకున్నాడు.

కెప్టెన్ సూపర్...

కెప్టెన్‌గా కూడా రజత పాటీదార్‌ను ఎంచుకోవడంలో ఆర్‌సీబీ ఎంతో ఆలోచించి నిర్ణయం తీసుకుంది. భారత్ క్రికెట్‌లో స్టార్ ఆటగాడు కాకపోయినా... ముస్తాక్‌అలీ ట్రోఫీలో అతని నాయకత్వ లక్షణాలు చూసి ఎంచుకుంది. ఇది ఎంత గొప్పగా పని చేసిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. కోల్‌కతా, చెన్నై, ముంబైలపై వారి వేదికల్లో ఎన్నో ఏళ్ల తర్వాత విజయాలు సాధించడంలో బ్యాటర్‌గా పాటీదార్ పాత్ర ఎంతో ఉంది. 312 పరుగులతో అతను రాణించాడు. సుయాశ్ శర్మ, యశ్ దయాళ్‌లను సరైన సమయంలో సమర్థంగా వాడుకోవడంలో అతని కెప్టెన్సీ ప్రతిభ కనిపించింది. ఇప్పుడు 17 సీజన్లలో సాధ్యం కాని ఘనతను కెప్టెన్‌గా తన తొలి సీజన్‌లోనే అందుకొని పాటీదార్ ఐపీఎల్ చరిత్రలో తన పేరును ఘనంగా లిఖించుకున్నాడు.

అంతా కోహ్లిమయం...

బెంగళూరు టీమ్ సభ్యులలో గతంలో కృనాల్ పాండ్యా, హాజల్‌వుడ్, భువనేశ్వర్, సాల్ట్ ఐపీఎల్ గెలిచిన జట్లలో సభ్యులుగా ఉన్నారు. ఇతర యువ ఆటగాళ్ల కెరీర్ ఇంకా పూర్తిగా ఊపందుకోలేదు. ఇప్పటికిప్పుడు టైటిల్ గెలిచినా, ఓడినా వారికి పెద్ద తేడా ఉండకపోవచ్చు. కానీ విరాట్ కోహ్లి పరిస్థితి అందరికంటే భిన్నం. అతను 18 సీజన్లుగా ఒకే జట్టుకు తన సర్వం ధారబోశాడు. ఎన్నో గొప్ప విజయాలను అందించాడు. కానీ టైటిల్ మాత్రం గెలవలేని లోటు ప్రతీసారి వెంటాడేది. గతంలో మూడు ఫైనల్ మ్యాచ్‌లో ఓడిన బాధ ఇంకా వెంటాడుతూనే ఉంది. ముఖ్యంగా 2016 సీజన్‌లో ఏకంగా 973 పరుగులతో చెలరేగినా ఫైనల్లో పరాజయం అతడికి తీవ్ర వేదనను కలిగించింది. నాటి నుంచి ఇప్పటి వరకు మళ్లీ జట్టు ట్రోఫీకి చేరువగా రాలేకపోయింది. కెరీర్ చరమాంకంలో ఉన్న అతను ఈసారి గెలవలేకపోతే మరింత ఆవేదన కలిగేది. ఇలాంటి స్థితిలో దక్కిన విజయం కోహ్లి కోసమే వచ్చినట్లుగా ఉంది. అందుకే మైదానమంతా కోహ్లి చుట్టే సంబరాలు. గతంలో జట్టులో భాగంగా ఉండి ట్రోఫీ గెలవలేని డివిలియర్స్, గేల్ కూడా కోహ్లి పక్కన ఉండి అతని సంతోషంలో భాగం కావడం విశేషం.

– సాక్షి క్రీడా విభాగం





'పసి పాపలా ప్రశాంతంగా నిద్రపోతా'

18 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ ముగిసింది. ఈ విజయం జట్టు సభ్యులది మాత్రమే కాదు అభిమానులది కూడా. నేను యువకుడిగా, ఆ తర్వాత కెరీర్ అత్యుత్తమ దశలో, ఇప్పుడు అనుభవజ్ఞుడిలా ఈ టీమ్‌తో ఉన్నాను. ప్రతీ సీజన్‌లోనూ ఇదే తరహాలో విజయం కోసం తీవ్రంగా శ్రమించాను. నేను చేయగలిగిందంతా చేశాను. చివరకు ఇప్పుడు దక్కిన భావన గొప్పగా ఉంది. ఈ రోజు వస్తుందని అనుకోలేదు. ఆఖరి బంతి తర్వాత భావోద్వేగాలను నియంత్రించుకున్నాను. ఏం జరిగినా ఇదే జట్టుతో ఉన్నాను. టీమ్ మేనేజ్‌మెంట్ కూడా నాతో నిలబడింది. ఇదే జట్టుతో టైటిల్ గెలవాలని కలగన్నాను. మరో టీమ్‌తో గెలిచి ఉంటే ఇంత ఆనందం దక్కకపోయేదేమో. నా హృదయం,



ఆత్మ బెంగళూరుతోనే ఉన్నాయి. గతంలో చెప్పినట్లుగా నేను ఐపీఎల్ ఆడినంత వరకు ఇదే జట్టుతో ఉంటా. ఎంతో పోటీ, తీవ్రత ఉండే ఈ టోర్నీలో టైటిల్ విజయాన్ని ఎంతో ప్రాధాన్యత ఉంది. నేను ఇలాంటి పెద్ద టోర్నీలను గెలవాలని, చిరస్మరణీయ క్షణాలను కోరుకుంటా. కెరీర్‌లో అత్యుత్తమ విజయాల్లో ఇదొకటి. ఈ రోజు నేను ప్రశాంతంగా పసిపాపలా నిద్రపోతా. వేలంలో మా ఎంపికను చాలా మంది ప్రశ్నించారు. కానీ వాటిని తప్పని నిరూపించాం. –విరాట్ కోహ్లి

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
636	174
80,738	24,543

విదేశీ సూచీలు

నాస్‌డాక్	19,432	▲	189
డోజోన్స్	42,086	▲	240
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,787	▲	13
డాక్స్	24,092	▲	161
షాంఘై	3,362	▲	14
నికాయ్	37,447	▽	24

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.10	86.12
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	113.90	116.83
€	యూరో	ఎస్‌బీఐ	96.28	98.98
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	59.04	60.59
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.27	56.48
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	64.11	68.78
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.93	23.44
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.41	24.19
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.03	12.86

టాటా హారియర్ ఈవీ రెడీ

- ధర రూ. 21.49 లక్షలతో మొదలు
- జూలై 2 నుంచి బుకింగ్స్ షురూ



న్యూఢిల్లీ: వాహనాల దిగ్గజం టాటా మోటార్స్ ఎలక్ట్రిక్ కార్ల శ్రేణిని మరింతగా విస్తరించే క్రమంలో హారియర్ ఎలక్ట్రిక్ వెహికల్‌ని ప్రవేశపెట్టింది. దీని ధర రూ. 21.49 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. ఒకసారి చార్జ్ చేస్తే 500 కి.మీ. రేంజ్ ఉంటుంది. జూలై 2 నుంచి బుకింగ్స్ ప్రారంభమవుతాయి. లైఫ్‌టైమ్ వారంటీ గల రెండు బ్యాటరీ ప్యాక్ ఆప్షన్లతో లభిస్తుంది. ఆటో పార్క్ అసిస్ట్, 6 టెరెయిన్ మోడ్‌లు, 55 పైగా కనెక్టెడ్ కార్ ఫీచర్లు మొదలైనవి ఇందులో ఉంటాయి. ప్రీమియం ఎస్‌యూవీ సెగ్మెంట్ కస్టమర్లకు ఇది ఆకర్షణీయంగా ఉంటుందని టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ ఎండీ శైలేష్ చంద్ర తెలిపారు. ప్రస్తుతం ఈ సెగ్మెంట్లో ప్రతి నెలా 25,000 యూనిట్లు అమ్ముడవుతున్నాయి. ప్రీమియం ఎస్‌యూవీ విభాగంలో హారియర్, సఫారీ వాహనాలతో టాటా మోటార్స్‌కి సుమారు 25 శాతం మార్కెట్ వాటా ఉంది. ఎస్‌యూవీ సెగ్మెంట్ ఏటా గణనీయంగా వృద్ధి చెందుతోందని, దేశీయంగా మొత్తం ప్యాసింజర్ వాహనాల అమ్మకాల్లో ప్రస్తుతం 54 శాతం వాటా దక్కించుకుందని చంద్ర చెప్పారు. చార్జింగ్ వేగం కూడా గణనీయంగా మెరుగుపడటంతో, సంప్రదాయ వాహనాలకు దీటుగా, మెరుగైన ఫీచర్లతో ఎలక్ట్రిక్ వాహనాలు ఉంటున్నాయని పేర్కొన్నారు.

భారత మార్కెట్లో భారీ అవకాశాలు

- టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్‌గా మారిన ఐటీ రంగం
- వర్జిన్ అట్లాంటిక్ సీఈవో షాయ్ వైస్

న్యూఢిల్లీ: భారత ఐటీ పరిశ్రమ, ఔట్‌సోర్సింగ్ మోడల్ నుంచి టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్‌గా ఎదిగిందని బ్రిటన్ విమానయాన సంస్థ వర్జిన్ అట్లాంటిక్ సీఈవో షాయ్ వైస్ తెలిపారు. ఇండియా మార్కెట్లో విస్తరణకు అపార అవకాశాలు ఉన్నాయన్నారు. తమకు అమెరికా తర్వాత రెండో అతి పెద్ద మార్కెట్‌గా భారత్ నిలుస్తోందని వైస్ వివరించారు. వర్జిన్ అట్లాంటిక్ గత పాతికేళ్లుగా భారత్‌కి విమానాలు నడుపుతోంది. ప్రస్తుతం ఢిల్లీ, ముంబై, బెంగళూరు నుంచి లండన్ హీత్రో ఎయిర్‌పోర్ట్‌కి రోజూ అయిదు ఫ్లయిట్స్‌ను నిర్వహిస్తోంది. ప్రయాణికులను నిరాటంకంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు భారతీయ విమానయాన సంస్థ ఇండిగోతో కంపెనీకి కోడ్‌షేర్ ఒప్పందం ఉంది. కొత్త రూట్లలో సర్వీసులు ప్రారంభించడమనేది డిమాండ్‌పై ఆధారపడి ఉంటుందని వైస్ చెప్పారు. భారత్–బ్రిటన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో ఇరు దేశాల మధ్య వ్యాపార కార్యకలాపాలు పుంజుకుంటాయని, తమ కార్గో వ్యాపారానికి కూడా ఇది ప్రయోజనకరమైన అంశమని తెలిపారు. భారత్ రూట్లో నడిపే ప్రతి విమానంలో స్థానికతకు పెద్ద పీట వేసేలా నలుగురు లోకల్ సిబ్బంది ఉంటారని, మెనూలో సమోసాలను కూడా అందిస్తున్నామని పేర్కొన్నారు. టారిఫ్‌లపరమైన ఆందోళనపై స్పందిస్తూ విమానయాన సంస్థలకు ఇలాంటి పరిస్థితులు అలవాటేనని వైస్ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం, బ్రెగ్జిట్, కోవిడ్ మహమ్మారిలాంటివెన్నో చూశాయని చెప్పారు. ఇక సరఫరా వ్యవస్థపరంగా అంతరాయాల విషయానికొస్తే తమ దగ్గర తగినన్ని విమానాలు ఉన్నాయని, ఈ ఏడాది డెలివరీ లేమీ లేవని వైస్ వివరించారు.



టీసీఎస్‌తో 7 ఏళ్ల ఒప్పందం ..

దేశీ ఐటీ దిగ్గజం టీసీఎస్‌తో వర్జిన్ అట్లాంటిక్ 7 సంవత్సరాల ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ ఆర్థిక వివరాలు వెల్లడి కాలేదు. ఇరు కంపెనీల మధ్య రెండు దశాబ్దాలుగా వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం ఉండగా, తాజా డీల్ దాని కి కొనసాగింపు. ఈ ఒప్పందంతో క్లౌడ్ ఫస్ట్, కృత్రిమ మేధ సాంకేతికతతో వర్జిన్ అట్లాంటిక్ టెక్నాలజీ కార్యకలాపాలను టీసీఎస్ ఆధునీకరిస్తుంది. అధునాతన టెక్నాలజీ కమాండ్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేస్తుంది. రియల్ టైమ్ డేటా విశ్లేషణతో కస్టమర్లకు, సిబ్బందికి మెరుగైన అనుభూతిని కల్పిస్తుంది. కార్యకలాపాలను క్రమబద్ధీకరించుకునేందుకు వీలు కల్పిస్తుంది.

81,000 దిగువకు సెన్సెక్స్

ముంబై: అంతర్జాతీయంగా భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు పెరగడం, వాణిజ్య సుంకాల భయాలతో దేశీయ స్టాక్ సూచీలు మంగళవారం ఒక శాతం మేర నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు వరుస విక్రయాలు సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. ఫలితంగా సెన్సెక్స్ 636 పాయింట్లు నష్టపోయి 80,738 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 174 పాయింట్లు కోల్పోయి 24,543 వద్ద నిలిచింది. సూచీలకిది మూడో రోజూ నష్టాల ముగింపు. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు ఆరంభంలోనే తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఇంధన, ఫైనాన్స్, ఐటీ షేర్లలో భారీగా విక్రయాలు వెల్లువెత్తడంతో ఇంట్రాడేలో సెన్సెక్స్ 799 పాయింట్లు క్షీణించి 80,575 వద్ద, నిఫ్టీ 215 పాయింట్లు పతనమై 24,502 వద్ద కనిష్టాన్ని తాకాయి. అమెరికా తయారీ రంగం వరుసగా మూడోనెలా తగ్గుముఖం పట్టడంతో పాటు చైనా ఫ్యాక్టరీ యాక్టివిటీ ఎనిమిది నెలల్లో తొలిసారి క్షీణించినట్లు డేటా రావడంతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

- డాలర్ మారకంలో రూపాయి విలువ 22 పైసలు బలహీనపడి 86.61 వద్ద స్థిరపడింది.
- అదానీ గ్రూప్ ముంద్రా రేవు ద్వారా కొన్ని కంపెనీలు ఇరాన్ ఎల్‌పీజీ దిగుమతి చేసుకునేందుకు సహకరించిందనే ఆరోపణల నేపథ్యంలో గ్రూప్ కంపెనీల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. అదానీ పోర్ట్స్, ఎన్‌డీటీవీ, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్, అదానీ పవర్, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 2.50% – 2% క్షీణించాయి.
- ప్రోస్టార్మ్ ఇన్ఫో సిస్టమ్స్ షేరు బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.105)తో పోలిస్తే 19% ప్రీమియంతో రూ.125 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 24% ఎగసి రూ.130 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 20% లాభంతో రూ.126 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.743 కోట్లకు చేరింది.



- నిఫ్టీ నష్టం 174 పాయింట్లు
- సూచీలు మూడో రోజూ డీలా

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

4-6-2025	
విశాఖ	535-00
చిత్తూరు	613-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	510-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	525-00
వరంగల్	527-00
రిటైల్ ధర	5.85

రష్యా చమురు దిగుమతులు జూమ్

- 'మే'లో 10 నెలల గరిష్టానికి

న్యూఢిల్లీ: దేశీయంగా రష్యా నుంచి ముడిచమురు దిగుమతులు గత నెలలో భారీగా పెరిగాయి. వెరసి మే నెలలో రోజుకి 1.96 మిలియన్ బ్యారెళ్ల(బీపీడీ)ను తాకాయి. ఇది 10 నెలల గరిష్ఠంకాగా.. ప్రపంచ ప్రామాణిక ధరలకంటే తక్కువలో చమురు లభించడం ఇందుకు సహకరించినట్లు గణాంకాల సంస్థ కెప్లర్ పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా చమురు వినియోగం, దిగుమతులకు మూడో ర్యాంకులో నిలిచే భారత్ విదేశాల నుంచి 5.1 మిలియన్ బ్యారెళ్ల చమురును కొనుగోలు చేసింది. ముడిచమురును శుద్ధి చేయడం ద్వారా రిఫైనరీలు పెట్రోల్, డీజిల్ తదితర ఇంధనాల తయారీని చేపట్టే సంగతి తెలిసిందే. భారత్ కొనుగోలు చేసిన చమురులో రష్యా 38 శాతం వాటా ఆక్రమిస్తోంది. రోజుకి 1.2 మిలియన్ బ్యారెళ్ల సరఫరా ద్వారా ఇరాక్ రెండో పెద్ద సరఫరాదారుగా నిలిచింది. ఈ బాటలో భారత్‌కు 6,15,000 బీపీడీ చమురును సౌదీ అరేబియా ఎగుమతి చేయగా.. యూఏఈ 14,90,000 బీపీడీ అందించింది. యూఎస్ నుంచి 2,80,000 బీపీడీ చమురును అందుకుంది. గత నెలలో భారత్ చమురు దిగుమతుల ప్రొఫైల్ ధరల ఆధారంగా విభిన్న ప్రాంతాల నుంచి కొనుగోలు చేసిన విషయాన్ని స్పష్టం చేస్తున్నట్లు కెప్లర్ వివరించింది. నిజానికి మధ్యప్రాచ్యం నుంచి భారత్ అత్యధికంగా చమురును కొనుగోలు చేస్తుంటుంది.



పీఎన్‌బీ విద్యా రుణాలపై వడ్డీ రేటు 0.2 శాతం తగ్గింపు

న్యూఢిల్లీ: విద్యాలక్ష్మి స్కీము కింద విద్యా రుణాలపై వడ్డీ రేటును 20 బేసిస్ పాయింట్లు (0.2%) తగ్గించినట్లు పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) వెల్లడించింది. సంస్థను బట్టి విద్యా రుణాలపై వడ్డీ రేటు 7.5% నుంచి ప్రారంభం అవుతుందని వివరించింది. ఉన్నత విద్యను అభ్యసించడంలో విద్యార్థులకు ఆర్థిక తోడ్పాటునందించే లక్ష్యంతో ఈ స్కీమును రూపొందించారు. దేశవ్యాప్తంగా నాణ్యమైన ఉన్నత విద్యా సంస్థలుగా (క్యూహెచ్‌ఈఐ) గుర్తింపు పొందిన 860 సంస్థల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఇది ఉపయోగకరంగా ఉంటోంది.

హ్యుందాయ్ మోటార్ బ్రాండ్ అంబాసిడర్‌గా పంకజ్ త్రిపాఠి



గురుగ్రామ్: హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్ఎంఐఎల్) తమ నూతన బ్రాండ్ అంబాసిడర్‌గా బాలీవుడ్ నటుడు పంకజ్ త్రిపాఠిని నియమించింది. 'లిజెన్ టు యువర్ దిల్ ఆర్ ది డీల్స్. యూ విల్ బ్రింగ్ హోమ్ ఎ హ్యుందాయ్' పేరిట కంపెనీ రూపొందించిన ప్రచార ప్రకటనల్లో ఆయన నటించారు. ''పంకజ్ త్రిపాఠి తన విలక్షణ నటన, సహజ వ్యక్తిత్వంతో దేశవ్యాప్తంగా పేరుపొందారు. త్రిపాఠి ప్రచారంతో బ్రాండ్‌పై మరింత నమ్మకం పెరుగుతుంది'' అని హెచ్ఎంఐఎల్ వెర్టికల్ హెడ్(మార్కెటింగ్) విరాట్ ఖుల్లార్ తెలిపారు.

కార్పొ బ్రీఫ్స్..

ఓలా నుంచి హ్యుందాయ్ ఔట్

న్యూఢిల్లీ: ఆటో దిగ్గజం హ్యుందాయ్ మోటార్ తాజాగా ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ నుంచి వైదొలగింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా ఓలాలో 2.47 శాతం వాటా విక్రయించింది. ఎన్ఎస్ఈ బల్క్‌డీల్స్ ప్రకారం షేరుకి రూ. 50.7 సగటు ధరలో 10.88 కోట్ల షేర్లు అమ్మివేసింది. తద్వారా రూ. 552 కోట్లు అందుకుంది. మరోవైపు కియా కార్పొరేషన్ సైతం 0.62 శాతం వాటాకు సమానమైన 2.71 కోట్ల ఓలా షేర్లు విక్రయించింది. షేరుకి రూ. 50.55 సగటు ధరలో రూ. 137.35 కోట్లకు విక్రయించింది.

నివా బూపా హెల్త్‌లో వాటా విక్రయం

న్యూఢిల్లీ: నివా బూపా హెల్త్ ఇన్సూరెన్స్‌లో ఎండీ, సీఈవో కృష్ణన్ రామచంద్రన్‌తోపాటు పీఈ దిగ్గజం ట్రూ నార్త్ సంయుక్తంగా 10 శాతం వాటా విక్రయించాయి. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా ఎస్‌పీవీ ఫెటిల్ టోన్ ఎల్ఎల్‌పీ 9.46 శాతం వాటాకు సమానమైన 17.29 కోట్ల షేర్లు అమ్మివేసింది. బీఎస్ఈ బల్క్‌డీల్స్ ప్రకారం రామచంద్రన్ సైతం కోటి షేర్ల(0.55 శాతం వాటా) విక్రయించారు. షేరుకి రూ. 82.11-82.76 సగటు ధరలో విక్రయించిన 10 శాతం వాటా ద్వారా రూ. 1,508 కోట్లు లభించాయి. ఈ లావాదేవీ తదుపరి ఫెటిల్‌టోన్ వాటా నివా బూపాలో 17.47 శాతం నుంచి 8.01 శాతానికి దిగివచ్చింది.

యస్ బ్యాంక్‌లో కార్లయిల్ వాటా డౌన్



గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ కార్లయిల్ ఓపెన్ మార్కెట్ లావాదేవీ ద్వారా యస్ బ్యాంక్‌లో 2.6% వాటాకు సమానమైన 82 కోట్ల షేర్లను రూ.1,775 కోట్లకు విక్రయించింది. తద్వారా యస్ బ్యాంక్‌లో కార్లయిల్ వాటా 6.84% నుంచి 4.22 శాతానికి దిగివచ్చింది. యస్ బ్యాంక్ షేరు 10.5% క్షీణించి రూ.20.85 వద్ద స్థిరపడింది.

సాక్షి సినిమా

పెద్దితో పాట



● జాన్వీ కపూర్

పెద్దితో స్టెప్పులేశారు జాన్వీ కపూర్. రామ్‌చరణ్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న పీరియాడికల్ అండ్ మల్టీ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'. ఈ విలేజ్ బ్యాక్‌డ్రాప్ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా కొత్త షెడ్యూల్‌లో జాన్వీ కపూర్ పాల్గొన్నారు. ఈ షెడ్యూల్‌లో రామ్‌చరణ్, జాన్వీతో పాటు ముఖ్య తారాగణంగా పాల్గొనగా ఓ పాటను చిత్రీకరించారు. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ పతాకాలపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి 27న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్.

రాజా సాబ్ రెడీ

థియేటర్స్‌లోకి రాజా సాబ్ వచ్చే తేదీ ఖరారైంది. ప్రభాస్ హీరోగా నటిస్తున్న చిత్రం 'ది రాజా సాబ్'. ఈ చిత్రంలో నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్, రిద్ధీ కుమార్ హీరోయిన్లుగా నటిస్తుండగా, సంజయ్ దత్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నట్లుగా తెలిసింది. మారుతి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాను డిసెంబరు 5న రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ మంగళవారం ప్రకటించారు. అలాగే టీజర్‌ను ఈ నెల 16న రిలీజ్ చేస్తామని కూడా తెలిపారు. ''ప్రభాస్ ఇప్పటివరకు చేయని రొమాంటిక్ హారర్ జానర్‌లో 'ది రాజా సాబ్' సినిమా రూపొందుతోంది. ఈ సినిమాతో ప్రేక్షకులకు ఎవర్ గ్రీన్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇవ్వబోతున్నారు దర్శకుడు మారుతి'' అని యూనిట్ పేర్కొంది.



● ప్రభాస్

నేను రెండో రకం!



● రాజ్‌కుమార్ రావ్

బాలీవుడ్ యాక్టర్ రాజ్‌కుమార్ రావ్ నటిస్తున్న పీరియాడికల్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'మాలిక్'. ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామాకి పుల్‌కిత్ దర్శకత్వం వహిస్తున్నారు. 'మాలిక్' టీజర్‌ను విడుదల చేసి, ఈ సినిమాను జూలై 11న రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ''మనుషులు రెండు రకాలుగా ఉంటారు. కొందరు జీవించడం కోసం చెమట చిందిస్తారు. మరికొందరు తమకు దక్కాల్సిన దాని కోసం, రావాల్సిన దాని కోసం చెమటతో పాటు రక్తాన్నీ చిందిస్తారు. నేను రెండో రకం' అనే అర్థం వచ్చే హిందీ డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి.

అది నా అదృష్టం

– రీతూ వర్మ



''చాలా మంది అమ్మాయిలను చుట్టు పక్కల ఉండే వాళ్లు 'నువ్వు అది చేయలేవు.. ఇది చేయలేవు' అంటూ నిరుత్సాహపరుస్తుంటారు. అలాంటి వారికి 'దేవిక అండ్ డానీ' సిరీస్ ఓ నమ్మకాన్ని కలిగిస్తుంది. ఇటువంటి నిజాయితీతో కూడిన కథ నా దగ్గరకు రావడం, నేను చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను'' అని హీరోయిన్ రీతూ వర్మ తెలిపారు. శివ కందుకూరి, రీతూ వర్మ, సూర్య వశిష్ఠ, సుబ్బరాజు ప్రధాన పాత్రల్లో బి. కిశోర్ దర్శకత్వం వహించిన వెబ్ సిరీస్ 'దేవిక అండ్ డానీ'. సుధాకర్ చాగంటి నిర్మించిన ఈ సిరీస్ ఈ నెల 6 నుంచి జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో శివ కందుకూరి మాట్లాడుతూ– ''ఈ సిరీస్‌లో నేను సుబ్బు అనే ఫన్నీ పాత్ర చేశాను'' అన్నారు. ''దేవిక అనే అమ్మాయి జీవితాన్ని డానీ, సుబ్బులాంటి పాత్రలు ఎలా మార్చాయనేది ఈ సిరీస్‌లో చూడొచ్చు'' అని పేర్కొన్నారు సూర్య వశిష్ఠ. ''దేవిక అండ్ డానీ'లో ఏడు ఎపిసోడ్స్ ఉంటాయి. ఎంటర్‌టైన్మెంట్, ఎమోషన్స్ సహా అన్ని అంశాలున్న సిరీస్ ఇది'' అని సుధాకర్ చాగంటి తెలిపారు. ''శ్రీకారం' సినిమా తర్వాత ఈ సిరీస్ చేయటం చాలా ఆనందంగా ఉంది. ఈ సిరీస్ చూసే ఆడియన్స్ సమయం వృథా కాదు'' అన్నారు బి. కిశోర్.

ఆ కష్టం వాళ్లకి అర్థం కాదు

– తరుణ్ భాస్కర్



● మహేశ్, తరుణ్ భాస్కర్, విద్యాసాగర్

''చాలామంది వినోదాన్ని తేలిగ్గా తీసిపారేస్తారు. కానీ, ఆ కామెడీ సన్నివేశాల వెనక ఎంత కష్టం, నిజాయితీ దాగుందనేది చూసే వాళ్లకి అర్థం కాదు. ఆ సన్నివేశాలు రాసినవాళ్లకే తెలుస్తుంది. 'పెళ్లిచూపులు' చిత్రానికి కామెడీ సీన్స్ రాస్తున్నప్పుడు మా నాన్న ఆరోగ్యం చాలా సీరియస్‌గా ఉంది. టెన్షన్ పడుతూనే రాత్రి వేళల్లో ఆ సన్నివేశాలు రాశాను'' అని నటుడు, డైరెక్టర్ తరుణ్ భాస్కర్ అన్నారు. మహేశ్ చింతల, విద్యాసాగర్ కారంపురి, బలగం సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్, కవితా శ్రీరంగం, దీక్షా కోటేశ్వర్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'బద్మాషులు'. శంకర్ చేగూరి దర్శకత్వంలో బి. బాలకృష్ణ, ఇ. రామ శంకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 6న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ–''వినోద ప్రధానంగా రూపొందిన 'బద్మాషులు' చిత్రం మంచి విజయం సాధించాలి'' అన్నారు. మరో ముఖ్య అతిథి డైరెక్టర్ మాలిక్ రామ్ మాట్లాడుతూ– ''బద్మాషులు' సినిమా భవిష్యత్తులో ఒక పెద్ద చిత్రానికి నాంది పలకబోతోందనిపిస్తోంది'' అని చెప్పారు. ''రెండు గంటల పాటు వినోదాన్ని పంచే చిత్రం ఇది'' అన్నారు శంకర్ చేగూరి.

ప్రేమలో...



● సుప్రిత, అమరదీప్

'బిగ్ బాస్' ఫేమ్ అమరదీప్ చౌదరి హీరోగా, సురేఖా వాణీ కూతురు సుప్రీతా నాయుడు హీరోయిన్‌గా నటించిన ప్రేమకథా చిత్రం 'చౌదరిగారి అబ్బాయితో నాయుడు గారి అమ్మాయి'. మాల్యాద్రి రెడ్డి దర్శకత్వంలో మహా మూవీస్ సౌజన్యంతో మహర్షి కూండ్ల సమర్పణలో మహేంద్ర నాథ్ కూండ్ల నిర్మించారు. ఈ సినిమా టైటిల్ గ్లింప్స్ విడుదల ప్రెస్‌మీట్‌లో మహేంద్ర నాథ్ మాట్లాడుతూ– ''మా సినిమాని లిమిటెడ్ బడ్జెట్‌తో ప్రారంభించాం. కానీ, మా హీరో, హీరోయిన్‌కి ఉన్న పాపులారిటీ వల్ల మా చిత్రానికి క్రేజ్ పెరిగింది'' అన్నారు. అమరదీప్ మాట్లాడుతూ– ''చౌదరిగారి అబ్బాయితో నాయుడుగారి అమ్మాయి' చాలా మంచి కథతో రూపొందించిన చిత్రం'' అని తెలిపారు. ''సినిమా ఆరంభంలో భయం వేసింది. కానీ, ఇప్పుడు సినిమా విజయంపై నమ్మకం వచ్చింది'' అన్నారు సుప్రీత.

బూమ్ బూమ్



● జెన్నిఫర్

అర్జున్ అంబటి హీరోగా నటించిన చిత్రం 'పరమపద సోపానం'. జెన్నిఫర్ ఇమ్మాన్యుయేల్ హీరోయిన్. పూరి జగన్నాథ్ వద్ద అసిస్టెంట్‌గా చేసిన నాగ శివ దర్శకత్వం వహించారు. గుడిమిట్ల సువర్ణలత సమర్పణలో ఎస్.ఎస్.మీడియా బ్యానర్‌పై గుడిమిట్ల శివ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం జూలై 11న విడుదలవుతోంది. డేవ్ జాండ్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'భూమ్ భూమ్...' అంటూ సాగే రెండో పాటని విడుదల చేశారు మేకర్స్. రాంబాబు గోశాల సాహిత్యం అందించిన ఈ పాటను గీతా మాధురి ఆలపించారు. ''భూమ్ భూమ్...' మంచి స్వింగ్ ఉన్న పాట. కచ్చితంగా అందర్నీ ఆకట్టుకుంటుంది'' అన్నారు గీతా మాధురి.

ప్రేమ... త్యాగం



● భవ్యశ్రీ, హరికృష్ణ

హరికృష్ణ, భవ్యశ్రీ జంటగా ఆదినారాయణ పినిశెట్టి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమా చిత్రీకరణ పూర్తయింది. టీఎస్ఆర్ మూవీ మేకర్స్ సమర్పణలో తిరుపతి శ్రీనివాసరావు నిర్మించారు. ఈ సందర్భంగా తిరుపతి శ్రీనివాసరావు మాట్లాడుతూ– ''ప్రేమ, త్యాగం, కుటుంబ విలువలను ఆవిష్కరిస్తూ భావోద్వేగాలతో నిండిన కథాంశంతో రూపొందిన చిత్రమిది'' అన్నారు. ''ప్రేక్షకులకు ఒక అర్థవంతమైన కథను అందించాలనే లక్ష్యంతో ఈ సినిమా తీశాం. త్వరలో టైటిల్, విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని ఆదినారాయణ పినిశెట్టి తెలిపారు.

ఇథన్ మేడ్ ఇట్ పాజిబుల్

హాలీవుడ్ సిరీస్‌లలో 'మిషన్ ఇంపాజిబుల్'కి ప్రత్యేక క్రేజ్ ఉంది. ఈ సిరీస్‌లో ఎనిమిదో భాగం మిషన్ ఇంపాజిబుల్–ది ఫైనల్ రికనింగ్ ఇటీవల విడుదలైంది. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఓ సీరియల్‌ను ప్రేక్షకులకు అలవాటుగా మార్చడం కొంచెం సులభం. కానీ అదే కథను సిరీస్ రూపంలో సినిమాలుగా చేస్తూ ప్రేక్షకులను మెప్పించడం మాత్రం కాస్త కష్టమనే చెప్పాలి. ఆ విషయంలో పాశ్చాత్య సిరీస్‌లు చాలావరకు విజయం సాధించాయి. అది కూడా పాతికేళ్ళకు పైగా ఒకే సిరీస్‌లో సినిమాలు నడపడమంటే మాటలా... ఇంపాజిబుల్. కానీ ఆ ఇంపాజిబుల్ టాస్క్‌ని పాజిబుల్ చేసి, ప్రేక్షకులను అలరిస్తున్న సిరీస్ 'మిషన్ ఇంపాజిబుల్'. ఇటీవల ఈ హాలీవుడ్ సిరీస్‌లో 8వ సినిమాగా రిలీజ్ అయిన 'మిషన్ ఇంపాజిబుల్–ది ఫైనల్ రికనింగ్' సూపర్ అనే చెప్పాలి. క్రిస్టోఫర్ మెక్ క్వారీ ఈ సినిమాకి దర్శకత్వం వహించారు. ఈసారి కథానాయకుడైన ఇథన్ హంట్ స్టంట్స్ అదరహో అనేలా ఉన్నాయి. సిరీస్‌లోని అన్ని సినిమాలలో ఇథన్ హంట్ పాత్రలో ప్రముఖ హాలీవుడ్ కథానాయకుడు టామ్ క్రూజ్ నటించారు. ఆయన నిజమైన సూపర్ స్టంట్స్‌తో ఆకట్టుకుంటారు. అందుకే ఈ సిరీస్ అంత స్పెషల్. ముఖ్యంగా ఎనిమిదో భాగంలో వచ్చే రెండు స్టంట్ ఎపిసోడ్లలో ప్రేక్షకులకు మతిపోతుందనే చెప్పాలి. సిరీస్ మొత్తం ఒకే పరమైన కథాంశంతో ఉంటుంది. కథానాయకుడు తన టీమ్‌తో కలిసి ప్రపంచాన్ని రక్షించడానికి విలువైన డాక్యుమెంట్లు, ఆయుధాలు శత్రువుల చేతుల్లోకి వెళ్ళకుండా చూడడమే మిషన్ ఇంపాజిబుల్. సిరీస్ మొదటినుంచి ఒకే టీమ్‌ను మెయింటైన్ చేస్తూ ఈ సినిమాలో మాత్రం టీమ్‌లోని ఓ మెంబరైన లూథర్ పాత్రను చంపేశారు. అదే ఆడియన్స్‌ను కొంచెం ఆలోచనలో పడేస్తుంది. ఓవరాల్‌గా 'మిషన్ ఇంపాజిబుల్–ది ఫైనల్ రికనింగ్' సినిమా యాక్షన్ థ్రిల్లర్‌ను ఇష్టపడేవాళ్ళకి... అలాగే ఈ సిరీస్‌ను ఫాలో అయ్యేవాళ్ళకు విజువల్ ఫీస్ట్ అనే చెప్పాలి. సో... 'ఎంజాయ్ మిషన్ ఇంపాజిబుల్–ది ఫైనల్ రికనింగ్' ఇన్ థియేటర్స్.

– హరికృష్ణ ఇంటూరు

క్లుప్తంగా...

నేడు, రేపు మహిళా, శిశు సంక్షేమంపై మేధోమథనం

- హాజరుకానున్న మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: మహిళా, శిశు సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం మేధోమథన సదస్సు నిర్వహించనుంది. బుధ, గురువారాల్లో రాజేంద్రనగర్‌లోని తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్‌లో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్క హాజరు కానున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు అంగన్‌వాడీలు, నూతన విధానాలు, ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న ఉత్తమ కార్యక్రమాలపై చర్చ జరగనుంది. అలాగే బెస్ట్ ప్రాక్టీస్‌లపై చర్చ, ఇతర జిల్లాల్లో అమలుచేసే కార్యాచరణ, మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి, దివ్యాంగుల సంక్షేమంపైనా చర్చిస్తారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు, జిల్లా సంక్షేమాధికారులు, కీలక విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు పాల్గొననున్నారు.

ఎవరూ ప్లాస్టిక్ వాడొద్దు.. పర్యావరణాన్ని నష్టపరచొద్దు

- పీసీబీ పోస్టరును విడుదల చేసిన మంత్రి కొండా సురేఖ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ఎవరూ ప్లాస్టిక్ వాడొద్దని, పర్యావరణాన్ని నష్టపరచొద్దని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖ అన్నారు. మానవ ఆరోగ్యంపై ప్లాస్టిక్ కాలుష్యంతో కలిగే హానికరమైన ప్రభావాల గురించి అవగాహన పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నామని, తెలంగాణను ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) పోస్టర్‌ను మంగళవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2025 సందర్భంగా 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం' అనే థీమ్‌తో పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ పర్యావరణం, వన్యప్రాణులు, మానవ ఆరోగ్యంపై ప్లాస్టిక్ కాలుష్యం వల్ల కలిగే హానికరమైన ప్రభావాల గురించి అవగాహన పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నాయన్నారు. స్థిరమైన పద్ధతులను అవలంబించడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, రీసైక్లింగ్ చేయడం, సరైన వ్యర్థాల నిర్వహణ అవసరాన్ని నొక్కి చెప్పారు. కార్యక్రమంలో టీజీ పీసీబీ మెంబర్ సెక్రటరీ గుగులోత్ రవి, పాల్గొన్నారు.

సుశిక్షిత మూగ గూఢచారులు

వాసన పసిగట్టి ప్రమాదాన్ని కనిపెట్టే జాగిలాలను మాత్రమే ఇప్పటి వరకు మనం చూశాం. అయితే పైకి కనిపించని 'నిగూఢ దళాలు' కూడా వివిధ దేశాల సైన్యాలలో నిశ్శబ్దంగా పని చేసుకుంటూ పోతున్నాయి. అవి మందుపాతరలను కనిపెడతాయి. సముద్ర జలాల్లోని పేలుడు పదార్థాలను గుర్తిస్తాయి. సరిహద్దుల్లో చొరబాటు దారులను అడ్డుకుని, వారిపై దాడి కూడా చేస్తాయి. శిక్షణ పొందిన ఈ మూగజీవులు.. ప్రపంచ దేశాల ఆర్మీలకు గొప్ప 'మార్మిక' శక్తిగా తోడ్పడుతున్నాయి.

- సాక్షి, స్పెషల్ డెస్క్

సైన్యానికి జంతుసాయం
మందుపాతరలు కనిపెడుతూ...
శత్రువులపై దాడిచేస్తూ...
ఉక్రెయిన్, ఇజ్రాయెల్‌కు ఎలుకలు
అమెరికా, రష్యాలకు డాల్ఫిన్‌లు
భారత సరిహద్దు దళానికి తేనెటీగలు



మహా తెలివైన 'హీరో ర్యాట్స్'

దశాబ్దాల అంతర్యుద్ధంతో మందుపాతరల భూమిగా మారిన కాంబోడియా ఆనాటి మందుపాతరలను కనిపెట్టి, వాటిని శక్తిహీనం చేసేందుకు ఎలుకల సహాయం తీసుకుంటోంది. శిక్షణ పొందిన 'ఆఫ్రికన్ జెయింట్ పౌచ్డ్ ర్యాట్స్' లేదా 'హీరో ర్యాట్స్' అనే ఆ ఎలుకలు మందుపాతరలు కచ్చితంగా గుర్తిస్తున్నాయి. ఉక్రెయిన్, ఇజ్రాయెల్, ఇంకా అనేక యూరోపియన్ దేశాల సైన్యాలు కూడా హీరో ర్యాట్స్ దళాన్ని ఏర్పాటు చేసుకున్నాయి. ఈ హీరో ర్యాట్స్ సబ్ సహారా ఆఫ్రికాకు చెందినవి. టెక్నాలజీ సైతం పసికట్టలేని టి.ఎన్.టి. (ట్రైనైట్రోటోల్యున్) వంటి పేలుడు పదార్థాల సూక్ష్మ జాడలను కూడా ఇవి తమ అఘ్రాణ శక్తితో గుర్తించగలవు. 45 సెంటీమీటర్ల పొడవైన శరీరంతో, దాదాపు అర మీటరు పొడవున్న తోకలు కలిగి ఉండే హీరో ర్యాట్స్.. ఇంటి ఎలుకల కంటే కాస్త పెద్దవిగా, చిన్న పిల్లిని పోలి ఉంటాయి. భూమి లోపల ఉన్న మందుపాతరలపై అవి పేలకుండా నడిచేంత తేలికగానూ ఉంటాయి. మొజాంబిక్, అంగోలా దేశాల సైన్యంలో కూడా ఈ 'హీరో ర్యాట్స్' దళాలు ఉన్నాయి.



డిటెక్టర్‌ల కంటే మెరుగైనవి!

ఒక హీరో ర్యాట్ టెన్నిస్ కోర్టు విస్తీర్ణంలో ఉండే భూమి లోపలి ప్రాంతాన్ని కేవలం 30 నిమిషాల్లో స్పష్టంగా గాలించగలదు. ఇదే పని చేయడానికి మనుషులకు కొన్ని రోజులు పడుతుంది. పైగా ఒక్కోసారి ప్రాణానికే ముప్పు వాటిల్లవచ్చు. హీరో ర్యాట్స్‌కి ఒక ఏడాది కంటే తక్కువ సమయంలో పూర్తి శిక్షణ ఇవ్వవచ్చు. ఇవి 6 నుంచి 8 సంవత్సరాలు జీవిస్తాయి. వాటి జీవితకాలంలో ఎక్కువ కాలాన్ని సైన్యంలో ఉపయోగించుకోవచ్చు. బెల్జియంలోని స్వచ్ఛంద సేవా సంస్థ ఎ.పి.ఒ.పి.ఒ. (యాంటీ పర్సనల్ లాండ్‌మైన్స్ డిటెక్షన్ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్) ఈ ఎలుకలకు శిక్షణ ఇస్తోంది. 'హీరో ర్యాట్స్' అని బ్రాండ్ చేసి, వివిధ దేశాల సైన్యాల అవసరాలకు సరఫరా చేస్తోంది. మెటల్ డిటెక్టర్లు గుర్తించలేని ప్లాస్టిక్ మందుపాతరలను కూడా గుర్తించే నైపుణ్యం వీటికి ఉంది. మానవ కఫం నమూనాలలో క్షయవ్యాధిని కూడా గుర్తించే విధంగా వీటికి శిక్షణ ఇస్తున్నారు.

భారత్‌కు తేనెటీగల దళం

ప్రపంచంలోని వివిధ దేశాల సైన్యం ఎలుకల సహాయం తీసుకుంటున్నట్లే.. మనదేశం సరిహద్దుల భద్రత, రక్షణల కోసం తేనెటీగల్ని పెంచుతోంది. నిరంతరం అస్థిరంగా ఉండే బంగ్లాదేశ్ సరిహద్దులో సరిహద్దు భద్రతా దళం (బి.ఎస్.ఎఫ్.) తేనెటీగలను మోహరించింది. చొరబాట్లతోపాటు, స్మగ్లింగ్‌ను కూడా అరికట్టేందుకు పశ్చిమ బెంగాల్‌లోని నాడియా జిల్లాలో, బి.ఎస్.ఎఫ్. 32వ బెటాలియన్ ముళ్లతీగల కంచెల వెంట పెట్టెల్ని వేలాడదీసి వాటిల్లో తేనెటీగల్ని పెంచుతోంది. తేనెకు తేనె... భద్రతకు భద్రత! ఈ పెట్టెల లోపల ఉండే తేనెటీగల గుంపు... స్మగ్లర్లు, చొరబాటు దారులను అడ్డుకుంటుంది. కంచెలను దాటేందుకు ప్రయత్నించే వారిపైన ఆ గుంపు తక్షణం మూకుమ్మడి దాడి చేస్తుంది. తేనెటీగల కోసం ఆ సమీపంలో తేనెనిచ్చే పూల మొక్కలను పెంచుతున్నారు. బి.ఎస్.ఎఫ్. సిబ్బందికి తేనెటీగల పెంపకంలో సైన్యం శిక్షణనిస్తోంది.

నీళ్ల అడుగున.. నిగూఢాల ఛేదన

ప్రపంచ దేశాల్లోని వివిధ నావికా దళాలు సముద్రంలోని అత్యంత తెలివైన జీవుల్ని తమ కార్యకలాపాలకు ఉపయోగించుకుంటున్నాయి. అమెరికా నావికాదళం ఇందుకోసం సముద్ర క్షీరదాల కార్యక్రమం (మెరైన్ మమ్మల్ ప్రోగ్రామ్) చేపట్టింది. నీటి అడుగున పొంచి ఉండే మైన్ల ప్రమాదాలను గుర్తించడానికి, నావికా దళం ఆస్తులను రక్షించడానికి డాల్ఫిన్లు, 'కాలిఫోర్నియా సీ లయన్స్'కు యూఎస్ శిక్షణ ఇస్తోంది. డాల్ఫిన్లు, వాటి సహజసిద్ధమైన ధ్వని గ్రాహ్యతా నైపుణ్యంతో యంత్రాల కంటే కూడా కచ్చితంగా.. మునిగిపోయిన పేలుడు పదార్థాలను గుర్తించగలవు. అవి వేగంగా ఉంటాయి. తెలివిగా ఉంటాయి. సముద్ర గర్భంలోని వస్తువుల్ని, డైవర్లను గాలించేవిధంగా వాటికి శిక్షణ ఉంటుంది. రష్యా కూడా నీటి అడుగున నిఘా, గూఢచర్యం వంటివాటి కోసం డాల్ఫిన్‌లకు శిక్షణ ఇవ్వటం మొదలు పెట్టింది.



సరిగ్గా బాంబు ఉన్న చోటుకు..

కంబోడియా, ఉక్రెయిన్‌లు ఈ హీరో ర్యాట్స్‌ని మందుపాతరల ఏరివేతకు ప్రయోగిస్తుండగా.. ఇజ్రాయెల్ భద్రతా దళాలు విమానాశ్రయాల్లో లగేజీలలోని పేలుడు పదార్థాలను పసిగట్టేందుకు ఉపయోగిస్తున్నాయి. బాంబు వాసన పసిగట్టే జాగిలాలకు ఇవి దీటైనవి. కుదురుగా, వేగవంతంగా, ఎవరి గమనింపులోకీ వెళ్లకుండా ఈ ఎలుకలు ఉగ్రవాద ముప్పును ముందస్తుగా గుర్తించి, ముప్పును తప్పించటానికి సహాయపడతాయి. ఇప్పుడు రష్యా కూడా వీటిని ఉపయోగించుకుంటోంది.

నూతన పరిశ్రమలతో యువతకు ఉపాధి

- ఎవర్జెంట్ టెక్నాలజీస్ గ్లోబల్ వాల్యూ సెంటర్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ధ్యేయమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. మంగళవారం నానక్‌రామ్‌గూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో యూఎస్‌కు చెందిన 'ఎవర్జెంట్ టెక్నాలజీస్' గ్లోబల్ వాల్యూ సెంటర్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఏడాదిన్నర వ్యవధిలో రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చామన్నారు. ఏఐ, మెషీన్ లెర్నింగ్, క్వాంటం కంప్యూటింగ్ లాంటి ఎమర్జింగ్ టెక్నాలజీస్‌కు హబ్‌గా తెలంగాణను మార్చేందుకు ప్రభుత్వం తరఫున తీసుకుంటున్న



వాల్యూ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

చర్యలను మంత్రి వివరించారు. ఏఐ రాజధానిగా హైదరాబాద్‌ను మార్చాలనే సంకల్పంతోనే ఫ్యూచర్ సిటీలో ప్రత్యేకంగా 200 ఎకరాల్లో ఏఐ సిటీని అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయబోతున్నామన్నారు. ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో తెలంగాణ యువతను నిపుణులుగా తీర్చిదిద్దేందుకు పాఠశాల స్థాయి నుంచే శిక్షణ ఇచ్చేలా నిపుణుల భాగస్వామ్యంతో ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. పరిశ్రమలు, విద్యా సంస్థల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏఐ పవర్డ్ సబ్ స్క్రైబర్ మేనేజ్‌మెంట్ అండ్ మానిటైజేషన్ ప్లాట్‌ఫాం 'ఎవర్జెంట్ టెక్నాలజీస్' గ్లోబల్ వాల్యూ సెంటర్ ద్వారా ప్రస్తుతం 600 మందికి ఉద్యోగాలు లభిస్తున్నాయని వివరించారు. కార్యక్రమంలో ఐఏఎస్ అధికారి భవానీశ్రీ, ఐటీ సలహాదారు సాయికృష్ణ, ఎవర్జెంట్ టెక్నాలజీస్ ఫౌండర్, సీఈవో విజయ్ సజ్జ తదితరులు పాల్గొన్నారు.

కనువిందుగా..



రంజాన్ సీజన్‌లో కోల్‌కతా కను'విందు'గా కనిపిస్తుందట. దీన్ని హల్వా పరాటా అంటారు. ఇఫ్తార్ కోసం ఇలా భారీ సైజులో తయారు చేస్తారు. హల్వాతో కలిపి తింటారు. ఇంతకీ విషయమేమిటంటే.. ఈ ఏడాది వరల్డ్ ఫుడ్ ఫొటోగ్రఫీ అవార్డుల్లో స్ట్రీట్ ఫుడ్ కేటగిరీలో ఈ చిత్రం మొదటి స్థానాన్ని దక్కించుకుంది. కోల్‌కతాకు చెందిన దేవదత్త చక్రవర్తి అనే ఫొటోగ్రాఫర్ దీన్ని తీశారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్యాంపస్ కొలువులకు కేరాఫ్

వరంగల్ ఎన్ఐటీ

ప్రతికూల పరిస్థితులున్నా సత్తా చాటుతున్న విద్యార్థులు



- వారి కోసం పోటీ పడుతున్న ప్రపంచ కంపెనీలు
- ఈ ఏడాది 1,508 మందిలో 1,201 మంది విద్యార్థులకు ఉద్యోగాలు
- ఓ విద్యార్థికి అత్యధికంగా రూ. 64.3 లక్షల వార్షిక ప్యాకేజీ
- తొలిసారి పీహెచ్‌డీలో ఆరుగురికి రూ. 9 లక్షల ప్యాకేజీ

సాక్షి ప్రతినిధి, వరంగల్: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) వరంగల్ ప్లేస్‌మెంట్లకు కేరాఫ్‌గా మారింది. నిట్‌లోని సెంటర్ ఫర్ కెరీర్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ (సీసీపీడీ) ఆధ్వర్యంలో నిర్వహించే క్యాంపస్ సెలెక్షన్‌లకు ప్రపంచ కంపెనీలు పోటీ పడుతున్నాయి. ఇక్కడి విద్యార్థులను ఎంపిక చేసుకోవడానికి క్యూ కడుతున్నాయి. 2024–25 విద్యాసంవత్సరానికిగాను ప్రపంచవ్యాప్తంగా ఉన్న 296 కంపెనీలు నిట్ క్యాంపస్ సెలక్షన్స్‌లో పోటీపడ్డాయి. క్యాంపస్ సెలక్షన్స్‌కు 1,508 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 1,201 మంది ఎంపికయ్యారు. ఓ విద్యార్థికి అత్యధిక వార్షిక ప్యాకేజీ రూ. 64.3 లక్షలు రాగా.. అత్యల్ప వార్షిక ప్యాకేజీ రూ.14.8 లక్షలుగా నమోదైంది. యూజీ, పీజీ విద్యార్థులతోపాటు తొలిసారి ఆరుగురు పీహెచ్‌డీ అభ్యర్థులు రూ. 9 లక్షల వార్షిక ప్యాకేజీకి ఎంపిక కావడం విశేషం. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, డేటా అనాలసిస్, డేటా సైన్స్, డేటా ఇంజనీరింగ్, ప్రోడక్ట్ అనాలసిస్, ప్రోడక్ట్ ఇంజనీర్, కన్సల్టెంట్, మేనేజ్‌మెంట్, గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రెయినీ లాంటి పోస్టులకు విద్యార్థులు ఎంపికయ్యారు.

ఒడిదొడుకులున్నా 'టాప్'లోనే..

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో కొలువుల మార్కెట్ ఈసారి అంతంతమాత్రంగానే ఉన్నా నిట్ క్యాంపస్ సెలక్షన్స్‌లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కొలువులకు ఎంపికైన 1,201 మందిలో 679 మంది యూజీ విద్యార్థులు, 516 మంది పీజీ, ఆరుగురు పీహెచ్‌డీ విద్యార్థులు ఉన్నారు. వారిలో బీటెక్ ఈసీఈ చేసిన సోమిల్ మాల్‌ధానీ ఏకంగా 64.3 లక్షల అత్యధిక వార్షిక ప్యాకేజీకి ఎంపికయ్యాడు. గతేడాది మొత్తం 1,483 మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్‌కు అర్హత పొందగా 1,128 మంది ఎంపికయ్యారు. బీటెక్‌లో 82 శాతం మంది, ఎంటెక్, ఇతర పీజీ కోర్సుల్లో 76 శాతం మంది విద్యార్థులకు కొలువులు లభించాయి. గతేడాది ఒక విద్యార్థి అత్యధికంగా రూ. 88 లక్షల వార్షిక వేతనానికి ఎంపికవగా 12 మంది రూ. 68 లక్షల చొప్పున వార్షిక వేతనానికి ఎంపికయ్యారు. సగటు వార్షిక వేతనం రూ. 15.6 లక్షలుగా నమోదైంది.

'నిట్'లో క్యాంపస్ సెలెక్షన్ వివరాలు ఇలా...

సంవత్సరం	అత్యధిక ప్యాకేజీ (రూ.లక్షల్లో..)	ఎంపికైన విద్యార్థులు	వచ్చిన కంపెనీలు
2020-21	52	815	186
2021-22	62.5	1,108	221
2022-23	88	1,404	275
2023-24	88	1,128	260
2024-25	64.3	1,201	296

సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పిస్తా..



మాది జైపూర్‌లోని మధ్యతరగతి కుటుంబం. నిట్‌లో అత్యుత్తమ విద్యాబోధనతోపాటు సీసీపీడీ గైడెన్స్‌లో బెంగళూరుకు చెందిన స్టార్టప్ సాఫ్ట్‌వేర్ కంపెనీకి రూ. 64.3 లక్షల వార్షిక ప్యాకేజీకి ఎంపికయ్యా. సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటు చేసి మిత్రులకు ఉద్యోగాలు కల్పించడమే నా లక్ష్యం.

– సోమిల్ మాల్‌ధానీ,
రూ.64.3 లక్షల వార్షిక ప్యాకేజీ పొందిన విద్యార్థి



విద్యార్థుల్లో ప్రేరణ నింపుతున్నాం..



మా క్యాంపస్ నుంచి గతేడాది 1,128 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికవగా ఈసారి 1,201 మంది ఎంపికవడం అభినందనీయం. అత్యుత్తమ బోధనతోపాటు లక్ష్య సాధన దిశగా విద్యార్థులకు మేం ప్రేరణ కల్పిస్తున్నాం.

– బిద్యాధర్ సుబుదీ, నిట్ డైరెక్టర్

వర్క్‌షాప్‌లు, కమ్యూనికేషన్ స్కిల్స్ వల్లే..



విద్యార్థులను ఇంటర్వ్యూలకు ప్రిపేర్ చేయడం, వర్క్‌షాప్‌లు, వారి కమ్యూనికేషన్ స్కిల్స్‌కు పదునుపెట్టడం క్యాంపస్ సెలక్షన్స్‌లో విజయానికి కీలక భూమిక పోషించాయి.

– హరికృష్ణ,
సీసీపీడీహెడ్, ఎన్ఐటీ, వరంగల్


కమ్మరిపేట గ్రామం

మారుపేరు.. మమకారాల ఊరు

ఊరంతా మారుపేర్లే

- అలా పిలిస్తేనే ఆనందం
- జగిత్యాల జిల్లా కమ్మరిపేటలో వింత సంస్కృతి

మేడిపల్లి(వేములవాడ): ఒక్కొక్క గ్రామంలో ఒక్కో రకమైన వింతలు ఉంటాయి. జగిత్యాల జిల్లా ఉమ్మడి మేడిపల్లి మండలం కమ్మరిపేట గ్రామంలో కూడా మారుపేర్ల (నిక్ నేమ్) వింత ఉంది. గోదావరి జిల్లాల్లో వెటకారం ఉన్నట్లు, కమ్మరిపేటలో కూడా వెటకారంతో కూడిన ప్రేమలు ఉంటాయి.

మచ్చుకు కొన్ని మారుపేర్లు

కమ్మరిపేటలో కొందరిని తల్లిదండ్రులు పెట్టిన పేర్లతో కాకుండా మారుపేర్లతోనే గుర్తిస్తా రు. ఉదాహరణకు.. నల్లోడు, కోడిజుట్టుగాడు, బర్లోడు, గుడుగుడు మల్లయ్య, బూటుగాడు, సెంబుగాడు, కటకట రాయడు, బారెపు మల్లయ్య, బొట్టుగాడు, దస్తగిరిగాడు, జేంకొరుకుడు, ఆపకాయేగాడు, సెట్టిపిసోడు, పొట్టన్న, బీపిగాడు, ఎద్దుగాడు, పిసోడు, పొట్టోడు, బుడ్డిగాడు, యాస్టీంగ్‌గాడు, నరుకుడుగాడు, పిర్రలెంకడు, మల్కుమల్లోజీ, ఒక్కపొద్దు, బొమ్మగాడు, సాంబర్‌గాడు, పత్తగాడు, బొంబాయిగాడు, బ్రహ్మంగారు, తత్తర్‌గాడు, గొట్టాలు, గుండంగాడు.. ఇలా దాదాపు ఊరందరికీ మారుపేర్లు ఉన్నాయి.

అవసరమైనప్పుడు అండగా..

కమ్మరిపేటలో గ్రామస్తులందరూ వరుసలతో పాటు వెటకారం జోడించి మారుపేర్లతో పిలుచుకుంటారు. ఇలా పిలవడం ఎదుటివారిని తక్కువ చేసినట్లు అస్సలు కాదు. ప్రేమగా ఇలా పిలుచుకోవడంలో గ్రామస్తులంతా ఆదర్శంగా నిలుస్తారు. గ్రామంలో ఎవరికైనా, ఏ సమయంలోనైనా సమస్య వచ్చినా.. అందరూ తలో చేయి వేసి ఆదుకుంటారు. ఎవరైనా చనిపోతే కులమతాలకు అతీతంగా దగ్గరుండి కార్యాలు జరుపుతారు. ఈ విషయంలో చాలా మంది పెద్దలు కమ్మరిపేట గ్రామాన్ని ప్రశంసిస్తారు. భీమారం గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించేందుకు కమ్మరిపేట గ్రామస్తులు తమదైన పాత్ర పోషించారు. ఇలా చాలా విషయాల్లో కమ్మరిపేట మండలంలో ఆదర్శంగా నిలుస్తోంది.

మారుపేరుతోనే పిలుస్తారు



నాపేరు బినవేని రెడ్డి. కానీ మా గ్రామంలో ఇంటివారు పెట్టిన పేరుతో పిలవరు. మారుపేర్లతోనే ఎక్కువగా పిలుస్తారు. మా పూర్వీకులు బర్లు కాసేవారని నన్ను బర్ల రెడ్డి అంటారు. మా ఊర్లో దాదాపు అందరినీ ఇలాగే పిలుస్తారు.

– బినవేని రెడ్డి, కమ్మరిపేట

అలా పిలిస్తేనే ప్రేమ..



సరదాగా మారుపేర్లతో పిలవడం మా ఊరి వెటకార భాషలో భాగం. అలా పిలిచినా ఎవరూ ఇబ్బంది పడరు. అలా పిలిస్తేనే గుండెకు దగ్గరగా.. ప్రేమతో పిలిచినట్లు భావిస్తారు. గ్రామంలో అందరం కలిసిమెలిసి ఉంటాం. ఏదైన విషయంలో భేదాభిప్రాయాలున్నా ఇతర గ్రామాల మధ్యవర్తిత్వానికి ఇష్టపడం.

– ఆకునూరి శ్రీనివాస్, కమ్మరిపేట

ఊరంతా ఒక్కటవుతం



చాలా గ్రామాల్లో వరుసలు పెట్టి పిలుస్తారు. మా గ్రామంలో వరుసలతో పాటు వెటకారం జోడించి పిలుస్తాం. ఇది ఎప్పటినుంచో వస్తున్న పరంపర. ఏ వర్గంవారైనా వరుసపెట్టి పిలవడం మాకు అలవాటు. మా గ్రామంలో గొడవలు పడ్డా.. ఇతర గ్రామాలు ఒత్తిడి ప్రయోగిస్తే ఊరంతా ఒక్కటవుతం. ఇది మా ఊరు గొప్పతనం.

– గొల్ల ముఖేశ్, కమ్మరిపేట


చెప్పులు వెతుక్కుంటున్న రోగుల సహాయకులు, బంధువులు

నా చెప్పలెక్కడ..?

- పాదరక్షలు దొరక్క రోగుల సహాయకుల తిప్పలు
- జగిత్యాల ఎంసీహెచ్‌లో స్ట్రెచర్‌పై తీసుకొచ్చి బయట కుప్పగా పోస్తున్న సిబ్బంది
- తరచూ వివాదాస్పదంగా మారుతున్న సిబ్బంది తీరు


స్ట్రెచర్‌పై పాదరక్షలను తరలిస్తున్న సిబ్బంది

జగిత్యాల టౌన్: జగిత్యాల జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపులో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన మాతా శిశు ఆస్పత్రి నిర్వహణ విమర్శల పాలవుతోంది. చిన్నారుల తారుమారు, బెడ్స్ కేటాయించకుండా రోగులను నేలపై పడుకో బెట్టడం, ఓ రోగిని ఆస్పత్రి నుంచి బయటకు పంపడం, ఆస్పత్రికి వచ్చిన రోగులను ప్రైవేటుకు తరలించడం లాంటి అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న మాతా శిశు ఆస్పత్రి సిబ్బంది.. రోగులను తరలించే స్ట్రెచర్‌పై చెప్పులు తరలిస్తూ మరో వివాదంలో చిక్కుకున్నారు. జగిత్యాల మాతాశిశు ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు చెప్పులు విప్పేందుకు సరైన షూ ర్యాక్స్, సెల్ఫులు, సరైన స్థలం కేటాయించలేదు. దీంతో రోగులు, వారి సహాయకులు, బంధువులు తమకు తోచిన చోట పాదరక్షలు విడిచి లోనికి వెళ్తున్నారు. దీంతో ఆస్పత్రి సిబ్బంది వారి చెప్పులను స్ట్రెచర్‌పై తరలించి ఆస్పత్రి ఆవరణలో కుప్పలుగా పోస్తున్నారు. రోగులను పరామర్శించి వచ్చేసరికి చెప్పులు కనబడక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని బాధితులు చెబుతున్నారు. ఆస్పత్రి ఆవరణలో పోసిన చెప్పులను కుక్కలు కొరికేస్తున్నాయని ఆరోపిస్తున్నారు. కాగా, రోగులను తరలించేందుకు వినియోగించే స్ట్రెచర్‌ను చెప్పులు తరలించేందుకు వినియోగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.





అమెరికాలోని డాలస్‌లో మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు. చిత్రంలో జగదీశ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, పాడి కౌశిక్‌రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి తదితరులు. (పక్కన) యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో భారతీయ విద్యార్థులతో కేటీఆర్


చెప్పులు వెతుక్కుంటున్న సహాయకులు,బంధువులు

క్లుప్తంగా...

పారదర్శకంగా బదిలీల ప్రక్రియ చేపట్టాలి: మంత్రి సత్యకుమార్

సాక్షి, అమరావతి: ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ప్రతి ఉద్యోగి స్థానాన్ని ఖాళీ కింద చూపేలా వైద్య శాఖలోని అన్ని విభాగాధిపతులను మంత్రి సత్యకుమార్ ఆదేశించినట్లు ఆయన కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఖాళీలను బ్లాక్ చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్న క్రమంలో ఇందుకు తావులేకుండా చూడాలని మంత్రి స్పష్టం చేశారని పేర్కొంది. పారదర్శకంగా బదిలీల ప్రక్రియ చేపట్టాలని అధికారులకు మంత్రి సూచించినట్లు వెల్లడించింది.

న్యాయవాదుల కుటుంబాలకు పరిహారం
మంత్రి ఫరూక్ వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మరణించిన 23 మంది న్యాయవాదులకు చెందిన కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం రూ.92 లక్షల మ్యాచింగ్ గ్రాంట్‌ను విడుదల చేసిందని న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన మ్యాచింగ్ గ్రాంట్‌ను ఏపీ అడ్వొకేట్స్ సంక్షేమ నిధికి విడుదల చేసినట్లు వెల్లడించారు. ఆ మొత్తంలో మరణించిన ఒక్కొక్క న్యాయవాది కుటుంబానికి రూ.4 లక్షలు చొప్పున అందజేస్తామన్నారు.

మంత్రి గొట్టిపాటితో ఆస్ట్రేలియన్ కాన్సులేట్ ప్రతినిధుల భేటీ

సాక్షి, అమరావతి: ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో ఆస్ట్రేలియన్ కాన్సుల్ జనరల్ సిలై జకి, డిప్యూటీ జనరల్ డేవిడ్ ఈగిల్సన్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ భేటీలో పునరుత్పాదక విద్యుత్ రంగంలో నైపుణ్యాభివృద్ధికి గల అవకాశాలపై చర్చించారు. పునరుత్పాదక ఇంధన రంగంతో పాటు మహిళలకు, గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చేందుకు తాము సహకారం అందిస్తామని సిలై జకి చెప్పారు. గిరిజన ప్రాంత వర్సిటీలకు ఆర్థిక సాయం చేస్తామన్నారు.

సీఎస్‌తో ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ భేటీ

సాక్షి, అమరావతి: ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ సిలై జకీ, డిప్యూటీ కాన్సుల్ జనరల్ డేవిడ్ ఎగ్లెస్టన్ మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌తో భేటీ అయ్యారు. వివిధ అంశాలపై సీఎస్‌తో చర్చలు జరిపారు.

పవర్‌లిఫ్టింగ్ చాంప్ హేమశ్రీ



హేమశ్రీ అభినందిస్తున్న రైల్వే ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ రాఘవేంద్ర

సాక్షి, అమరావతి: రాష్ట్ర స్థాయి పవర్‌లిఫ్టింగ్ చాంపియన్ షిప్ జూనియర్స్ మహిళల విభాగంలో ఎం.హేమశ్రీ ఓవరాల్ బంగారు పతకాన్ని సాధించింది. 47కిలోల విభాగంలో మొత్తం 190కిలోలు బరువులు ఎత్తింది. మే 31 నుంచి జూన్ 2వరకు ప్రకాశం జిల్లాలో జరిగిన పోటీల్లో రెండు బంగారు, ఒక కాంస్య పతకాలు సాధించింది. హేమశ్రీ ప్రస్తుతం విజయవాడ రైల్వే జిమ్‌లోని కోచ్ బి.సందీప్ మార్గదర్శకత్వంలో శిక్షణ పొందుతోంది.

కేంద్ర పథకాల సమర్థ వినియోగానికి ప్రణాళిక
మంత్రి ఫరూక్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మైనారిటీల ఆర్థిక స్వావలంబనతో పాటు వారి స్థితిగతులను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకునేలా కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నట్టు మంత్రి ఎన్ఎండీ ఫరూక్ చెప్పారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో మైనారిటీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పీఎం వికాస్, ప్రధానమంత్రి జన్ వికాస్, జాతీయ మైనారిటీల అభివృద్ధి ఆర్థిక సంస్థ పథకాల ద్వారా రాష్ట్రానికి వచ్చే నిధుల వినియోగంపై మంత్రి చర్చించారు.

'కాంట్రాక్టు అధ్యాపకులకు టైం స్కేల్ అమలు చేయాలి'

సాక్షి, అమరావతి: ప్రభుత్వ వర్సిటీల్లో పనిచేస్తోన్న కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (కాంట్రాక్ట్) రాష్ట్ర అధ్యక్షుడు కోడి అర్జునుడు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఉన్నత విద్యా మండలి చైర్మన్ మధుమూర్తికి వినతిపత్రమిచ్చారు. తమకు ఉద్యోగ భద్రతతో పాటు డీఏ, హెచ్ఆర్ఏతో కూడిన టైం స్కేల్‌ను అమలు చేయాలని కోరారు. అసోసియేషన్ ప్రతినిధులు హరిబాబు, బోరుగడ్డ సుబ్బయ్య, ప్రభాకర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీ వీడ్.. సో గుడ్

నేడు జాతీయ సముద్రపు నాచు దినోత్సవం

- రాష్ట్రంలో కుటీర పరిశ్రమగా నాచు సాగు
- పోషక విలువలు.. ఔషధ గుణాల్లో మేటి
- ప్రయోగాత్మకంగా విశాఖపట్నంలో మొదటి సాగు
- రాష్ట్రంలో సీ వీడ్ సాగుకు 37 అనుకూల ప్రాంతాల గుర్తింపు
- పీఎంఎంఎస్‌వై ద్వారా మహిళలకు సబ్సిడీ రుణాలకు ప్రణాళిక
- రాష్ట్రంలో 60 వేల యూనిట్ల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం



సముద్రపు నాచు దినోత్సవం పోస్టర్

కైకలూరు: సముద్రపు నాచు (సీ వీడ్) తీరప్రాంత మహిళలకు కుటీర పరిశ్రమగా మారుతోంది. మంచినీరు, ఎరువులు, పురుగు మందులు, ఆహారం అవసరం లేకుండా సముద్రంలో తక్కువ కాలంలోనే అధిక దిగుబడులు సాధించే నాచు పెంపకానికి డిమాండ్ పెరుగుతోంది. ఆక్వా రంగానికి ప్రత్యామ్నాయంగా నాచు సాగు మారనుంది. సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ (సీఎంఎఫ్ఆర్ఐ), కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ (సీఏఏ) ఆధ్వర్యంలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన(పీఎంఎంఎస్‌వై) ద్వారా మహిళలకు సబ్సిడీ రుణాలిచ్చేందుకు ప్రభుత్వం ముందుకొస్తోంది. సీ వీడ్‌పై అవగాహన కల్పించేందుకు ఏటా జూన్ 4న జాతీయ సముద్రపు నాచు దినోత్సవం జరుపుతారు.

పోషకాల గని.. సముద్రపు నాచు

సముద్రపు నాచు (మెరైన్ ఆల్గే)లో పోషక, ఔషధ విలువలు అధికంగా ఉంటాయి. తెప్పలు, రేస్ వేలు, మోనోలైన్, తాళ్ల వంటి పద్ధతుల్లో సముద్రంలో నాచును సాగు చేస్తున్నారు. తమిళనాడులోని మండపం ప్రాంతం నుంచి కప్పఫైకస్, గ్రాసిలేరియా అనే జాతుల విత్తనాలను ఏపీకి తెస్తున్నారు. ఒక్కో పంట 45–60 రోజుల సమయం పడుతోంది. సీ వీడ్‌లో ప్రొటీన్, ఖనిజాలు, విటమిన్లు అధికంగా ఉంటాయి. వీటిని బిస్కెట్లు, పాస్తా, నూడుల్స్, సూప్ పౌడర్లు, పెరుగు వంటి ఆహార పదార్థాల్లో వినియోగిస్తారు. ఔషధ, సౌందర్య రంగాల్లోనూ సీ వీడ్‌కు డిమాండ్ ఉంది. దీంతో ఆగార్, కరోజీనాన్ పదార్థాలు తయారవుతాయి. వీటిని టూత్‌పేస్ట్, స్కిన్ కేర్ ఉత్పత్తుల ఔషధాల్లో వినియోగిస్తారు. వ్యవసాయంలో బయో ఫెర్టిలైజర్లుగా కూడా దీనిని వాడతారు. సీ వీడ్‌తో తయారు చేసిన తినుబండారాలు, సాల్ట్, ఆయిల్, స్నాక్స్‌కు డిమాండ్ ఉంది.

రాష్ట్రంలో 36 కేంద్రాల గుర్తింపు

ఆంధ్రప్రదేశ్‌లో 1,027 కిలోమీటర్ల సుదీర్ఘ తీర ప్రాంతం ఉంది. సీ వీడ్ సాగుకు అనుకూలమైన 36 ప్రాంతాలను రాష్ట్ర వ్యాప్తంగా సెంట్రల్ సాల్ట్ అండ్ మెరైన్ కెమికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎస్ఎంసీఆర్ఐ) గుర్తించింది. విశాఖపట్నం, శ్రీకాకుళం, నెల్లూరు, కృష్ణా, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలు సీ వీడ్ సాగుకు అనుకూలంగా ఉన్నాయి. నరసాపురం, మొగల్తూరు, సూర్యలంక, విశాఖపట్నం, శ్రీకాకుళంలోని బుడగట్లపాలెంలో పైలట్ ప్రాజెక్టుగా సీ వీడ్ సాగు చేపట్టనున్నారు. విశాఖపట్నం, బుడగట్లపాలెంలో ప్రయోగాత్మక సాగు చేపట్టారు. పీఎంఎంఎస్‌వై ద్వారా వీడ్ సాగుకు కేంద్రం 60 శాతం సబ్సిడీ అందిస్తోంది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో 60 వేల యూనిట్ల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది.



సముద్రపు నాచుతో తయారు చేసిన ఉత్పత్తులు

సముద్రపు నాచు విశేషాలివీ!

- భూగోళంపై పండించే కూరగాయల కంటే సముద్రంలో పెరిగే నాచు పరిమాణం 30 శాతం ఎక్కువ
- సముద్రంలో అదనపు రసాయనాలు, భారీ లోహాలను ఇది గ్రహిస్తుంది
- పర్యావరణ వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తుంది
- సముద్రపు నాచును జీరో ఇన్‌పుట్ ఫుడ్‌గా పిలుస్తారు
- సముద్రంలో కార్బన్ డైఆక్సైడ్‌ను గ్రహిస్తుంది
- పశువుల ఆహారం, ఆక్వా కల్చర్‌లో దీనినిఫీడ్ సప్లిమెంట్లుగా వినియోగిస్తారు
- సముద్రపు జీవులకు ఆహారం, ఆశ్రయం అందించి జీవ వైవిధ్యంలో కీలకపాత్ర పోషిస్తుంది
- సేంద్రియ ఎరువుగా కార్బోహైడ్రేట్లు, సూక్ష్మ పోషకాలు, ఖనిజాలు అధికం
- ఆహార పరిశ్రమ, ఔషధ, సౌందర్య రంగం, వ్యవసాయంలో దీనిని వినియోగిస్తారు
- తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం ఇస్తుంది
- మత్స్యకారులు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం

తొలి విడతలో 2.2 టన్నుల దిగుబడి



విశాఖపట్నం ఆర్కే బీచ్ సమీపంలో తొలిసారిగా సీ వీడ్ సాగును 50 యూనిట్ల ద్వారా ధాన్ ఫౌండేషన్ మహిళలు చేపట్టారు. మొదటి విడతలో 2.20 టన్నుల దిగుబడి వచ్చింది. కిలో రూ.23 ధర పలికింది. ఈ ప్రాజెక్టుకు పెట్టుబడి రూ.4.50 లక్షలు అయింది. మొదటిసారి పెట్టుబడితో అమర్చిన సామగ్రి 8 ఏళ్లపాటు ఉపయోగపడతాయి. రెండో సాగు నుంచి పెట్టుబడి వ్యయం బాగా తగ్గుతుంది. ఇది ప్రధానంగా మహిళలకు కుటీర పరిశ్రమగా మారుతుంది. కేంద్రం సబ్సిడీ ఇచ్చి సీ వీడ్ సాగుకు అవకాశం కల్పిస్తోంది.

– పి.లక్ష్మణరావు, మత్స్యశాఖ జేడీ, విశాఖ

అవగాహన పెంచాలి



సముద్రపు నాచుపై తీరప్రాంత ప్రజలకు అవగాహన పెంచాలి. రాష్ట్రంలో ప్రోసెసింగ్ యూనిట్లు, సీడ్ హేచరీలను ఏర్పాటు చేయాలి. సముద్రపు నాచు పరిశ్రమను వ్యవసాయంగా గుర్తించి బీమా సౌకర్యం కల్పించాలి. సాగు పద్ధతులపై శిక్షణ, సాంకేతిక మార్గదర్శకాలను అందించాలి.

– డాక్టర్ పి.రామమోహన్‌రావు, విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్, కాకినాడ



సముద్రపు నాచుతో ఉపాధి





సముద్రంలో నాచు సాగు

పేరుకే డిప్యుటేషన్‌ల రద్దు

డీఎస్‌హెచ్ కార్యాలయంలో 60 మంది మేర డిప్యుటేషన్‌పై విధులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ (డీఎస్‌హెచ్) ఆస్పత్రులను వైద్యులు, సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. క్షేత్ర స్థాయిలో సేవలు అందించాల్సిన వైద్యులు, సిబ్బందికి డిప్యుటేషన్ పేరుతో డీఎస్‌హెచ్ కార్యాలయంలోకి అధికారులు డంప్ చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డీఎస్‌హెచ్ కార్యాలయంలో వంద వరకూ పోస్టులు ఉన్నాయి. నియామకాలు, ఇతర కార్యక్రమాల పర్యవేక్షణ కోసం ప్రభుత్వం అనుమతి తీసుకుని ఐదు నుంచి పది మంది ఉద్యోగులను రాష్ట్ర కార్యాలయాల్లో నియమించుకోవడం సహజంగా జరిగే ప్రక్రియ. అయితే ఏకంగా 60 మంది మేర వైద్యులు, ఇతర ఉద్యోగులు కొద్దినెలలుగా డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. అసలు వైద్యశాఖలో వైద్యులు, ఇతర ఉద్యోగులు డిప్యూటేషన్‌పై వేరొక చోట విధులు చేయడానికి వీల్లేదని గతంలో వైద్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా డిప్యుటేషన్ ఇస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేరుకే నిబంధనలు పెట్టారు. వాటిని ఉన్నతాధికారులే పాటించరని కింది స్థాయి ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. గత ప్రభుత్వంలో మెడికల్ రిక్రూట్‌మెంట్ ఏర్పాటు చేయడానికి ముందు వరకూ రాష్ట్ర స్థాయి వైద్య పోస్టులన్నింటినీ డీఎస్‌హెచ్ కార్యాలయం నుంచే నోటిఫికేషన్ ఇచ్చి, భర్తీ చేసేవారు. వేల సంఖ్యలో వైద్య పోస్టులు భర్తీ, ఏడాది పొడవునా ఉద్యోగులకు ప్రమోషన్‌లు, నాడు–నేడు, స్టైమెమీ, ఇలా పెద్ద ఎత్తున కార్యక్రమాలున్న సమయంలోనే ఇంత మంది ఉద్యోగులను డిప్యూట్ చేయలేదనే చర్చ నడుస్తోంది.

బనకచర్ల భారం ప్రజలపై వేస్తారా?: సీపీఎం

సాక్షి, అమరావతి: పోలవరం–బనకచర్ల ప్రాజెక్టును సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టుగా సీఎం చంద్రబాబు చెప్పినట్లు అధికారులు ప్రకటించారని, అంటే బనకచర్ల భారం రాష్ట్ర ప్రజలపై వేస్తారా? అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. బనకచర్ల విషయంలో కూటమి ప్రభుత్వ తీరును తప్పుబడుతూ మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. బనకచర్ల ప్రాజెక్టు పూర్తి వివరాలను బహిరంగంగా వెల్లడించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే, నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేయాలని ఈనెల 5న గుంటూరులోని జీపీఐ కంపెనీ ఎదుట పొగాకు రైతులు చేసే ఆందోళనకు సీపీఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

కులవృత్తిదారులను వ్యాపారవేత్తలుగా చేస్తాం

సాక్షి, అమరావతి: కులవృత్తిదారులను వ్యాపారవేత్తలుగా చేస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత చెప్పారు. మూడో విడత ఆదరణ పథకం కింద అధునాతన పరికరాలు అందిస్తామన్నారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఆమె సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కుట్టు మిషన్లు అందజేస్తున్నామని చెప్పారు. మహిళలకు శిక్షణతో పాటు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని అధికారులను ఆదేశించారు.

పీజీ ప్రవేశ పరీక్షను వాయిదా వేయండి: ఏఐఎస్ఎఫ్



రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయం వద్ద ఏఐఎస్ఎఫ్ నాయకులు

మంగళగిరి టౌన్: డీఎస్సీ పరీక్ష రోజున నిర్వహించనున్న పీజీ ప్రవేశ పరీక్షను వాయిదా వేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాజర్‌జీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళగిరిలోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ కృష్ణమూర్తికి మంగళవారం వినతిపత్రమిచ్చారు. అనంతరం మాట్లాడుతూ.. చాలామంది విద్యార్థులకు డీఎస్సీ పరీక్షల రోజునే సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పీజీ ప్రవేశ పరీక్షలు వాయిదా వేసి డీఎస్సీ పరీక్షలు లేని రోజుల్లో నిర్వహించాలని డిమాండ్ చేశారు.

జనం సొమ్ముతో జల్సా!



ఉత్తరాంధ్రలోని ఓ మంత్రి కోసం 'స్త్రీనిధి' సొమ్ము దుబారా

- రూ.35 లక్షలతో కారు కొనుగోలుకు తీర్మానం
- నెలనెలా రూ.30వేల చొప్పున దాని నిర్వహణ ఖర్చులు కూడా చెల్లించేలా నిర్ణయం
- అడ్డగోలుగా నియామకాలు.. ఇష్టారాజ్యంగా వేతనాల పెంపుదల
- ఐదేళ్ల క్రితం తొలగించిన వారికి మళ్లీ అధిక వేతనాలతో అందలం
- దుబారా ఖర్చుల కోసం అన్నట్లుగా పొదుపు మహిళల వడ్డీ మార్జిన్ చెల్లింపులోనూ కోత
- ఫలితంగా ఏటా రూ.10 కోట్ల మేర నష్టపోనున్న మహిళా సంఘాలు
- సంస్థ ఎండీ తీరుతెన్నులపై విమర్శల వెల్లువ

సాక్షి, అమరావతి : స్త్రీనిధి సంస్థ ద్వారా పొదుపు సంఘాల మహిళలకిచ్చే రుణాలపై వసూలుచేసే వడ్డీ సొమ్మును ఉత్తరాంధ్రకు చెందిన ఓ మంత్రిగారి జల్సాల కోసం దుబారా చేస్తున్నారు. రూ.35 లక్షలతో ఓ కారు కొనడమే కాక.. నెలనెలా దాని పెట్రోల్ ఖర్చుల కోసం మరో రూ.30 వేల చొప్పున సమర్పించేందుకు రంగం సిద్ధమైంది. ఇందుకోసం స్త్రీనిధి సంస్థ మేనేజింగ్ కమిటీ (ఎంసీ) సమావేశంలో ఇప్పటికే తీర్మానం కూడా జరిగిపోయిందని.. అమలుచేయడమే తరువాయని అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు తర్వాత ప్రభుత్వ పెద్దల ఆశీస్సులతో స్త్రీనిధి సంస్థలోకి డిప్యుటేషన్‌పై వచ్చిన ఓ ఉన్నతాధికారే ఈ తతంగమంతా నడిపిస్తున్నట్లు సమాచారం. నిజానికి.. స్త్రీనిధి సంస్థ ఎండీగా కొనసాగుతున్న సదరు అధికారి వినియోగానికి ఇప్పటికే ఓ ఇన్నోవా కారు ఉండగా, ఆయన అవసరాల కోసమంటూ కొత్తగా రూ.35 లక్షల సంస్థ నిధులతో మరో ఇన్నోవా కారు సిద్ధంచేస్తున్నారు. ఈ రెండింటిలో ఒకటి సదరు మంత్రి తన సొంత నియోజకవర్గంలో ఉన్నప్పుడు వినియోగించుకోవడానికి అప్పగించాలని నిర్ణయించారు.

మంత్రి పేషీ ఉద్యోగులకూ స్త్రీనిధి నుంచే జీతాలు..

ఇదే కాదు.. సదరు ఉన్నతాధికారి స్త్రీనిధి సంస్థలో కొందరు అస్మదీయులకు భారీగా వేతనాలు పెంచుతూ నిర్ణయాలు తీసుకోవడం కూడా వివాదాస్పదమవుతోంది. ఓ మంత్రి పేషీలో పీఏగా పనిచేస్తున్న వ్యక్తితో పాటు సీఎంఓలో పనిచేసే మరో ఇద్దరికీ స్త్రీనిధి సంస్థ నుంచే వేతనాలు చెల్లించేందుకు సదరు ఉన్నతాధికారి ఆమోదం తెలిపినట్లు ప్రచారం జరుగుతోంది. పీఏగా పనిచేస్తున్న వ్యక్తి గతంలో టీడీపీ ప్రధాన కార్యాలయంలో పనిచేసినట్లు తెలుస్తోంది. అతనితో పాటు మరొకరికి నెలకు రూ.35 వేల చొప్పున వేతనంతో 'స్త్రీనిధి'లో ఉద్యోగం ఇచ్చి, నెలల వ్యవధిలోనే దానిని రూ.45 వేలకు పెంచారు. దీనికి అదనంగా టీఏ, డిప్యుటేషన్ భత్యం అంటూ మరో రూ.20 వేలు చెల్లించేలా స్త్రీనిధి ఉన్నతాధికారి చక్రం తిప్పారని అందులోని సిబ్బంది చెబుతున్నారు. అలాగే, ఐదేళ్ల క్రితం వివిధ కారణాలతో ఈ సంస్థ నుంచి తొలగించిన ముగ్గురు అధికారుల పునర్నియామకానికి ఆ ఉన్నతాధికారి ఆమోదం తెలిపారని.. పైగా వారి వేతనాలూ భారీగా నిర్ధారించారని సంస్థలోని ఉద్యోగులు మండిపడుతున్నారు.

పొదుపు మహిళల వడ్డీ మార్జిన్‌లో కోత..

ఇదిలా ఉంటే.. మంత్రి కోసం స్త్రీనిధి సంస్థ ద్వారా కారు కొనుగోలుకు తీర్మానం చేసిన సమావేశంలోనే మరో కీలక తీర్మానం చేశారు. దుబారా ఖర్చుల కోసమా అన్నట్లుగా పొదుపు సంఘాల రుణాలపై వసూలుచేసే వడ్డీలో గ్రామ, మండల సమాఖ్యలకిచ్చే వడ్డీ మార్జిన్‌ను 50 శాతం మేర తగ్గించాలని నిర్ణయించారు. ప్రస్తుతం స్త్రీనిధి సంస్థ మహిళలకిచ్చే రుణాలపై 11.5 శాతం చొప్పున వడ్డీ వసూలుచేస్తుండగా, అందులో రెండు శాతం వడ్డీ డబ్బులను తిరిగి ఏడాది చివరిన ఆయా గ్రామ సమాఖ్యలు, మండల సమాఖ్యలకు చెల్లిస్తున్నారు. కానీ, ఇప్పుడా వడ్డీ మార్జిన్ కోత నిర్ణయంతో పొదుపు మహిళలు భారీగా నష్టపోనున్నారు. వడ్డీ మార్జిన్‌ను రెండు నుంచి ఒక శాతానికి కోత వేయడంవల్ల వారు ఏటా దాదాపు రూ.10 కోట్ల మేర నష్టపోయే అవకాశముంది.

బలహీన వర్గాల సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శిగా సునీత
ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్

సాక్షి, అమరావతి: బలహీన వర్గాల సంక్షేమశాఖముఖ్యకార్యదర్శిగా కె.సునీతకు పోస్టింగ్ ఇస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఈ పోస్టులో ఉన్న ఎస్.సత్యనారాయణను ఆ బాధ్యతల నుంచి తప్పించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సూర్యఘర్‌కు స్పందన కరువు

- అందుకే అధికారులకు టార్గెట్లు
- ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి



ఇంజనీర్లు, కంపెనీల ప్రతినిధులతో సమావేశమైన ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి

సాక్షి, అమరావతి: ప్రధానమంత్రి సూర్యఘర్ పథకానికి ప్రజల నుంచి స్పందన కరువైందని, ఈ కారణంగానే అధికారులకు టార్గెట్లు ఇస్తున్నామని ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీసీపీడీసీఎల్) సీఎండీ పి.పుల్లారెడ్డి తెలిపారు. డిస్కం పరిధిలోని వివిధ జిల్లాల సూపరింటెండెంట్ ఇంజనీర్లు, సోలార్ కంపెనీల ప్రతినిధులతో మంగళవారం విజయవాడ ఎస్ఈ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోలార్ సిస్టమ్ ఏర్పాటుకు కిలోవాట్‌కు రూ.30వేలు, రెండు కిలో వాట్లకు రూ.60వేలు, మూడు కిలో వాట్‌లకు పైన రూ.78వేలు సబ్సిడీ వస్తుందని ఆయన వెల్లడించారు. అదనపు లోడు క్రమబద్ధీకరణకు రాయితీ గడువు ఈనెల 30తో ముగుస్తుందని దీనిపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులను ఆదేశించారు. నాణ్యమైన మెటీరియల్స్‌ను ఉపయోగించాలని సోలార్ కంపెనీల ప్రతినిధులను కోరారు.

ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ బదిలీల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) ఓ ప్రకటనలో డిమాండ్ చేసింది. గతంలో జరిగిన ఉపాధ్యాయ సంఘాల చర్చల్లో ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పాఠశాల విద్య డైరెక్టర్ హామీ ఇచ్చారని ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరావు, ప్రధాన కార్యదర్శి కాకి ప్రకాష్‌రావు గుర్తు చేశారు. ఈ విషయంలో అన్ని సంఘాలు ఏకాభిప్రాయంతో ఉన్నాయన్నారు. ఈ మేరకు కమిషనరేట్‌కు లేఖ రాసినా ఇంతవరకు అధికారుల నుంచి ఆదేశాలు వెలువడలేదని, వెంటనే ఆదేశాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

ప్రపంచవ్యాప్తంగా 2022లో 37.5 కోట్ల టన్నుల బంగాళదుంపలను రైతులు పండించారు.

చైనా 95.5 (టన్నులు)	ఉక్రెయిన్ 20.9	అమెరికా 17.8	బంగ్లాదేశ్ 10.1	పాకిస్తాన్ 7.9
భారత్ 56.2	రష్యా సమాఖ్య 18.9	జర్మనీ 10.7	ఫ్రాన్స్ 8.0	నెదర్లాండ్స్ 6.9

సాగుబడి

రోహిణి కార్తె: జూన్ 8 వరకు

ఆలూ ద బెస్ట్



ప్రపంచవ్యాప్తంగా 100 దేశాల్లో వందలాది కోట్ల గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజానీకానికి దైనందిన ప్రధానాహారంలో వరి, గోధుమ తర్వాత మూడో స్థానం బంగాళదుంపదే. 66% ప్రపంచ ప్రజలు దైనందిన ఆహారంలో బంగాళదుంపలు తింటున్నారు. 2023లో 38.3 కోట్ల టన్నుల బంగాళదుంపలు పండాయి. ప్రపంచ జనాభాకు ఆహార భద్రత కల్పిస్తున్న బంగాళదుంప ప్రాధాన్యాన్ని చాటిచెప్పటానికి 2008లో అంతర్జాతీయ బంగాళదుంపల సంవత్సరంగా ఐక్యరాజ్యసమితి నిర్వహించింది. 2024 నుంచి మే 30న అంతర్జాతీయ బంగాళదుంప దినోత్సవాన్ని సైతం నిర్వహిస్తోంది. 'చరిత్రను నిర్మించటం, భవిష్యత్తును పోషించటం' ఇదీ ఈ ఏడాది నినాదం.

బంగాళదుంపలతో ఆహారేతర ప్రయోజనాలు

బంగాళదుంపలను ఆహారంగానే కాకుండా.. ఔషధ తయారీ, వస్త్రోత్పత్తి, ప్లైవుడ్, పేపర్ పరిశ్రమల్లోనూ రకరకాల ప్రయోజనాల కోసం వాడుతున్నారు.

బంగాళదుంప పై పొరను ఫ్యూయల్-గ్రేడ్ ఇథనాల్ ఉత్పత్తిలో వాడుతున్నారు.

100% ప్రకృతిలో కలిసిపోయే ప్లాస్టిక్‌ల తయారీలోనూ బంగాళదుంపలు ఉపయోగపడతాయి.

గోజాతి పశువులు, పందులు వంటి పశువులకు దాణాగా బంగాళ దుంపలను పెడుతున్నారు.

8,000 ఏళ్ల క్రితం బంగాళదుంపలను తొలిసారి పెరులో సాగు చేయటం మొదలుపెట్టారు.

5.000 రకాలకు పైగా బంగాళదుంపల వంగడాలు ఉన్నాయి

159 దేశాల్లో బంగాళదుంపలను పండిస్తున్నారు

పెరులోని ఆండీస్ ప్రాంతంలో విరాజిల్లిన పురాతన 'ఇంకా నాగరికత'కు పూచిన పుష్పంగా బంగాళదుంపలను చెబుతారు. పెరు నుంచి 16వ శతాబ్దంలో యూరప్ దేశాలకు ఈ పంట చేరింది. ఎటువంటి వాతావరణానికి ఇట్టే అలవాటైపోవటం వంటి సుగుణాల వల్ల 5 శతాబ్దాల్లోనే ప్రపంచం అంతా వ్యాపించింది.

➡ వేల రకాల బంగాళదుంపల్లో దేని రంగు, సైజు, రుచి, పోషక విలువలు దానికే ప్రత్యేకంగా ఉంటాయి. అందువల్ల ఇదొక ముఖ్యమైన ఆహార పదార్థంగా మాత్రమే కాదు వంటింటి సృజనాత్మక సంస్కృతికి మూలాధారం అని కూడా అర్థమవుతుందని ఐరాసకు చెందిన ఆహార-వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఓ) చెబుతోంది.

➡ ఆహారపు అలవాట్లు మారిపోతున్న నేపథ్యంలో తాజా బంగాళదుంపలను వండుకు తినే వారి సంఖ్య తగ్గుతున్నట్లు అంచనా. అదేసమయంలో, అతిగా ప్రాసెస్ చేసిన పొటాటో చిప్స్, ఫ్రెంచ్ ఫ్రైస్ వంటివి తినటం మాత్రం ఎక్కువైందట. ఫలితంగా అనేక రకాల పోషకాహార లోపాలు తలెత్తుతున్నాయి. ఈ ట్రెండ్ మన దేశంలోనే కాదు ప్రపంచదేశాలన్నిటిలోనూ ఇంతేనని ఎఫ్ఎఓ తాజా నివేదిక చెబుతోంది.

➡ బంగాళదుంపల్లో సమృద్ధిగా పోషకాలు ఉంటాయి. విటమిన్లు, ఖనిజాలతో పాటు బంగాళదుంపలో 80% నీరు, 15.7% పిండిపదార్థాలు, 1.8% మాంసకృత్తులు, 1.7% పీచుపదార్థం, 0.1% కొవ్వు ఉంటాయి.

➡ విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది స్కర్వీ జబ్బును నివారించడంలో సహాయపడుతుంది.

➡ పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది ఎలక్ట్రొలైట్. మన గుండె, కండరాలు, నాడీ వ్యవస్థల సరైన పనితీరుకు దోహదం చేస్తుంది.


➡ బంగాళాదుంప పైపొరలో పీచు పదార్థం ఉంటుంది. మానవ జీర్ణవ్యవస్థలో ఆహారం జీర్ణం కావడానికి ఇది అవసరం.

➡ దేహ రక్షణకు సహజ మూలకాలైన యాంటీఆక్సిడెంట్లు దోహదం చేస్తాయి. బంగాళదుంపల్లో ఇవి పుష్కలంగా ఉన్నాయి. గుండె ఆరోగ్యానికి దన్నుగా నిలవటం ద్వారా ఆరోగ్యదాయకమైన కొలెస్ట్రాల్ స్థాయిలను నిర్వహించటంలో యాంటీఆక్సిడెంట్లు తోడ్పడతాయి.

➡ బంగాళదుంపలోని పోషక విలువ దాని రకం, వాతావరణం, నేల, సాగు పద్ధతులు, నిల్వ పరిస్థితులు, ప్రాసెసింగ్, తయారీ, వంట పద్ధతిపై ఎక్కువగా ఆధారపడి ఉంటుంది.

➡ బంగాళదుంపలు ఆరోగ్యకరమైన ఆహారంలో భాగం కాగలిగినప్పటికీ ఇవి అందరికీ సరిపడవు. ఎందుకని అంటే..? ఎంత తింటాం? ఎలా ప్రాసెస్ చేస్తాం? ఎలా వండుతాం? విలువ ఆధారిత ఆహారోత్పత్తుల్ని ఎలా తయారు చేస్తాం? వంటి అంశాలతో పాటు ఏ ఇతర ఆహార పదార్థాలతో కలిపినప్పుడు ఎంత సమతుల్యతను పాటిస్తాం అన్నదానిపై ఆధారపడి బంగాళదుంప బాగోగులు ఆధారపడి ఉంటాయని ఎఫ్ఎఓ తెలిపింది.

అతి ముఖ్యమైన పంట





బంగాళదుంపల సాగు:
- వేర్వేరు వ్యవసాయ వాతావరణ ప్రాంతాల్లో, నేలల్లో సాగు అవుతుంది.
- సముద్రతలం నుంచి 4.700 మీటర్ల ఎత్తు వరకు భూముల్లో సాగవుతుంది.



- చిన్న, సన్నకారు రైతులకు ఆధారపడదగిన ఆదాయాన్ని అందిస్తుంది బంగాళదుంప పంట.



- సుసంపన్నమైన జన్యువైవిధ్యం వల్ల బంగాళదుంప వంగడాలు చీడపీడలను దీటుగా తట్టుకోగలుగుతుంది.



- బంగాళదుంపలను కోట్లాది మంది ప్రజలు దైనందిన ప్రధాన ఆహారంగా తింటున్నారు.

పోషకం	విలువలు	సగటు	ఏ రకంలో ఈ పోషకం ఎక్కువ ఉంది?
మాంసకృత్తులు	0.9-4.2 గ్రా.	2.1 గ్రా.	రోజా రైనస్ (స్పెయిన్)
పీచు పదార్థం	0.3-3.7 గ్రా.	2.0 గ్రా.	రెడ్ పోంటియాక్ - స్కిన్ (కెనడా)
ఫాస్ఫరస్	33-126 మి.గ్రా.	71 మి.గ్రా.	సిఐపి703315 (పెరు)
రాగి	0.05-0.15 మి.గ్రా.	0.11 మి.గ్రా.	బొనిట (స్పెయిన్)
రిబొఫ్లావిన్ (విటమిన్ బి12)	0.02-0.36 మి.గ్రా.	0.07 మి.గ్రా.	రసెట్ బర్‌బ్యాంక్ (అమెరికా)
విటమిన్ బి6	0.15-0.30 మి.గ్రా.	0.24 మి.గ్రా.	నార్చిప్ (అమెరికా)
విటమిన్ సి	7-34 మి.గ్రా.	17 మి.గ్రా.	మరియా క్రజ్ (పెరు)

ఏ రకం బంగాళదుంపల్లో ఏయే పోషక విలువలు ఎంతెంత? (ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార-వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఓ) సమాచారం ప్రకారం.. 100 గ్రాముల పచ్చి బంగాళ దుంపలో గత పోషక విలువలు)

* * *

* * *

బంగాళదుంపలు.. అంకెలు.. వాస్తవాలు..

➡ ప్రపంచవ్యాప్తంగా వందలాది కోట్ల గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజానీకానికి దైనందిన ప్రధానాహారంలో వరి, గోధుమ తర్వాత మూడో స్థానం బంగాళదుంపలదే.

➡ ఇవి 5 వేల రకాలు ఉన్నాయి. బంగాళదుంపల జీవవైవిధ్యం ప్రపంచ ఆహార భద్రతకు ఒక పట్టుకొమ్మగా నిలిచింది. చిన్న, సన్నకారు రైతులకు ఇదొక ముఖ్యమైన ఆహార పంటగా మారిపోయింది.

➡ బంగాళదుంపలకు పుట్టిల్లు పెరులోని ఆండీస్ పర్వత ప్రాంతాలు. పెరులోని కస్కో దగ్గర పొటాటో పార్క్ ఉంది. దీని విస్తర్ణం 12 వేల హెక్టార్లు. వైవిధ్యంతో కూడిన పురాతన బంగాళదుంప వంగడాల జన్యువనరులను, సంప్రదాయ విజ్ఞానాన్ని ఆదివాసులు అనాదిగా పరిరక్షిస్తున్నది ఈ ప్రాంతంలోనే.

➡ ఆండీస్ ప్రాంతంలో విరాజిల్లిన పురాతన 'ఇంకా నాగరికత'కు పూచిన పుష్పంగా బంగాళదుంపలను చెబుతారు.

➡ పెరు నుంచి 16వ శతాబ్దంలో యూరప్ దేశాలకు, అక్కడి నుంచి ప్రపంచానికి వ్యాపించింది బంగాళదుంప పంట. కేవలం 5 శతాబ్దాల్లో వేగంగా విస్తరించింది.

➡ ఐర్లాండులో 1840వ దశకంలో బంగాళదుంప పంట చీడపీడలతో తుడిచిపెట్టుకుపోవటంతో క్షామం సంభవించింది. అక్కడ ఈ పంట వంగడాల్లో వైవిధ్యతను నిలుపుకోకపోవటమే ఇందుకు కారణం.

➡ బంగాళదుంపలు మనకు గోధుమ రంగులో ఉండేవే తెలుసు. కానీ, ఎన్నెన్నో రంగుల్లో ఉంటాయి. విభిన్నమైన వాతావరణ పరిస్థితుల్లో, విభిన్న సాగు పద్ధతుల్లో, భూతాపాన్ని తట్టుకుంటూ మనగలుగుతున్న అతి ముఖ్యమైన ఆహార పంట ఇది. మారుతున్న పరిస్థితులకు తగినవిధంగా మార్పుచెందే క్రమంలో ప్రతి బంగాళదుంప వంగడానికి ప్రత్యేకమైన గుణాలు ప్రకృతిసిద్ధంగా చేకూరాయి.

➡ 2000-2020 మధ్యకాలంలో బంగాళదుంపల సాగు విస్తీర్ణం 17% తగ్గినప్పటికీ ఉత్పత్తి 11 శాతం పెరిగింది. తక్కువ చోటులో ఎక్కువ దిగుబడి సాధించటంలో మెరుగైన వంగడాలు, సాగు పద్ధతుల్లో వచ్చిన మార్పులు దోహదం చేస్తున్నాయి.

➡ ప్రపంచవ్యాప్తంగా బంగాళదుంప వంగడాల సంరక్షణ, విత్తటం, కోత, విక్రయం తదితర ప్రక్రియల్లో గ్రామీణ మహిళలు కీలకపాత్రపోషిస్తున్నారు. ఈ పొలాల్లో మహిళల శ్రమే అధికం.

ఆలూపై అపోహలు వద్దు

ఎవరైనా తీసుకునే ఆహారం వారి వయసు, రోజువారీగా వారి శారీరక శ్రమపై ఆధారపడి ఉండాలి. ఏదైనా మితంగా తీసుకోవాలి. బంగాళదుంప వాతం అంటూ ఉంటారు. కానీ, నిజానికి ఇది అపోహే. బంగాళదుంపలో ఎక్కువగా పిండిపదార్థాలు ఉన్నాయి. దీనితో పాటు కలిపి తీసుకునే ఇతర ఆహార పదార్థాలు మాంసకృత్తులు కలిగినవై ఉండాలి. ఉత్తరాదిలో ఏ కూర చూసినా ఆలు లేకుండా ఉండదు. అయితే, ఆలుతో పాటు కాబోలి శనగలు కూడా కలిపి వండుతారు. మన ఆహారంలో సాధారణంగా మాంసకృత్తులు లోపిస్తున్న విషయం తెలిసిందే కదా. పెద్దవాళ్లు రోజూ ఆలు తిని కూర్చుంటే పిండి పదార్థాలు ఎక్కువై నొప్పుల సమస్య వస్తుంది. పెద్దవాళ్లకు జీర్ణశక్తి తగ్గటం కూడా ఈ సమస్యకు ఒక కారణం. అదే పిల్లలైతే శారీరక కదలికలు ఎక్కువ కాబట్టి వారికి ఆ సమస్య రాదు. ఎవరైనా, తగుమాత్రంగా, సమతులాహారంలో భాగంగా తీసుకున్నప్పుడు ఏ సమస్యా ఉండదు. లేదంటే ఊబకాయానికి దారితీస్తుంది. నూనెలో డీప్ ఫ్రై చేసిన ఫ్రెంచ్ ఫ్రైస్, చిప్స్ తినటం చిన్నా పెద్దా ఎవరికీ ఆరోగ్యకరం కాదు.



- ఆచార్య విజయ ఖాదర్, విశ్రాంత డీన్, ఫ్యాకల్టీ ఆఫ్ హోం సైన్స్, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం

గత మూడు రోజుల వాతావరణం:

గడిచిన మూడు రోజుల్లో రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసాయి. పగటి ఉష్ణోగ్రతలు 32 నుంచి 39 డిగ్రీల సెల్సియస్, రాత్రి ఉష్ణోగ్రతలు 22 నుంచి 28 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి.

వచ్చే ఐదు రోజుల వాతావరణ విశ్లేషణ:

హైదరాబాద్ వాతావరణ కేంద్రం వారు అందించిన సమాచారం ప్రకారం వచ్చే ఐదు (జూన్ 4 నుంచి 8 వరకు) రోజుల్లో రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 33 నుండి 40 డిగ్రీల సెల్సియస్ మధ్య, రాత్రి ఉష్ణోగ్రతలు 24 నుంచి 31డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదుకావచ్చు.



- నేటి నుంచి ఆదివారం వరకు వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు

బుధవారం: ఈదురు గాలులు (గాలి వేగం గంటకు 30-40 కి.మీ.) వేగంతో తెలంగాణ రాష్ట్రంలోని ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాలలో అక్కడక్కడ వీచే అవకాశం ఉంది.


గురువారం: ఈదురు గాలులు (గాలి వేగం గంటకు 30-40 కి.మీ.) వేగంతో తెలంగాణ రాష్ట్రంలోని జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాలలో అక్కడక్కడా వీచే అవకాశం ఉంది.

శుక్ర, శని, ఆదివారాల్లో రైతులకు ఎటువంటి వాతావరణ సంబంధమైన హెచ్చరికలు లేవు.

వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు

- జూన్‌లో అధిక వర్షపాతం

నేల 6 అంగుళాలు తడిచాక విత్తుకోండి!



● నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి మే 26వ తేదీన ప్రవేశించి మే 28వ తేదీన రాష్ట్రమంతటా విస్తరించాయి ● రుతుపవనాలు రాష్ట్రంలోకి 15 రోజుల ముందుగా వచ్చినప్పటికీ రైతులు వర్షాధార పంటలైన పత్తి, సోయాచిక్కుడు, మొక్కజొన్న, జొన్న, కంది, పెసర మొదలగు పంటలను సాధారణ విత్తే సమయంలోనే అంటే జూన్ 15 వ తేదీ నుంచి నేల 15-20 సెం.మీ. (6-8 అంగుళాల) లోతు తడిచిన తరువాతనే పంటలను విత్తుకోవాలి ● జూన్‌లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే సూచనలున్నందున (108 శాతం) రైతులు అధిక వర్షపు నీటిని పొలం నుంచి బయటకు తీసివేయడానికి మురుగు కాలువలను ఏర్పరచుకోవాలి ● వర్షాధారపు పంటలను సరైన సమయంలో విత్తుకోవడానికి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సేకరించుకోవాలి ● వేరుశనగ, సోయాచిక్కుడు, జొన్న, పెసర, కంది, మినుము పంటలను విత్తుకునే ముందు తప్పని సరిగా విత్తన శుద్ధి చేసుకోవాలి ● రాష్ట్రంలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే సూచనలున్నందున రైతులు చెట్ల కింద నిలబడకూడదు. పశువులు, గొర్రెలు, మేకలను చెట్ల కింద ఉంచకూడదు ● ఉరుములు, మెరుపులతో కూడిన వర్ష సూచనలున్నందున రైతులు విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు, చెరువులు, నీటి కుంటలకు దూరంగా ఉండాలి ● తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నందున కోసిన పంటలను (వరి, మొక్కజొన్న, పెసర, మినుము, జొన్న, పొద్దుతిరుగుడు, నువ్వులు తదితర పంటలు) ముందు జాగ్రత్తగా సురక్షిత ప్రాంతానికి తరలించాలి. మార్కెట్‌కు తరలించిన ధాన్యం తడవకుండా టార్పాలిన్‌తో కప్పి వుంచాలి ● వర్షాలు కురిసే సూచనలున్నందున మామిడి, కూరగాయ పంటలను కోసుకొని మార్కెట్‌కు తరలించాలి ● వర్ష సూచనలున్నందున పురుగు మందుల పిచికారీని కొన్ని రోజులు వాయిదా వేసుకోవాలి ● ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను ఉపయోగించుకొని వరి సాగు చేసే రైతులు పచ్చిరొట్ట పైరులను (జనుము, జీలుగ, పెసర, పిల్లి పెసర, ఉలవలు మొదలైన) విత్తుకోవాలి.



వరి: ● నీరు సమృద్ధిగా ఉన్న ప్రాంతాల్లో రైతులు దీర్ఘకాలిక (140 రోజులు అంతకంటే ఎక్కువ) వరి రకాల నారుమళ్ళు పోసుకోవడానికి ఇది అనువైన సమయం.

ప్రత్తి: ● పత్తి పంటను జులై 20వ తేదీ వరకు దిగుబడిలో ఎటువంటి తరుగుదల లేకుండా సాగు చేసుకోవచ్చు ● పత్తి వర్షాధార పంట. రైతులు బిటి రకాలను బోదెలు, కాలువల పద్ధతిలో విత్తుకోవాలి ● ఎక్కువ వర్షాలు పడినప్పుడు కూడా కాలువల ద్వారా నీటిని తీసివేయటానికి అనుకూలంగా ఉంటుంది.

మొక్కజొన్న: ● మొక్కజొన్న పంటను జులై 15వ తేదీ వరకు మధ్యకాలిక (90-100 రోజులు), దీర్ఘకాలిక (100-120 రోజులు) రకాలను విత్తుకోవటానికి అనుకూల సమయం ● మొక్కజొన్న శాకీయ దశలో ఎక్కువ నీటిని, ప్రత్యుత్పత్తి దశలో నీటి ఎద్దడిని తట్టుకోలేదు. కాబట్టి పంటను బోదెలు, కాలువల పద్ధతిలో సాగు చేసుకోవాలి.

జొన్న: ● జొన్న పంటను జూన్ 30వ తేదీ వరకు విత్తుకోవచ్చు ● జొన్నని ఏక పంటగా లేదా కందితో అంతర పంటగా సాగు చేసుకోవచ్చు.

ఆముదం: ● ఆముదం పంటను జూలై 15-31 వరకు విత్తుకోవచ్చు.

కంది: ● కంది పంటను జులై 15వ తేదీ వరకు సాగు చేసుకోవచ్చు ● కందిని ఏకపంటగా లేదా పత్తి, మొక్కజొన్న, జొన్న, సోయాచిక్కుడు, పెసలు, మినుములతో అంతర పంటగా సాగు చేసుకోవచ్చు ● కంది పంటను విత్తే ముందు విత్తనాన్ని 2.5 గ్రా. కాప్టాన్ లేదా 3 గ్రా. థైరామ్, 10గ్రా. ట్రైకోడెర్మా విరిడి మందుతో కిలో విత్తనానికి కలిపి విత్తుకున్నట్లయితే విత్తనం లేదా భూమి ద్వారా సంక్రమించే శిలీంద్రాల నుంచి పంటను కాపాడవచ్చు.



పెసర- మినుము: ● పెసర, మినుము పంటలను జులై 15వ తేదీ వరకు విత్తుకోవచ్చు ● పెసర, మినుములను ఏక పంటగా లేదా పత్తి-కందితో అంతర పంటగా సాగు చేసుకోవచ్చు ● వరి సాగు చేసే పొలాల్లో ఆలస్యంగా నీరు విడుదలయ్యే ప్రాంతాల్లో పెసరను పైరుగా లేనిచో పచ్చిరొట్టగా విత్తుకోవాలి.

సోయాచిక్కుడు: ● సోయాచిక్కుడు పంటను జులై మొదటి వారం వరకు విత్తుకోవచ్చు ● నీటి వసతి గల తేలికపాటి నేలలు కూడా సోయాచిక్కుడు సాగుకు అనుకూలం ● ఎత్తు మడులు-కాలువల పద్ధతిలో విత్తుకున్నట్లయితే విత్తన మోతాదు తగ్గటంతోపాటు సరైన సాంద్రతలో మొక్కలు ఉండి, సాగు ఖర్చులు తగ్గి అధిక దిగుబడులు వస్తాయి ● ఈ పద్ధతిలో భూమిలో ఎక్కువ తేమ నిలువ ఉండి పంట నీటి ఎద్దడిని తట్టుకుంటుంది. అదేవిధంగా ఎక్కువ నీటిని పొలం నుంచి తీసివేయటానికి కాలువలు ఉపయోగపడతాయి.

చెరకు: ● తోట వయస్సు నాలుగు నెలలప్పుడు (జూన్ - జులై మాసాల్లో) మొదళ్ళకు ఎత్తుగా మట్టిని ఎగదోయాలి. దీని వలన అధిక వర్షాలు, తుఫాను గాలులకు పంట పడిపోకుండా కాపాడుకోవచ్చు.

- డాక్టర్ లీలారాణి, ప్రధాన శాస్త్రవేత్త-అధిపతి, వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం, పిజెటిఎయు, రాజేంద్రనగర్, హైదరాబాద్


ప్రియమైన ప్రత్యర్థిపై ఘనమైన విజయం

ప్రపంచ మాజీ చాంపియన్ ఒకుహారాపై 11వసారి నెగ్గిన పీవీ సింధు

79 నిమిషాల హోరాహోరీ సమరంలో భారత స్టార్‌దే పైచేయి

ఇద్దరి మధ్య 20 సార్లు ముఖాముఖి పోరు

ఆట ఏదైనా కొందరి పోరు చూస్తుంటే ముచ్చటేస్తుంది. చివర్లో విజేతగా ఎవరు అవతరించినా అభిమానులకు మాత్రం పైసా వసూల్ అవుతుంది. మహిళల బ్యాడ్మింటన్ విషయానికొస్తే భారత స్టార్ పీవీ సింధు, జపాన్ ప్లేయర్ నొజోమి ఒకుహారా మధ్య మైదానంలో వైరం ఇప్పటిది కాదు. 2012లో ఆసియా యూత్ అండర్–19 చాంపియన్‌షిప్‌లో వీరిద్దరి మధ్య తొలి పోరు జరిగింది. ఆ తర్వాత ఇద్దరూ తమ కెరీర్‌లో ఒక్కో మెట్టు ఎక్కుతూ సీనియర్ స్థాయిలో చిరస్మరణీయ విజయాలు అందుకున్నారు. ప్రపంచ చాంపియన్‌గా అవతరించడంతోపాటు ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌లను అందుకున్నారు. ఈ క్రమంలో సింధు, ఒకుహారా మ్యాచ్‌లంటే బ్యాడ్మింటన్ అభిమానులకు పసందైన విందుగా మారిపోయింది. ఒకసారి సింధు గెలిస్తే, మరోసారి ఒకుహారా నెగ్గి లెక్క సరిచేసేది. తాజాగా ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 టోర్నీలో వీరిద్దరు తొలి రౌండ్‌లోనే ఎదురెదురుగా తలపడ్డారు. ఇద్దరి మధ్య 20వ ముఖాముఖి పోరు ఎప్పటిలాగే ఆద్యంతం అద్భుతంగా సాగింది. 79 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో చివరకు సింధు గెలిచి తన ప్రియమైన ప్రత్యర్థిపై ఆధిపత్యం చాటుకుంది. మ్యాచ్ ముగిశాక ఈ చిరకాల ప్రత్యర్థులు పరస్పరం అభినందించుకోవడంతోపాటు... త్వరలో మరోసారి ఆడేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నామని తమ తమ సోషల్ మీడియా ఖాతాల్లో పేర్కొనడం విశేషం.



మ్యాచ్ ముగిశాక సింధు, ఒకుహారా కరచాలనం

జకార్తా: ఈ ఏడాది తొలి టైటిల్ కోసం ఎదురుచూస్తున్న భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ప్రతిష్టాత్మక ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 టోర్నీలో తొలి అడ్డంకిని అధిగమించింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సింధు 22–20, 21–23, 21–15తో ప్రపంచ మాజీ చాంపియన్ నొజోమి ఒకుహారా (జపాన్)పై అద్భుత విజయం సాధించింది. 79 నిమిషాల పాటు సాగిన హోరాహోరీ పోరులో సింధు కీలకదశలో పాయింట్లు గెలిచి అనుకున్న ఫలితాన్ని అందుకుంది. సింధు, ఒకుహారా ఇప్పటి వరకు 20 సార్లు అమీతుమీ తలపడగా... అందులో సింధు 11వసారి గెలుపొందింది. ప్రిక్వార్టర్స్‌లో థాయ్‌లాండ్ ప్లేయర్ పోర్న్‌పవీ చొచువాంగ్‌తో సింధు ఆడనుంది. ఈ ఏడాది అత్యుత్తమంగా ఇండియా ఓపెన్ క్వార్టర్ ఫైనల్‌కు చేరిన సింధు... ఆ తర్వాత స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేక పలు టోర్నమెంట్‌లలో ఆరంభ దశల్లోనే వెనుదిరిగింది. మరోవైపు ఒకుహారా పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. గత కొంతకాలంగా నిలకడలేమితో ఇబ్బందిపడుతున్న ఈ జపాన్ ప్లేయర్ బరిలోకి దిగిన చివరి ఆరు టోర్నీల్లో రెండో రౌండ్ దాటలేకపోయింది. 'ఇటీవలి కాలంలో ఆరంభ రౌండ్లలోనే పరాజయాలు ఎదురయ్యాయి. అలాంటి దశలో ఈ విజయం చాలా ముఖ్యమైంది. ఒకుహారాతో ఆడటం ఎప్పుడూ ప్రత్యేకమే. తను అంత తేలికగా పరాజయాన్ని అంగీకరించదు. ఆటలో రోజురోజుకు చాలా మార్పులు వస్తున్నాయి. సుదీర్ఘ ర్యాలీలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అటాకింగ్ గేమ్ తగ్గి.. రక్షణాత్మక ధోరణిలో ఆడటం ఎక్కువైంది. ఇక అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ ఆటకు ఫిట్‌నెస్ కీలకమే. దానిపై మరింత దృష్టి సారించాల్సి ఉంది. ఇండియా ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్ చేరిన తర్వాత స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయా. ఈ నేపథ్యంలో ఈ విజయం నాలో కొత్త ఉత్సాహాన్నిచ్చింది. ఓపికగా ఎదురుచూస్తే లయ అందిపుచ్చుకోవచ్చని నిరూపితమైంది. ఫలితంతో సంతోషంగా ఉన్నా. కానీ ఇంకా చాలా విషయాల్లో మెరుగవ్వాల్సి ఉంది. ముఖ్యంగా గాయాల బారిన పడకుండా ఉండేందుకు ప్రయత్నిస్తున్నా' అని సింధు మ్యాచ్ అనంతరం పేర్కొంది.



చిరాగ్, సాత్విక్

సాత్విక్–చిరాగ్ జోడీ బోణీ

పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) జోడీ శుభారంభం చేసింది. తొలి రౌండ్‌లో సాత్విక్–చిరాగ్ ద్వయం 67 నిమిషాల్లో 18–21, 21–18, 21–14తో లియో రాలీ కర్నాండో–బాగస్ మౌలానా (ఇండోనేసియా) జంటపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరింది. పురుషుల సింగిల్స్ విభాగంలో భారత స్టార్స్ లక్ష్య సేన్, హెచ్‌ఎస్ ప్రణయ్ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. లక్ష్యసేన్ 11–21, 22–20, 15–21తో టాప్ సీడ్ షి యూఛీ (చైనా) చేతిలో ఓడాడు. 65 నిమిషాల పాటు సాగిన పోరులో తొలి గేమ్‌లో పరాజయం పాలైన లక్ష్యసేన్... ఆ తర్వాత పుంజుకున్నా... కీలక సమయాల్లో పాయింట్లు గెలిచిన చైనా ప్లేయర్ మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. మరో మ్యాచ్‌లో ప్రణయ్ 17–21, 18–21తో ఫర్హాన్ (ఇండోనేసియా) చేతిలో ఓటమి పాలయ్యాడు. పుత్రి కుసుమ వర్ధిని (ఇండోనేసియా)తో జరిగిన మహిళల సింగిల్స్ మ్యాచ్‌లో మాళవిక బన్సోద్ (భారత్) 21–16, 16–15తో ఆధిక్యంలో ఉన్న దశలో గాయం కారణంగా వైదొలిగింది. ఇతర మ్యాచ్‌ల్లో అనుపమ (భారత్) 15–21, 9–21తో కిమ్ గా యిన్ (కొరియా) చేతిలో... రక్షిత శ్రీ (భారత్) 21–14, 15–21, 12–21 సుపనిద కటెథాంగ్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి పాలయ్యారు.

మహిళల ఎమర్జింగ్ ఆసియా కప్ వాయిదా



లాహోర్: శ్రీలంకలో జరగాల్సిన మహిళల ఎమర్జింగ్ ఆసియా కప్ క్రికెట్ టోర్నీ వాయిదా పడింది. శ్రీలంకలో ప్రతికూల వాతావరణ పరిస్థితులతో పాటు, సీజనల్ వ్యాధులు స్వైర విహారం చేయడంతో ఆతిథ్య దేశం వాయిదా కోరింది. దీనిపై సమీక్షించిన ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ) టోర్నీని వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది. ముందనుకున్న షెడ్యూల్ ప్రకారమైతే ఈ నెల 6 నుంచి ఎమర్జింగ్ జట్లు తలపడే ఆసియా కప్ జరగాల్సి ఉంది. అయితే ప్రస్తుతం లంకలో ప్రతికూల వాతావరణంతో పాటు చికెన్ గున్యా వ్యాధితో స్థానిక ప్రజలు సతమతమవుతున్నారు. లంక బోర్డు విజ్ఞప్తి మేరకు ఈవెంట్‌ను వాయిదా వేస్తున్నట్లు ఏసీసీ ప్రకటించింది. తదుపరి ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే నిర్ణయిస్తామని ఏసీసీ చీఫ్ మోసిన్ రజా నక్వీ తెలిపారు. దీంతో పాటు పురుషుల ఆసియా కప్ టి20 టోర్నమెంట్‌పై కూడా నీలినీడలు కమ్ముకున్నాయి. ఇటీవల భారత్, పాకిస్తాన్ సరిహద్దుల వెంబడి నెలకొన్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో పురుషుల ఈవెంట్ జరగడం కూడా అనుమానమేనని ఏసీసీ వర్గాలు వెల్లడించాయి. 2023లో హాంకాంగ్ వేదికగా జరిగిన తొలి ఆసియా ఎమర్జింగ్ కప్ టోర్నీలో శ్వేతా సెహ్రావత్ నాయకత్వంలో బరిలోకి దిగిన భారత 'ఎ' జట్టు విజేతగా నిలిచింది.

భారత్ బోణీ

డబ్లిన్: ప్రొ హాకీ లీగ్ సన్నాహాల్లో భాగంగా ఐర్లాండ్‌తో జరుగుతున్న రెండు మ్యాచ్‌ల హాకీ సిరీస్‌లో భారత పురుషుల జట్టు శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 4–0 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున హర్మన్‌ప్రీత్ సింగ్, మన్‌దీప్ సింగ్ ఒక్కో గోల్ చేయగా... దిల్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్‌తో ఆకట్టుకున్నాడు. ఈ సిరీస్ ముగిశాక రెండు జట్లు నెదర్లాండ్స్‌లో జరిగే ప్రొ హాకీ లీగ్ చివరి అంచె టోర్నీలో పాల్గొంటాయి.

సెమీస్‌లో సబలెంకా

- క్వార్టర్ ఫైనల్లో ఎనిమిదో సీడ్ కిన్‌వెన్ జెంగ్‌పై గెలుపు
- ఫైనల్లో చోటు కోసం స్వియాటెక్‌తో పోరు



సబలెంకా

పారిస్: కెరీర్‌లో నాలుగో గ్రాండ్‌స్లామ్ టైటిల్ దిశగా ప్రపంచ నంబర్‌వన్, బెలారస్ స్టార్ సబలెంకా మరో అడుగు ముందుకు వేసింది. టెన్నిస్ సీజన్ రెండో గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఫ్రెంచ్ ఓపెన్‌లో టాప్ సీడ్ సబలెంకా రెండోసారి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. పారిస్ ఒలింపిక్స్ చాంపియన్, ఎనిమిదో సీడ్ కిన్‌వెన్ జెంగ్ (చైనా)తో మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో సబలెంకా 7–6 (7/3), 6–3తో గెలుపొందింది. 1 గంటా 57 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సబలెంకాకు గట్టిపోటీ ఎదురైంది. తొలి సెట్‌లో ఒక దశలో సబలెంకా 2–4తో వెనుకబడింది. అయితే ఏడో గేమ్‌లో కిన్‌వెన్ తడబడి అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకుంది. కిన్‌వెన్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన సబలెంకా ఆ తర్వాత తన సర్వీస్‌ను నిలబెట్టుకొని స్కోరును 4–4తో సమం చేసింది. అనంతరం ఇద్దరూ తమ సర్వీస్‌లను కాపాడుకోవడంతో స్కోరు 6–6తో నిలిచింది. టైబ్రేక్‌లో సబలెంకా జోరు కనబరిచి సెట్‌ను సొంతం చేసుకుంది. రెండో సెట్‌లో సబలెంకా ఏడో గేమ్‌లో, తొమ్మిదో గేమ్‌లో కిన్‌వెన్ సర్వీస్‌లను బ్రేక్ చేసి అదే జోరులో విజయాన్ని ఖరారు చేసుకుంది. మ్యాచ్ మొత్తంలో సబలెంకా ఆరు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. 20 విన్నర్స్ కొట్టిన ఈ బెలారస్ స్టార్ 18 అనవసర తప్పిదాలు చేసింది. నెట్ వద్దకు 14 సార్లు దూసుకొచ్చి ఎనిమిది సార్లు పాయింట్లు గెలిచింది. మరోవైపు కిన్‌వెన్ ఐదు ఏస్‌లు సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. 22 విన్నర్స్ కొట్టిన ఈ చైనా స్టార్ 31 అనవసర తప్పిదాలు చేసింది. సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ ఇగా స్వియాటెక్ (పోలాండ్)తో సబలెంకా తలపడుతుంది. మరో క్వార్టర్ ఫైనల్లో స్వియాటెక్ 6–1, 7–5తో 13వ సీడ్ స్వితోలినా (ఉక్రెయిన్)పై విజయం సాధించింది. 1 గంటా 41 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో స్వియాటెక్ మూడు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. ఫ్రెంచ్ ఓపెన్‌లో స్వియాటెక్‌కిది వరుసగా 26వ విజయం. 2022, 2023, 2024లలో విజేతగా నిలిచిన స్వియాటెక్ టైటిల్ నిలబెట్టుకోవడానికి రెండు విజయాల దూరంలో ఉంది.



స్వియాటెక్

సెమీస్‌లో ముసెట్టి

పురుషుల సింగిల్స్ విభాగంలో ఎనిమిదో సీడ్ లొరెంజో ముసెట్టి (ఇటలీ) సెమీఫైనల్లోకి దూసుకెళ్లగా... ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ (ఇటలీ) క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. క్వార్టర్ ఫైనల్లో ముసెట్టి 6–2, 4–6, 7–5, 6–2తో 15వ సీడ్ టియాఫో (అమెరికా)పై గెలుపొందాడు. 2 గంటల 47 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ముసెట్టి ఎనిమిది ఏస్‌లు సంధించాడు. తన ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేశాడు. సోమవారం అర్ధరాత్రి తర్వాత ముగిసిన ప్రిక్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ సినెర్ 6–1, 6–3, 6–4తో 17వ సీడ్ రుబ్లెవ్ (రష్యా)పై విజయం సాధించాడు.

విలియమ్సన్‌కు మొండిచేయి



వెల్లింగ్టన్: మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్‌కు న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు (ఎన్‌జడ్‌సీ) సెంట్రల్ కాంట్రాక్టుల్లో మళ్లీ మొండిచేయి చూపింది. దీంతో వచ్చే నెల జింబాబ్వే పర్యటనకు విలియమ్సన్ దూరమయ్యే అవకాశముంది. గతేడాది కూడా ఇలాగే అతనికి న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు సెంట్రల్ కాంట్రాక్టును నిరాకరించింది. విశ్వవ్యాప్తంగా జరిగే ఫ్రాంచైజీ టి20 లీగ్‌లలో ఆడేందుకు అతనికి స్వేచ్ఛనిచ్చింది. అయితే సాధారణ కాంట్రాక్టు ప్లేయర్‌గా గతేడాది 9 టెస్టులు ఆడి 1000 పైచిలుకు పరుగులు చేసి నిరూపించుకున్నాడు. మంగళవారం ఎన్‌జడ్‌సీ విడుదల 20 మంది కాంట్రాక్టు ఆటగాళ్ల జాబితాలో విలియమ్సన్‌తో పాటు డెవాన్ కాన్వే, ఫిన్ అలెన్, టిమ్ సీఫెర్ట్, ఫెర్గూసన్‌లు కూడా లేరు. వీరంతా ప్రపంచ వ్యాప్తంగా జరిగే లీగ్‌లతో బిజీగా ఉన్నారు. దేశవాళీ టోర్నీలతో పాటు అంతర్జాతీయ క్రికెట్‌లో కనబరిచిన ప్రదర్శన ఆధారంగా 20 మందికి సెంట్రల్ కాంట్రాక్టు ఇచ్చినట్లు ఎన్‌జడ్‌సీ ఒక ప్రకటనలో తెలిపింది.



అర్జున్‌పై తొలిసారి నెగ్గిన గుకేశ్

స్టావెంజర్: గత ఏడాది ప్రపంచ చెస్ చాంపియన్‌గా అవతరించిన తర్వాత భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ పాల్గొన్న పలు టోర్నీలలో ఆశించినస్థాయిలో రాణించలేకపోయాడు. అయితే నార్వే ఓపెన్ టోర్నీలో గుకేశ్ మళ్లీ ఫామ్‌లోకి వచ్చాడు. ఆరుగురు మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య జరుగుతోన్న ఈ టోర్నీలో... గుకేశ్ ఆరో రౌండ్‌లో నార్వే దిగ్గజం, వరల్డ్ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్‌పై క్లాసికల్ ఫార్మాట్‌లో తొలిసారి గెలిచాడు. కార్ల్‌సన్‌ను ఓడించిన ఉత్సాహంలో గుకేశ్ క్లాసికల్ ఫార్మాట్‌లో మరో ప్రత్యర్థిపై తొలిసారి విజయాన్ని అందుకున్నాడు. ఆ ప్రత్యర్థి ఎవరో కాదు భారత్‌కే చెందిన యువ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్. గతంలో అర్జున్‌తో పోటీపడిన ఆరుసార్లు గుకేశ్‌కు విజయం దక్కలేదు. ఒక గేమ్‌లో ఓడిపోయి, నాలుగు గేమ్‌లను 'డ్రా' చేసుకున్నాడు. ఏడో ప్రయత్నంలో మాత్రం గుకేశ్ పైచేయి సాధించాడు. మూడున్నర గంటలకుపైగా జరిగిన ఏడో రౌండ్ గేమ్‌లో గుకేశ్ తెల్ల పావులతో ఆడుతూ 92 ఎత్తుల్లో అర్జున్‌ను ఓడించాడు. ఈ విజయంతో గుకేశ్ 11.5 పాయింట్లతో రెండో స్థానానికి చేరుకున్నాడు. 12.5 పాయింట్లతో ఫాబియానో కరువానా (అమెరికా) అగ్రస్థానంలో... 11 పాయింట్లతో మాగ్నస్ కార్ల్‌సన్ మూడో స్థానంలో ఉన్నారు. హికారు నకమురా (అమెరికా; 8.5 పాయింట్లు) నాలుగో స్థానంలో, అర్జున్ (7.5 పాయింట్లు) ఐదో స్థానంలో, వె యి (చైనా; 6.5 పాయింట్లు) ఆరో స్థానంలో ఉన్నారు.


జూలై 5న నీరజ్ చోప్రా 'క్లాసిక్' ఈవెంట్

గతంలో వాయిదాపడ్డ ఈవెంట్‌కు కొత్త షెడ్యూల్ ఖరారు

బెంగళూరు: భారత ఒలింపిక్ చాంపియన్ నీరజ్ చోప్రా ఈ ఏడాది నిర్వహించ తలపెట్టిన అంతర్జాతీయ జావెలిన్ త్రో ఈవెంట్‌కు కొత్త షెడ్యూల్ ఖరారైంది. వచ్చేనెల 5న బెంగళూరులో ఈ ఈవెంట్ నిర్వహించనున్నారు. భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్‌ఐ), జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్‌ల ఉమ్మడి భాగస్వామ్యంతో చోప్రా గత నెలలోనే ఈ అంతర్జాతీయ ఈవెంట్ నిర్వహించాలనుకున్నాడు. కానీ పహల్గాంలో ఉగ్రదాడి దరిమిలా 'ఆపరేషన్ సిందూర్'తో భారత్, పాక్‌ల మధ్య డ్రోన్ దాడులతో యుద్ధవాతావరణం నెలకొంది. దీంతో భారత్‌లోని కొన్ని అంతర్జాతీయ విమానాశ్రయాలను మూసివేయడం తదితర ప్రతికూల పరిస్థితులతో మే 24న క్రీడాఈవెంట్‌ను నిర్వహించే వాతావరణం లేకపోయింది. ఈ జావెలిన్ త్రో టోర్నీయే కాదు... ప్రముఖ ఫ్రాంచైజీ క్రికెట్ లీగ్ ఐపీఎల్ కూడా వాయిదా పడింది! ఇప్పుడు ఉద్రిక్తతలు సద్దుమణగడంతో నీరజ్ చోప్రా, జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్ వాయిదా పడిన ఈవెంట్ నిర్వహణకు తుదికసరత్తు పూర్తి చేసి జూలై 5 నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 12 మంది స్టార్ అంతర్జాతీయ జావెలిన్ త్రోయర్లు ఇందులో పాల్గొంటున్నారు. ఇందులో చోప్రా సహా ఐదుగురు భారత అథ్లెట్లు కాగా... ఏడుగురు విదేశీ అథ్లెట్లు ఉన్నారు. బెంగళూరులోని శ్రీ కంఠీరవ స్టేడియంలో ఈ పోటీలు జరుగుతాయి. భారత్ నుంచి నీరజ్‌తో పాటు ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రజతం నెగ్గిన సచిన్ యాదవ్, కిషోర్ జేనా, రోహిత్ యాదవ్, సాహిల్ పాల్గొంటున్నారు. విదేశీ స్టార్లలో రెండుసార్లు ప్రపంచ చాంపియన్ అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా), 2016 రియో ఒలింపిక్స్ చాంపియన్ థామస్ రోహ్లెర్ (జర్మనీ), 2015 ప్రపంచ చాంపియన్ జూలియస్ యెగో (కెన్యా), కర్టిస్ థాంప్సన్ (అమెరికా), ఆసియా క్రీడల కాంస్య పతక విజేత గెన్కి డీన్ (జపాన్), రుమేశ్ పతిరగె (శ్రీలంక), లూయిజ్ మారిసియో (బ్రెజిల్) భారత్‌లో జరిగే ఈవెంట్‌లో పాల్గొనేందుకు ఆసక్తి చూపించారు. ఈ పోటీలను ప్రత్యక్షంగా చూసేందుకు రూ. 199 నుంచి రూ. 9999 ధర పలికే టికెట్లను అందుబాటులో ఉంచారు. కార్పొరేట్ బాక్స్ ప్రేక్షకుల కోసం రూ. 44,999 టికెట్లు ఉన్నాయి.









తైవాన్‌లోని చియాయి నగరంలో ఉన్న నేషనల్ చుంగ్ చెంగ్ యూనివర్సిటీలో మంగళవారం ప్రదర్శనకు ఉంచిన జింగ్ ఫెంగ్ ఎటాక్ డ్రోన్లు, కార్డినల్ 3 రకం నిఘా డ్రోన్లు

చూడగానే పరుగున వెళ్లి హత్తుకున్నారు

మోదీతో తన చిన్నారుల అనుబంధంపై ఉషా వాన్స్

- భారత పర్యటన తనకెంతో ప్రత్యేకమని వ్యాఖ్య



జేడీ వాన్స్ పిల్లలకు నెమలీకను గురించి చెబుతున్న మోదీ

వాషింగ్టన్: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సతీమణి, యునైటెడ్ స్టేట్స్ 'సెకండ్ లేడీ' ఉషా వాన్స్ తన భారత పర్యటన విశేషాలను మీడియాతో పంచుకున్నారు. మంగళవారం అమెరికాలో జరిగిన అమెరికా-ఇండియా వ్యూహాత్మక భాగస్వామ్యవేదిక(యూఎస్ఐఎస్‌పీఎఫ్) ఎనిమిదో విడత నాయకత్వ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఉషా వాన్స్ మీడియాతో మాట్లాడారు. ఏప్రిల్ 21 నుంచి 24వ తేదీ వరకు భారత్‌లో పర్యటించినప్పుడు తనకు, తన ముగ్గురు చిన్నారులకు కల్గిన అద్భుతానుభూతిని అందరితో పంచుకున్నారు. ''ప్రధాని మోదీని తొలిసారిగా చూసినప్పుడే నా ముగ్గురు చిన్నారులు ఆయనను తాతగా భావించారు. ఢిల్లీలో సాయంత్రం ఆయన అధికార నివాసంలో కలిసినప్పుడు ఆత్మీయంగా పలకరించారు. తాతను చూశామన్న ఆనందంలో వాళ్లు వెళ్లి మోదీని హత్తుకున్నారు. ఐదేళ్ల మా చిన్నారికి మోదీ గుర్తుపెట్టుకుని మరీ బర్త్‌డే గిఫ్ట్ ఇవ్వడం మాకెంతో నచ్చింది. వాస్తవానికి మూడు, నాలుగేళ్ల క్రితమే మేం భారత్‌కు రావాల్సింది. కానీ కోవిడ్ సంక్షోభం, జేడీ వాన్స్ రాజకీయ బిజీ షెడ్యూల్ కారణంగా మా పిల్లలు, నేను భారత్‌కు రాలేకపోయాం. అమెరికాలో ఉన్నా కూడా మా పిల్లలు భారతదేశ విశిష్టతను వింటూ పెరిగారు. ఇక్కడి ఆహారం, అలవాట్లు, అమ్మమ్మ తాతయ్యలతో అనుబంధాలు, ఆప్యాయతల గురించి ఎంతో గొప్పగా విన్నారు. అదే స్థాయిలో భారత్‌లో ఎన్నో విషయాలను స్వయంగా చూసి తెల్సుకున్నారు. ముఖ్యంగా ఉత్తరభారతదేశంలోని కొన్ని ప్రఖ్యాత పర్యాటక ప్రదేశాలను చూసి మేం మంత్రముగ్దులమయ్యాం''అని ఉషా వాన్స్ చెప్పారు.

ఈసారి మా సొంతూరుకు వెళ్తా

మరోసారి భారత్‌కు వస్తే మా సొంతూరు, నేను పెరిగిన ప్రదేశాలకు తప్పకుండా వెళ్తానని తెలుగు మూలాలున్న ఉషా చెప్పారు. ''భారత్‌లో ఉన్నంతసేపు మేం సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాం. అత్యంత వైవిధ్యమైన భోజనం చేశాం. నా ముగ్గురు చిన్నారులు నెమళ్లను చూసి ఎంతో సంబరపడ్డారు. తాజ్‌మహల్‌ను చూశాం. తోలుబొమ్మలను ఆస్వాదించాం. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన వాళ్ల ప్రతిభను కళ్లారా చూశా. తోలుబొమ్మలాటలో రామాయణంలోని కొన్ని ఘట్టాలను అద్భుతంగా చూపించారు. జంతువుల బొమ్మలతోనూ సరదా సన్నివేశాలను ఆవిష్కరించారు. ఇక ప్రధాని ఇంటికి విందు కోసం వెళ్లినప్పుడు బుట్టలో ఉన్న మామిడి పండ్లను మా అబ్బాయి మొత్తంగా తినేస్తానని తీసేసుకున్నాడు. భారత్‌లోనే ఉండిపోతానేమోనని నేరుగా మోదీకే చెప్పాడు. అంతటా భారత్‌ను మా అబ్బాయి ఇష్టపడుతున్నాడు. ప్రపంచంలోని ఎన్నో ప్రదేశాలను చూసే అవకాశమున్నా మా పిల్లలకు భారత పర్యటన ఎంతో ప్రత్యేకంగా నిలిచిపోయింది. ఆలయాలను సందర్శించినప్పుడు అక్కడి శిల్పకళా నైపుణ్యంచేసి మా పెద్దబ్బాయి ఇవాన్ అలాగే నిల్చుండిపోయాడు. ఆటో రిక్షాలో ప్రయాణించడాన్ని మా అమ్మాయి మిరాబెల్ ఎంతగానో ఇష్టపడింది. భారత్‌లో ఉన్నంతసేపూ సీక్రెట్ సర్వీస్ సిబ్బంది సైతం ఎంతో సాయపడ్డారు''అని ఉషా చెప్పారు.

ఇరుదేశాల సంబంధాలు నాకెంతో ప్రత్యేకం

''భారత్, అమెరికా సత్సంబంధాలు నాకెంతో ప్రత్యేకం. ద్వైపాక్షిక సంబంధాలు మరింతగా పెనువేసుకునేందుకు



జేడీ వాన్స్ కుటుంబంతో ప్రధాని మోదీ(ఫైల్)

ఇదొక సువర్ణావకాశంగా భావిస్తా. వ్యక్తిగతంగా చూసినా రెండు దేశాలూ నాకెంతో ముఖ్యం. రెండు దేశాల్లోనూ నాకు కుటుంబసభ్యులు, ఆత్మీయులు, స్నేహితులు ఉన్నారు. భారత్ పర్యటనలో ఎంతో నేర్చుకున్నా''అని ఉషా అన్నారు. యూఎస్ఐఎస్‌పీఎఫ్ అనేది ఇరుదేశాల సంబంధాల బలోపేతానికి కృషిచేసే లాభాపేక్షలేని సంస్థ.

పొగాకుతో అనర్థాలపై స్కూళ్లలో స్పెషల్ డ్రైవ్

సాక్షి, న్యూఢిల్లీ: పొగాకు వినియోగం, ధూమపానం, డ్రగ్స్‌కు బానిసలుగా మారిన విద్యార్థులు చిన్న వయస్సులోనే ఎన్నో ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారని కేంద్ర విద్యాశాఖ పేర్కొంది. వీటిపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు జాతీయ స్థాయిలో స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు మంగళవారం తెలిపింది. పొగాకు, మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై ఆన్‌లైన్ వేదికగా తెలుగు సహా 12 భాషల్లో httpr://quiz.mygov.in/quiz/wordnootbaccodayawarenerrquiz/ ద్వారా క్విజ్ నిర్వహిస్తామంది. పాల్గొన్న వారికి 'మైజీఓవీ'నుంచి డిజిటల్ సర్టిఫికెట్ అందిస్తామని పేర్కొంది. క్విజ్‌లో ఉపాధ్యాయులు సైతం పాల్గొనవచ్చు. అవగాహన కార్యక్రమాల్లో భాగంగా 'పాఠశాల ప్రవేశ ద్వారం వద్ద 'పొగాకు రహిత విద్యా సంస్థ'అనే బోర్డులు ఏర్పాటు చేస్తారు. పొగాకు వినియోగం, ధూమపానంతో కలిగే అనర్థాలపై ప్రదర్శనలను ఏర్పాటు చేస్తారు. పాఠశాలలకు వంద గజాల దూరంలో పసుపు గీతను ఏర్పాటు చేసి 'పొగాకు రహిత జోన్'గా ప్రకటిస్తారు. ఆ 100 గజాల జోన్ పరిధిలో 'పొగాకు ఉత్పత్తులను విక్రయించరాదు'అనే బోర్డులు ఏర్పాటు చేయాలని రాష్ట్రాలను కోరినట్లు కేంద్ర విద్యాశాఖ పేర్కొంది.

6న చినాబ్ రైలు వంతెన ప్రారంభం

జాతికి అంకితం చేయనున్న ప్రధాని మోదీ

జమ్మూ: ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన రైల్వే వంతెన 'చినాబ్ రైలు బ్రిడ్జి'ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 6వ తేదీన ప్రారంభించబోతున్నారు. ఆ వంతెనను ఆయన జాతికి అంకితం చేస్తారు. జమ్మూకశ్మీర్‌లో 272 కిలోమీటర్ల పొడవైన ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైల్వే లింక్(యూఎస్‌బీఆర్ఎల్) ప్రాజెక్టులో భాగంగా చినాబ్ రైలు వంతెన నిర్మించారు. నూతన భారతదేశపు బలం, దార్శనికతకు ఈ వంతెన ఒక గుర్తు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మంగళవారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత ప్రధాన మోదీ తొలిసారిగా జమ్మూకశ్మీర్‌లో పర్యటించబోతున్నారు. 'చినాబ్ రైలు బ్రిడ్జి'ని ప్రారంభించడంతోపాటు పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. వంతెన ప్రారంభం అనంతరం ఆయన రైలులో కాట్రా వరకు ప్రయాణిస్తారు. అంజిఖాద్ తీగల వంతెనను పరిశీలిస్తారు. రైల్వే ఇంజనీర్లు, రిటైర్డ్ ఉద్యోగులతో సమావేశమవుతారు. కాట్రా నుంచి ఉత్తర కాశ్మీర్‌లోని బారాముల్లా వరకు నడిచే వందేభారత్ రైలును ప్రారంభిస్తారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

'ఘర్ ఘర్ సిందూర్'పై మాన్ విసుర్లు

లూథియానా: ఆపరేషన్ సిందూర్‌ను బీజేపీ రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటోందని పంజాబ్ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నేత భగవంత్ మాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకోసం 'ఘర్ ఘర్ సిందూర్ అభియాన్' కార్యక్రమం ప్రారంభిస్తోందని విమర్శించారు. పవిత్రమైన భారతీయ సంప్రదాయాలను ఓట్ల కోసం ఉపయోగించుకోవడం దారుణమని మండిపడ్డారు. సిందూర్ పేరుతో ఓట్లు అడగడం ఏమిటని ప్రశ్నించారు. అంతిమంగా సిందూర్‌ను ఎగతాళి చేస్తున్నారని ఆక్షేపించారు. మంగళవారం లూథియానా వెస్ట్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారంలో భగవంత్ మాన్ మాట్లాడారు. ఇంటింటికీ సిందూరం పంచే కార్యక్రమాన్ని బీజేపీ ప్రారంభించబోతోందని అన్నారు. ''ప్రతి ఇంటికీ సిందూరం అందజేస్తామని బీజేపీ నాయకులు చెబుతున్నారు. అంటే మోదీ పేరుతో ఆ సిందూరాన్ని మహిళలు ధరించాలా? ఒకే దేశం.. ఒకే భర్త అనేది బీజేపీ కొత్త పథకమా? అని భగవంత్ మాన్ నిలదీశారు. మరోవైపు ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత, ఎంపీ సంజయ్ సింగ్ సైతం ఇదే తరహా ఆరోపణలు చేశారు.

గూఢచర్యం ఆరోపణలపై మరో ఇద్దరు అరెస్ట్

జైపూర్/చండీగఢ్: దేశ రక్షణకు, ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పాకిస్తాన్‌కు చేరవేస్తున్న ఆరోపణలపై అధికారులు మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. వీరిలో ఒకరు రాజస్తాన్ ప్రభుత్వ ఉద్యోగి షకూర్ ఖాన్ కాగా, మరొకరు పంజాబ్‌కు చెందిన గగన్‌దీప్ సింగ్ అనే వ్యక్తి. జైసల్మీర్ ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి(ఏఏవో)గా ఉన్న షకూర్ ఖాన్ కొంతకాలంగా పాకిస్తాన్ హై కమిషన్ కార్యాలయంలో పనిచేసే అహ్సన్ ఉర్ రహ్మాన్ అలియాస్ డానిష్, సొహైల్ కమర్‌లతో టచ్‌లో ఉంటున్నాడు. షకూర్ పలుమార్లు డానిష్ సాయంతో పాకిస్తాన్ వెళ్లి వచ్చాడు. పాక్‌లో ఇతడు నిఘా విభాగం ఐఎస్ఐ ఏజెంట్లను కలిశాడు. భారత్‌కు సంబంధించిన సున్నిత సమాచారాన్ని వాట్సాప్ ద్వారా పాక్‌లోని ఏజెంట్లకు పంపించాడు. విచారణలో షకూర్ వీటన్నిటినీ అంగీకరించాడని సీఐడీ ఐజీ విష్ణుకాంత్ గుప్తా వివరించారు. షకూర్‌పై అధికార రహస్యాల చట్టం-1923 ప్రకారం కేసు నమోదు చేశామన్నారు. కాగా, షకూర్ కాంగ్రెస్‌కు చెందిన రాష్ట్ర మాజీ మంత్రి షలె మహ్మద్‌కు వ్యక్తిగత కార్యదర్శిగా పని చేశాడంటూ వచ్చిన వార్తలపై స్పందించేందుకు ఆయన నిరాకరించారు. మరో ఘటన..పంజాబ్‌లోని తరన్‌తరన్ జిల్లా మొహల్లా రొదుపూర్‌కు చెందిన గగన్‌దీప్ సింగ్ అలియాస్ గగన్ పాకిస్తాన్ కేంద్రంగా పనిచేసే ఖలిస్తానీ గోపాల్ సింగ్ చావ్లాతో ఐదేళ్లుగా సంబంధాలు కొనసాగిస్తున్నాడు. ఇతడి ద్వారా గగన్‌కు పాకిస్తాన్ ఐఎస్ఐ ఏజెంట్లతో సంప్రదింపులు జరిపేవాడు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఆర్మీ కదలికలు, వ్యూహాత్మక ప్రాంతాల సమాచారాన్ని పాక్ అధికారులకు అందజేశాడు. ప్రతిఫలంగా ఇతడికి డబ్బు కూడా అందింది. గగన్‌దీప్ ఫోన్‌లో 20 మంది ఐఎస్ఐ ఏజెంట్లతో సంబంధాలున్నట్లు పోలీసులకు ఆధారాలు లభ్యమయ్యాయి. కస్టడీలో ఉన్న గగన్‌దీప్ సింగ్ నుంచి మరింత సమాచారం రాబట్టే ప్రయత్నాలు చేస్తున్నామని డీజీపీ గౌరవ్ యాదవ్ చెప్పారు.

జస్టిస్ యశ్వంత్‌పై అభిశంసనకు కేంద్రం రెడీ

వచ్చే పార్లమెంట్ సెషన్‌లో తీర్మానం తెచ్చే యోచనలో కేంద్రం

న్యూఢిల్లీ: దేశ రాజధానిలోని అధికారిక భవనం ఔట్‌హౌస్‌లో సగం కాలిన స్థితిలో కరెన్సీ కట్టలు వెలుగుచూసిన ఘటనలో అప్రతిష్టను మూటగట్టుకున్న అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మను అభిశంసించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. త్వరలో జరగబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఈమేరకు ఆయనపై అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదముద్ర పడేందుకు వీలుగా అన్ని ప్రధాన రాజకీయ పక్షాల నేతల సమ్మతిని సాధించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇందులోభాగంగా అన్ని ప్రధాన రాజకీయ పార్టీల నేతలతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు త్వరలో సమావేశం కానున్నారని సంబంధిత వర్గాలు మంగళవారం వెల్లడించాయి. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఏర్పాటైన ముగ్గురు జడ్జీల విచారణ కమిటీ సైతం జస్టిస్ యశ్వంత్ వర్మకు వ్యతిరేకంగా నివేదికను రూపొందించిన నేపథ్యంలో ప్రభుత్వం అభిశంసనకు రంగం సిద్ధంచేస్తోంది. ఘటన వెలుగుచూసిన కాలంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సంజీవ్ ఖన్నా అనాడే జస్టిస్ యశ్వంత్‌ను రాజీనామాచేయాలని మౌఖికంగా కోరినా అందుకు ఆయన నిరాకరించినట్లు వార్తలొచ్చాయి. ఈ ఉదంతం తర్వాతే రాష్ట్రపతి, ప్రధానమంత్రులకు సీజేఐ హోదాలో జస్టిస్ ఖన్నా ఒక సిఫార్సు లేఖ రాశారు. జస్టిస్ యశ్వంత్‌ను అభిశంసించాల్సిందేనని ఆయన సిఫార్సుచేశారు. జూలై మూడోవారంలో మొదలయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఈ అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టే వీలుంది. లోక్‌సభలో, తర్వాత రాజ్యసభలో ఈ తీర్మానాన్ని తీసుకొస్తారు. ఎంపీల్లో మూడింట రెండొంతుల మధ్య అనుకూలంగా ఓటేస్తేనే తీర్మానానికి ఆమోదముద్రపడుతుంది. రాజ్యసభలో కనీసం 50 మంది, లోక్‌సభలో కనీసం 100 మంది సభ్యులు తమ సమ్మతి తెలపాల్సి ఉంటుందిన తెలుస్తోంది.

మంగోలియా ప్రధానమంత్రి రాజీనామా

విశ్వాస పరీక్షలో ఓడిపోయిన ఒయున్-ఎర్డేన్

ఉలాన్‌బాటర్: మంగోలియా ప్రధానమంత్రి లువ్‌సనామ్‌స్రెయిన్ ఒయున్-ఎర్డేన్ తన పదవికి రాజీనామా చేశారు. మంగళవారం పార్లమెంట్‌లో జరిగిన విశ్వాస పరీక్షలో ఆయన ఓడిపోయారు. దాంతో పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. ఒయున్-ఎర్డేన్ కుటుంబం అత్యంత విలాసవంతమైన జీవితం గడుపుతోందని, వారికి అంత డబ్బు ఎక్కడి వచ్చిందో చెప్పాలంటూ ప్రజలు గత రెండు వారాలుగా ఆందోళన నిర్వహిస్తున్నారు. మరోవైపు అవినీతి నిరోధక శాఖ కూడా దర్యాప్తు ప్రారంభించింది.



సనా యూసఫ్

పాక్‌లో టీనేజీ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ కాల్చివేత

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో టీనేజీ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ సనా యూసఫ్(17) హత్యకు గురైంది. సనాకు టిక్‌టాక్‌లో 7.40 లక్షల మంది, ఇన్‌స్టాలో 5 లక్షల మంది ఫాలోయెర్లున్నారు. ఇస్లామాబాద్‌లో సుంబల్ ప్రాంతంలో కుటుంబంతో కలిసి ఉంటోంది. ఈమె తండ్రి ప్రభుత్వ అధికారి కాగా, తల్లి గృహిణి. ఈమె 15 ఏళ్ల సోదరుడు ఖైబర్ ప్రావిన్స్‌లోని సొంతూరు చిత్రాల్‌కు వెళ్లాడు. మంగళవారం నివాసంలో ఉండగా ఈమె వద్దకు ఉమర్ హయత్ అలియాస్ కాకా వచ్చాడు. కొద్దిసేపు మాట్లాడాక తన వెంట తెచ్చుకున్న రివాల్వర్‌తో ఆమెపైకి రెండుసార్లు కాల్పులు జరిపి, పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన సనా అక్కడికక్కడే చనిపోయింది. ఆ సమయంలో సనా బంధువు ఒక్కరే ఇంట్లో ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు దుండగుడి కోసం గాలింపు జరిపి, ఫైసలాబాద్‌లో ఉండగా పట్టుకున్నారు. ఈ నేరానికి పాల్పడినట్లు ఒప్పుకున్నాడని పోలీసులు చెప్పారు. హయత్ కూడా టిక్‌టాకరేనని తెలిపారు. ఇతడి నుంచి రివాల్వర్, ఐఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కాగా, పాకిస్తాన్‌లో హత్యకు గురైన మూడో మహిళా ఇన్‌ఫ్లుయెన్సర్ సనా. పంజాబ్‌లో మహిళా టిక్‌టాకర్‌ను ఇటీవలే ఆమె బంధువొకరు చంపేశారు. ఫిబ్రవరిలో పెషావర్‌లో మరో మహిళా టిక్‌టాకర్ హత్యకు గురయ్యారు.

ట్రంప్‌కు లొంగిపోయిన మోదీ

- ఫోన్ చేయగానే పాకిస్తాన్‌పై దాడులు ఆపేశారు
- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపాటు

భోపాల్: ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు లొంగిపోయారని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ట్రంప్ ఫోన్ చేయగానే పాకిస్తాన్‌పై దాడులు ఆపేశారని మండిపడ్డారు. 1971లో పాకిస్తాన్‌పై యుద్ధంలో అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ అత్యంత దృఢంగా వ్యవహరించారని, అమెరికా ఒత్తిళ్లకు ఎంతమాత్రం లొంగలేదని గుర్తుచేశారు. మంగళవారం మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో రాహుల్ గాంధీ 'సంఘటన్ సృజన్ అభియాన్' ప్రారంభించారు. రాష్ట్రంలో 2028 అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీని బలోపేతం చేయడానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో రాహుల్ ప్రసంగించారు. ట్రంప్ నుంచి ఫోన్ రాగానే మోదీ లొంగిపోయి అస్త్రసన్యాసం చేశారని, చరిత్రనే ఇందుకు సాక్షి అని పేర్కొన్నారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్‌ల అసలు వ్యక్తిత్వం ఇదేనని, ఎల్లప్పుడూ ఇతరుల ముందు తల వంచడం వారికి అలవాటేనని ధ్వజమెత్తారు. 1971లో అమెరికా హెచ్చరికలను కూడా లెక్కచేయకుండా భారత ప్రభుత్వం



పాకిస్తాన్‌ను రెండు ముక్కలు చేసిందన్నారు. సూపర్ పవర్స్‌తో కాంగ్రెస్ వీరోచితంగా పోరాడింది తప్ప ఎనాడూ తల వంచలేదని తేల్చిచెప్పారు. 1971 యుద్ధ సమయంలో ఎలాంటి ఫోన్‌కాల్ రాలేదన్నారు. అమెరికా ప్రభుత్వం పాకిస్తాన్‌కు మద్దతుగా యుద్ధ నౌకలు, విమానాలు, ఆయుధాలు పంపించినప్పటికీ ఇందిరా గాంధీ వెనక్కి తగ్గలేదని, ఏం చేయాలని అనుకున్నారో అదే చేసి చూపించారని వెల్లడించారు.

భావప్రకటనా స్వేచ్ఛ అంటే మనోభావాలు కించపర్చడం కాదు

- కలకత్తా హైకోర్టు స్పష్టీకరణ
- శర్మిష్ట పనోలీ మధ్యంతర బెయిల్‌పై 5న విచారణ

కోల్‌కతా: న్యాయ విద్యార్థిని, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ శర్మిష్ట పనోలీ మధ్యంతర బెయిల్‌పై కలకత్తా హైకోర్టు తన నిర్ణయాన్ని ఈ నెల 5వ తేదీకి వాయిదా వేసింది. ఆమె అరెస్టుకు సంబంధించిన కేసు డైరీని సమర్పించాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. తనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ శర్మిష్ట దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ పార్థసారథి ముఖర్జీ నేతృత్వంలోని హైకోర్టు ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ఆమెపై నమోదైన ఎఫ్ఐఆర్‌లపై తాము తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకూ ఎలాంటి చర్యలు తీసుకోవద్దని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. శర్మిష్టపై కొత్తగా ఎలాంటి కేసు నమోదు చేయకుండా చూడాలని బెంగాల్ ప్రభుత్వానికి తేల్చిచెప్పింది. భావప్రకటనా స్వేచ్ఛ అంటే ఇతరుల మనోభావాలను కించపర్చడం కాదని జస్టిస్ ముఖర్జీ స్పష్టం చేశారు.

ఆస్ట్రేలియాలో జార్జ్ ఫ్లాయిడ్ తరహా ఘటన

- భారతీయుడిని నేలకేసి మోకాలితో అదిమిపట్టిన పోలీసు
- మెడ నరాలు, మెదడు దెబ్బతిని కోమాలోకి వెళ్లిన బాధితుడు గౌరవ్
- చావు బతుకుల్లో కొట్టుమిట్టాడుతున్నాడంటూ కన్నీరుమున్నీరైన భార్య

మెల్‌బోర్న్: సరిగ్గా ఐదు సంవత్సరాల క్రితం అమెరికాలో అమాయక నల్లజాతీయుడిని శ్వేతజాతి పోలీసు అదుపులోకి తీసుకునే వేళ నేలకేసి అదిమి పట్టి ప్రాణాలు తీసిన తరహా ఘటన ఆస్ట్రేలియాలో చోటుచేసుకుంది. భార్యతో వాగ్వాదానికి దిగిన 42 ఏళ్ల భారతీయుడు గౌరవ్ కుందీని ఆస్ట్రేలియా పోలీసు నేలకు అదిమి పట్టి మెడ నరాలు దారుణంగా దెబ్బతినేలా చేశాడు. దీంతో మెదడు సైతం దెబ్బతిని ఇప్పుడు అతను కోమాలోకి వెళ్లాడు. ప్రస్తుతం ఇతను రాయల్ అడిలైడ్ ఆస్పత్రి ఐసీయూలో అత్యయికవైద్య ఉపకరణాల సాయంతో జీవనపోరాటం చేస్తున్నాడు. అడిలైడ్ నగరంలోని రాయిస్టన్ పార్క్ వద్ద గత వారం ఈ దారుణోదంతం జరిగింది. ఆయనను హింసించొద్దు అని పోలీసులను భార్య వేడుకుంటున్న వీడియో తాజాగా బహిర్గతం కావడంతో ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

బతిమాలినా వినిపించుకోలేదు

భార్య అమృత్‌పాల్ కౌర్ తెలిపిన వివరాల ప్రకారం.. ''మా కుటుంబం ఇక్కడే ఉంటోంది. మాకు ఇద్దరు పిల్లలు. కాస్తంత తాగిన మా ఆయన పెనెహామ్ రోడ్‌లో నడిచి వెళ్తున్నాడు. నేను ఆయనతో చిన్న వాగ్వాదానికి దిగడం, ఆయన నన్ను దూరంగా నెట్టేయడం బహుశా పెట్రోలింగ్ పోలీసులు చూసి ఉంటారు. వెంటనే ఒక పోలీసు అధికారి మా దగ్గరకొచ్చి నా భర్త తలను పోలీస్ కారుకేసి కొట్టారు. తర్వాత కిందపడేసి తలను నేలకేసి అధికారి అదిమి పట్టాడు. ఆమెను హింసించట్లేదని మా ఆయన మొత్తుకుంటున్నా అధికారి వినిపించుకోలేదు. మేం కేవలం గట్టిగా మాట్లాడుకుంటున్నామని, ఆయన నన్నేం హింసించట్లేదని నేను అరుస్తున్నా అధికారి అస్సలు వినిపించుకోలేదు. వదిలేయండని బతిమాలా. అదిమిపట్టడంతో ఊపిరాడక ఆయన స్పృహ కోల్పోయారు. అరెస్టేచేసి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లకుండా వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలని బతిమాలా. రాయల్ అడిలైడ్ ఆస్పత్రి ఐసీయూలో చేర్పించాం. నొక్కిపెట్టడంతో మెడ, మెదడు నరాలు బాగా దెబ్బతిన్నాయి. కోమాలోకి వెళ్లిన ఆయన మళ్లీ స్పృహలోకి రావడం కష్టమని వైద్యులు చెబుతున్నారు''అని భార్య కౌర్ కన్నీటిపర్యంతమయ్యారు. కోమాలోకి వెళ్లేంతగా అదిమి పట్టిన ఉదంతంపై ఆస్ట్రేలియా పోలీస్ విభాగం స్పందించింది. ''తాగి అరుస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకోబోతుంటే అతను తీవ్రస్థాయిలో ప్రతిఘటించాడు. ఆ క్రమంలో ఈ దుర్ఘటన జరిగింది. పోలీసు శిక్షణలో ఇచ్చిన తర్ఫీదు మేరకే ఆ అధికారి ప్రవర్తించారు. అయినాసరే ఈ ఉదంతంలో ఉన్నతస్థాయి విచారణకు ఆదేశిస్తున్నా''అని సౌత్ ఆస్ట్రేలియన్ పోలీస్ కమిషనర్ గ్రాంట్ స్టీవెన్స్ చెప్పారు.

అస్సాంలో వరదలు.. 17కు చేరిన మరణాలు

గువాహటి: అస్సాంలో వరద పరిస్థితి మరింత విషమించింది. మంగళవారం మరో ఆరుగురు చనిపోయారని ప్రభుత్వం తెలిపింది. దీంతో, ఇప్పటి వరకు చనిపోయిన వారి సంఖ్య 17కు పెరిగిందని పేర్కొంది. రాష్ట్రంలోని 21 జిల్లాల పరిధిలోని 6.33 లక్షల మంది ప్రజలపై వర్షాలు, వరదల ప్రభావం పడిందని వివరించింది. 14 వేలకు పైగా హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. హైలకండి జిల్లాలో కటఖల్ నదికి మునుపెన్నడూ లేనంతటి స్థాయిలో వరద చేరుకుంది. బ్రహ్మపుత్ర సహా మొత్తం ఏడు నదులు ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. ఇలా ఉండగా, బిహార్‌లోని సివాన్ జిల్లాలో మంగళవారం భారీ వర్షాలు, వడగండ్ల వానలకు సంబంధించిన ఘటనల్లో ఏడుగురు చనిపోయారు. పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. వందలాదిగా చెట్లు నేలకూలాయి. ఏప్రిల్‌లో పిడుగులు, వడగండ్ల వాన కారణంగా బిహార్‌లో 90 మందికి పైగా చనిపోవడం తెల్సిందే.

4 వేలు దాటిన కోవిడ్ యాక్టివ్ కేసులు

న్యూఢిల్లీ: దేశంలో కోవిడ్-19 యాక్టివ్ కేసుల సంఖ్య 4 వేల మార్కును దాటేసింది. దేశం మొత్తమ్మీద కేరళలోనే అత్యధిక బాధితులుండగా, తర్వాతి స్థానాల్లో మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ ఉన్నాయి. కోవిడ్‌తో మరో ఐదుగురు చనిపోయారు. మంగళవారం కేంద్ర ఆరోగ్య శాఖ ఈ గణాంకాలతో ఒక ప్రకటన విడుదల చేసింది. గడిచిన 24 గంటల్లో దేశంలో కోవిడ్ యాక్టివ్ కేసుల సంఖ్య 4,026కు చేరుకుంది. తాజాగా చనిపోయిన ఐదుగురితో కలిపితే జనవరి నుంచి ఇప్పటి వరకు 37 మంది చనిపోయారు. మే 22వ తేదీన దేశంలో కోవిడ్ యాక్టివ్ కేసులు 257 కాగా, మే 31వ తేదీకల్లా ఇవి 3,395కు పెరిగిపోయాయి. ఇప్పుడు 4,026కు చేరాయి. అత్యధికంగా కేరళలో 1,446 యాక్టివ్ కేసులున్నాయి.

పాకిస్తాన్ జైలు నుంచి 216 మంది ఖైదీలు పరార్

కరాచీ: పాకిస్తాన్‌లోని కరాచీలో మాలిర్ జైలు నుంచి 216 మంది ఖైదీలు తప్పించుకున్నారు. వీరిలో 80 మందిని తిరిగి అదుపులోకి తీసుకున్నట్లు స్థానిక మీడియా మంగళవారం వెల్లడించింది. కరాచీ ప్రాంతంలో భూకంపం సంభవించడంతో అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. సోమవారం రాత్రి మాలిర్ జైలు నుంచి ఖైదీలను సురక్షిత ప్రాంతానికి తరలిస్తుండగా తీవ్ర గందరగోళం చోటుచేసుకుంది. ఖైదీలు పారిపోయేందుకు ప్రయత్నించగా భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఒక ఖైదీ మరణించాడు. ముగ్గురు భద్రతా సిబ్బందితోపాట జైలు అధికారి ఒకరు గాయపడ్డారు. భూకంపం తర్వాత జైలు బ్యారక్‌ల నుంచి 600 మందికిపైగా ఖైదీలను బయటకు తీసుకురాగా, 216 మంది పరారయ్యారు. 80 మందిని మళ్లీ అదుపులోకి తీసుకోగలిగారు. పరారీలో ఉన్న మిగతా ఖైదీల కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. ఇంకా 136 మందిని పట్టుకోవాల్సి ఉందని అధికారులు చెప్పారు. అత్యంత పటిష్టమైన భద్రత కలిగిన మాలిర్ జైలులో మొత్తం 6,000 మంది ఖైదీలు ఉన్నారు.

సోమనాథ్ దేవాలయాన్ని పునర్నిర్మించినవారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

మధ్యయుగ భారతదేశ చరిత్ర (8వ శతాబ్దం - 18వ శతాబ్దం)

సోలంకీలు: అనిల్‌వారా రాజధానిగా గుజరాత్, కథియవార్ ప్రాంతాలను దాదాపు నాలుగు శతాబ్దాల పాటు సోలంకీలు పాలించారు. వీరిని అనిల్‌వారా చాళుక్యులు అని కూడా అంటారు.

మూలరాజు: అనిల్‌వారా కేంద్రంగా సోలంకీ రాజ్యాన్ని స్థాపించిన రాజు మూలరాజు. రాజధానిలో రెండు శైవాలయాలను నిర్మించాడు.

మొదటి భీమ : ఇతడి పాలనా కాలంలో గజనీ మహ్మద్ సోమనాథ్‌లోని దేవాలయాన్ని ముట్టడించాడు. భీముడు ఈ దాడిని ఎదుర్కోలేక కచ్‌కు పారిపోయాడు. ఇతడు తన కుమారుడు కర్ణ కోసం సింహాసనాన్ని త్యాగం చేశాడు.

కర్ణ : ఇతడు తన రాజ్యంలో అనేక నిర్మాణాలు చేపట్టాడు. పలు దేవాలయాలతోపాటు తన పేరుతో ఒక నగరాన్ని కూడా నిర్మించాడు. అదే నేటి అహ్మదాబాద్.

జయసింహ సిద్ధరాజు

సిద్ధరాజ అనే బిరుదుతో ఇతడు సింహాసనాన్ని అధిష్ఠించాడు. సోలంకీలందరిలో అగ్రగణ్యుడిగా పేరుగాంచాడు. అనేక యుద్ధాలు చేసి పరమారులు, చాందేలులు, చౌహాన్‌లు, కల్యాణి చాళుక్యులను ఓడించాడు. మరోవైపు భాషా సాహిత్యాలను ప్రోత్సహించాడు. ఇతడి ఆస్థానంలోని ప్రముఖ కవి హేమచంద్రుడు. జయసింహుడు సిద్ధపురలో రుద్ర మహాకాల దేవాలయాన్ని నిర్మించాడు.

కుమారపాల: హేమచంద్రుడు ఇతడి ఆస్థాన కవిగానూ కొనసాగాడు. కుమారపాల చరిత్ర, త్రిశస్తి శలక పురుష, పరిశిష్ట పర్వన్ అనే గ్రంథాలను రచించాడు. ఇతడి ప్రభావంతో కుమారపాలుడు జైనమతాన్ని పోషించడమే కాకుండా తన రాజ్యంలో జంతువధను, జూదాన్ని నిషేధించాడు.

అజయపాల: ఇతడు జైన దేవాలయాలను ధ్వంసం చేసి, జైన మత గురువు రామచంద్రను వధించాడు.

రెండో మూలరాజు: ఇతడు బాలుడు కావడంతో తల్లి నాయికీదేవి సంరక్షకురాలిగా ఉండి రాజ్య పాలనను చేపట్టింది. వీరి ఆధ్వర్యంలోనే 1178 మౌంట్ అబూ యుద్ధంలో సోలంకీ సేనలు ఘోరీ మహ్మద్‌ను ఓడించాయి.

రెండో భీమ: ఇతడి వద్ద తేజపాల, వస్తుపాల అనే సోదరులు మంత్రులుగా ఉండేవారు. రెండో భీముడి పాలనా కాలంలో క్రీ.శ. 1197లో కుతుబుద్దీన్ ఐబక్ ఇతడి రాజ్యంపై దాడి చేశాడు. ఇల్‌టుట్‌మిష్ దాడిని వస్తుపాలుడు తిప్పికొట్టాడు. భీముడి తర్వాత ఈ రాజ్యాన్ని వాఘేలా వంశస్థులు ఆక్రమించారు. చివరికి అల్లావుద్దీన్ ఖిల్జీ మొత్తం గుజరాత్‌ను ఆక్రమించాడు.



చౌహాన్‌లు: ప్రతీహారుల తరహాలో చౌహాన్‌ల్లోనూ అనేక శాఖలున్నాయి. శాకంబరిని(అజ్మీర్) కేంద్రంగా చేసుకొని పాలించిన చౌహాన్ రాజ్యం వాటన్నింటిలోకి అతి ముఖ్యమైంది. వీరు మొదట ప్రతీహారులకు సామంతులుగా ఉండి తర్వాత స్వాతంత్ర్యం ప్రకటించుకున్నారు.

వాసుదేవుడు: క్రీ.శ. 6వ శతాబ్దంలో చౌహాన్ వంశాన్ని స్థాపించిన రాజు వాసుదేవుడు.

వాక్పతి రాజు: వాసుదేవుడి అనంతరం పలువురు రాజులు పాలించిన తర్వాత వాక్పతి రాజు రాజ్యానికొచ్చాడు. ఇతడు పుష్కరలో ఒక శైవాలయాన్ని నిర్మించాడు. దీన్ని విమర్శకులు శివుడి కైలాసంతో పోల్చారు.

సింహరాజు: చౌహాన్ వంశంలోని తొలి స్వతంత్ర పాలకుడు సింహరాజు. ఇతడు మహారాజాధిరాజ అనే బిరుదును పొందాడు.

రెండో విగ్రహరాజు : ఇతడు చౌహాన్ రాజ్య వాస్తవ స్థాపకుడు. గుజరాత్‌పై దాడి చేసి మూలరాజును ఓడించాడు.

మొదటి పృథ్వీరాజు: రెండో విగ్రహరాజు తర్వాత పాలకుల్లో ముఖ్యమైన రాజు మొదటి పృథ్వీరాజు. పుష్కర్‌పై జరిగిన చాళుక్యుల దాడిని తిప్పికొట్టాడు. 700 మందిని అంతం చేశాడు.

రెండో అజయరాజు: శాకంబరికి గజ్నవీ రాజుల నుంచి పొంచి ఉన్న ముప్పును దృష్టిలో ఉంచుకొని ఇతడు అజయమేరు(అజ్మీర్) అనే నూతన నగరాన్ని, కోటను నిర్మించాడు. తన రాజధానిని శాకంబరి నుంచి అజ్మీర్‌కు మార్చాడు. ఇతడు తన చివరి కాలంలో రాజ్యాన్ని తన కుమారుడు అర్న రాజుకు అప్పగించి సన్యాసాన్ని స్వీకరించాడు.

నాలుగో విగ్రహరాజు: ఇతడు గొప్ప విజేత. అనేక ప్రాంతాలను జయించి తన రాజ్యంలో కలుపుకున్నాడు. తోమారులను ఓడించి వారి నుంచి ఢిల్లీని ఆక్రమించాడు. ఇతడు స్వయంగా కవి, సాహిత్య పోషకుడు. హరికేళి అనే నాటకాన్ని రచించాడు. మహాకవి సోమదేవుడు ఇతడి గురించి లలిత విగ్రహ రాజనాటకం అనే గ్రంథాన్ని రచించాడు. భోజుడు ధారలో నిర్మించిన సరస్వతి కంఠాభరణ విద్యాలయ నమూనాలో ఇతడు అజ్మీర్‌లో సంస్కృత కళాశాలను నిర్మించాడు. విశాల్‌పూర్ అనే నూతన నగరాన్ని కూడా నిర్మించాడు.

మూడో పృథ్వీరాజు :
మూడో పృథ్వీరాజుకు ముందు అపరాంగగేయ, రెండో పృథ్వీరాజు, సోమేశ్వర అనే రాజులు పాలించారు. చౌహాన్ రాజుల్లో అగ్రగణ్యుడు మూడో పృథ్వీరాజు. ఇతడు తన సమకాలీన రాజులైన గహద్వాలులు, చాందేలులు, సోలంకీలతో అనేక యుద్ధాలు చేశాడు. ఘోరీ మహ్మద్‌తో రెండు యుద్ధాలు చేశాడు. 1191లో మొదటి తరైన్ (స్థానేశ్వర్) యుద్ధంలో ఘోరీని ఓడించాడు. 1192లో జరిగిన రెండో తరైన్ యుద్ధంలో ఘోరీ మహ్మద్, పృథ్వీరాజును ఓడించి అంతమొందించాడు. అనంతరం పృథ్వీరాజు వారసులు రణతంభోర్ కేంద్రంగా కొంతకాలం పాటు పాలించారు. చివరికి అల్లావుద్దీన్ ఖిల్జీ ఈ రాజ్యాన్ని జయించి ఢిల్లీ సామ్రాజ్యంలో కలిపివేశాడు.

మాదిరి ప్రశ్నలు

1. మహ్మద్ ఘోరీని మౌంట్ అబూ యుద్ధంలో ఓడించిన రాజు?
   1) మొదటి భీమ
   2) రెండో మూలరాజ
   3) నాలుగో విగ్రహరాజు
   4) మూడో పృథ్వీరాజు
2. గుజరాత్‌పై జరిగిన ఇల్‌టుట్‌మిష్ దాడిని తిప్పికొట్టిన రాజు?
   1) రెండో భీమ 2) మొదటి భీమ
   3) మొదటి నాగభట 4) రెండో నాగభట
3. మౌంట్ అబూలోని విమల దేవాలయ నిర్మాతలు?
   1) చౌహాన్‌లు 2) సోలంకీలు
   3) పరమారులు 4) గహద్వాలులు
4. సోలంకీలు నిర్మించిన సూర్య దేవాలయం ఎక్కడ ఉంది?
   1) మార్తాండ్ 2) కోణార్క్
   3) మధుర 4) బరోడా
5. గజనీ మహ్మద్ ధ్వంసం చేసిన సోమనాథ్ దేవాలయాన్ని పునర్నిర్మించినవారు?
   1) రెండో భీమ 2) రెండో మూలరాజు
   3) విగ్రహరాజు 4) సామంతరాజు
6. అజ్మీర్ నగర నిర్మాత?
   1) నాలుగో విగ్రహరాజు
   2) మొదటి అజయరాజు
   3) రెండో అజయరాజు
   4) మూడో పృథ్వీరాజు
7. హరికేళి నాటకం అనే గ్రంథంలోని వ్యాఖ్యలు గోడలపై కలిగి ఉన్న కట్టడం?
   1) అరై దిన్‌కా జోప్రామసీద్
   2) కువ్వాతుల్ ఇస్లామ్ మసీద్
   3) అజ్మీర్‌లోని సరస్వతి మందిరం
   4) చిత్తోర్ కీర్తి స్తంభం
8. కవిబాంధవ అనే బిరుదు ఉన్న రాజు?
   1) మూడో పృథ్వీరాజు
   2) నాలుగో విగ్రహరాజు
   3) కుమార పాల
   4) జయసింహ సిద్ధరాజు
9. ముస్లిం చరిత్రకారులు రామ్‌పితూర అని ఎవరిని పిలిచారు?
   1) రాణా ప్రతాప్‌సింగ్
   2) రాణా సంగ్రామ్‌సింగ్
   3) మూడో పృథ్వీరాజు
   4) గహద్వాల జయచంద్ర
10. మూడో పృథ్వీరాజు ఆస్థానంలోని ప్రముఖ కవులు?
    1) విద్యాపతి, జనార్దన
    2) జనార్దన, విశ్వరూప
    3) విశ్వరూప, జయనాక, పద్మనాభ
    4) పై వారందరూ
11. రాణీ సంయుక్తతో మూడో పృథ్వీరాజు ప్రేమాయణం గురించి రాసిన 'పృథ్వీ రాజ రాసో'' అనే గ్రంథ రచయిత?
    1) చాంద్ బర్దాయ్
    2) మాలిక్ మహ్మద్ జయసీ
    3) జయనాక
    4) అల్ బెరూనీ
12. ఢిల్లీని నిర్మించిన తోమార్ రాజు?
    1) వజ్రపాలుడు
    2) అనంగపాలుడు
    3) వస్తుపాలుడు 4) తేజపాలుడు
13. 'నవ సాహసాంక చరితం' అనే గ్రంథాన్ని రచించిన సంస్కృత కవి?
    1) పద్మగుప్త 2) పద్మసాంభవ
    3) ధనంజయ 4) జోనరాజ
14. చౌహాన్‌ల ఆగర్భ శత్రువులు?
    1) చాందేలులు
    2) గహద్వాలులు
    3) సోలంకీలు 4) ప్రతీహారులు
15. జ్ఞానపీఠ్ అవార్డ్‌లోని వాగ్దేవి ప్రతిమతో సంబంధం ఉన్న రాజు?
    1) పరమార భోజుడు
    2) చాందేల విద్యాధరుడు
    3) చాళుక్య జయసింహుడు
    4) మూడో పృథ్వీరాజు
16. సోమనాథ్ దేవాలయాన్ని ఏ దేవుడికి అంకితమిచ్చారు?
    1) సూర్యుడు 2) గణేశుడు
    3) కార్తికేయుడు 4) శివుడు
17. శపథ లక్ష దేశమని ఎవరి రాజ్యానికి పేరు?
    1) చాందేలు 2) గహద్వాలు
    3) పరమారు 4) చౌహాన్
18. గజనీ మహ్మద్ దాడితో రాజధాని కనౌజ్‌ను వదిలి పారిపోయిన ప్రతీహార రాజు?
    1) యశ పాలుడు
    2) రాజ్య పాలుడు
    3) రెండో భోజుడు 4) విజయ పాలుడు
19. దానరూప గ్రంథాన్ని రచించిన పరమారుల ఆస్థాన కవి?
    1) హలాయుధుడు
    2) ధనిక
    3) ధనంజయ 4) పద్మగుప్త
20. కవి రాజు అనే బిరుదు ఉన్న రాజులు?
    1) హాలుడు
    2) సముద్ర గుప్తుడు
    3) భోజుడు 4) పై వారందరూ
21. పతంజలి యోగ సూత్రాలపై వ్యాఖ్యానం రాసిన రాజు?
    1) ముంజ 2) భోజ
    3) మొదటి భీమ 4) కర్ణ
22. ఏ రాజు పాలనా కాలంలో గజనీ మహ్మద్ సోమనాథ్ దేవాలయంపై దాడి చేశాడు?
    1) మొదటి భీమ
    2) మొదటి నాగభటుడు
    3) మొదటి భోజ
    4) జయసింహ సిద్ధరాజ
23. సిద్ధ హేమచంద్ర అనే ప్రముఖ వ్యాకరణ గ్రంథ రచయిత?
    1) సోమదేవుడు 2) హేమచంద్రుడు
    3) మహావీరాచార్యుడు
    4) శ్రీహర్షుడు
24. తన రాజ్యంలో జంతువధను నిషేధించిన జైన రాజు?
    1) జయసింహ సిద్ధరాజ
    2) అమోఘవర్ష
    3) కుమారపాల
    4) వాక్పతి ముంజ
25. కలికాల సర్వజ్ఞ అనే బిరుదు కలిగిన జైనకవి?
    1) సోమదేవసూరి 2) హరి విజయసూరి
    3) కాలకాచార్యుడు
    4) హేమ చంద్రుడు

సమాధానాలు

1) 2; 2) 1; 3) 2; 4) 3;
5) 1; 6) 3; 7) 1; 8) 2;
9) 3; 10) 4; 11) 1; 12) 2;
13) 1; 14) 2; 15) 1; 16) 4;
17) 4; 18) 2; 19) 3; 20) 4;
21) 2; 22) 1; 23) 2; 24) 3;
25) 4.

భారత సమాఖ్య నిర్మాణం-పని విధానం

ప్రపంచ రాజకీయ వ్యవస్థల్లో భిన్నమైంది భారత రాజకీయ వ్యవస్థ. దీని నిర్మాణంలో కేంద్ర -రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాల పంపిణీ, సంబంధాలు, పని చేసే విధానం వివరణ, విశ్లేషణ ప్రాధాన్యత కలిగిన అంశం. 1950లో రాజ్యాంగం అమల్లోకి వచ్చింది మొదలు ఇటీవల దేశంలో ప్రవేశపెట్టిన మలిదశ ఆర్థిక సంస్కరణల వరకు కేంద్ర -రాష్ట్ర సంబంధాల్లో వచ్చిన మార్పులు, రావాల్సిన మార్పుల వివరణ మన సమాఖ్య విశ్లేషణ.



టెట్/డీఎస్సీ - ప్రత్యేకం

పాలిటీ

ఏ దేశ రాజ్యాంగమైనా ఆనాటి పరిస్థితులను ప్రతిబింబిస్తుంది అని మన మొదటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ పేర్కొన్నారు. ఆయన మాటలు వాస్తవీకరణ పొందాలంటే.. మారుతున్న దేశ కాలమాన పరిస్థితులకు, సామాజిక, ఆర్థిక, రాజకీయ అవసరాలకు అనుగుణంగా రాజ్యాంగంలో కూడా మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. 50 ఏళ్ల రాజ్యాంగ పనితీరును అధ్యయనం చేసేందుకు నాటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ జస్టిస్ ఎం.ఎన్. వెంకటాచలయ్య నేతృత్వంలో రాజ్యాంగ పునఃసమీక్ష కమిషన్ ఏర్పాటు చేశారు. ఈ కమిషన్ రెండేళ్ల తర్వాత 2002లో నివేదిక సమర్పించింది. ఈ కమిషన్ రాజ్యాంగం పని విధానాన్ని మొత్తం అధ్యయనం చేసే సందర్భంలో కేంద్ర-రాష్ట్ర సంబంధాల తీరును విశ్లేషించడమే కాకుండా పలు సూచనలు చేసింది. 2007లో మన్మోహన్‌సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మదన్‌మోహన్ పూంఛీ కమిషన్ కేంద్ర-రాష్ట్ర సంబంధాలను అధ్యయనం చేసి 2010 మార్చిలో నివేదిక సమర్పించింది. వీరప్ప మొయిలీ నేతృత్వంలోని రెండో పరిపాలనా సంస్కరణల కమిషన్ కూడా కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై ప్రత్యేక నివేదికను రూపొందించింది.

భారతదేశం - అర్ధ సమాఖ్య

భారతదేశ ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా రాజ్యాంగ నిర్మాతలు.. మన రాజ్యాంగాన్ని ఏకకేంద్ర, సమాఖ్య లక్షణాల కలయికగా రూపొందించారు. 1935 భారత ప్రభుత్వ చట్టాన్ని అనుసరించి సమాఖ్య విధానాన్ని ఆమోదిస్తూనే దేశ విభజన కాలంనాటి పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటూ బలమైన కేంద్రానికి అవకాశం కల్పించే ఏకకేంద్ర లక్షణాలకు రాజ్యాంగంలో చోటు కల్పించారు. స్వాతంత్ర్యోద్యమంలో ప్రధాన భూమిక పోషించిన కాంగ్రెస్ పార్టీ.. రాజ్యాంగ రచనలో కూడా కీలక పాత్రను నిర్వహించింది. స్వాతంత్ర్యానికి పూర్వం కేంద్రీకరణ ధోరణిని సమర్థించిన కాంగ్రెస్ ఆలోచనా విధానం రాజ్యాంగంలోనూ ప్రతిబింబిస్తుంది. భిన్నత్వానికి నిలయమైన మనదేశంలో ఏకత్వాన్ని సాధించాలంటే కేంద్రంలో బలమైన ప్రభుత్వం ఉండటమే ఏకైక పరిష్కార మార్గంగా కాంగ్రెస్ విశ్వసించి.. బలమైన కేంద్రీకృత ధోరణిని అనుసరించింది. అందుకే కె.సి.వేర్ మన రాజ్యాంగాన్ని విశ్లేషిస్తూ 'భారతదేశం బలమైన ఏకకేంద్ర లక్షణాల బలహీనమైన సమాఖ్యయే గానీ బలమైన సమాఖ్య లక్షణాలు గల బలహీనమైన ఏకకేంద్రం కాదు' అని వ్యాఖ్యానించారు. అంటే 'భారతదేశం ఒక అర్ధ సమాఖ్య వంటిది' అని పేర్కొన్నారు.

భారతదేశం - సహకార సమాఖ్య

గ్రాన్‌విలే ఆస్టిన్, డి.ఎన్. బెనర్జీలు మన దేశాన్ని ఒక సహకార సమాఖ్యగా వర్ణించారు. అధికరణ 252 ప్రకారం రెండు అంతకంటే ఎక్కువ రాష్ట్రాలు కోరినప్పుడు.. రాష్ట్ర జాబితాలోని అంశంపై కేంద్రం శాసనం చేయడం, అధికరణ 258 ప్రకారం కేంద్రం .. రాష్ట్రాలను సంప్రదించి కొన్ని నిర్మాణపరమైన బాధ్యతలను అప్పగిస్తే రాష్ట్రాలు వాటిని నిర్వర్తించడం, కేంద్రానికి-రాష్ట్రాలకు, రాష్ట్రాలు-రాష్ట్రాల మధ్య సమన్వయాన్ని పెంపొందించే ఉద్దేశంతో అధికరణ 263 ప్రకారం అంతర్ రాష్ట్ర కౌన్సిల్ ఏర్పాటుకు అవకాశం కల్పించారు. అధికరణ 285 ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఆస్తులపై రాష్ట్రాలు పన్నులు విధించకుండా, అధికరణ 289 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులపై కేంద్రం పన్నులు విధించకుండా రాజ్యాంగ పరంగా చేసిన ఏర్పాట్లు మనదేశాన్ని ఒక సహకార సమాఖ్యగా వర్ణించడానికి కారణమయ్యాయి.

బలమైన కేంద్రీకృత ధోరణి

సర్ ఐవర్ జెన్నింగ్స్ వంటి వారు మనదేశాన్ని ఒక బలమైన కేంద్రీకృత ధోరణి గల సమాఖ్యగా వర్ణించారు. అధికరణ 249 ప్రకారం రాజ్యసభ ప్రత్యేక తీర్మానం చేస్తే, రాష్ట్ర జాబితాలోని ఏదైనా అంశానికి జాతీయ ప్రాముఖ్యత ఉందని భావిస్తే ఆ అంశంపై శాసనం చేసే అధికారం కేంద్రానికి ఉంది. జాతీయ అత్యవసర పరిస్థితిలో అధికరణ 250 ప్రకారం కేంద్రం.. రాష్ట్ర జాబితాలోని ఏ అంశంపైనైనా శాసనం చేయవచ్చు. 365 అధికరణను అనుసరించి కేంద్రం జారీ చేసిన ఆదేశాన్ని సదరు రాష్ట్రం తప్పనిసరిగా పాటించాలి. లేకుంటే ఆ రాష్ట్రంపై చర్య తీసుకునే అధికారం కేంద్రానికి ఉంది. అధికరణ 356 ద్వారా విధించే రాష్ట్రపతి పాలన కేంద్ర ప్రభుత్వం వద్ద ఉండే వజ్రాయుధం వంటిది. అందుకే 356 అధికరణను డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర ప్రభుత్వాల పాలిట చావు ఉత్తర్వు వంటిదని పేర్కొన్నారు.

వాస్తవికమైన సమాఖ్య

ప్రముఖ అమెరికన్ పాలనా శాస్త్రవేత్త పాల్ ఆసిల్‌బీ, అలెగ్జాండ్రి విజ్ వంటి వారు మన సమాఖ్యను వాస్తవికమైన సమాఖ్యగానే పేర్కొన్నారు. గ్రాన్‌విలే ఆస్టిన్ మరొక సందర్భంలో భారత సమాఖ్య నిర్మాణంలో రాజ్యాంగ నిర్మాతల వివేకం దాగి ఉందని వ్యాఖ్యానించారు. 7వ షెడ్యూల్‌లో పొందుపరిచిన అధికారాల పంపిణీ జాబితాలో పేర్కొన్న అంశాల ప్రాముఖ్యాన్ని అనుసరించి మాత్రమే జరిగిన అధికారాల పంపిణీగా పేర్కొంటారు. కేంద్రం, రాష్ట్రాల మధ్య ఉండే సమన్వయానికి నిదర్శనం ఉమ్మడి జాబితా.

రాజ్యాంగ - రాజ్యాంగేతర సంస్థల ప్రభావం

స్వాతంత్ర్యానంతరం మన దేశం ప్రణాళికాబద్ధమైన ఆర్థిక వ్యవస్థను అనుసరించింది. సామాజిక, ఆర్థిక ప్రణాళికలు ఉమ్మడి జాబితాలో ఉన్నాయి. 1950లో ఏర్పడిన ప్రణాళికా సంఘం.. జాతీయ ప్రణాళికలను రూపొందించడంతోపాటు ప్రాంతీయ ప్రయోజనాలను నిర్ణయించేది. కానీ ప్రణాళికా సంఘంలో రాష్ట్రాలకు ఎలాంటి ప్రాతినిధ్యం లేదు. ప్రణాళికా ముసాయిదాను ఆమోదించే జాతీయాభివృద్ధి మండలిలో రాష్ట్రాలకు ప్రాతినిధ్యం ఉన్నప్పటికీ.. అందులో కూడా కేంద్రం ప్రభుత్వానిదే ఆధిపత్యం. ప్రణాళిక లక్ష్యాలను దృష్ట్యా కేంద్ర-రాష్ట్రాల మధ్య ఆదాయ వనరులను పంపిణీ చేసే కేంద్ర ఫైనాన్స్ కమిషన్‌లో కూడా రాష్ట్రాలకు ప్రాతినిధ్యం లేదు. ఈ రెండూ కూడా మన సమాఖ్య పని తీరుపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. ఆర్థికపరమైన ఈ కేంద్రీకరణ దృష్ట్యా ప్రముఖ రాజ్యాంగ, ఆర్థిక నిపుణుడు కె. సంతానం మన దేశం సమాఖ్య విధానాన్ని అనుసరించాలని కోరుకున్నప్పటికీ, వాస్తవంలో ఏకకేంద్ర విధానాన్నే అనుసరిస్తుందని పేర్కొన్నారు. దీనికి గల ప్రధాన కారణం ఆర్థిక అంశాల కేంద్రీకరణే. నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన నీతిఆయోగ్‌లో రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ప్రాతినిధ్యం కల్పించడం కీలక అంశం.

వాస్తవిక సమాఖ్యతో మనం విభేదించే అంశాలు

ప్రపంచంలో అత్యుత్తమమైన సమాఖ్యకు పర్యాయ పదంగా నిలిచే అమెరికా సమాఖ్యతో మనదేశం పలు విషయాల్లో విభేదిస్తుందనే అంశం సుస్పష్టం. భారతదేశం ఏక పౌరసత్వాన్ని, ఒకే రాజ్యాంగం, ఏకీకృత న్యాయ వ్యవస్థను అనుసరిస్తుంది. అమెరికాలో రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించే సెనేట్‌లో అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం లభిస్తుంటే మన రాజ్యసభలో పెద్ద రాష్ట్రాలకు ఎక్కువ, చిన్న రాష్ట్రాలకు తక్కువ ప్రాతినిధ్యం కల్పించారు. అమెరికా బలమైన రాష్ట్రాలను ఏర్పాటు చేస్తే మనం బలమైన కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. మన దగ్గర అవశిష్ట అధికారాలను కేంద్రానికి కట్టబెట్టారు. వాస్తవిక సమాఖ్యకు భిన్నంగా మన రాజ్యాంగం ప్రధానంగా అదృఢమైంది. సూత్రబద్ధమైన సమాఖ్య కాకపోడంతో మన రాజ్యాంగంలో సమాఖ్య అనే పదాన్ని వినియోగించలేదు.

కేంద్ర - రాష్ట్రాల మధ్య వివాదాలు - కారణాలు

గడిచిన ఆరు దశాబ్దాలలో కేంద్ర-రాష్ట్రాల సంబంధాల తీరును పరిశీలిస్తే పలు సందర్భాల్లో వివాదాలు, సమస్యలు కనిపిస్తాయి. 1967లో నాలుగో సాధారణ ఎన్నికల అనంతరం కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటికీ.. ఎనిమిది రాష్ట్రాల్లో కాంగ్రెసేతర పార్టీలు అధికారంలోకి వచ్చాయి. అప్పుడే రాష్ట్రాలకు ఎక్కువ అధికారాలు కావాలనే డిమాండ్ ప్రారంభమైంది. ప్రధానమైన సంక్షేమ శ్రేయోవాద అంశాల సంబంధిత బాధ్యతలన్నీ రాష్ట్రాలకు అప్పగించగా ఆర్థిక వనరులన్నీ కేంద్రం వద్ద ఉండేవి. క్రమంగా రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు అధ్వాన్నంగా తయారయ్యాయి. దాంతో రాష్ట్రాలు నిరంతరం కేంద్రంపై ఆధారపడాల్సి వచ్చింది.

గవర్నర్ వ్యవస్థ కేంద్ర-రాష్ట్రాల మధ్య వివాదాలకు మరో కారణం. రాజ్యాంగం గవర్నర్లకు విచక్షణాధికారాలను కల్పించింది. అయితే గవర్నర్లు వాటిని విచక్షణ రహితంగా వినియోగించడం ప్రధాన సమస్యగా పరిణమించింది. ఏ రాజకీయ పార్టీ శాసనసభలో మెజార్టీ సాధించలేని సందర్భంలో ముఖ్యమంత్రి నియామకం గవర్నర్ విచక్షణాధికారంపైనే ఆధారపడి ఉంటుంది. 1952 తమిళనాడు గవర్నర్ ప్రకాశ్ మొదలు.. జార్ఖండ్‌లో గవర్నర్ సయ్యద్ సిబ్తరజీ.. శిబూ సోరెన్‌ను ముఖ్యమంత్రిగా నియమించడం వంటివి గవర్నర్లు తమ అధికారాలను విచక్షణ రహితంగా వినియోగించరడానికి నిదర్శనాలు. రాష్ట్ర శాసనసభలో మెజార్టీని కోల్పోయిన సందర్భంలో సదరు ప్రభుత్వానికి తమ మెజార్టీ నిరూపించుకునే అవకాశాన్ని కల్పించకుండా వాటి రద్దు చేయడం మరో సమస్య. 1984లో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీ రామారావు ప్రభుత్వానికి శాసనసభలో మెజార్టీ ఉన్నప్పటికీ.. మెజార్టీ నిరూపించుకునే అవకాశం ఇవ్వకుండానే అప్పటి గవర్నర్ ప్రభుత్వాన్ని రద్దుచేసి నాదెండ్ల భాస్కరరావును ముఖ్యమంత్రిగా నియమించారు. అదేవిధంగా ఉత్తరప్రదేశ్‌లో అప్పటి గవర్నర్ రమేష్ బండారీ బీజేపీకి చెందిన కల్యాణ్‌సింగ్ ప్రభుత్వాన్ని రద్దుచేసి జగదంబికా పాల్‌ను ముఖ్యమంత్రిగా నియమించారు (ఈ నియామకాన్ని అలహాబాద్ హైకోర్టు నిలిపివేయడంతోపాటు సుప్రీంకోర్టు కూడా తప్పుపట్టింది). కేంద్ర-రాష్ట్రాల మధ్య వివాదాలకు మరో కారణం 356 అధికరణ దుర్వినియోగం. రాజ్యాంగంలో అత్యంత వివాదాస్పద అధికరణ 356. కారణం దాన్ని వినియోగించిన తీరు వివాదాస్పదం కావడమే. 1959లో కేరళలో ఇఎంఎస్ నంబూద్రిపాద్ ప్రభుత్వాన్ని ఈ అధికరణతో రద్దు చేశారు. 1977లో కేంద్రంలో అధికారంలో ఉన్న జనతా ప్రభుత్వం 9 రాష్ట్రాల్లోని కాంగ్రెస్ ప్రభుత్వాలపై ఈ అధికరణను ప్రయోగించింది. 1980లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ఇందిరా గాంధీ ప్రభుత్వం 9 రాష్ట్రాల్లోని జనతా ప్రభుత్వాలను రద్దు చేసింది. 1989లో కర్ణాటకలో ఎస్.ఆర్. బొమ్మై ప్రభుత్వాన్ని, నాగాలాండ్‌లో ఎస్.సి. జమీర్ ప్రభుత్వాన్ని రద్దు చేయడాన్ని 1994లో సుప్రీం కోర్టు 'ఎస్.ఆర్. బొమ్మై/యూనియన్ ఆఫ్ ఇండియా' మధ్య జరిగిన వ్యాజ్యంలో అధికరణ 356 దుర్వినియోగం మన సమాఖ్య విధానానికి భంగకరం అని పేర్కొంది. అంతేకాకుండా సమాఖ్య విధానం మన రాజ్యాంగ మౌలిక స్వరూపంలో అంతర్భాగమని కూడా వ్యాఖ్యానించింది.

రాజ్యాంగ - రాజ్యాంగేతర సంస్థల పని విధానానికి సంబంధించి ముఖ్యంగా ప్రణాళికా సంఘం, కేంద్ర ఫైనాన్స్ కమిషన్‌ల ఏకఛత్రాధిపత్యాన్ని రాష్ట్రాలు తమ ప్రయోజనాలకు పెద్ద ఆటంకంగా భావిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో కేంద్రం రాష్ట్రాలపై ఆధిపత్యాన్ని కొనసాగించడం లేదా తరచుగా జోక్యం చేసుకోవడం కూడా మరో సమస్య. 1967లో దుర్గాపూర్ ఇనుము ఉక్కు కర్మాగారంలో కార్మికుల సమ్మె సందర్భంగా కనీసం ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించకుండానే కేంద్రం సాయుధ బలగాలను మోహరించింది. దీంతో అప్పటి ఆ రాష్ట్ర హోంశాఖ మంత్రి జ్యోతిబసు రాజీనామా చేస్తాననడం గమనించదగిన అంశం.

కేంద్ర-రాష్ట్రాల వివాదాలు-పరిష్కార మార్గాలు

1967 సాధారణ ఎన్నికల తదనంతరం వివిధ రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన ప్రాంతీయ పార్టీలు, ప్రతిపక్షాలకు చెందిన ప్రభుత్వాలు రాష్ట్రాలకు ఎక్కువ అధికారాలు కావాలనే డిమాండ్‌ను ముందుకు తెచ్చాయి. దీంతో 1966లో ఏర్పాటు చేసిన మొదటి పరిపాలనా సంస్కరణల కమిషన్ నుంచి ఎం.సి. సీతల్‌వాడ్ కమిటీని ప్రత్యేకంగా కేంద్ర - రాష్ట్ర సంబంధాలు, వివాదాల అధ్యయనం కోసం ఇందిరాగాంధీ ప్రభుత్వం నియమించింది. సీతల్‌వాడ్ కమిటీ సమూల మార్పులను సూచించనప్పటికీ.. కొన్ని కీలక అంశాలను ప్రభుత్వం దృష్టికి తెచ్చింది. కేంద్రం తరచుగా రాష్ట్రాల విషయాల్లో జోక్యం చేసుకోకుండా చర్యలు చేపట్టాలని, అంతర్ రాష్ట్ర కౌన్సిల్ ఏర్పాటు చేయాలని పేర్కొంది. కేంద్ర ఫైనాన్స్ కమిషన్ సూచనలను కేంద్రం తప్పనిసరిగా పాటించాలని కోరింది. గవర్నర్లుగా వివాదాస్పదం కాని వ్యక్తులను నియమించాలని సూచించింది. 1967లో తమిళనాడులో అధికారంలోకి వచ్చిన డీఎంకే ప్రభుత్వం పి.వి. రాజమన్నార్ నేతృత్వంలో కేంద్ర - రాష్ట్ర సంబంధాలపై ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసింది. దీనికి ప్రధాన కారణం సీతల్‌వాడ్ కమిటీ సూచనలు రాష్ట్రాలకు సంతృప్తిని ఇవ్వకపోవడమే. రాజమన్నార్ కమిటీ ..రాష్ట్రాలకు ఎక్కువ అధికారాలను కల్పించడం కోసం రాజ్యాంగాన్ని సవరించాలని పేర్కొంది. ఉమ్మడి జాబితాలో జాతీయ ప్రాముఖ్యత కలిగిన అంశాలను కేంద్రానికి కేటాయించి మిగిలిన అధికారాలన్నీ రాష్ట్రాలకు బదలాయించాలని కోరింది. ప్రణాళికా సంఘంలో సమూల మార్పులు చేయాలని సూచించింది. ఎక్కువ ఆర్థిక వనరులను కల్పించడం కోసం విదేశీ ఎగుమతులు, దిగుమతులపై విధించే సుంకాల్లో రాష్ట్రాలకు కూడా వాటా కల్పించాలని కోరింది. 1980లో చోటు చేసుకున్న రాజకీయ మార్పుల నేపథ్యంలో 1983లో ఇందిరా గాంధీ ప్రభుత్వం సర్కారియా కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ కేంద్ర - రాష్ట్ర సంబంధాలపై అనేక అంశాలతో కూడిన సవివరమైన నివేదికను రాజీవ్‌గాంధీ ప్రభుత్వానికి సమర్పించింది. గవర్నర్ వ్యవస్థ వివాదాస్పదం కాకుండా ఉండటం కోసం పలు సూచనలు చేసింది. 356 అధికరణను చివరి అస్త్రంగా మాత్రమే వినియోగించాలని కమిషన్ పేర్కొంది. ఆదాయపన్నుపై విధించే సెస్, కార్పొరేట్ ట్యాక్స్‌లో రాష్ట్రాలకు వాటా కల్పించాలని సూచించింది. అంతర్ రాష్ట్ర వ్యాపార వాణిజ్యంపై చట్టాలు చేసేటప్పుడు, ఉమ్మడి జాబితాలోని అంశాలపై కేంద్రం శాసనాలు చేసే సందర్భంలో రాష్ట్రాల అభిప్రాయాలను, ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరింది. రాజ్యాంగ పునఃసమీక్ష కమిషన్ కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై వ్యాఖ్యానించే సందర్భంలో అంతర్ రాష్ట్ర కౌన్సిల్ ద్వారా కేంద్రం లేదా రాష్ట్రాలు సహకార సమాఖ్య ఏర్పాటు కోసం కృషి చేయాలని సూచించింది. రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులను, కేంద్ర పరిశీలన కోసం గవర్నర్ పంపినప్పుడు దానిపై రాష్ట్రపతి ఆరు నెలల్లోగా ఏదో ఒక నిర్ణయం ప్రకటించేలా సవరణ చేయాలని కూడా ఈ కమిషన్ సూచించింది. మదన్ మోహన్ పూంఛీ కమిషన్ గవర్నర్లను కూడా రాష్ట్రపతి మాదిరిగానే తొలగించే అధికారం రాష్ట్ర శాసన సభలకు కల్పించాలని పేర్కొంది.

కాకతీయుల కాలంలో ప్రసిద్ధమైన రేవు పట్టణం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

కాకతీయ యుగ విశేషాలు

పన్నులు

కాకతీయుల కాలంలో స్థూలంగా అయిదు రకాల పన్నులుండేవి.

అవి: 1. భూమి పన్ను, 2. పారిశ్రామిక, ఆస్తి పన్నులు, 3. వృత్తి పన్నులు, 4. వ్యాపార పన్నులు, 5. ఇతర పన్నులు.

ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ మార్గం భూమి శిస్తు. వర్తకం, పరిశ్రమలు, వృత్తులపై విధించే పన్నులు రెండో ఆదాయ మార్గం. పశుగ్రాసానికి పనికి వచ్చే పచ్చికబయళ్లపై వసూలు చేసే పన్ను, అడవుల కలపపై వేసే పన్ను మూడో ఆదాయ మార్గంగా ఉండేది. వర్తక సరకులు, ఎగుమతి దిగుమతులు, తయారైన వస్తువుల మీద వేసే పన్నును 'సుంకం'గా పేర్కొనేవారు. సాధారణంగా సుంకాలు వసూలు చేసే అధికారం వర్తక శ్రేణులకు ఇచ్చేవారు.

న్యాయ పాలన

సామాన్యమైన వివాదాలన్నింటినీ గ్రామ సభల్లో గ్రామ ప్రభువులు పరిష్కరించేవారు. గ్రామాల్లో దొంగతనాలు జరగకుండా 'తలారి' అనే గ్రామోద్యోగి చూసేవాడు. రాజే అంతిమ న్యాయ నిర్ణేత. యాజ్ఞవల్క్య స్మృతి లాంటి ప్రాచీన స్మృతి గ్రంథాల్లో పేర్కొన్న సూత్రాలను అనుసరించి ధర్మాసనాలు ఏర్పరిచేవారు. ఒకరిద్దరు రాజాధికారులతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన సభల్లో న్యాయ సమస్యలు పరిష్కారమయ్యేవి. వీరిని 'మహాజనులు'గా పేర్కొనేవారు. సమస్య పరిష్కారమైన వెంటనే సభ రద్దయ్యేది. ప్రస్తుతం గ్రామ పెద్దల మాదిరిగా ఈ మహాజనులు పనిచేసేవారు. తెగల్లో వివాదాలను 'సమయాలే' పరిష్కరించేవి.

సైనిక వ్యవస్థ

కాకతీయ సైన్యంలో చక్రవర్తి సైన్యం, నాయంకర సైన్యం అని రెండు విభాగాలు ఉండేవి. కాకతీయ చక్రవర్తులు సైన్యానికి స్వయంగా నాయకత్వం వహించేవారు. వీరి రాజ్యంలో స్థల, జల, వన, గిరి అనే నాలుగు రకాల కోటలు ఉన్నట్లు తెలుస్తోంది. కాకతీయుల కాలంలో ఓరుగల్లు, రాయచూరు, గోల్కొండ, భువనగిరి, రాచకొండ, దేవరకొండ, నల్లగొండ, పానుగల్లు కోటలు శత్రు దుర్భేద్యమైనవిగా పేరు పొందాయి.

ఆర్థిక పరిస్థితులు

కాకతీయుల కాలంలో ఆంధ్రదేశం సిరి సంపదలతో విలసిల్లినట్లు అమీర్ ఖుస్రూ, అబ్దుల్లా వాసఫ్, మార్కోపోలో లాంటి విదేశీ యాత్రికుల రచనల ద్వారా తెలుస్తోంది.

వ్యవసాయం: తెలంగాణా ప్రాంతంలో సాగు భూమిని, నీటి వనరులను పెంచడానికి కాకతీయులు ఎనలేని కృషి చేశారు. వీరు చెరువులు నిర్మించి నీటి పారుదలపై శ్రద్ధ వహించారు. రెండో బేతరాజు సెట్టి సముద్రం, కెరె సముద్రం, కేసరి సముద్రం చెరువులను నిర్మించాడు. గణపతిదేవుడు రాజ్యం నలుమూలలా అనేక చెరువులు నిర్మించాడు. గణపతిదేవుడి సేనాని రేచర్లరుద్రుడు 17,258 ఎకరాలకు సాగు నీరు అందించేవిధంగా పాకాల చెరువును నిర్మించాడు. దీని విస్తీర్ణం 12 చ.కి.మీ. రామప్ప చెరువును నిర్మించింది కూడా ఇతడే. రేచర్ల రెడ్లు 35 నీటి వనరులను ఏర్పాటు చేశారు. కాటచమూపతి కాట సముద్రం; చౌడ చమూపతి చౌడ సముద్రం; నామిరెడ్డి సబ్బి సముద్రం, గౌర సముద్రం, కోమటి చెరువు; ఎరకసాని ఎరక సముద్రం నిర్మించారు. వీటితో పాటు చింతల సముద్రం, నామా సముద్రం కూడా ఉండేవి. చెరువుల నిర్మాణంలో పాల్గొన్న శ్రామికులకు దినసరి వేతనాలు చెల్లించేవారు. చెరువులతో పాటు ఊట కాలువలను కూడా నిర్మించారు. మూసీ నది నుంచి సాగే మూసెటి కాలువ; ఆలేరు నది నుంచి ఆలేటి కాలువ; కూచినేని కాలువ, రావిపాటు కాలువ, బొమ్మకంటి కాలువ, ఉటుంకాలువ, చింతల కాలువల గురించి పిల్లలమర్రి శాసనాల్లో పేర్కొన్నారు. ఏతం, మోటలతో కూడా వ్యవసాయం చేసేవారు. కొత్తగా పొలాలను సాగు చేయడానికి కాకతీయ రాజులు కృషి చేశారు. ప్రతాపరుద్రుడి కాలంలో అడవులను నరికేసి విశాల భూభాగాలను సాగులోకి తీసుకువచ్చారు. నేటి రాయలసీమ, పల్నాడు ప్రాంతాల్లోని అనేక గ్రామాలు ప్రతాపరుద్రుడి కాలంలో రూపొందినవేనని ఆ గ్రామ కైఫీయతుల ద్వారా తెలుస్తోంది. తెలంగాణలోని మంథెన, కాళేశ్వరం, చెన్నూరు, నర్సంపేట, అచ్చంపేట, ఖమ్మం మెట్టు, కొత్తగూడెం అటవీ ప్రాంతాల్లోని గ్రామాల్లో ఎక్కువ భాగం కాకతీయుల కాలంలోనే ఏర్పడినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. గ్రామం, చెరువును నిర్మించడం నాడు పుణ్యకార్యంగా భావించేవారు. గ్రామాలను ఏర్పరచడానికి అన్ని వృత్తుల వారికి ప్రోత్సాహకాలు ఇచ్చేవారు. చాలా మంది కాకతీయ రాజులు, రాణులు అటవీ, బీడు భూములను వ్యవసాయ యోగ్యంగా చేశారు. వీరి పేరు మీద అనేక గ్రామాలు ఏర్పడ్డాయి. గణపవరం, ఘన్‌పూర్, మహాదేవపురం, రుద్రవరం, బయ్యారం, ముప్పవరం, కుందవరం మొదలైనవన్నీ వీటికి ఉదాహరణ. భూమిపై ప్రాథమిక స్వామ్యం రాజుది, ద్వితీయ స్వామ్యం వ్యక్తిది.

రైతులు వరి, గోధుమలు, కొర్రలు, జొన్నలు, మొక్కజొన్నలు, నీలిమందు, ఆముదాలు, నువ్వులు, పెసలు, కందులు, చెరకు, నూనెగింజలు, ఆవాలు, సజ్జలు, మినుములు, ఉలవలు, పత్తి, అల్లం, పసుపు, ఉల్లి తదితర పంటలు పండించేవారు. ఓరుగల్లు ప్రాంతంలో సువాసనలు వెదజల్లే బియ్యం తయారైనట్లు సాహిత్యం ద్వారా తెలుస్తోంది. ఆ కాలంలో కొబ్బరి, చెరకు, మామిడి, జామ, అరటి తోటలు విస్తారంగా ఉండేవి. సాధారణంగా ప్రతి గ్రామంలో బెల్లం, నూనె గానుగలు ఉండేవి. పశు సంపద పుష్కలంగా ఉండేది.

పరిశ్రమలు: నాడు వ్యవసాయంతో పాటు అనేక పరిశ్రమలు కూడా ఉండేవి. పాల్కురికి సోమనాథుడు 'పండితారాధ్య చరిత్ర'లో ఇరవైకి పైగా వస్త్రాల గురించి పేర్కొన్నాడు. ఓరుగల్లులో రత్న కంబళ్లు, మఖమల్ వస్త్రాలు నేసేవారు. ఏకామ్రనాథుడు ఓరుగల్లులో చిత్తరువులు రాసే ఇళ్లు 1500 వరకు ఉండేవని పేర్కొన్నాడు. నాడు చిత్రకళకు మంచి ఆదరణ ఉండేది. పాల్కురికి 'బసవపురాణం'లో యాభై రకాల దుస్తుల పేర్లను ప్రస్తావించాడు. కాకతీయుల రాజ్యంలో శ్రేష్టమైన సన్నని వస్త్రాలు నేసేవారని, అవి సాలెపురుగు జాలె మాదిరిగా ఉండేవని మార్కోపోలో ప్రశంసించాడు. వీటి ఆధారంగా ఆ కాలంలో పద్మశాలీలకు మంచి నైపుణ్యం ఉండేదని తెలుస్తోంది.

పల్లకీల మీద చెక్కిన నగిషీల వర్ణనను పరిశీలిస్తే నాటి వడ్రంగుల పని నైపుణ్యం అర్థమవుతుంది. పంచలోహాలతో వివిధ రకాల వస్తువులను తయారు చేసేవారు. నిర్మల్‌లో తయారైన కత్తులకు డమాస్కస్‌లోనూ మంచి ఆదరణ ఉండేది. గోల్కొండ ప్రాంతంలో వజ్రాల గనులున్నట్లు మార్కోపోలో రాశారు. వ్యవసాయానికి అవసరమైన పరికరాలను గ్రామాల్లోనే తయారు చేసేవారు. పానగల్లు, చండూరులో దేవాలయాల్లో ఉపయోగించే కంచు గంటలు, పళ్లాలు, పాత్రలను రూపొందించేవారు.

వర్తక – వాణిజ్యం: శాతవాహనుల తర్వాత క్రమంగా క్షీణించిన దేశీయ, విదేశీ వాణిజ్యాన్ని కాకతీయులు పునరుద్ధరించారు. కాకతీయుల కాలంలో దేశీయ వాణిజ్యానికి ప్రధాన కేంద్రం ఓరుగల్లు. ఆ తర్వాత తెలంగాణలో మంథెన, అలంపురం, జడ్చర్ల, మగతల, పేరూరు ప్రధాన వాణిజ్యకేంద్రాలుగా ఉండేవి. పలనాటి సీమ నుంచి వాడపల్లి, నకిరెకల్, పిల్లలమర్రి మీదుగా వ్యాపారులు వరంగల్ వచ్చేవారు. బళ్లారి–చిత్తూరు, రాయచూరు–కొలనుపాక, బీదరు–కొలనుపాక, కల్యాణి–కొలనుపాక–అనుమకొండ, బీదరు–పటాన్‌చెరువు–వరంగల్ మొదలైనవి ముఖ్యమైన వాణిజ్య మార్గాలుగా ఉండేవి. కాకతీయుల పాలనలో తెలంగాణలో వర్తక శ్రేణుల నిర్మాణంలో గుర్తించదగిన మార్పు వచ్చింది. ఆ కాలంలో వ్యాపారం బలిజలకు, వైశ్యులకే పరిమితం కాలేదు.



రెడ్లు, నాయుళ్లు, బోయలు, దాసర్లు, తెలికలు, పద్మశాలీలు, వ్యవసాయదారుల లాంటి ఉత్పత్తిదారులు, కమ్మరి, కంసాలి, మేదరి లాంటి వృత్తి కులాల వారు వ్యాపారంలోకి వచ్చారు. వివిధ వృత్తికారులు, ఉత్పత్తిదారులు సొంత సమయాలను ఏర్పరచుకొని తమ కులవృత్తులతో పాటు వ్యాపారాలను నిర్వహించుకునేవారు.

వీరిలో కొంత మంది కేవలం తమ ఉత్పత్తులనే అమ్ముకునేవారు. అందువల్ల ఇంతమంది వ్యాపారంలోకి వచ్చినప్పటికీ ప్రధానంగా వ్యాపారం వైశ్యుల చేతిలోనే ఉండేది. గోధుమ, పెసలు, వడ్లు, జొన్నలు, ఉప్పు, నూనె, నెయ్యి, మిరియాలు, ఆవాలు, తేనె, తగరం, రాగి, కర్పూరం, కస్తూరి, పట్టు, రత్నాలు, ముత్యాలు, పూసలు, పసుపు, ఉల్లిగడ్డలు, అల్లం, నూలు, దుంపలు మొదలైన ఉత్పత్తుల వ్యాపారం జరిగేది.

విదేశీ వాణిజ్యం: కాకతీయుల కాలంలో 'మోటుపల్లి' విదేశీ వాణిజ్యానికి ప్రసిద్ధమైన రేవు పట్టణంగా గుర్తింపు పొందింది. చాళుక్య, చోళ రాజుల కారణంగా దెబ్బతిన్న విదేశీ వ్యాపారాన్ని గణపతిదేవుడు ఈ రేవు పట్టణం ద్వారా పునరుద్ధరించాడు. దీని ద్వారా ఇండోనేషియా, జావా, సుమత్రా, జపాన్, మలయా, బర్మాతో వ్యాపారం చేసేవారు.

మార్కోపోలో ఈ రేవు పట్టణాన్ని సందర్శించాడు. ఇక్కడి నుంచి ఎగుమతయ్యే వస్తువుల్లో వజ్రాలు, పట్టుతో తయారయ్యే సన్నని వస్త్రాలు ముఖ్యమైనవని అతడు పేర్కొన్నాడు. కాకతీయుల నాణేలు ఎక్కువగా లభించలేదు. కానీ శాసనాలు, సాహిత్యంలో నాణేల ప్రస్తావన ఉండేది.

సాంఘిక పరిస్థితులు

కాకతీయుల కాలంనాటి సంఘంలో ప్రధానంగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర కులాలు ఉండేవి. ప్రతి కులంలో అనేక ఉపకులాలు ఏర్పడ్డాయి. ఏకామ్రనాథుడు 'ప్రతాపచరిత్ర'లో, వినుకొండ వల్లభరాయుడు 'క్రీడాభిరామం'లో కాకతీయుల కాలంనాటి వివిధ వృత్తుల గురించి ప్రస్తావించారు. కోమట్లు, ఈదురవారు, గొల్లవారు, అక్కలవారు (ఆగసాల), సాలెవారు, మంగలులు, కుమ్మరివారు, బోయవారు, రుంజులు, పిచ్చుకుంట్లు, పంబల, బవని, మేదర, గాండ్ల మొదలైన కులాల పేర్లను శాసనాల్లోనూ పేర్కొన్నారు. హిందూ మతాన్ని సంస్కరించే ఉద్దేశంతో శైవ, వైష్ణవ మతాలు ఆవిర్భవించాయి. కుల నిర్మూలన కోసం పుట్టిన వీటి ద్వారా సంఘంలో కొత్త కులాలు ఏర్పడ్డాయి. ఈ విధంగా శైవుల్లో లింగాయతులు, బలిజలు, జంగాలు, తంబళ్ల మొదలైన కులాలు ఏర్పడ్డాయి. వైష్ణవుల్లో నంబులు, సాతానులు, దాసర్లు మొదలైన కులాలు ఆవిర్భవించాయి. 'అష్టాదశ కులాలు' అప్పటికే ప్రాచుర్యంలో ఉన్నాయి. కాకతీయుల కాలంలో బాల్యవివాహాలు జరిగాయి. అనులోమ, ప్రతిలోమ వివాహ పద్ధతులు ఉండేవి. రుద్రమదేవి కుమార్తె రుయ్యమను బ్రాహ్మణ మంత్రి ఇందులూరి అన్నయ్య దేవుడు పెళ్లి చేసుకోవడం దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు. అయినప్పటికీ కుల నిర్మూలన ప్రయత్నాలు విఫలమయ్యాయి. కాకతీయుల కాలంలో వెలమలు సంఘ సంస్కర్తలుగా, రెడ్లు పూర్వాచార పరాయణులుగా ఉన్నట్లు తెలుస్తోంది. నాడు రాజకీయంగా ప్రాబల్యం వహించిన రెడ్లు, వెలమల మధ్య అధికారం కోసం పోటీ ప్రారంభమైంది. ఈ కాలంలో అష్టాదశ వర్ణాల్లో అగ్రవర్ణమైన బ్రాహ్మణ వర్గానికి చెందినవారు రాజకీయ ప్రాబల్యాన్ని కోల్పోయారు. రాజకీయాధికారం చతుర్థ వర్ణ పరమైంది. క్షత్రియ వంశాలు నామమాత్రంగా అధికారంలో ఉండేవి.

కాకతీయుల కాలంనాటి సాంఘిక జీవితానికి సంబంధించిన ఒక ప్రధాన లక్షణం కుల సంఘాలు. వీటిని 'సమయములు' అనేవారు. నగరాలు, గ్రామాలు పేటలుగా విభజించి ఉండేవి. అక్కలవాడ, భోగంవీధి, వెలిపాళె, మేదరవాడ, మోహరినాడు మొదలైనవి ఇలాంటివే. పూటకూళ్ల ఇళ్లు ఉండేవి. బసవ పురాణం ఆధారంగా ఆనాటికే వెట్టి వ్యవస్థ ఉన్నట్లు తెలుస్తోంది. మహిళలు పాత్ర, గొండ్లి, పేరణి, కోలాటం, గొబ్బిళ్లు, గుర్రం, భంజళి మొదలైన క్రీడలతో వినోదం పొందేవారు.

వాస్తు, శిల్ప కళ

కాకతీయ రాజులు, వారి సామంతులు అనేక జైన, శైవ, వైష్ణవాలయాలను నిర్మించారు. దేవాలయ నిర్మాణంలో కాకతీయులు పశ్చిమ చాళుక్యుల వాస్తు విధానాన్ని అనుసరించారు. వీరు త్రికూటాలయాలను ఇదే పద్ధతిలో నిర్మించారు. బేతిరెడ్డి భార్య ఎరకేశ్వరాలయం నిర్మించారు. నామిరెడ్డి పిల్లలమర్రిలో కాటేశ్వర, కాచేశ్వర, నామేశ్వర ఆలయాలను నిర్మించాడు. పాలంపేట, పిల్లలమర్రి, పానగల్లు, హన్మకొండలో ఉన్న ఆలయాలను త్రికూట పద్ధతిలోనే నిర్మించారు.

నంది విగ్రహాలు కాకతీయ శిల్ప ప్రాభవానికి నిదర్శనాలు. కాకతీయ శిల్పం చాళుక్యుల శిల్పం కంటే నిగ్గు తేలి ఉంది. ఇది కొంత ప్రాంతీయ లక్షణాలను సంతరించుకొని ఉంటుంది. దేశీయ నృత్య రీతులకు ప్రాతినిధ్యం వహిస్తున్న నాట్యగత్తెల కోలాట దృశ్యాలు కూడా కాకతీయుల కళా నైపుణ్యానికి తార్కాణంగా ఉన్నాయి.

మాదిరి ప్రశ్నలు

1. ఏ కాకతీయ పాలకుడి కాలంలో విశాల భూభాగాలు సాగులోకి వచ్చాయి?
   1) గణపతిదేవుడు 2) ప్రతాపరుద్రుడు
   3) రుద్రదేవుడు 4) రెండో బేతరాజు
2. రాయలసీమ, పల్నాడు ప్రాంతాల్లోని అనేక గ్రామాలు ఎవరి కాలంలో ఏర్పడ్డాయని కైఫీయత్తుల ద్వారా తెలుస్తోంది?
   1) బేతరాజు 2) ప్రోలరాజు
   3) ప్రతాపరుద్రుడు 4) రుద్రమదేవి
3. కాకతీయ రాజ్యంలో శ్రేష్టమైన వస్త్రాలు ఉన్నాయని ప్రశంసించిన విదేశీ యాత్రికుడు?
   1) మెగస్తనీస్ 2) ప్లీని
   3) మార్కోపోలో 4) నికోలో కాంటి
4. గోల్కొండ ప్రాంతంలో వజ్రాల గనులు ఉన్నట్లు రాసిన విదేశీ యాత్రికుడు?
   1) టాలెమి 2) మార్కోపోలో
   3) ప్లీని 4) కొలంబస్

సమాధానాలు

1) 2; 2) 3; 3) 3; 4) 2.

The smallest memory size is?



Hacker (Computer security)

Hacker is considered as hero of computer programs. In computer security, a hacker is someone who focuses on security mechanisms of computer and network systems. He is someone who lives and breathes computers, who know all about computers, who can get a computer to do anything. Equally important, though, is the hacker's attitude. Computer programming must be a hobby, something done for fun, not out of a sense of duty. Hackers are generally computer geniuses because it is due to the extraordinary computer knowledge and skills that they can conveniently break into other computer systems.

CRACKER

Cracker is considered as villain of computer programs. A cracker is someone who breaks into someone else's computer system, often on a network; bypasses passwords or licenses in computer programs; or in other ways intentionally breaches computer security. A cracker does this for profit, maliciously, for some altruistic purpose.

CLASSIFICATION OF HACKERS BASED ON THEIR ATTITUDE:

WHITE HAT

A "White hat" hacker breaks security for non-malicious reasons, perhaps to test their own security system or while working for a security company which makes security software. The term "white hat" in Internet slang refers to an ethical hacker.

BLACK HAT

A "Black hat" hacker is a hacker who "violates computer security for little reason beyond maliciousness or for personal gain". Black hat hackers break into secure networks to destroy, modify, or steal data; or to make the network unusable for those who are authorized to use the network. Black hat hackers are also referred to as the "crackers" within the security industry and by modern programmers.

GREY HAT

A grey hat hacker lies between a black hat and a white hat hacker. Grey hat hackers sometimes find the defect of a system and publish the facts to the world instead of a group of people. Even though grey hat hackers may not necessarily perform hacking for their personal gain, unauthorized access to a system can be considered illegal and unethical.

ELITE HACKER

A social status among hackers, elite is used to describe the most skilled. Newly discovered exploits circulate among these hackers.

SCRIPT KIDDIE

A script kiddie (also known as a skid or skiddie) is an unskilled hacker who breaks into computer systems by using automated tools written by others.

NEOPHYTE

A neophyte ("newbie", or "noob") is someone who is new to hacking or phreaking and has almost no knowledge or experience of the workings of technology and hacking.

BLUE HAT

A blue hat hacker is someone outside computer security consulting firms who is used to bug-test a system prior to its launch, looking for exploits so they can be closed.

PHREAKS

A phreak is a hacker who specializes in phone systems. These days, however, phreaking is more of a cracker activity. At one time, phreaks were enthusiastic about telephone networks and simply wanted to understand how they worked and explore them. Ethical phreaks didn't steal services or cause damage; they just used their technical skill to play with the system. Phone systems have changed and are less susceptible to technological hacks. As a result, modern phreaks intent on cracking the telecommunications systems often rely on criminal acts such as stealing phone cards and cloning cell phones.

HACKTIVISTS

The hacktivist is a gray hat or cracker who defaces Web pages to bring attention to a political agenda or social cause. Companies, organizations, and governments that engage in controversial practices or that have unpopular policies are likely targets of hacktivists. How ethical this behaviour is depends on whether or not you support the hactivist's agenda or believe in his cause..

MODEL QESTIONS

1. Retail employees typically use _________ terminals to process sales transactions.
   1) Point of sale
   2) Transaction point
   3) Automatic teller
   4) Sales processing
   5) None of these
2. The simultaneous processing of two or more programs by multiple processors is _____
   1) Multiprogramming
   2) Multiprocessing
   3) Time-sharing
   4) Multitasking
   5) None of these
3. The ___ folder retains copies of messages that you have started but are not yet ready to send.
   1) Drafts 2) Sent Items
   3) Address Book 4) Outbox
   5) None of these
4. Inheritance is the ability of an object to pass on its characteristics to its ________.
   1) Subclasses 2) off-spring
   3) Super classes 4) Parents
   5) None of these
5. Which of the following is used for close a tab on a browser?
   1) Ctrl + T 2) Ctrl + Y
   3) Ctrl + A 4) Ctrl + W
   5) None of these
6. A program that converts high level language to machine Language is _______
   1) Linker 2) Assembler
   3) Compiler 4) All of the above
   5) None of these
7. At a time how many operating system can be at work on a computer?
   1) Only one 2) Two
   3) Three 4) Four
   5) None of these
8. A computer that combines the characteristic of analog and digital computers_________
   1) Hybrid Computer
   2) Analog Computer
   3) Digital Computer
   4) Super Computer
   5) None of these
9. The technique that extends storage capacities of main memory beyond the actual size of the main memory is called _______
   1) Multitasking 2) Switching
   3) Multiprocessing
   4) Multiprogramming
   5) Virtual storage
10. The maximum Zoom percentage in MS WORD is___
    1) 100% 2) 200%
    3) 400% 4) 500%
    5) None of these
11. The smallest memory size is?
    1) Byte 2) GigaByte
    3) KiloByte 4) MegaByte
    5) None of these
12. Android Operating system is an example of which kind of Source Model?
    1) Open Source
    2) Vertical Market Software
    3) Horizontal Market Software
    4) Shareware 5) None of these
13. Which process checks to ensure the components of the computer and operating are connected properly?
    1) Booting 2) Processing
    3) Editing 4) Saving
    5) None of these
14. Codes consisting of lines of varying widths or lengths that are computer-readable are known as?
    1) An ASCII code
    2) An OCR scanner
    3) A magnetic tape
    4) A bar code 5) None of these
15. What is the ultimate purpose of Defragmentation?
    1) Make the PC faster
    2) Create More Free Space
    3) Delete temporary files
    4) Reduce Power consumption
    5) None of these
16. Which input device cannot be used to work in MS Office?
    1) Scanner 2) Mouse
    3) Keyboard 4) Joy stick
    5) Light pen
17. Storage that retains its data after the power is turned off is referred to as?
    1) Volatile storage
    2) Sequential storage
    3) Non-volatile storage
    4) Direct storage
    5) None of these
18. Accessing data on tapes is much ______ than that accessing data on disks?
    1) Same 2) Faster
    3) Slower 4) All of the above
    5) None of these
19. IP-Address 192.5.48.3 belongs to-
    1) Class A 2) Class B
    (3) Class C 4) Class D
    5) None of these
20. Which type of web document is run at the client site?
    1) Static 2) Dynamic
    3) Active 4) All of the above
    5) None of these
21. UDP (User Diagram Protocol) is-
    1) Connectionless
    2) Network Oriented
    3) Connection oriented
    4) a & b 5) None of these
22. Which of the following is NOT a Microsoft Internet tool or technology?
    1) Dreamweaver
    2) Silver light
    3) Internet Explorer
    4) Expression Web
    5) None of these
23. Which Software protects the resources of a private network from users from other networks?
    1) Cache server 2) proxy server 3) Firewall 4) Router 5) None of these

KEY

1) 1; 2) 2; 3) 1; 4) 1; 5) 4; 6) 3; 7) 1; 8) 1; 9) 5; 10) 4; 11) 3; 12) 1; 13) 1; 15) 2; 14) 4; 16) 4; 17.3; 18) 3; 19) 3; 20) 1; 21.1; 22) 1; 23) 3